ముహూర్తం

శ్రీ విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋుతువు, చైత్ర మాసం, తిథి: శుద్ధ అష్టమి ఉ. 7.40 వరకు, అనంతరం నవమి; నక్షత్రం: ఆరుద్ర మ. 2.23 వరకు, అనంతరం పునర్వసు; అమృతకాలం: శే ఉ. 6.30 నుండి 8.50 వరకు; వర్జ్యం: రా.వ 1.10 నుండి 1.40 వరకు; దుర్ముహూర్తం: సా.4.24 నుండి 5.12 వరకు; రాహుకాలం: సా. 4.30 నుండి 6.00 వరకు; యమగండం: మ. 12.00 నుండి 1.30 వరకు;

Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి: 62 • సంచిక: 74 • ఆదివారం 25 మార్చి 2018 • విజయవాడ * పేజీలు: 14 • వెల: 6.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad

హ్యాపీ ఉగాది అంటూ ఉరుములు మెరుపులతో అమిత్ షా లేఖాస్త్రం



చాలా ఇచ్చాం

పచ్చి అబద్ధం



అ లేఖ అభూత కల్పన

కట్టుకథలతో ఎదురుదాడి

మనోభావాలు దెబ్బతీయొద్దు

హోదా మరచి మాట్లాడొద్దు

మిత్రధర్మాన్ని దెబ్బతీశారు

సీఎం చంద్రబాబు ఆగ్రహం

రాజకీయ విస్ఫోటనం! ఈసారి ఏకంగా రెండు పార్టీల అధినేతల మధ్యే! అగాధం అనంతమై..పరస్పరం ప్రత్యర్థులై..ఆరోపణల అస్త్రాలతో యుద్ధానికి దిగిన సన్నివేశం ఇది! అమిత్ షా తొమ్మిది పేజీల లేఖ..అందులో ప్రశ్నలకు జవాబులున్నాయి. విమర్శలకు ఎదురుదాడులున్నాయి. నిధులపై నిగ్గుతీతలున్నాయి. యుద్ధానికి శంఖారావమూ ఉంది. చంద్రబాబు ఆమధ్య రాసిన లేఖకు ఇది ప్రత్యుత్తరం. కేంద్రం నుంచి అంతా సవ్యంగా ఉందన్నది దాని సారాంశం. పైగా సంకీర్ణం నుంచి ఏకపక్షంగా వైదొలిగారని ఓ పెద్ద అభాండం. దీనికి చంద్రబాబు అంతే రీతిలో ఎదురుదాడి..ఆ లేఖంతా తప్పుల తడక అని..అబద్ధాల పుట్ట అని అసెంబ్లీ సాక్షిగా గర్జన. ఎవ్వరి వాదనా ఎవ్వరూ ఒప్పుకోలేని సంక్షోభ స్థితి. ఆంధ్రప్రదేశ్-కేంద్రం మధ్య ఉప్పు-నిప్పు..చంద్రబాబు-మోడీ మధ్య మరింత భగ్గు. కేంద్రాన్ని మరింతగా తూర్పారబట్టేందుకు చంద్రబాబు భావి వ్యూహం..రెండు రోజుల దీక్షకు ఆలోచన! చిలికి చిలికి గాలివానై..అది తుపానుగా మారి..తాజాగా సునామీ దిశగా పయనిస్తున్న సంకేతాలు! ఉభయపక్షాలు యుద్ధానికి దిగారు. అమిత్ షా లేఖలోని అంశాలను బలంగా జనంలోకి తీసుకెళ్లేందుకు కమలనాథులు సిద్ధమయ్యారు. అలాగే ఆ లేఖ ఓ అబద్ధాల పుట్ట అని చీల్చి చెండాడి అమిత్ షాను, ప్రధాని మోడీని ఎండగట్టేందుకు చంద్రబాబు బృందం రంగం సిద్ధం చేసింది. ఈ రణం ఇక ముందుకే గాని వెనకడుగుకు ఆస్కారం లేనంతగా ఉభయులూ చాలా దూరం ముందుకెళ్లారు!

వివరాలు 2, 3లో...

సెంటిమెంటు రాజకీయాలు చేస్తున్నారు

ఇచ్చిన నిధులకు యూసీలు ఎందుకివ్వలేదు

మీ పరిపాలనలో లోపానికి అది నిదర్శనం

లక్షల కోట్లు ఇస్తున్నాం - ఇంకా ఇస్తాం

ఎన్డీయే నుంచి ఏకపక్షంగా వైదొలిగారు:

అమిత్‌షా తొమ్మిది పేజీల సుదీర్ఘ లేఖ



అమిత్ షాకేమీ తెలియదు

యూసీలకు, ప్రత్యేక హోదాకు సంబంధమేమిటి? : మంత్రి లోకేష్ ప్రశ్న

3 లో

ఢిల్లీపై యుద్ధమే!

అమరావతిలో 2-3 రోజుల దీక్షకు చంద్రబాబు వ్యూహం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రత్యేక హోదాతో పాటు విభజన చట్టంలో ఇచ్చిన హామీలను నెరవేర్చని కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా నిరసన దీక్షను చేపట్టాలన్న ఆలోచనతో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నిరసన దీక్ష 48 గంటల నుంచి 72 గంటల పాటు కొనసాగే అవకాశాలు ఉన్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సీఎం హోదాలో చంద్రబాబు అమరావతి కేంద్రంగా ఈ దీక్షలో కూర్చోవాలని మంత్రులు వారి జిల్లాలకు చెందిన కేంద్రాలలో, ఎమ్మెల్యేలు, ఎంపీలు వారి వారి నియోజకవర్గాల కేంద్రాల్లో బైఠాయించి నిరసన తెలపనున్నట్లు తెలుస్తోంది. శాసనసభ సమావేశాలు ముగిశాక పార్టీ విస్తృత స్థాయి సమావేశం, పొలిట్‌బ్యూరో, శాసనసభ, పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించి దీక్ష చేపట్టే తేదీలను ఖరారు చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. విభజన చట్టంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చామని మిగిలిన హామీలను దశల వారీగా తీరుస్తామని భారతీయ జనతాపార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా చెప్పిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన సీఎం చంద్రబాబుకు సుదీర్ఘ లేఖను రాసి పంపించారు. దీనిపై చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంపై, అమిత్ షాపై అగ్గిమీద గుగ్గిలమయ్యారు. శాసనసభ వేదికగా నిప్పులు చెరిగారు. భారతీయ జనతా పార్టీకన్నా కాంగ్రెస్ 3వ పేజీలో...

జిల్లా కేంద్రాల్లో మంత్రులు

నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేలు

అసెంబ్లీ అయ్యాక దీక్షలు



లెక్కడిగితే డొంక తిరుగుడా

నిజాల నుంచి తెలుగుదేశం పారిపోతోంది: జీవీఎల్ ధ్వజం

8 లో



ఎందుకీ దాగుడుమూతలు?

• అమిత్ షా పాత పాట • హోదా ఇవ్వరని తేలిపోయింది • మా కమిటీ తేల్చిన లెక్కలతో కేంద్రాన్ని నిలదీయొచ్చు : పవన్ కల్యాణ్

అమరావతి, ఆంధ్రప్రభ : బీజేపీ జాతీయ అధ్యక్షులు అమిత్ షా ఏపీ సీఎం చంద్రబాబునాయుడుకు సుదీర్ఘమైన లేఖ రాయడం, దానికి ప్రతిగా చంద్రబాబు శాసనసభలో అంతే సుదీర్ఘంగా జవాబు ఇవ్వడం చూస్తుంటే ప్రత్యేక హోదా బీజేపీ ఎప్పటికీ ఇవ్వదని, దానిని సాధించే స్థితిలో తెలుగుదేశం పార్టీ ఏమాత్రం లేదన్న సంగతిని ప్రజలు మరింతగా అర్థం చేసుకున్నారని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. శనివారం ఈ మేరకు ఆయన పత్రికలకు ప్రకటన విడుదల చేశారు. వేలాది కోట్ల రూపాయలను ఏపీకి ఇచ్చామని, వాటిని ఖర్చుచేయడంలో టీడీపీ విఫలమైందని పాడిన పాటనే అమిత్‌షా మళ్లీ పాడారన్నారు. అదే మాదిరిగా ఎప్పటిలాగే చంద్రబాబు కూడా ఏపీకి బీజేపీ ప్రభుత్వం అన్యాయం చేసిందని మరోసారి ఘోషించారని అన్నారు. ఎందుకీ దాగుడు మూతలు ? భారత ప్రభుత్వం ఎంత ఇచ్చిందో ఏపీ ప్రభుత్వం ఎంత ఖర్చు చేసిందో ఇరు ప్రభుత్వాలకు చెందిన అధికారులతో కమిటీగా వేసి,లెక్కలు కట్టి ప్రజలకు తెలియజేయవచ్చు కదా అని అన్నారు. జనసేన చొరవతో 3వ పేజీలో...



బాబూ భేష్!

• అమిత్ షాకు ధీటైన జవాబిచ్చారు

• ఆయనవన్నీ అసత్య ప్రచారాలే : మమతా బెనర్జీ

అమరావతి, ఆంధ్రప్రభ: ముఖ్యమంత్రి చంద్రబాబును పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అభినందించారు. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షాకు ధీటైన జవాబిచ్చారని చంద్రబాబుపై ప్రశంసలు గుప్పించారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఆమె శనివారం ట్విట్టర్ ద్వారా స్పందించారు. అమిత్‌షా లాంటి నాయకులు చాలా మంది అసత్యాలను ప్రచారం చేస్తున్నారని, వారికిది పరిపాటిగా మారిందని విమర్శించారు. రాష్ట్రాలకు వారేదో చేస్తున్నట్లు కల్పితాలు సృష్టిస్తున్నారని కేంద్రం తీరును తప్పుపట్టారు. రాష్ట్రాల నుంచి వసూలు చేసిన పన్నులనే తిరిగి ఇస్తున్నారు తప్ప. ఇందులో బీజేపీ ప్రభుత్వం గొప్పేమీ లేదని ట్విట్టర్‌లో మమతాబెనర్జీ పేర్కొన్నారు.

ఔరా..!



రాజ్యాంగంపై దాడికి కుట్ర

బీజేపీపై రాహుల్ ఘాటు విమర్శలు • మేం అధికారంలోకి వస్తే జీఎస్టీలో ఒకే శ్లాబ్ • కర్ణాటకలో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం



చామరాజనగర్ జిల్లాలో రాహుల్ జన ఆశీర్వాద యాత్ర

5 లో



లాలూకు 14 ఏళ్ల జైలు

5 లో

• రూ.60 లక్షలు జరిమానా • దాణా స్కాం

4వ కేసులో సీబీఐ న్యాయస్థానం తీర్పు

శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక కథనం



గీతాంజలి... సీతాంజలి

వివరాలు లైఫ్‌లో...






పచ్చి అబద్ధం

- అమిత్‌షా లేఖ అభూత కల్పన
- కట్టుకథలు, అసత్యాలతో ఎదురుదాడి
- ప్రజల మనోభావాలు దెబ్బతీస్తే చూస్తూ ఊరుకోం
- కుట్ర రాజకీయాలు చేస్తారా?
- అరకొర నిధులు ఇచ్చి, ఏదో చేశామంటే ఎలా?
- హోదా మరిచి మాట్లాడడం దుర్మార్గం
- పైగా అవాస్తవాలతో లేఖాస్త్రాలెందుకు?
- శాసనసభలో అమిత్‌షా లేఖపై సీఎం చంద్రబాబు మండిపాటు

అమరావతి, ఆంధ్రప్రభ: ఓ పార్టీ జాతీయ అధ్యక్షుడై ఉండి అమిత్‌షా రాష్ట్రప్రజల మనోభావాలను దెబ్బ తీసేవిధంగా లేఖతో ఎదురుదాడికి దిగడం దారుణమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మండిపడ్డారు. అమిత్ షా రాసిన లేఖపై ఆయన శనివారం అసెంబ్లీలో రెండుగంటలకు పైగా సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ సందర్బంగా ఆయన అమిత్‌షా రాసిన 9 పేజీల లేఖలోని అంశాల వారీగా ప్రస్తావిస్తూ, అమిత్‌షాను, బీజేపీపెద్దలను గట్టిగా నిలదీశారు. అమిత్ షా లేఖ ఒక అభూత కల్పన అని, బేస్‌లెస్ లేఖ అని కొట్టిపారేశారు. టీడీపీ ఒక ప్రొగ్రెసెవ్ పార్టీ అని, ప్రజాస్వామిక విలువకు కట్టుబడి పని చేస్తోందని, కానీ అమిత్‌షా లాంటి ఉన్నత స్థాయి వ్యక్తులు వాటికి తిలోదకాలు ఇవ్వడం బాధాకరమన్నారు. ఒక వైపు పార్లమెంట్‌లో ప్రత్యేక హోదా కోసం అలుపెరగని విధంగా పోరాడుతుంటే అవేవి పట్టించుకోకుండా, కనీసం హామీలపై ఎటువంటి సమీక్ష కూడా చేయకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని, ఆ పార్టీ అధ్యక్షుడు తప్పుల తడకలుగా ఉన్న లేఖతో రాష్ట్ర ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని సీఎం ఎండగట్టారు. విభజన చట్టాన్ని అమలు చేయకుండా నీచ రాజకీ యాలు చేస్తున్నారని అన్నారు. ఆనాడు రాజ్యసభలో ఇచ్చిన హామీలు చేయమని కోరు తున్న తమల్ని పట్టించుకోకుండా బాధ్యత లేకుండా అమిత్‌షా పొంతన లేని తప్పుడు కథనాలు, అర్ధ అసత్యాలతో రాష్ట్రప్రజల్ని వంచిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. లేఖలో కట్టుకథలు, అవాస్తవాలు పేర్కొన్నారని అన్నారు. ఒక ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తి ఈ విధంగా బాధ్యతారహితంగా వ్యవహరించడం మంచి పద్ధతి కాదన్నారు. పద్ధతి లేకుండా

ఫెడరలిజం గురించి మాట్లాడేది మీరా?

కో ఆపరేటివ్ ఫెడరలిజం గురించి వారు మాట్లాడం విడ్డూరంగా ఉందని అన్నారు. వాటిని గాలికొదిలేసి ప్రవర్తిస్తున్న వారు ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడడం దారుణమన్నారు. రాష్ట్రం పన్నుల రూపంలో కట్టిన డబ్బునే తమకు ఇస్తుంది తప్పా కొత్తగా రాష్ట్రానికి ఒరగబెట్టిందేమీ లేదని తేల్చి చెప్పారు. ఇదేనా వారు చెప్పే ఫెడరలిజం అని ప్రశ్నించారు. దీని గురించి మాట్లాడే అర్హత ఆ పార్టీ నేతలకు లేదన్నారు. ఇవ్వాల్సినవి ఇవ్వకుండా పైగా తప్పుడు లేఖలతో ఎదురుదాడులకు దిగుతారా? అని ధ్వజమెత్తారు. జాతీయ స్థాయి నాయకునికి ఒక హుందాతనం ఉండాలని, కానీ అది లేకుండా ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం ఏ విధమైన నీతి అనిపిం చుకుంటుందని అన్నారు. ఇటువంటి పద్ధతి అటువంటి వ్యక్తులకు మంచిది కాదన్నారు.



అసత్యాలు మాట్లాడడం అమిత్‌షా లాంటి వ్యక్తులకు సరికాదంటూ చురుకలు అంటించారు. ఈ విధంగా అబద్దాలతో ఎవర్ని ఎంతకాలం మోసం చేస్తారని మండిపడ్డారు. దీని ద్వారా జనంలోకి ఎటువంటి సంకేతాలను పంపిస్తున్నారన్నారు. ఈ లేఖ నాకు రాసింది కాదు, యావత్ రాష్ట్ర ప్రజల్ని కించపరుస్తూ రాసిందిగా అంతా భావించి, స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. వారు చెప్పిందొకటి, ఆచరణలో చేసేదొకటిగా ఉందని, ఈ నాలుగేళ్లు ఎంతో ఓపికతో రాష్ట్ర అభివృద్ధి కోసం మిత్రధర్మంతో పని చేశామన్నారు. చివరికి దానిని కూడా స్వార్ధ రాజకీయ ప్రయోజనాలతో వారు తుంగలో తొక్కారని విమర్శించారు. 40 సంవత్సరాల తన రాజకీయ జీవితంలో ఇటువంటి కుట్రలను ఇంతవరకు చూడలేదన్నారు. గతంలో కేంద్ర రాజకీయాల్లోను చక్రం తిప్పి,ఎంతో ఉన్నతంగా వ్యవహరించిన తనపై అమిత్‌షా తన స్వార్థం కోసం తప్పుడు కథనాలతో కూడిన లేఖతో ఎదురుదాడికి దిగడం దారుణమన్నారు. తమ పోరాటాన్ని కేంద్రం రాష్ట్రప్రజల చాతగానితనంగా భావిస్తుందని అన్నారు.

అరకొర నిధులు ఇచ్చి,ఏదో గొప్పగా చేశామంటే కుదరదని, దీన్ని బట్టి రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఇంకా 10 ఏళ్లకు పైగానే పడుతుం దన్నారు. ఇన్ని కష్టాల్లోను పెట్టుబడులు కోసం అహర్నిశలు శ్రమిస్తూ ముందుకు పోతున్నామన్నారు. ఎవరెన్ని విధాలా మాట్లాడినా ప్రత్యేక హోదా కోసం రాజీలేని విప్లవా త్మకంగా వీరోచితంగా పోరాడతామని స్పష్టం చేశారు. మిత్రపక్షంగా ఉండబట్టే ఆనాడు ఎన్ని తప్పులు చేసినా మాట్లాడలేకపోయా మని అన్నారు. ఇప్పుడు ఆ పార్టీ నేతలు తెలుగు వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తే ఎట్టి పరిస్థితుల్లోను సహించేది లేదని స్పష్టంచేశారు. అమిత్‌షా లేఖలో ఎంతో దుర్మార్గంగా అవాకులు,చెవాకులు పేలారని ధ్వజమెత్తారు. ఈ క్రమంలో రాష్ట్రం కోసం ,ప్రజల కోసం టీడీపీ ఎటువంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉందన్నారు. నాడు ఎన్టీఆర్ తెలుగు వారి ఆత్మగౌరవాన్ని ఇనుమడింజేశారని, ఆయనిచ్చిన స్ఫూర్తితో మరింత ముందుకు పోతామని స్పష్టం చేశారు.విభజన హామీలపై సమీక్ష చేయకుండా టీడీపీని లక్ష్యంగా చేసుకుని వ్యవహరిస్తున్నారని, ఇటువంటి వారికి ఎలా సమాధానం చెప్పాలో తమకు తెలుసన్నారు. తాను రాసిన లేఖను వక్రీకరించారని అన్నారు. పైగా మారు మనసు పొందకుండా .. సమీక్షించుకోకుండా ఏకపక్షంగా మాట్లాడడం ఎంతవరకు సబబు అన్నారు. నాడు రాష్ట్రాన్ని విభజించిన కాంగ్రెస్ ఆ తర్వాత ఎన్నికల్లో అడ్రస్ లేకుండా పోయిందని గుర్తు చేశారు. ప్రజలు వారికి డిపాజిట్లు కూడా దక్కకుండా చేసిన విష యాన్ని గుర్తించాలని అన్నారు. రానున్న రోజుల్లో వారికి ఇదే పరిస్థితి రావొచ్చు న్నారు. రాష్ట్రానికి అన్యాయం చేస్తుంటే బాధతో, ఆవేదనతో మాట్లాడుతున్నామని చెప్పారు. లేఖలో పొంతనలేకుండా అంశాలు ప్రస్తావించారన్నారు.

కుట్ర రాజకీయాలు చేస్తారా?

మిగతా రాష్ట్రాలతో సమానంగా ప్రత్యేక హోదా బెనిఫిట్స్ ఇస్తానంటేనే అంగీకరించామని, కానీ మిగతా రాష్ట్రాలకు హోదా బెనిఫిట్స్ ఇస్తూ ఏపీని విస్మరించడం వెనుక ఏం కుట్ర చేస్తున్నారని ప్రశ్నించారు. విభజన హామీలు కోసం తాను 29 సార్లు ఢిల్లీ చుట్టూ తిరిగానని, ప్రధానిని, మంత్రులను కలిసి,వేడుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందని, చివరికి మోసం చేశారన్నారు.


ఆ లేఖ ఎంతో దుర్మార్గంగా ఉంది

అమిత్‌షా లేఖలో ఎంతో దుర్మార్గంగా అవాకులు,చెవాకులు పేలారని ధ్వజమెత్తారు. ఈ క్రమంలో రాష్ట్రం కోసం, ప్రజల కోసం టీడీపీ ఎటువంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉందన్నారు. నాడు ఎన్టీఆర్ తెలుగు వారి ఆత్మగౌరవాన్ని ఇనుమడింజేశారని, ఆయనిచ్చిన స్ఫూర్తితో మరింత ముందుకు పోతామని స్పష్టం చేశారు.

ఇలాగే ఉంటే భవిష్యత్‌లో చరిత్ర హీనులుగా మిగిలిపోతారంటూ మండి పడ్డారు. వివిధ పథకాలకు అరకొర నిధులిస్తే లక్షల కోట్ల విలువచేసే భూములను ఇచ్చామన్నారు. ఇచ్చిన భూముల విలువ కోట్లలో ఉంటుందని, వాటితో తామే పరిశ్రమలు స్థాపించుకునే అవకాశం కూడా ఉంటుందన్నారు.

ప్రజలే నాకు హైకమాండ్

ప్రజలే నాకు హైకమాండ్ అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టంచేశారు. వేరే రాష్ట్రాలకు హోదా ప్రత్యేక రాయితీలు ఇస్తున్న కేంద్రం తమపై అసత్యాలతో ఎదురుదాడి చేసి,5 కోట్ల రాష్ట్ర ప్రజల్ని మభ్యపెడుతున్నారని ధ్వజమెత్తారు. మీరేమి నాకు హైకమాండ్ కాదు..నాకు నా రాష్ట్రప్రజలే హైకమాండ్ అని స్పష్టంచేశారు. ఎన్టీ ఆర్ ఇచ్చిన ఆత్మగౌరవ స్ఫూర్తితో తిరుగులేని విధంగా కేంద్రంపై చివరకంటూ పోరాడతామని అన్నారు. మీరు ఎంతగా రెచ్చగొడతారో అదే స్థాయిలో మరింత ఆత్మ విశ్వాసంతో పోరాతామన్నారు. జపాన్ తరహా ఉద్యమాన్ని నిర్వహిస్తామని అన్నారు. తాము చేసిన అన్ని పనులకు సంబంధించిన యూసీలన్నీ పంపించామని పేర్కొన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులను వేరే వాటికి మళ్లించామని చేసిన తప్పుడు ఆరోపణల్లో నిజం లేదన్నారు. ఆ అవసరం తమకు లేదన్నారు.లేనిపోని అవినీతిని అంటగడితే ప్రజలు చూస్తూ ఊరుకోరని అన్నారు. ఇపిపి, కేంద్ర ఇండస్ట్రీ ఇన్సెంటివ్‌లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం వల్ల పరిశ్రమలు రాకుండా పోతున్నాయన్నారు. తాము 90:10 పద్ధతిలో కేంద్రం ఇండస్ట్రీ ఇన్సెంటీవ్‌లు అడిగినా పట్టించుకోవడం లేదన్నారు. 11,598 యూసీలు పూర్తి చేశామన్నారు.రూ. 3,979 కోట్లకు కేవలం 355 కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. ఇటీవల రూ.350 కోట్లు ఇచ్చినట్లే ఇచ్చి, తిరిగి తీసేసుకున్నారని అన్నారు.మీ దగ్గర ఇన్ని తప్పులు ఉంచుకుని,నన్నే తప్పు బడతారా ? ఇదేం రాజకీయం అంటూ నిలదీశారు.




మిత్ర ధర్మానికి తూట్లు

నాడు రాష్ట్ర విభజన సందర్భంలో బీజేపీ కూడా మద్దతుగా నిలిచిందని, ప్రత్యేక హోదా అంశంతో పాటు రాజ్యసభలో చేసిన హామీలన్నీ ఆ పార్టీకి తెలిసే నాటకమాడుతున్నారని ధ్వజమెత్తారు. ప్ర త్యేక హోదా, విభజన హామీల కోసమే ఇంతకాలం వారితో ఉన్నామని, కానీ మిత్ర ధర్మాన్ని పాటించకుండా ప్రత్యేకహోదా డిమాండ్‌కు తూట్లు పొడిచారని ఆవేదన వ్యక్తంచేశారు.

సహనాన్ని పరీక్షిస్తూ... తప్పుడు లేఖలు సంధిస్తున్నారు

నేను పట్టింపులకు పోలేదన్నారు. ఎంతో ఓపికతో పద్ధతి మార్చుకుని, సమీక్షించుకుని, రాష్ట్రానికి న్యాయం చేస్తారని ఎదురు చూశానని అన్నారు. కానీ అవేవి పట్టించుకోకుండా రాజకీయ స్వార్థంతో చులకనగా చూసి, మిత్ర ధర్మానికి తూట్లు పొడిచి, తప్పుడు లేఖాస్త్రాలు సంధిస్తున్నారని అన్నారు. కేవలం ప్రజలకు మేలు జరగాలనే లక్ష్యంతోనే సహనం వహిస్తున్నామని చెప్పారు. లేనిపోని అడ్డంకులు సృష్టిస్తూ, అభాండాలు వేస్తున్నారని అన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు, రైల్వేజోన్, చెన్నై- విశాఖ కారిడార్ వంటి వాటికి తిలోదకాలు ఇచ్చారని అన్నారు. దుగ్గిరాజపోర్టు ఊసే లేకుండా చేశారన్నారు. ఫైనాన్స్ కమిషన్ ఇవ్వమని చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు.





మీకో న్యాయం... మాకో న్యాయమా?

మిత్ర ధర్మం గురించి మీరా మాట్లాడేది? తెలంగాణాలో ఎవరికి చెప్పి మాతో తెగదెంపులు చేసుకున్నారు? అంటే మీకో న్యాయం... మాకో న్యాయమా? అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. అమిత్ షా లేఖపై ఆయన శనివారం అసెంబ్లీలో ఘాటుగా బీజేపీపై స్పందించారు. అన్నీ అభూతకల్పనతో లేఖ రాసిన అమిత్‌షా రాజకీయ ఎత్తుగడలు తమకు తెలియందీ కాదన్నారు. తెలంగాణలో సంవత్సరన్నరలోనే మిత్రధర్మానికి తిలోదకాలిచ్చి,తమ దారి చూసుకున్నారని గుర్తు చేశారు. కానీ మీరు అలా చేసినా కూడా మేము ఇక్కడ ఎంతో ఉన్నతంగా హుందాతనంగా వ్యవహరించి, మిత్రధర్మాన్ని కాపాడమని అన్నారు. రాష్ట్రప్రయోజనాలు ఆశించి,ఎంతో ఓపికతో ఉన్నామన్నారు. నా గురించి వాజ్‌పాయ్ లాంటి నాయకునికి బాగా తెలుసన్నారు. చరిత్ర తెలుసుకోకుండా మాట్లాడితే చరిత్రహీనులుగా మిగిలిపోతారని పేర్కొన్నారు. తెలుగు ప్రజల గురించి అడ్డగోలుగా మాట్లాడితే ఉపేక్షించమని అన్నారు.

ఆనాడు మన్మోహన్‌సింగ్ ఫొటో మీరెందుకు పెట్టలేదు?

తాను కేంద్రం పథకాలకు సంబంధించి ప్రధాని ఫొటో పెట్టలేదంటున్నారని,కానీ ఆనాడు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మోదీ నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఫొటోను ఎందుకు పెట్టలేదని చంద్రబాబు ప్రశ్నించారు. చెప్పటానికే నీతులు కాదని గ్రహించాలన్నారు. ప్రజల్ని మోసం చేసి, వైసీపీతో జతకడుతున్నారని ధ్వజమెత్తారు. నేర చరిత్ర ఉన్న వారు పీఎంవో కార్యాలయానికి వచ్చి వెళుతుంటే ప్రజలకు ఎటువంటి సంకేతం ఇస్తున్నారని ప్రశ్నించారు. వీటన్నింటికి కాలమే సమాధానం చెబుతుందన్నారు.

జాతి గర్వించేలా అమరావతి నిర్మాణం



- రైతుల త్యాగం ఎన్నటికీ మరవలేం
- రాజధానిలో 60 వేల మందికి ఉపాధి
- కేంద్రం ఇచ్చింది కేవలం రూ.1,500 కోట్లే
- శాసనసభలో మంత్రి నారాయణ

అమరావతి, ఆంధ్రప్రభ: నవ్యాంధ్ర రాజధాని అమరావతిని విశ్వనగరాల్లో ఒకటిగా నిర్మించడానికి తమ ప్రభుత్వం బృహత్ ప్రణాళికతో ముందుకు సాగుతోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి పి. నారాయణ తెలిపారు. రైతుల త్యాగ ఫలితంగా సమకూరిన 33 వేల ఎకరాల భూముల్లో అధునాతన హంగులతో కూడిన భవనాల సమహారంగా నూతన రాజధాని దర్శనమివ్వనున్నదని ఆయన ఘంటాపథంగా చెప్పారు. శనివారం శాసనసభలో 344వ నియమం కింద అమరావతి రాజధాని అభివృద్ధిపై పలువురు సభ్యులిచ్చిన నోటీసుకు మంత్రి నారాయణ సమాధానమిచ్చారు. రాజధాని నిర్మాణానికే రూ.2,500 కోట్ల నిధులందిస్తామని హామీ ఇచ్చిన మోడీ ప్రభుత్వం కేవలం రూ.1,500 కోట్లు మాత్రమే అందించిందని, ఈ కారణంగా కొన్ని నిర్మాణ పనులు ఆశించినంత వేగంగా సాగడంలేదని మంత్రి అంగీకరించారు. అయినప్పటికీ వివిధ మార్గాల ద్వారా నిధులు సేకరించి రాజధాని నిర్మాణ పనులు జరిగేలా చూస్తున్నామన్నారు. వచ్చే డిసెంబర్ నాటికి ప్రభుత్వోద్యోగుల అవసరార్థం 3,840 అపార్ట్‌మెంట్లను నిర్మించి అందచేయనున్నట్లు చెప్పారు. నీలి, హరిత రాజధానిగా చూడబోయే రాజధానిలో ఓ అద్భుత కన్వెన్షన్ సెంటర్, 300 ఎకరాల విస్తీర్ణంలో అందమైన పార్కు నిర్మితమవుతాయని, రాజధానిలో ఏర్పాటయ్యే వివిధ కార్యాల యాలు, సంస్థలు కలిసి 60 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తాయన్నారు. ప్రస్తుతమున్న అసెంబ్లీ భవనం భవిష్యత్‌లో 8 అంతస్తుల భవనంగా పలు సంస్థల ఏర్పాటుకు దోహదపడుతుందన్నారు. సింగపూర్ ప్రభుత్వం అందించిన మాస్టర్ ప్లాన్ ప్రకారం 1600 కి.మీ. పొడవున రూ.10,373 కోట్ల ఖర్చుతో రహదారుల నిర్మాణం కావిస్తామని, 8 లైన్లతో 97.5 కి.మీ. విస్తీర్ణంలో ఇన్నర్ రింగ్ రోడ్ నిర్మాణంతో పాటు రాజధాని నడిబొడ్డున జ్యోతిబా పూలే, అంబేద్కర్, ఎన్‌టిఆర్ విగ్రహాలు ఏర్పాటవుతాయని మంత్రి చెప్పారు. సింగపూర్ నిపుణులు అందించిన ప్లాన్ ఆధారంగా రాజధాని తాత్కాలిక భవనాలను 6 లక్షల చదరపు అడుగుల్లో 6 నెలల కాలంలో వంద అడుగుల పునాదితో రూ.450 కోట్ల ఖర్చుతో నిర్మింపచేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుందన్నారు. రాజధాని ఆకృతులకు త్వరలో మంత్రివర్గం ఆమోదం తెలుపుతుందని, ఆ వెంటనే సచివాలయం, హైకోర్టుతోసహా వివిధ రాష్ట్రస్థాయి కార్యాలయాల నిర్మాణాలు ప్రారంభమవుతాయన్నారు. రాజధానిని 7 సిటీలుగా విభజించి ఒక్కో నగర జనాభా లక్ష ఉండేలా చేసి పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించనున్నట్లు మంత్రి వివరించారు. కొండవీటి వాగు వల్ల రాజధాని ప్రాంతం ముంపునకు గురవుతుందన్న విమర్శలను మంత్రి ఖండించారు. భావితరాలకు విశేష ప్రయోజనాలను కల్గించేరీతిలో అమరావతిని ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రాజధానిగా తీర్చిదిద్దనున్న తరుణంలో ఈ నిర్మాణాలపై ప్రతిపక్ష పార్టీల నేతలు చేస్తున్న రాద్ధాంతాన్ని ప్రజలు హర్షించరని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

పేదల సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే నాటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు దళిత బడుగు, బలహీన, ఇతర ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ఆర్థికాభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలను వెలుగులోకి తెచ్చి ఆ వర్గాల జీవన ప్రమాణాన్ని పెంపొందించారని పలువురు శాసనసభ్యులు ప్రశంసించారు. శనివారం ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ, మహిళా, శిశు సంక్షేమంపై సభలో జరిగిన లఘు చర్చలో టీడీపీ సభ్యులు సూర్యారావు, వీరాంజనేయస్వామి, యామిని బాల, చాంద్ బాషా, సత్యనారాయణ, సుగుణమ్మ, బీజేపీ సభ్యులు విష్ణు కుమారరాజు పాల్గొన్నారు. పేదవాడి ఇంటిలోకి తొంగి చూసిన ఏకైక రాజకీయ పార్టీ టీడీపీ అని, నాడు ఎన్టీఆర్, నేడు చంద్రబాబులు పేద వర్గాలకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ వారికి సొంత ఇళ్ళ నిర్మాణానికి బాటలు వేశారని ఎమ్మెల్యే సూర్యారావు ప్రశంసించారు.వీరాంజనేయస్వామి మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాలతో పాటు బ్రాహ్మణ, వైశ్య కార్పొరేషన్‌లు కూడా ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుందన్నారు. మహిళలను పారిశ్రామిక వేత్తలుగా చేయాలన్న లక్ష్యం, దళితులు, బలహీన వర్గాలకు చెందిన బాల బాలికలు విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించడం కోసం ఆర్థిక సాయం అందించడంతో పాటు ఈ వర్గాలకు పెళ్ళి కానుకను వర్తింపజేస్తున్న చంద్రబాబు పేదల సాధికారతే తన ప్రభుత్వ లక్ష్యమని చాటుకుంటున్నారన్నారు. మరో సభ్యురాలు యామిని బాల మాట్లాడుతూ మహిళా వికాసానికి చంద్రబాబు చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు ఇతర రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. చాంద్‌బాషా మాట్లాడుతూ బీసీ అంటే టీడీపీ, టీడీపీ అంటే బీసీలు అనే విధంగా ఈ వర్గాలతో చంద్రబాబు మమేకమయ్యారని ప్రశంసించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆదరణ పథకం ద్వారా బీసీ వర్గాలకు పనిముట్ల కొనుగోలు చేసుకొని వెసులుబాటును కల్పించి వారికి ఆదాయ మార్గాలు కల్పించడం, వీటితో పాటు బీసీ సబ్‌ప్లాన్ ప్రకటించి చంద్రబాబు మమతా నురాగాలను కొనసాగిస్తున్నారని మరో సత్యనారాయణ తెలిపారు. తిరుపతి శాసన సభ్యురాలు సుగు ణమ్మ మాట్లా డుతూ బాలల రక్షణ, సంరక్షణ బాధ్య తను తన సొంత బాధ్యతగా చేసుకున్నారని, చంద్రబాబు ఎంతైనా అభినందనీయు లన్నారు.







అసెంబ్లీ నమూనాలను పరిశీలించిన స్పీకర్, లోకేష్

అమరావతి, ఆంధ్రప్రభ; ప్రపంచశ్రేణి రాజధాని నిర్మాణానికి నార్మన్ పోస్టర్ రూపొందించిన నమూనాలను శనివారం అసెంబ్లీ ప్రాంగణంలో స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు, మంత్రులు నారా లోకేష్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నారాయణ, అమర్‌నాథ్‌రెడ్డి తదితర మంత్రులు, శాసనసభ్యులు పరిశీలించారు. ముందుగా శాసనసభాపతి డాక్టర్ కోడెల, నారాయణతో కలిసి రాజధాని నమూనాలను పరిశీలించారు. భవనాల నిర్మాణంలో ఎమ్మెల్యేల అభిప్రాయాలు తీసుకోనున్నట్లు మంత్రి నారాయణ చెప్పారు. సచివాలయం కోసం ఐదు బహుళ అంతస్థుల భవనాన్ని నిర్మించనున్నట్లు పోస్టర్స్ బృందం ప్రతినిధులు వివరించారు. సీఎం చంద్రబాబు ఉండే భవనంలో 46 అంతస్తులు ఉంటుందనీ, పైన హెలిపాడ్ కూడా నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. డయాగ్రిడ్ టెక్నాలజీతో భవనాల నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సూర్యరశ్మి నేరుగా లోపలికి ప్రవేశించకుండా ప్రత్యేక అద్దాల ఏర్పాటు చేస్తారని నమూనాలను పరిశీలించిన మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. సచివాలయం పైనుంచి చూస్తే ఇతర కట్టడాలు స్పష్టంగా కనిపించేలా నిర్మాణాలు చేపడుతున్నారని నిర్మాణాలు అద్భుతంగా ఉన్నాయని సునీత కితాబిచ్చారు. అలాగే రాజధానిలో నిర్మింపతలపెట్టిన సచివాలయ భవంతులు, అసెంబ్లీ, శాసనసభ్యుల క్వార్టర్ల ఆకృతులపై మంత్రి నారా లోకేష్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డిలు సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా నార్మన్ పోస్టర్స్ రూపొందించిన రాజధాని నిర్మాణ భవన ఆకృతులు అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయగా, నిర్మాణ ఆకృతులు పలువురిని ఆకర్షించాయి.



అసెంబ్లీ సమావేశాలు పొడిగింపు?

- పాలకపక్షంలో తర్జనభర్జన

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలను ఏప్రిల్ 5వ తేదీ దాకా పొడిగించే అవకాశాలున్నాయి. తొలుత ఈ సమావేశాలను మార్చి 28 వరకు నిర్వహించాలని బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో నిర్ణయించారు. అయితే ప్రతిపక్షం లేకపోయినా సభను అర్థవంతంగా, సమస్యలను ప్రతిబింబించే విధంగా కొనసాగించాలని గట్టి పట్టుదలతోవున్న ముఖ్యమంత్రి తాజాగా సమావేశాల పొడిగింపు పట్ల సుముఖంగా వున్నట్టు తెలిసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడం, సభ్యులకు క్రీడల నిర్వహణ, ముఖ్యమైన అంశాలపై చర్చించాల్సి వున్న నేపథ్యంలో సమావేశాలు పొడించేందుకే అవకాశాలు వున్నాయని భావిస్తున్నారు. తొలుత ఏప్రిల్ 1 వ తేదీవరకు సమావేశాలను పొడిగించాలనే దిశగా పాలకపక్షంలో చర్చ జరిగిందని, అయితే చివరకు 5 వ తేదీదాకా కొనసాంచాలనే అభిప్రాయం వ్యక్తమైందని తెలిసింది.

పథకాల అమలులో ఏపీకి అవార్డులు




- బీజేపీ పాలిత రాష్ట్రాలకు ఎందుకు రాలేదు?: మంత్రి లోకేష్

అమరావతి, ఆంధ్రప్రభ: పథకాలను సమర్థవంతంగా అమలుచేయడంతోనే ఆంధ్రప్రదేశ్‌కి 20 జాతీయ అవార్డులు వచ్చాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. గ్రామీణ నీటిసరఫరాపై శనివారం శాసనమండలిలో మాట్లాడుతూ దేశంలోని 20 రాష్ట్రాలలో బీజేపీ అధికారంలో ఉందని, కాని ఆ రాష్ట్రాలకు అవార్డులు ఎందుకు రాలేదని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజుని ప్రశ్నించారు. ఏపీకి అవార్డుల రావటంలో కేంద్రం సహకారం కూడా ఉందన్న ఆయన రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా పథకాలను అమలుచేయడంతో అవార్డులు వచ్చాయన్నారు. ఉపాధి హామీ పథకం కాంగ్రెస్ పెట్టిందని, ఈ పథకం అమలులో పశ్చిమబెంగాల్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచాయన్నారు. శాశ్విత తాగునీటి కోసం వాటర్ గ్రిడ్ పథకం చాలా అవసరమని, 2022నాటికి ప్రతి రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి కుళాయి ద్వారా 70 లీటర్ల నీటిని ఇస్తామని స్పష్టంచేశారు. గత సంవత్సరం ఏప్రిల్ నాటికే రాష్ట్రంలో 2,22,250 బోర్లు వేసి చేతిపంపులు ఏర్పాటు చేశామని, పీడబ్ల్యూయస్ కింద 33,985, సీపీడబ్ల్యూయస్ కింద 554 నిర్మించామన్నారు. సౌరశక్తి ఆధారిత పథకాల ద్వారా 1127 ఇళ్లకు నీటి సరఫరా అందించామని, ఉద్దానంతోపాటు ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలలోని 325 కుటుంబాలకు నీటి శుద్ధీకరణ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. సచివాలయంలో వాటర్ రూమ్‌ని క్రియోట్ చేస్తామని, మార్చి-2019 నాటికి ఎటువంటి ఇబ్బంది లేకుండా కుళాయి నీటిని తాగాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నామని తెలిపారు. తాగునీటి సరఫరా సంస్థను ఏర్పాటు చేశామని, రూ.22వేల కోట్లతో తాగు నీటి ప్రాజెక్టు ప్రతిపాదనలు రూపొందిచామని, రూ.99.32 కోట్లు గనుల శాఖనుండి తీసుకున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీసబ్ ప్లాన్ మీద సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారని, 2019 మార్చి నాటికి ఎస్టీ తండాలన్నిటికీ తాగు నీరు ఇస్తామన్నారు. సభ్యులు చెప్పిన విధంగా పైప్ లైన్లు అండర్ గ్రౌండ్ వేస్తామని, తూర్పుగోదావరి జిల్లాలో వందశాతం ఎల్ఈడీ వీధిలైట్లు ఏర్పాటు చేసామన్నారు. ప్రతి పాఠశాలకు తాగునీరు అందిస్తామని, బాక్సైట్ మైనింగ్‌లేదని సీఎం తెలిపారన్నారు. ఆక్వా కల్చర్ ద్వారా ఆదాయం ఎక్కువగా వస్తుందని, దాంతోపాటు కాలుష్యం కూడా ఎక్కువగా ఉంటుందని, దీనిపై ఆలోచిస్తామన్నారు. ఏరాష్ట్రంలో లేని విధంగా పంట కుంటలు ఏర్పాటు చేశామని, వెలుగొండ ప్రాజెక్టుతో ప్రకాశం జిల్లా త్రాగునీటి సమస్య పరిష్కారమవుతుందని, తప్పకుండా వెలుగొండను పూర్తి చేస్తామన్నారు. సలహాలు ఇవ్వొచ్చని తెలిపారు.

చాలా ఇచ్చాం

● ఏపీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం ● ఇచ్చిన నిధులకు యూసీలు ఎందుకివ్వలేదు?

● రాజకీయాల కోసమే ఎన్డీయే నుంచి టీడీపీ బయటకొచ్చింది ● చంద్రబాబుకు అమిత్‌షా 9 పేజీల లేఖ



అమిత్‌షా లేఖ పూర్తి పాఠం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:

శ్రీ చంద్రబాబునాయుడుగారికి,

మొదటగా మీకు, ఆంధ్రప్రదేశ్‌లోని 5 కోట్ల మంది సోదర సోదరీమణులకు ఉగాది శుభాకాంక్షలు. ఈ నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందాన్ని, మంచి ఆరోగ్యాన్ని అందిస్తుంది అని ఆశిస్తున్నాను. ఎన్డీఏ కుటుంబం నుంచి వైదొలగాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించుకున్న తర్వాత ఈ ఉత్తరాన్ని రాస్తున్నాను. మీ నిర్ణయం ఏకపక్షం, దురదృష్టకరం. అభివృద్ధి అంశాల కన్నా రాజకీయ సమీకరణల ఆధారంగానే మీ నిర్ణయం పూర్తిగా ప్రభావితమైనదని నేను సందేహిస్తున్నాను. కార్యరూప రాజకీయం, అందరికీ అభివృద్ధి విధానాన్ని భాజపా బలంగా నమ్ముతుంది. జాతీయ అభివృద్ధి అజెండాలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రముఖస్థానం ఉంది. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం శ్రీ నరేంద్రమోడీగారి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అందుబాటులో ఉన్న ఏ ఒక్క అవకాశాన్ని వదలడం లేదన్నది జగద్విదితం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చర్చ మొదలైనప్పటి నుంచి నేటి వరకు ఉభయ రాష్ట్రాల లోని తెలుగు ప్రజల ప్రయోజనాల పరిరక్షణకై భాజపా కృత నిశ్చయంతో ఉన్నది. తన వాణిని బలంగా వినిపించుచున్నది. ఇది కాంగ్రెస్ పార్టీ అనుసరించిన విధానానికి పూర్తి విరుద్ధం. కాంగ్రెస్ పార్టీ గందరగోళంగా ఏపీని విభజించటమే కాక తెలుగు ప్రజల ప్రయోజనాల పట్ల పూర్తిగా నిర్లిప్త భావాన్ని ప్రదర్శించింది. తెలుగు జాతిపట్ల వారి చారిత్రిక, నిరాశక్త ధోరణికి అనుగుణంగానే వ్యవహరించింది. గత లోక్‌సభ, రాజ్యసభలలో మీ పార్టీకి తగినంత ప్రాతినిధ్యం లేకపోయినప్పటికీ భాజపా ఒక ఎజెండా ప్రకారం వ్యవహరించి ఉభయ రాష్ట్రాల్లోని తెలుగు ప్రజలకు న్యాయం జరిగే విధంగా వ్యవహరించింది. కేంద్రంలో మీరు కూడా భాగస్వామిగా ఉన్న భాజపా నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అవశేష ఆంధ్రప్రదేశ్‌ను బాధిత రాష్ట్రంగా భావించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడమైనది. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పట్ల చూపించిన శ్రద్ధలో ఆంధ్ర అభివృద్ధి పట్ల అంకితభావం, చిత్తశుద్ధి కనిపిస్తాయి. గత నాలుగేళ్లుగా ఆంధ్ర రాష్ట్రానికి కేటాయించిన భారీ నిధులు విభజన చట్టం 2014లోని హామీల అమలు దిశగా జరుగుతున్న తీరును గమనిస్తే ఎన్డీఏ ప్రభుత్వ అంకితభావం స్పష్టమౌతుంది. ప్రజల జీవితాలలో మార్పు సాధించే ఉద్దేశ్యంతో మాత్రమే భాజపా అభివృద్ధి రాజకీయాలను నడుపుతున్నది. గడచిన నాలుగు సంవత్సరాలుగా దేశ వ్యాప్తంగా ప్రజలు మమ్మల్ని మా సానుకూల ఎజెండాను ఆశీర్వదించారు. ఆంధ్ర రాష్ట్రప్రజల ఆకాంక్షల పట్ల కేంద్రం నిర్లిప్తతతో ఉన్నదని విభజన చట్టంలోని హామీలను నెరవేర్చలేదని మీరు చేసిన వాదన పూర్తిగా అవాస్తవం, నిరాధారం. ఈ ప్రభుత్వం సమాఖ్యాస్ఫూర్తిని సిద్ధాంతంగా భావిస్తుంది. ప్రధాని శ్రీ నరేంద్రమోడీ గారు అందరు ముఖ్యమంత్రులతో కలిసి టీం ఇండియా స్పిరిట్‌తో పనిచేయుచున్నారు. కేంద్ర ఆదాయంలో రాష్ట్రాలకు పంపిణీ చేసే ఆదాయం ఇదివరలో 32 శాతం కాగా ఇప్పుడది అత్యధికంగా 42 శాతంగా ఉంది. ఈ పెరుగుదలతో రాష్ట్రాలు అదనంగా 2 లక్షల కోట్లను పొందనున్నాయి. ఆంధ్రరాష్ట్రం పట్ల మా ప్రభుత్వం వివక్ష చూపిస్తున్నదని మీరు చేస్తున్న ఆరోపణ వాస్తవాలకు దూరమైనదని దీనిని బట్టి అర్థం అవుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎకానమీకి ఊపు తెచ్చే విధంగా ప్రత్యేక సాయం, శ్రద్ధ ఏపీకి లభించాయి. కింద తెలుపబడిన అంశాల్లో పేర్కొన్న వాస్తవాలను బట్టి ఏపీ విభజన చట్టం 2014లో పేర్కొన్న చట్టబద్ధమైన హామీలను కేంద్రప్రభుత్వం ఎలా అమలు చేసింది, రాష్ట్రం ఆర్థికంగా బలోపేతం కావడానికి ఏ విధంగా కృషి చేసినది స్పష్టమౌతుంది. వీటివల్ల కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతలను ఏ విధంగా నిర్వర్తించిందో, భాజపా ఒక నమ్మకమైన స్నేహితుడిగా వ్యవహరించడం, ఆంధ్ర రాష్ట్రప్రజల శ్రేయోభిలాషిగా వ్యవహరించిన విషయాలు మీకు తెలిసి ఉన్నప్పటికీ ఒప్పుకోలేరన్న విషయం స్పష్టమౌతుంది. విద్య, మౌలిక వసతుల కల్పన అనేవి 'ఏపీ విభజన చట్టం - 2014' లో రెండు భాగాలు. విభజన చట్టం ప్రకారం జాతీయ ప్రాధాన్యతకల 11 విద్యాసంస్థలను కేంద్ర ప్రభుత్వం 13వ ప్లాన్ పూర్తయ్యేలోపు (2022) ఏర్పాటు చేయాలి. కాని ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ఐటీ, ఐఐఎం, ఐఐఎస్ఈఆర్, ఐఐపీఈ, వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఎన్ఐడీఎం, ఎయిమ్స్ వంటి 9 విద్యాసంస్థలు ఇప్పటికే ఏర్పాటయ్యాయి. మిగిలిన రెండు విద్యాసంస్థలు (సెంట్రల్ యూనివర్శిటీ, ట్రైబల్ యూనివర్శిటీ) ఏర్పాటుకు అవసరమైన నిధులను ప్రస్తుత కేంద్ర బడ్జెట్‌లో ఆమోదించారు. విభజన చట్టం ప్రకారంపై సంస్థల ఏర్పాటుకు 2022 వరకు అవకాశం ఉన్నప్పటికీ కేవలం మూడేళ్లలోనే సాకారం చేసిన కేంద్రం రాష్ట్ర ప్రజల ఆకాంక్షల పట్ల నిర్లిప్తంగా ఉందని, మొండిగా వ్యవహరిస్తోందని ఎలా ఆరోపిస్తారు?

విభజన చట్టాన్ని అనుసరించి సాధ్యాసాధ్యాలను బట్టి ఏపీలో ఎనిమిది భారీ ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉంది. ఇప్పటికే కేంద్రం ఈ కింది 5 భారీ ప్రాజెక్టుల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకుంది.

1) కాకినాడలో హెచ్‌పీసీఎల్ వారి గ్రీన్‌ఫీల్డ్ క్రూడ్ ఆయిల్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్సు.

2) 800 కి.మీ విశాఖ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్.

3) విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలోని విమానాశ్రయాలను అంతర్జాతీయ విమానాశ్రయాలుగా ఆధునీకరించడం.

4) (ఎ) నూతన రాజధాని అమరావతి నుంచి అనంతపురం కలిపే గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేని కర్నూలు,

కడప వరకు పొడిగించే ప్రతిపాదనతో టెక్నో- ఎకనామిక్ ఫీజిబిలిటీ రిపోర్టులు (రూ.24 వేల కోట్లు అంచనా వ్యయంతో) సిద్ధమౌతోందని మీ ప్రభుత్వం తెలిపింది. మొదట్లో ఎలాంటి షరతులు లేకుండా భూమిని ఉచితంగా ఇస్తామన్న రాష్ట్రప్రభుత్వం తదుపరి భారత్‌మాల పరియోజన ప్రకారం 50 శాతం ల్యాండ్ కాస్ట్‌ను సమకూర్చుకోగలమని ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఈ విషయమై రాష్ట్రప్రభుత్వం నుంచి లేఖ రావాలి.

బి) రూ.19,700 కోట్ల వ్యయంతో 180 కి.మీ. పొడవైన అవుటర్ రింగ్ రోడ్డు.

సి) రూ. 2,680 కోట్ల వ్యయంతో అమరావతి మీదుగా విజయవాడ - గుంటూరు మధ్య కొత్త రైల్వేలైన్.

డి) రూ. 340 కోట్ల వ్యయంతో 309 కి.మీ. పొడవైన నడికుడి - శ్రీకాళహస్తి మధ్య కొత్త రైల్వేలైన్.

ఇ) రూ. 3,361 కోట్ల అంచనా వ్యయంతో ఎలక్ట్రిఫికేషన్‌తో కూడిన గుంతకల్లు - గుంటూరు లైన్ డబ్లింగ్ ప్రాజెక్టు.



5) రూ. 6,769 కోట్ల అంచనాతో విజయవాడ మెట్రోరైల్ ప్రాజెక్టుకు సూత్రప్రాయ అంగీకారం. విశాఖపట్నం మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి సవరించిన సూచనలు రాష్ట్రప్రభుత్వం నుంచి అందాల్సి వుంది. మిగిలిన ప్రాజెక్టుల్లో దుగరాజపట్నం పోర్టు, వైఎస్ఆర్ జిల్లాలో స్టీల్‌ప్లాంట్ సానుకూలమైనవి కావని ప్రాథమిక అంచనా. దుగరాజపట్నం పోర్టు కాని, మరి ఇతర ఏ పోర్టు కాని సాధ్యమైనంత త్వరగా అమలు చేయగలమని పార్లమెంటులో భారత ప్రభుత్వం హామీ ఇచ్చింది. వైఎస్ఆర్ జిల్లాలోని స్టీల్‌ప్లాంట్ సాధ్యాసాధ్యాల నిమిత్తం ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్, ప్రాజెక్టు ఏర్పాటుకు చేసిన సూచనలతో కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టు అమలుకు కార్యాచరణ ప్రారంభించింది. కొత్త రైల్వే జోన్ ఏర్పాటు అంశం రైల్వే మంత్రిత్వ శాఖ పరిశీలనలో ఉంది. అన్ని సంబంధిత అంశాలను పరిగణలోనికి తీసుకుని తగు సమయంలో నిర్ణయం తీసుకుంటాం.

ప్రత్యేక హోదా:

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రధానమైన నిర్ణయాత్మక చర్చకి బదులుగా ప్రత్యేక హోదా అంశం పట్ల రాజకీయ పార్టీలు, ప్రజల భావోద్వేగాలను రెచ్చగొడుతున్నాయి. రాజకీయ పార్టీలు జరుగుతున్న అభివృద్ధిని దాచి రాజకీయ లబ్ధికోసం ప్రజలలో సెంటిమెంటుని రగిలిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వనరుల లభ్యతను బట్టి సిఫార్సు చేసేనిమిత్తం మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్.ఒ.నెం. 1424(ఇ)లో ప్రచురితమైన రాష్ట్రపతి ఉత్తర్వు ద్వారా ఏపీ విభజన చట్టం 2014 ప్రకారం 14వ ఆర్థికసంఘం టెర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీఓఆర్) చిత్తశుద్ధితో సవరించాం. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో బలహీన ఆర్థిక పరిస్థితిని పరిగణలోకి తీసుకున్న 14వ ఆర్థిక సంఘం అయిదు సంవత్సరాల మొత్తం ఆర్థికలోటు రూ.22,113 కోట్లుగా తేల్చింది. 8 ఈశాన్య రాష్ట్రాలతో పాటుగా 2015 నుంచి 2020 వరకు అయిదు సంవత్సరాల కాలపరిధికి రెవిన్యూ డెఫిషిట్ గ్రాంట్లను పొందిన ఏకైక రాష్ట్రం విభజిత ఆంధ్రప్రదేశ్ అని గమనించగలరు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రప్రయోజనాల పట్ల చూపుతున్న శ్రద్ధకు ఇదే తార్కాణం. కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వం అయిదేళ్లలో ఏపీకి అందించిన సాయం కంటే భాజపా నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం రెండింతల సాయం చేసింది. 14వ ఆర్థిక సంఘం కాలపరిధిని (2015-2020)కి వివిధ ఖాతాల కింద నిధుల సరఫరా, గ్రాంట్ల కింద రూ.2,44,271 కోట్ల నిధులను ఇవ్వనుంది.

కేంద్ర పన్నుల్లో వాటా :	రూ. 1,70,686 కోట్లు
గ్రాంట్ ఇన్ ఎయిడ్ :	రూ. 36,225 కోట్లు
రెవిన్యూ డెఫిషిట్ గ్రాంట్ :	రూ. 22,113 కోట్లు
లోకల్ బాడీస్ గ్రాంట్ :	రూ. 12,290 కోట్లు
స్టేట్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫండ్:	రూ, 2,957 కోట్లు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి ఉన్న గత అయిదు సంవత్సరాల్లో రాష్ట్రానికి ఫండ్స్, గ్రాంట్ల రూపంలో ఇచ్చినది కేవలం రూ. 1,17,967 కోట్లు మాత్రమే. ఈ మొత్తంతో పోలిస్తే భాజపా ప్రభుత్వం 107 శాతం పెరుగుదలతో రూ. 1,26,304 కోట్లు (మొత్తం రూ.2,44,271 కోట్లు) అధికంగా రాష్ట్రానికి అందిస్తోంది. కేంద్ర ప్రభుత్వం పట్ల ఎంతం భాధ్యతతో ఉందనుకోడానికి ఈ అంకెలు సరిపోతాయనుకుంటా నాయుడుగారు?

దీనికి అదనంగా రాష్ట్ర ఆర్థిక పరిపుష్టికి తోడ్పడేలా కేంద్రప్రభుత్వం సెప్టెంబరు 2016లో ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించింది. ప్రత్యేక హోదా వలన కలిగే ఆర్థిక ప్రయోజనాలకు సమానంగా ఉండే విధంగా ఈ ప్యాకేజీ రూపకల్పన జరిగింది. ప్యాకేజీని తమ ఘనతగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రకటించుకుంది. రెండు సంవత్సరాల తర్వాత ఒక్క సారిగా యూ-టర్న్ తీసుకుని ప్రత్యేకహోదా పల్లవిని అందుకుంది. కేంద్ర ప్రభుత్వం అందించిన, అమలు చేసిన ఆర్థిక హామీలతో ప్రత్యేకహోదా అంశం ప్రస్తావనార్హం కాని అంశంమైనది.


ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ కింద రూ.8,991.18 కోట్ల ఎక్స్‌టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టులు (ఈఏపీ) ఒప్పందం చేసుకోవడం జరిగింది. రూ. 17,236 కోట్ల విలువైన ప్రాజెక్టులు కార్యరూపం దాల్చడానికి సిద్ధంగా ఉన్నాయి. ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు విడుదల ఆలస్యం అవుతుందని నిందించడం మీ చిత్తశుద్ధి లేమిని సూచిస్తోంది. కేంద్ర కేబినెట్ ఆమోదించిన ప్రత్యేక ప్యా కేజీ ప్రకారం ఎక్స్‌టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టుల కోసం మీరెం దుకు త్వరితగతిన స్పందించలేదు? ప్రజాహితమే మీ ప్రాధాన్యత అయినప్పుడు మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోడానికి ఎందుకు వేగిరిపడలేదు? నాబార్డ్ నుంచి నిధులను డైరెక్టుగా తీసుకోడానికి వీలుపరిచే స్పెషల్ పర్పస్ వెహికల్ ను ఏర్పాటు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ సూచనకు ఎందుకు స్పందించలేదు? ఇతర అవసరాల కోసం నిధులు మళ్లించడంలో సమస్యల వస్తాయన్నదే మీ సమస్య కదా!

కేంద్ర ప్రభుత్వం 2014-15 సంవత్సరానికి లోటు భర్తీ చేయడానికి అంగీకరించింది. అందుకు అనుగుణంగా రాష్ట్రానికి రూ.3,979.50 కోట్లు విడుదల చేసిన విషయం మీకు తెలిసిందే. ఫైనాన్స్ కమిషన్ రెవెన్యూ డెఫిషిట్ అంచనాలను అనుసరించి 2015-16 సంవత్సరానికి రూ.1,600 కోట్లు అదనంగా విడుదల చేయడానికి కేంద్రం అంగీకరించింది. 2014-15 సంవత్సరానికి మీరు చూపుతున్న రూ.16 వేల కోట్ల లోటులో రైతు రుణమాఫీ, పెన్షన్ వంటివి కూడా కలసినందున మీ వాదన సరికాదు. భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాలు కూడా రైతు రుణమాఫీ చేసినప్పటికీ అవి తమ సొంత వనరుల నుంచే ఖర్చు పెడుతున్నాయి. రాష్ట్రప్రభుత్వం అమలు పరిచే ఒకే తరహా సంక్షేమ పథకాలను వేరు చేసి చూడలేనందువల్ల కేంద్ర ప్రభుత్వం ఇటువంటి వ్యయాలను భరిస్తుందని ఆశించకూడదు. అన్యాయమైన, అసంబద్ధమైన ఆర్థిక డిమాండ్లను కోరి నెరవేర్చలేదన్న నిందారోపణ చేయడం రాజకీయ జాణతనం కాదా!

ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో మా పార్టీ విధానం ప్రకారం, మా పార్టీ నాయకులు చర్చల్లో వాదించిన ప్రకారం ఎన్‌డీఏ ప్రభుత్వం చేసిన ప్రతి హామీని నెరవేర్చడానికి ప్రయత్నించింది. రాయలసీమలోని 7 వెనుకబడిన జిల్లాలు, ఉత్తరాంధ్ర జిల్లాలకు వర్తించేలా సెప్టెంబర్ 30, 2016న సిబిడిటి నోటిఫికేషన్ ఇచ్చాము. పారిశ్రామిక పన్ను రాయితీలను అందుకోలేదని మీరు వాదించడం మీ అసమర్థత కాదా?

మొదటి మూడేళ్లలో 7 వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక అభివృద్ధి సహాయం కింద కేంద్ర ప్రభుత్వం రూ.1,050 కోట్లు అభివృద్ధి గ్రాంట్ల రూపంలో విడుదల చేసింది. ఇలా విడుదల అయిన మొత్తంలో 12 శాతం వాడుకుని 88 శాతం ఉపయోగించకపోవడం ఆశ్చర్యకరం. పైగా ప్రధానమంత్రికార్యాలయం అనుమతి లేకుండా నిధులు విడుదల అయ్యాయని అందువల్ల ఆ నిధులను కేంద్రం తిరిగి ఇచ్చివేయాలని కోరినట్లు మీరు చెప్పడం ఊహాజనితం, అసంబద్ధం. 2014-19 రైల్వే బడ్జెట్ వ్యయానికి బడ్జెట్ కేటాయింపు రూ. 14, 151 కోట్లు కాగా 2009-14కు అది కేవలం రూ.5,100 కోట్లు మాత్రమే. అనగా 219 శాతం పెరుగుదల, ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి పట్ల కేంద్ర ప్రభుత్వం యొక్క అంకిత భావానికి ఇది నిదర్శనం. రూ.47,989 కోట్ల వ్యయంతో రూ.5,016 కి.మీ. 32 ప్రాజెక్టులు కార్యరూపంలో ఉన్నాయి. కొత్త రాజధాని నగరం: విభజన చట్టాన్ని అనుసరించి కేంద్ర ప్రభుత్వం రాజ్‌భవన్, హైకోర్టు, సెక్రటేరియట్, అసెంబ్లీ, ఇతర మౌలిక వసతులకు ప్రత్యేక ఆర్థిక సాయాన్ని అందించాలి. పైన పేర్కొన్న వివిధ భవనాల నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం రూ.2,500 కోట్లు విడుదల చేసింది. ఇందులో రూ.1,000 కోట్లు కేంద్ర హౌసింగ్, పట్టణాభివృద్ధి శాఖ రాజధాని ప్రాంత అభివృద్ధి నిమిత్తం విడుదల చేసింది. రాష్ట్రప్రభుత్వం ఇందులో 8 శాతం మాత్రమే వినియోగించుకుంది. ఇచ్చిన నిధులను వినియోగించుకోలేని రాష్ట్రప్రభుత్వం మరిన్ని నిధులను కోరడం సముచితమేనా?

పోలవరం ప్రాజెక్టు :



జలవనరులశాఖకు చెందిన అడ్వైజరీ కమిటీ 2010-11లో ప్రాజెక్టు వ్యయాన్ని రూ.2,868 కోట్ల తాగునీటి భాగాన్ని కలుపుకుని రూ.16,010.45 కోట్లుగా ఆమోదించింది. 08-09-2016న ఆర్థికమంత్రి 1-4-2014 మొదలుకుని ఇరిగేషన్ భాగం (కాంపోనెంట్స్) మిగిలిన వ్యయాన్ని 100 శాతం ఇస్తామని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ ఇప్పటి వరకు రూ.5,364 కోట్లు విడుదల చేసింది. ఆర్థిక మంత్రి 08-09- 2016న చేసిన ప్రకటన ప్రకారం మిగతా మొత్తాన్ని సహాయం చేయడానికి చిత్తశుద్ధితో ఉన్నది.

రాష్ట్రం పట్ల కేంద్రం చొరవ:

2014 నుంచి రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వం విభజన చట్టం ప్రకారం ఇచ్చిన హామీల అమలు, ప్రత్యేక సహాయం ప్యాకేజీ రూ.3లక్షల కోట్ల విలువైన మౌలిక వసతులు, పారిశ్రామిక ప్రాజెక్టులు ప్రారంభించడానికి చొరవ తీసుకుంది.

ఇందులో:

రహదారులు, రోడ్లకు	: రూ.లక్ష కోట్లు
రాష్ట్రాన్ని పెట్రో కెమికల్ హబ్‌గా తయారుచేసేందుకు హెచ్‌పిసీఎల్, గెయిల్, ఒఎన్‌జీసీల ద్వారా పెట్రోలియం సెక్టార్‌లో పెట్టుబడులు	: రూ.1.4లక్షల కోట్లు
విశాఖ స్టీల్ ప్లాంటు విస్తరణకు పెట్టుబడులు	: రూ. 38,500 కోట్లు
ఉదయ్(డిస్కమ్స్) పథకానికి నికర ప్రయోజనం	: రూ.4,400 కోట్లు
సోలార్ పవర్ ప్రాజెక్టులు, సోలార్ పార్కులకు	: రూ.24,000 కోట్లు

పేదలకు ప్రయోజనం చేకూర్చే అనేక కార్యక్రమాలకు ముఖ్యంగా స్వచ్ఛభారత్ అభియాన్ ఉజ్వల యోజన, ప్రధాన మంత్రి ఆవాస్‌యోజనలకు కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులను మంజూరుచేస్తోంది. ఈ పథకాల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి గుర్తింపు రాకుండా వాటి వల్ల తాను మాత్రం లబ్దిపొందటానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించడం బాధాకరం

వినియోగ వివరాలు :

మీ ప్రభుత్వం వైపు నుంచి తీవ్రమైన పొరపాట్లు జరిగిన విషయం ఇక్కడ గమనించాలి. కోరిన పద్దుల కింద అభివృద్ధి నిమిత్తం మంజూరు చేసిన నిధులకు సంబంధించిన ఖాతా వివరాలను, వినియోగ వివరాలను మీరు కేంద్ర ప్రభుత్వానికి సమర్పించలేదని నాకు తెలిసింది. వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి 2016-17లో మంజూరైన గ్రాంట్లలో కేవలం 12 శాతానికి యుటిలిటీ సర్టిఫికెట్లు మాత్రమే కేంద్రానికి అందాయి. అలాగే రాజధాని ప్రాంతానికి మంజూరు చేసినరూ.1000 కోట్లకుగాను కేవలం 8శాతానికి మాత్రమే యుటిలైజేషన్ సర్టిఫికెట్లు అందడం గమనించదగ్గ విషయం. మరిన్ని వాయిదాల్లో నిధులను విడుదల చేయాలంటే కేంద్ర ప్రభుత్వం దగ్గర వివారలు ఉండటం ఆవశ్యకం. ఖర్చుచేసిన ప్రతి రూపాయికి ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ఖర్చుచేసిన వివారాలను కేంద్రానికి సమర్పించాల్సిన అవసరం రాష్ట్రాలకు లేదని మీరు ప్రకటించడం మీ అవకాశవాదాన్ని, పాలనా లోపాన్ని తెలియచేస్తోంది. విభజన చట్టంలో పేర్కొన్న హామీలను వేగంగా కేంద్ర ప్రభుత్వం నిజాయితీతో అమలుపరిచిందని పైన పేర్కొన్న వాస్తవాలను బట్టి తెలుస్తోంది. పై హామీలను దాటి 5 కోట్లు ఆంధ్రుల ప్రయోజనం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కార్యాచరణలతో మా చిశుద్ధిని, అంకిత భావాన్ని నిరూపించుకున్నాము. ఆంధ్రరాష్ట్ర అభివృద్ధికి, ఆంధ్రరాష్ట్రానికి న్యాయం చేసే విషయంలో భాజపా అంకిత భావం ప్రశ్నించలేనిది. మన ఉమ్మడి పార్టీలకు ప్రజలు ఇచ్చిన తీర్పు రాజకీయ కారణాల దృష్ట్యా వదులుకోవాల్సి రావడం దురదృష్టకరం. ఆంధ్రరాష్ట్ర ప్రజల అభివృద్ధిలో తెలుగుదేశం పార్టీని మా భాగస్వామిగా చూస్తున్నాము. స్వప్రయోజన రాజకీయాల కోసం మీరు ఎన్‌డీఏ నుంచి వీడిపోవడం బాధాకంరం. ఆంధ్రరాష్ట్ర ప్రజల పట్ల భాజపా అంకిత భావంతో ఉన్నదని స్పష్టం చేస్తున్నాము. ఆంధ్రరాష్ట్ర పురోగతి నిమిత్తం నిరంతరం శ్రమిస్తాము.

గౌరవాభినందనలతో

అమిత్‌షా,

జాతీయ అధ్యక్షులు,

భారతీయ జనతా పార్టీ.

అమిత్ షాకేమీ తెలియదు

● మంత్రి నారా లోకేష్



అమరావతి, ఆంధ్రప్రభ: బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాకు రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై అవగాహనలేనట్లు ఆయన రాసిన లేఖ ద్వారా స్పష్టమవుతోందని మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. శనివారం సచివాలయంలో లోకేష్‌ను కలిసిన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఇప్పటి వరకు జరిగిన అన్ని పనులకు సంబంధించిన యూసీలు కేంద్రానికి అందజేశామన్నారు. యూసీకి ప్ర త్యేక హోదాకు సంబంధమేమిటని ప్రశ్నించారు. విభజన హామీలకు సంబంధించి హోదా, 18 అంశాలు నెరవేర్చేందుకు యూసీలు అవసరమా అన్నారు. ఎన్డీఏ నుంచి టీడీపీ బయటకు రావడం ఆవేశపూరిత నిర్ణయం కాదన్నారు. ప్రజల్లో ఉన్న అసంతృప్తిని అనేకమార్లు ప్రధాని దృష్టికి సీఎం తీసుకెళ్లినట్లు చెప్పారు. కేంద్ర మంత్రి పదవులకు రాజీనామాలు చేసిన తర్వాత కూడా ఎన్డీఏలో ఉన్నామని గుర్తు చేశారు. ఇది ఆవేశపూరిత నిర్ణయం ఎలా అవుతుందని ప్రశ్నించారు. త్వరలో పూర్తి స్థాయి ఆధారాలతో అమిత్ లేఖకు బదులిస్తామని మంత్రి పేర్కొన్నారు.

టీడీపీ బయటకు రావడం ఏకపక్ష నిర్ణయం కాదు

● అమిత్‌షా వ్యాఖ్యలు సరికావు : అశోక్ గజపతిరాజు



విజయనగరం, ప్రభ బ్యూరో: ఎన్డీయే నుంచి టీడీపీ బయటకు రావడం ఏకపక్ష నిర్ణయంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా పేర్కొనడం సరికాదని కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు వ్యాఖ్యానించారు. మంత్రి పదవికి రాజీనామా చేసిన తర్వాత తొలిసారిగా శనివారం జిల్లాకు విచ్చేసిన ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రసమస్యలు ఎన్నిసార్లు విన్నవించినా వారి నుంచి స్పందన లేకపోయిందని వాపోయారు. పోలవరం నిర్వాసితులకు ప్యాకేజీలు రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలనడం అవివేకమన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి కేటాయింపులు లేకపోవడంతోనే బయటకు రావాల్సివచ్చిందని అశోక్ గజపతిరాజు చెప్పుకొచ్చారు. విభజన హామీలపై ఇంకా చర్చలు జరగడం దురదృష్టకరమన్నారు. కేంద్రంపై అవిశ్వాసం పెట్టినా సభ ఆర్డర్‌లో లేదంటూ చర్చకు అనుమతించని వైనం అందరికీ తెలిసిందేనన్నారు. జాతీయ పార్టీలకు రోగాలొచ్చాయని, అందుకే సభను ప్రజాస్వామ్యబద్ధంగా నడపలేకపోతున్నాయని అశోక్ గజపతి రాజు ఎద్దేవా చేశారు. కష్టపడే తత్వమున్న తెలుగువారిని మోసం చేయాలనుకుంటే తిరగబడతారన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతీరాణి, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు శోభా హైమావతి, టీడీపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.చిన్నంనాయుడు,ఐవీపీ రాజు పాల్గొన్నారు.

ఏపీపై కేంద్రం చిన్నచూపు

● అభివృద్ధి మాది... ఆదాయం మీదా? ● 73 శాతం ప్రజలు పోరాటాన్ని స్వాగతిస్తున్నారు

● పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలి ● ఎంపీలతో టెలీకాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యం కాదని చెప్పిన కేంద్రం, మిగిలిన రాష్ట్రాలకు హోదా ప్రోత్సాహకాలను కొనసాగించడమే కాక, మరోవైపు ఈశాన్య రాష్ట్రాలకు రూ.3 వేల కోట్లు ఇచ్చిందని, ఇది దేనికి సంకేతమంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌ను కేంద్రం చిన్న చూపు చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎందుకింత వివక్షత చూపుతున్నారని కేంద్రాన్ని సూటిగా ప్రశ్నించారు. శనివారం తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉండ వల్లిలోని తన నివాసం నుంచి ఆ పార్టీ ఎంపీలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక్క పరిశ్రమను స్థాపిస్తే కేంద్రానికి ఎంతో లాభం చేకూరుతుందని, జీఎస్టీ, ఆదాయపన్ను రూపంలో భారీగా ఆదాయం వస్తుందన్నారు. ఇంత భారీగా రాష్ట్రాల నుంచి ఆదాయం పొందుతూ, వాటిపై శీతకన్ను వేయడం దురదృష్ట కరమన్నారు. అభివృద్ధి బాధ్యత మేం తీసుకుంటే ఆదాయం మీరు పొందుతారా..? అంటూ కేంద్రంపై విరుచుకుపడ్డారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూమి, నీళ్ళు, కరెంటు రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తుంటే ఆదాయంలో అధిక భాగం మాత్రం కేంద్ర ప్రభుత్వం పొందుతుందని నిప్పులు చెరిగారు. ఈ పరిస్థితులు మారాలని, అందుకు అనుగుణంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కియో, హీరో మోటార్స్ తో కేంద్రానికి ఎంతో ఆదాయం వస్తుందని అయినప్పటికీ రాష్ట్రాలను ఆదుకోవడంలో కేంద్రం ఉదారంగా వ్యవహరిం చకపోవడం బాధాకరమన్నారు. తమ రెక్కల కష్టంతో వరుస గా నాలుగేళ్లు రెండంకెల వృద్ధి సాధించి సగటున ఏడాదికి 10.5 వృద్ధిలో ఉన్నామని చెప్పారు. దీనికి కారణం తమ స్వయం కృషి, పట్టుదలేనని చంద్రబాబు స్పష్టం చేశారు. కేంద్రం చేస్తున్న అన్యా యంపై పార్టీ ఎంపీలు చేస్తున్న పోరాటం పట్ల 73 శాతం ప్రజా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్రాలను బలహీనపరిచే విధంగా కేంద్రం వ్యవ హరించకూడదన్నారు.

సుజనా చౌదరిపై దుష్ప్రచారం

ప్రధానమంత్రి కార్యాలయం చుట్టూ వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి చేస్తున్న ప్రదక్షిణల నుంచి ప్రజల దృష్టి మళ్ళించేందుకే సుజనాచౌదరిపై దుష్ప్రచారం చేస్తున్నారని వైకాపా నేతలపై ముఖ్యమంత్రి మండి పడ్డారు. కేంద్ర మంత్రులను కలుస్తున్నారనే ఆరోపణలను ఖండించారు. ప్రజల తరుపున రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాటం చేస్తున్నామన్నారు. ఇవన్నీ వైకాపాకు కంటగింపుగా మారి అనుచితమైన ఆరోపణలకు దిగుతుందంటూ ధ్వజమెత్తారు. అసలు వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డికి ప్రధానమంత్రి కార్యాలయంలో ఉన్న పని ఏమిటో అక్కడ మీడియా కంట పడకుండా ఎందుకు దాకున్నారో చెప్పాలని డిమాండ్ చేశా రు. దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక మంత్రుల భేటీకి సంబంధించి రాష్ట్ర మంత్రి యనమల రామకృష్ణుడు ముఖ్యమంత్రితో ప్రస్తావించా రు. కేంద్రం నిధుల మంజూరులో 2011 జనాభా ప్రాతిపది కన తీసుకుంటుందని దీనిపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో భేటీ అయ్యేందుకు ఆర్థిక మంత్రి యనమల ముఖ్యమంత్రిని అనుమతిని కోరగా, ఆయన అంగీకారం తెలిపారు. ఈ వారంలో కేవలం రెండు రోజులు మాత్రమే సభ జరుగుతుందని ముఖ్యమంత్రి టీడీపీ ఎంపీలకు తెలిపారు.

ఈ దశలో పోరాటాన్ని మరింత ఉధృతం చేసి రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల హక్కులను పరిరక్షించాలని సూచించారు. సభ లేని సమయంలో ఎక్కడికక్కడా ప్రజల్లోకి కేంద్రం చేస్తున్న అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళి ఎండగట్టాలని దీనిపై తెలుగుదేశం పార్టీ చేస్తున్న పోరాటాన్ని వివరించాలని దిశానిర్దేశం చేశారు. కేంద్రం నుంచి మనం ఏమి ఆశిస్తున్నాం, వాళ్లెందుకు ఇవ్వడం లేదు, మిగిలిన రాష్ట్రాలకు ఎలా ఇస్తు న్నారనే విషయాలను ప్రజలకు వివరించి వారిలో చైతన్య పర చాలని కోరారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో టిడిపి పార్లమెంటరీ పా ర్టీ నేత వై.సుజనా చౌదరి, శాసనసభ చీఫ్ విప్ పల్లె రఘు నాథ రెడ్డి, ప్రభుత్వ మీడియా సలహాదారు పరకాల ప్రభాకర్, లోక్ సభ, రాజ్యసభ సభ్యులు శాసనసభ సభ్యులు పాల్గొన్నారు.

ఎందుకీ దాగుడుమూతలు?

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటైన జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యయనంలో వెల్లడైన అంశాలను పరి గణలోకి తీసుకుని యూనియన్ గవర్నమెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం నిలదీయవచ్చు గా ? ఎంతకాలం ఈ ముసుగులో గుద్దులాట ? విసిగి వేసారిన ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరవధిక ఆందోళనలకు దిగే పరిస్థితులను దయచేసికల్పించవద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక హోదా తప్పా మిగిలిన వాటి గురించి వినే స్థితిలో ప్రజలు లేరనే యధార్థాన్ని ప్రభుత్వాలు గురిస్తే మంచిందన్నారు. బీజేపీ,టీడీపీ పార్టీల కారణంగా ఏపీలో ఏర్పడిన అనిశ్చితి పరిస్థితిపై చర్చించడానికి త్వరలో వామపక్షాల నాయకులతో చర్చలు జరపనున్నామన్నారు. ప్రజల అభీష్టాన్ని నెరవేర్చడానికి ఏ విధంగా ముందుకు వెళ్లాలో ఈ సమావేశంలో నిర్ణ యిస్తామని తెలిపారు. ఆ తర్వాత లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షులు జయప్రకాశ్ వంటి అనుభవజ్ఞులతో పాటు రాజకీయ నాయకులు, మేధావులతో కూడా సమాలోచనలు జరుపుతామని పవన్ తెలిపారు.


ఢిల్లీపై యుద్ధమే!

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ ఎంతో నయమని, రాష్ట్రాన్ని కాంగ్రెస్ విడదీసినా ప్రత్యేక హోదా విషయంలో కట్టుబడి ఉన్నామన్న సంకేతాలిచ్చిందని చంద్రబాబు చెప్పారు. కేంద్రంలో తమ కూటమి అధికారంలోకి వస్తే తొలి సంతకం ఏపీకి ప్రత్యేక హోదా కల్పిస్తూ సిద్ధం చేసిన ఫైలుపై ఆమోదముద్ర వేస్తానని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, యువనేత రాహుల్ గాంధీ చెప్పిన విషయాన్ని చంద్రబాబు గుర్తుచేశారు. ప్రత్యేక హోదాతో పాటు రాష్ట్రానికి రావలసిన నిధులు, పోలవరం ప్రాజెక్టు, విభజన చట్టంలోని హామీల అమలులో కేంద్రం తాత్సారం చేయడాన్ని నిరసిస్తూ ఎన్‌డిఎ కూటమి నుంచి చంద్రబాబు బయటకు రావడంతో పాటు కేంద్ర మంత్రివర్గంలో తమ పార్టీకి చెందిన ఇరువురు మంత్రులతో రాజీనామా చేయించిన సంగతి తెలిసిందే. ఈ పరిణామం చోటు చేసుకున్నాక ఏపీ ప్రభుత్వంపై, చంద్రబాబుపై ఢిల్లీ, ఏపీలోని భాజపా నాయకత్వం తీవ్రస్థాయిలో విరుచుకుపడుతోంది. మరోవైపు విపక్ష పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భాజపాకు దగ్గరవుతోందని ఆ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ప్రధాని నరేంద్రమోడీ కార్యాలయంలో కూర్చొని తనపై ఆ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డిపై బనాయించిన కేసులను ఉపసంహరించుకునే ప్రయత్నం చేస్తున్నారని చంద్రబాబు ధ్వజమెత్తుతున్న సంగతి తెలిసిందే. మరోవైపు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, వామపక్షాల నేతలు ప్రత్యేక హోదా విషయంలో తెదేపాను, చంద్రబాబును నిలదీస్తున్నారు. ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల దిగ్బంధానికి పిలుపునిచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సంగతి విదితమే. ఎన్‌డిఎకు రాం..రాం చెప్పిన చంద్రబాబు ప్రజల మద్దతు కూడగట్టుకోవాలన్న ధ్యేయంతో నిరసన దీక్షకు దిగాలన్న నిర్ణయానికి వచ్చినట్టు ఆ పార్టీలో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం కొనసాగుతున్న శాసనసభ బడ్జెట్ సమావేశాలు వచ్చే బుధ లేదా గురువారంతో ముగియనున్నాయి. ఆ తర్వాత వరుసగా మూడు రోజులపాటు సెలవులు వస్తుండడంతో ఆ రోజుల్లో ఈ దీక్ష చేపట్టాలా లేక ఆ తర్వాత దీక్షకు కూర్చోవాలా అనే అంశంపై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నారు. ఎన్‌డిఎ నుంచి వైదొలగడం, తమ పార్టీకి చెందిన ఇద్దరు మంత్రులతో రాజీనామా చేయించిన తర్వాత రాష్ట్రంలో నెలకొన్న పరిణామాలపై చంద్రబాబు నిఘా వర్గాల ద్వారా సర్వే చేయించినట్టు చెబుతున్నారు. ఈ సర్వేలో సానుకూల ఫలితాలు వచ్చాయని తమ నిర్ణయాన్ని ఎక్కువ మంది ప్రజలు సమర్థించడంతో పాటు చంద్రబాబుది సాహసోపేతమైన చర్యగా అభివర్ణించినట్టు తెలుస్తోంది. అమిత్ షా తాజాగా లేఖ రాయడం ఆ లేఖలో అన్ని అవాస్తవాలను పొందుపరచడం వంటి పరిణామాలతో ఆగ్రహంతో ఉన్న చంద్రబాబు ప్రత్యేక హోదాపై అధికార పార్టీగానే నిరసన దీక్షకు కూర్చోవాలని సంకల్పించినట్టు సమాచారం. గతంలో అనేక రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను నిరసిస్తూ అక్కడి ప్రాంతీయ పార్టీలు పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టడంతో పాటు నిరసన కార్యక్రమాలకు దిగాయని పార్టీలోని కొందరు నేతలు గుర్తుచేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పటికీ తమకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలకు చెప్పడంలో నిరసన తెలపడంలో ఎటువంటి తప్పు లేదని ఇలాచేస్తే జాతీయ స్థాయిలో కూడా చర్చ జరిగే అవకాశం ఉంటుందని వారు అభిప్రాయ పడుతున్నారు. లోక్‌సభసమావేశాలు తిరిగి మంగళ వారం జరగనున్నందున ఈలోపు లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో సమావేశమై నిరసన దీక్ష విషయంలో ఎలా ముందుకు వెళ్ళాలన్న అంశంపై చర్చించి తుది నిర్ణయానికి రావాలని చంద్రబాబు సంకల్పించినట్టు సమాచారం. అమరావతిలో తాను ఎక్కడ దీక్షను చేపట్టాలన్న అంశంపై గుంటూరు, కృష్ణా జిల్లాల నేతలు, మంత్రులతో చర్చించి తుది నిర్ణయానికి రావాలని ప్రతిపాదించారు. రాష్ట్ర విభజనకు ముందు చేపట్టిన ఆందోళన వల్ల ప్రజల నుంచి అప్పట్లో అనూహ్య స్పందన వచ్చిందని తిరిగి ప్రత్యేక హోదా విషయంలోనూ మరింత దూకుడుగా వెళ్ళి కేంద్ర ప్రభుత్వాన్ని, బీజేపీని ప్రజల్లో దోషిగా నిలబెట్టాలన్న భావనతో చంద్రబాబు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

ఒకేసారి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్టీ నేతలు దీక్షకు కూర్చుంటే అందుకు ప్రజల నుంచి వచ్చే స్పందన అంతాఇంతా ఉండదని కేంద్ర ప్రభుత్వం విధిలేని పరిస్థితుల్లో కిందకు వచ్చి విభజన చట్టంలో ఇచ్చిన హామీలతో పాటు ప్రత్యేక హోదా ఇవ్వక తప్పదని తెదేపా భావిస్తోంది. తాను 29 దఫాలు ఢిల్లీ వెళ్ళి ప్రత్యేక హోదా ఇవ్వాలని వేడుకున్నా ప్రధాని మోడీ పట్టించుకోలేదన్న విషయాన్ని కూడా ప్రజలకు వివరించాలని భావిస్తున్నారు. ఈ మేరకు కరపత్రాలు, గోడపత్రికలు ముద్రించి ప్రజలకు పంపిణీ చేయాలని కూడా తెదేపా ప్రతిపాదించింది.

మోడీకి అటూ ఇటూ
ఊరిస్తున్న నేతలు



ఏ దేశానికైనా శాశ్వత పాలకుడున్నాడంటే..అతను నియంత కిందే లెక్క. నియంతను సమర్థించడమంటే ఒక దేశపు ప్రజాస్వామిక మూలాల్లో విషాన్ని ఎక్కించడమే!
ఒక దేశ నియంత యావజ్జాతికి ప్రమాదకరమైతే..ఒక ప్రజాస్వామిక అధినేత యావత్ ప్రపంచానికే ఒక ఆశాదీపం!
పై రెండు కొటేషన్లు ప్రపంచవ్యాప్తంగా నిరంతరం ప్రజల గుండెల్లో సుడులు తిరుగుతూనే ఉన్నాయి. ప్రపంచం వీటి పరమార్థాన్ని ఎప్పటికప్పుడు అనుభవిస్తూనే ఉంది!

జిన్‌పింగ్ కమ్యూనిస్టు చైనాకు శాశ్వత అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కొద్ది రోజులకే పుతిన్ ఆరోసారి రష్యా అధ్యక్షుడిగా ఎన్నికల్లో రష్యన్ల అభిమానాన్ని చూరగొన్నారు. అయితే మోడీ పంపిన ఈ రెండు అభినందనల్లోనూ చాపకింద నీరులాంటి ఓ అప్రకటిత..ఓ లీలామాత్రపు సంశయాత్మక సందేశం వినిపిస్తున్నది.

జిన్‌పింగ్ జీవితకాల అధ్యక్షుడు ఎలా అయ్యాడు? ఎందుకయ్యాడు? దాని వెనక సుదీర్ఘ కాల వ్యూహం దాగి ఉంది. కిందటి ఏడాది అక్టోబరులో ఆయన రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికైనప్పుడే చైనా కమ్యూనిస్టు పార్టీ ఆయన అధికారానికి ఎల్లలు చెరిపేసింది. రెండుసార్లు మాత్రమే అధ్యక్ష పదవి అన్న నియమాన్ని రద్దు చేయాలని నిర్ణయించి జిన్‌పింగ్ ఆదేశాలకు పార్టీ హుజూరంది. జిన్‌పింగ్ అమోఘమైన పాలనా సామర్థ్యానికి మెచ్చి సకల చైనీయులు ఆయనకు హారతులు పట్టలేదు. యావత్ చైనా ఆయన సారథ్యం కోసం బీజింగ్ వీధులను హోరెత్తించలేదు. ఆయనకు దీటైన నాయకులు చైనాలో..లేదా..చైనా కమ్యూనిస్టు పార్టీలో లేకుండా పోలేదు. నెంబర్ టూ..నెంబర్ త్రీ స్థానాలు బేలగా ఖాళీగా లేకుండా లేవు. ఆయనకు పోటీదారులు అనదగ్గ వారినందర్నీ కర్కశంగా పక్కకి తప్పించేశారు. ఆయన నిర్ణయాలను వ్యతిరేకించిన వారిని జైళ్లకు పంపారు. లేదంటే మరణశిక్షలు వేశారు. చెట్టు ఆకు నుంచైనా రెపరెపలాడేంత ధ్వని కూడా రాని నిశీధిలాంటి నిశ్శబ్ద వాతావరణంలో జిన్‌పింగ్ తనకు తాను ఎదురులేని నేతగా..జీవితకాలపు పాలకుడిగా ముద్ర వేసుకుని...వేయించుకుని...అదే ముద్రని జనం చేత మమ అనిపించుకుని..చెయ్యెత్తి జై కొట్టించుకున్నారు. చైనా పాలకులు దీనికి అందమైన పేర్లు పెట్టుకుని ఉండొచ్చు గాక. నిశ్శబ్ద ప్రజాస్వామ్యం పరిఢవిల్లినట్టు చెప్పుకుంటే అది వారి ఆత్మవంచనే అవుతుందని ప్రపంచ దేశాలు భావించాయి. కమ్యూనిజం అనే భావనను సహజంగానే ఆమోదిస్తారు. ఆస్వాదిస్తారు గాని కమ్యూనిస్టు పాలన అనగానే సందేహించే వాతావరణం ఉంది. కమ్యూనిజం భావన స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు నెలవుగా చెప్పుకుంటాము. పెట్టుబడిదారీ విధానానికి దూరమన్నది

దాని సిద్ధాంతం. శ్రామిక వర్గాలకు, పేద బడుగు వర్గాలకు ఆశాదీపమంటారు. అణగారిన వర్గాలే ఆలంబనగా కమ్యూనిస్టు పార్టీలు పనిచేస్తుంటాయి. స్థూలంగా ఇదీ కమ్యూనిస్టు దేశాల నుంచి సామాన్య ప్రజానీకం ఆశించేది. ఆశించింది. కాని కమ్యూనిస్టు చైనాలో నెలకొన్న పరిస్థితేమిటి? కమ్యూనిజమంటే ఊపిరాడని జనజీవనమని..జనం నోటికి వేసే తాళమని..ప్రభుత్వమంటే ప్రజా ప్రభుత్వం కాదన్న కొత్త నిర్వచనం ఏనాడో బలపడిపోయింది. కమ్యూనిస్టు పార్టీయే అక్కడ సర్వాధికారి. ఏకపార్టీ పాలన. ప్రజలకు ఏమి కావాలో ప్రజలను అడగరు. చెప్పే స్వేచ్ఛ ప్రజలకు లేదు. వారికి ఏమి కావాలో పార్టీయే ఆలోచిస్తుంది. నిర్ణయిస్తుంది. చేస్తుంది. అది అమలుచేసినదాన్ని..ప్రజలు అది తమకు అవసరమనుకుని అనుసరించాలి. ఇదీ చైనా ఆధునిక నీతి..పాలనా రీతి. రాజనీతిజ్ఞుల మధ్య మేథోమథనం లేదు..భావాల సంఘర్షణ లేదు..మూసపోసిన పాలనలో శాశ్వత నేతలు నడిపిస్తే నడిచే దేశం చైనాగా అక్కడి మేధావులే పెదవి విరిచే వాతావరణం నెలకొని ఉన్నది. ఒక పాలకుడు తన జీవితకాలం ప్రజలను పాలిస్తే అది దేశానికి మంచిదవుతుందా? ప్రజలకు మంచి జరుగుతుందా? ఇక తనకు పోటీ ఉండదని తెలిశాక ఆ పాలకుడి మనోగతం ఎలా ఉంటుంది? ప్రజలకు జవాబుదారీగా ఉండగలడా? ఇవన్నీ వివాదాస్పద అంశాలు.

స్థూలంగా భారత్ వంటి ప్రజాస్వామ్య దేశానికి బొత్తిగా సరిపడని వ్యవహారమిది. భారత్ ప్రజాస్వామిక దేశంగా ప్రపంచంలోనే మన్ననలందుకుంటున్న దేశం. ఇక్కడ వాక్‌స్వాతంత్ర్యానికి ప్రాణం పోస్తారు. ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా నడుచుకుంటాయి. ప్రజల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తాయి. ప్రజల అవసరాలను ప్రజల్లో ఉండి గుర్తించి సంక్షేమపథకాలు రూపొందిస్తారు. ప్రజలకు నచ్చనవి ప్రభుత్వాలు చేయడానికి సాహసించవు. గతంలో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించి ఏకపక్ష పాలనకు ప్రయత్నిస్తే..యావద్దేశం భగ్గుమన్నది. ఆమెను ఎన్నికల్లో ఓడించి గుణపాఠం చెప్పారు. అయిదేళ్లకోసారి తప్పనిసరిగా ఎన్నికలు జరుగుతాయి. తమకు నచ్చిన వారినే ఎన్నుకుంటారు. అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని

ఇద్దరు అధ్యక్షులు..ఒక ప్రధానమంత్రి కథ ఇది..వారితో ముడిపడిన ప్రపంచ ప్రజల వ్యథ ఇది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్..రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్..భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీల వ్యక్తిత్వాలు.. వ్యవహారశైలి.. పాలితులపై ఆ పాలకుల ప్రభావం విడమరిచి చెప్పే వాస్తవ కథ ఇది. జిన్‌పింగ్ వయస్సు 64 ఏళ్లు. పుతిన్ ఆయనకన్నా ఒక ఏడాది పెద్ద. ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి 67 ఏళ్లు. ఆ ఇద్దరి కన్నా మోడీ పెద్ద. పెద్ద ప్రజాస్వామిక దేశపు పెద్దన్న..అందుకు తగ్గట్టే పెద్ద మనస్సుతో అటు జిన్‌పింగ్‌ని, ఇటు పుతిన్‌నీ అభినందించారు. అభినందించడం ఒక సానుకూల సంకేతం. ఇలాంటప్పుడు అభినందించకపోతే అనుమానించాలి గాని ఆశీర్వదిస్తే భ్రుకుటి ముడవడమెందుకు? అభినందన అనేది ఇద్దరి మధ్య స్నేహానికి..సత్సంబంధాలనూ గౌరవాన్నీ ఇనుమడింపచేసే ఓ సద్భావన. మోడీ సకాలంలో సకారాత్మకంగా ఆ భావనకు న్యాయం చేశారనే అనుకోవాలి. కాని ఇక్కడే ఆశ్చర్యకరమైన పరిణామాలు సాక్షాత్కరించాయి. ప్రధాని మోడీ చైనా శాశ్వత అధ్యక్షుడికి ఫోన్ చేసి పది నిమిషాలు మాట్లాడి అభిమానించి.. అభినందించి.. ఆనందించడంతో యావత్ భారతజాతి ఒక్కసారి ఉలిక్కిపడింది. నరేంద్ర మోడీలో మరో మోడీ వారి కళ్ల ముందు మెదిలాడు. ఏమిటి?! మోడీ జిన్‌పింగ్‌కి కంగ్రాట్స్ చెప్పడమేమిటని ఎవరికి వారు లోలోన తమని ప్రశ్నించుకున్నారు. ఆతర్వాత ఒకరికొకరు అడిగి అభిప్రాయాలు పంచుకున్నారు. మరి కమలనాథుల్లో ఈ రకమైన ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయా? అయితే గియితే..బైటికి చెప్పుకోలేరన్నది తెలిసిన విషయమే.

భావిస్తే వారికి శృంగభంగం కల్పిస్తారు. యూపీయే-2 ప్రభుత్వంలో భారీ కుంభకోణాలు వెలుగు చూడటంతో 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సారథ్యంలోని సంకీర్ణ ప్రభుత్వాన్ని గద్దె దింపిన వైనం తెల్సిందే.

వాక్‌స్వేచ్ఛకు ఏకాస్తంత భంగం కలిగినట్టు అనిపించినా సామాన్య పౌరుడి దగ్గర్నుంచీ ప్రజా సంఘాల దాకా ఎలుగెత్తి తమ నిరసనను తెలియజెప్పే వాతావరణం భారత్‌లో ఉంది. ఒకసారి ప్రధానమంత్రి అయిన నాయకుడు మళ్లీ ఇన్నిసార్లు కావచ్చు అన్న నియమం లేదు. అలాగే జీవితకాలం శాశ్వత ప్రధానిగా ఉండే అవకాశమే లేదు. అలాగని ఒకసారి కాదు రెండుమూడుసార్లు ప్రధాని అయినా ఇకముందు కాకూడదన్న నియమమూ లేదు. ప్రజాభిమానం ఉన్నవారే అధినేతలవుతారు. ప్రజాభిమాని ఎంతకాలం ఉంటే అంతకాలం అధికారంలో ఉండొచ్చు. ఇంతటి పారదర్శక..స్వేచ్ఛాయుత..ప్రజాస్వామిక దేశానికి ప్రధానిగా ఉన్న నరేంద్ర మోడీ..ప్రజల మనోభిప్రాయంతో నిమిత్తం లేకుండా..వారి మెడలు వంచి జీవితకాలపు అధ్యక్షుడైన జిన్‌పింగ్‌కి శుభాభివందనలు చెప్పడంలోని ఔచిత్యమేమిటి? స్థానిక స్థితిగతుల్ని..ఆయన అధ్యక్షుడైన విధివిధానాలను పట్టించుకోకుండా అభినందనలు చెప్పేటంత సౌహార్ద్రస్నేహ సంబంధాలు రెండు దేశాల మధ్య ఉన్నాయా? తెల్లారి లేస్తే..దాగుడుమూతల దౌత్యస్నేహం..అంతేకాదు. అస్సలీ రెండు దేశాల ప్రజానీకం మధ్యే పెద్దగా ఆత్మీయ సంబంధాలు లేవు. ఉభయ దేశాల్లోని సామాన్యులు ఒకరికొకరు అంతగా ఇష్టపడరు. వారి ఆలోచనాధోరణికి భారతీయుల ఆలోచనాధోరణికి పొంతన ఉండదు. సరిహద్దుల గొడవలతో నిమిత్తం లేదు. అలాగే ప్రభుత్వాల స్థాయిలో ద్వైపాక్షిక సంబంధాలతో పనిలేదు. కాని ఇరుదేశాల సామాన్య పౌరుల మధ్య

మాత్రం విడదీయరాని సంబంధబాంధవ్యాలు లేనేలేవు. వివిధ దేశాల పౌరులు ఇతర దేశాలను ఎలా వీక్షిస్తారన్న అంశం మీద ప్యూ రీసెర్చి గ్లోబల్ యాటిట్యూడ్స్ ప్రాజెక్టు సంస్థ ఒక సర్వే చేసింది. ఇందులో చాలా ఆసక్తికరమైన అంశాలు బైటపడ్డాయి. భారతీయులు అమెరికన్లని 50 శాతం ఇష్టపడితే..జపనీయుల్ని 45 శాతం ఇష్టపడుతున్నారు. కాని చైనీయుల విషయంలో మాత్రం కేవలం 31 శాతం మంది మాత్రమే సానుకూలంగా ఉన్నారు. అలాగే చైనీయులు అమెరికాను 50 శాతం..భారత్‌ను 30 శాతం..జపాన్‌ని 8శాతం ఇష్టపడుతున్నారు. అంటే భారతీయులు, చైనీయుల మధ్య పరస్పరం ఇష్టపడే శాతం కేవలం 30 శాతం దాటలేదు. చైనాను అతిగా కౌగలించుకోవద్దన్నది సగటు భారతీయుడి మనోగతం. అయినా ప్రధానమంత్రి మోడీ జిన్‌పింగ్‌కి అభినందనలు పంపడంలో ఏమాత్రం ఆలస్యం చేయలేదు.

ఇక రష్యా విషయానికొస్తే..ఉభయదేశాల మధ్య పెద్దగా ప్రతికూల పరిణామాలేమీ లేవు. వ్లాదిమిర్ పుతిన్ కాస్త అటుఇటుగా అటు ప్రధానిగానో..లేక అధ్యక్షుడిగానో పదవిలో ఉంటూనే ఉన్నారు. 1999 నుంచి 2000 సంవత్సరం దాకా..మళ్లీ 2008 నుంచి 2012 దాకా రష్యా ప్రధానమంత్రిగా చేశారు. 2000 నుంచి 2008 దాకా అధ్యక్షుడిగా చేశారు. ఆ ఎన్నికల్లో 53 శాతం ఓట్లు సాధించారు. 2004లో మళ్లీ గెలిచారు. ఈసారి 72 శాతం ఓట్లు వచ్చాయి. 2012 మే నుంచి మొన్న ఎన్నికల దాకా కొనసాగారు. ఆరేళ్ల పాటు ఆయనే ఉంటారు. అప్పటిదాకా ఆయనకు పోటీయే లేదు. జిన్‌పింగ్‌తో పోలిస్తే పుతిన్ దారి వేరు. ఆయన సుదీర్ఘకాలం పదవిలో కొనసాగుతున్నప్పటికీ.. ప్రజాభిమానంతోనే.. ప్రజామోదంతోనే.. ప్రత్యక్ష ఎన్నికల ద్వారానే పదవిలోకి రాగలుగుతున్నారు. ఆయన హయాంలో దేశం ఒకస్థాయిలో సుస్థిరతను సాధించిందన్న అభిప్రాయం నెలకొన్నది. అందుకే ఆయన పదేపదే ఎన్నిక కాగలుగుతున్నారు.

ఏమైనా అటు జిన్‌పింగ్..ఇటు పుతిన్..ఈ ఇద్దరూ ప్రధాని మోడీ మీద తీవ్ర ప్రభావాన్నే చూపించినట్టు అర్థమవుతున్నది. పుతిన్ వ్యవహారశైలిని మినహాయిస్తే..మోడీని జిన్‌పింగ్‌తో పోలుస్తూ..మోడీ ఆలోచనా ధోరణిని పలు రకాలుగా విశ్లేషిస్తున్నారు. ప్రధాని మోడీ 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు ఆయన పట్ల అంతులేని ఆకర్షణ నెలకొని ఉంది. రాజకీయ వాతావరణంలో ఒకవిధమైన కదలిక వచ్చింది. దానికితోడు ఆయనిచ్చిన హామీలు దేశప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. తిరుగులేని మెజారిటీతో ఆయన అధికారంలోకి వచ్చారు. తీరా నాలుగేళ్లు దాటి..అయిదో సంవత్సరంలోకి అడుగుపెట్టాక..మరీ ముఖ్యంగా గత నాలుగైదు నెలలుగా ఆయన వ్యవహారశైలిలో పూర్తి మార్పు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. ఇది దేశప్రజల్లో విశేషంగా చర్చకు దారితీస్తున్నది. సోషల్ మీడియాలో ఆయన భావజాలం గురించి, ఆయన వ్యవహారశైలి గురించి తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. ఆయన కదలికల మీద..ఆయన హావభావాల మీద దేశ ప్రజల నిఘా ఎక్కువైంది. ఆయన్ని నిశితంగా పరిశీలిస్తున్నారు. మొన్నీమధ్య త్రిపురలో కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారానికి వెళ్లినప్పుడు వేదిక మీద బీజేపీ వృద్ధ నాయకుడు ఎల్‌కే అద్వానీ ముకుళిత హస్తాలతో ముందు నిలబడి ఎదురొస్తున్న మోడీకి నమస్కరిస్తే..ఆయనదేమీ పట్టించుకోకుండా ఆతర్వాత నిలబడి ఉన్న నాయకుడి దగ్గరికి వెళ్లి..ఆయన చేతులు పట్టుకుని మరీ పలకరించిన వీడియో సోషల్ మీడియాలో రోజుల తరబడి హల్‌చల్ చేసింది. ఇది లక్షలాది ఇళ్లల్లో ఇంటిల్లిపాదీ సభ్యుల మధ్య చర్చనీయాంశంగా మారిందంటే.. సామాన్యులు మోడీ మీద ఎంతగా దృష్టిపెట్టి ఉన్నారో అర్థమవుతోంది. పార్లమెంటులో రెండు మూడు వారాలుగా జరుగుతున్న సంక్షోభం మీద కూడా ప్రజల అభిప్రాయం మరో విధంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ విషయంలో ప్రధాని మోడీ అలక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మెజారిటీ ప్రజలు అభిప్రాయపడుతున్నట్టు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

ఒక ముఖ్యమంత్రి తన రాష్ట్ర సమస్యల పరిష్కారానికి 29సార్లు ప్రధానమంత్రిని కలవాల్సిన అవసరం ఉందా? అన్నిసార్లు కలవడమంటే ఆ ముఖ్యమంత్రి సమగ్రత ఏమవుతుంది? రాష్ట్ర ప్రజలు ఓట్లేసి గెలిపించుకున్న పార్టీకి కేంద్రం ఇస్తున్న విలువ ఇంతేనా అన్న ప్రశ్న ప్రజాస్వామ్యదేశంలో ఉత్పన్నమవకూడదు. కాని మోడీ అలాంటి వాతావరణం కల్పిస్తున్నారన్న విమర్శలు రానురాను ఎక్కువవుతున్నాయి. మోడీ దేశరాజకీయాల్లోకి వచ్చి కేవలం నాలుగేళ్లే. ఆయన ప్రధానమంత్రి పదవిని అధిష్టించి కేవలం నాలుగున్నరేళ్లే. ఈ స్వల్పకాలంలోనే దేశంలోని యావత్ ప్రతిపక్షాలు మూడో ప్రత్యామ్నాయం గురించి ఆలోచించే అవకాశాన్ని మోడీయే కల్పించారన్న అభిప్రాయాన్ని కొట్టిపారేయలేము. రాజకీయ ఆధిపత్యమే లక్ష్యంగా పావులు కదపడంలో అందెవేసిన చేయిగా పేరు తెచ్చుకున్న మోడీ యావద్భారతాన్ని విముక్త కాంగ్రెస్‌భారత్‌గా తీర్చిదిద్దడానికి కంకణం కట్టుకున్నట్టు చెప్పుకుంటున్నారు. దీనర్థం ఏమిటి? దేశంలో ప్రతిపక్షమనేదే లేకుండా..నిరంతరం..లేదంటే..సుదీర్ఘకాలం తాను ప్రధానిగా..తన పార్టీ బీజేపీ పాలక పార్టీగా సుస్థిరంగా ఉండాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్టు కనిపిస్తున్నది. ఇందులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భావాలే అంతర్లీనంగా ధ్వనిస్తున్నాయని పలువురు విశ్లేషిస్తున్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ మాదిరి ప్రజల ఆమోదంతో అధికారంలోకి వస్తే ఎవ్వరూ అభ్యంతరపెట్టరు. కాని వ్యవస్థల రూపురేఖలే మార్చేసి శాశ్వత ఏకచ్ఛత్రాధిపత్యానికే మార్గం వేసుకోవాలని తలపోస్తేనే ప్రమాదకరం. అయితే జిన్‌పింగ్ మాదిరి సమూలంగా వ్యవస్థలను కూలదోసి శాశ్వత అధికార పీఠాన్ని కొత్తగా నిర్మించే అవకాశాలు అదృష్టవశాత్తూ భారత్‌లో లేవు! కాని ఆ భావాలు వచ్చినా దేశానికి ఎంతోకొంత చేటేనని మాత్రం చెప్పక తప్పదు! శాశ్వత అధ్యక్షుడిగా ఎన్నిక తర్వాత చైనా చట్ట సభలో జిన్‌పింగ్ మాట్లాడుతూ.. చైనా సార్వభౌమత్వం కోసం అవసరమైతే రక్తపుటేరులు పారించడానికైనా వెనకాడనని శపథం చేసిన రోజే ప్రధాని మోడీ ఆయనకు శుభాభివందనలు చెప్పడంలోని అనౌచిత్యం భారతదేశ చరిత్ర పుటల్లో చెరగని నల్లసిరాతో లిఖితమై ఉంటుంది!!

-వయ్యస్సారెస్




కళ్యాణాక్షతలు
ముత్యాల తలంబ్రాలు!!

పచ్చని మావితోరములు వాకిట వ్రేలగ, వీధి వీధులన్
పచ్చని పెండ్లి పందిరులు భాసిల్ల,
ముగ్గు లెసంగ ముంగిటన్
పచ్చయరంటి మంటపము - భద్రగిరీంద్ర సువర్ణ పీఠము
న్న చెరువంద - వైభవ నయ్యెను-
జానకి పెండ్లి భూతలిన్!!
● శ్రీలు చెలగగ - కళ్యాణరేఖ నుదుట
చరణ పద్మాల పారాణి మెఱయ, పసిడి
బుగ్గపైని కాటుక చుక్క ముద్దులొలుక-
రాముని గళమందిడె - సీత - రాగమాల!!
● పాలబుగ్గల సిగ్గులు జాలువార,
రాముని పయి జానకి తలంబ్రాలు పోయ,
కన్నులందనురాగపు కాంతివిరియ,
రాముడును సీతపై తలంబ్రాలు పోసె!!
● నీల మనోజ్ఞ రాముని వినీల కరంబులలోన ఇంద్రనీ
లాలయి, మల్లె మొగ్గలుగ రాజిలి సీత శరమ్ముపైన, నం
దాలగులాబి బుగ్గలను తాకగ భాసిలి మేల్మి కెంపులై-
రాలెను- ముత్తెముల్ - జలజలా -
భువి బ్రోచెడి శ్రీకరాక్షతల్!!
మొరసెను మంగళధ్వనులు
భూతల మందున, పారిజాతముల్
కురియగ జేయ దేవతలు,
కూర్మిని బ్రహ్మ మహేశ్వరుల్ వధూ
వరుల పయిన్ సువర్ణ కుసుమాల్ కురియింప,
ద్విజుల్ వేద మం
త్రరవ మొనర్ప - సంతస తరంగిణి దేలెను
విశ్వమంతయున్!!
● ప్రణవ రూపులు, ఆదిదంపతులు, శ్రీక
రులును - మధురాను రాగమూర్తులును - భువిని
వెలయ - జానకీ రాముల పెండ్లి సేస
విలను - నిత్య కళ్యాణాక్షతలయి బ్రోచు!!
● వాక్కు అర్థాల జంట, సువర్ణ సౌర
భాల పంటయై, సత్య - ధర్మాల బంధ
మునయి - పాలు తేనెల వలె- ముచ్చటగను
ధరను - మీదు దాంపత్య మాదర్శమగుత!!
● అంబరాన నిల్చిన దేవతాళి యెల్ల
భరత ఖండాన - శ్రీరామభక్తి పొంగ,
నఖిల మంగళాశీస్సులందజేసి
కీర్తి కళ్యాణములు కటాక్షించుగాక!!

-కళ్యాణశ్రీ
జంధ్యాల వేంకట రామశాస్త్రి
సాహితీ రత్నాకర

మొక్కుబడి అంటే ఇదే!



తెలివి తేటలు ఉండాలే కానీ, దేవుళ్ళను కూడా బురిడీ కొట్టించవచ్చు అని అనుకునే జనం తయారయ్యారు. పదిహేడు మాసాల క్రితం వెయ్యి , ఐదొందల రూపాయిల కరెన్సీ నోట్లను కేంద్రం రద్దు చేసినప్పుడు వాటిని సకాలంలో మార్చుకోలేని వారు,వాటిని వదిలించుకోవడానికి వివిధ మార్గాలను అన్వేషించారు.దేవుళ్ళకు చెల్లించాల్సిన మొక్కుబడుల కోసం ఆ కరెన్సీ చాలామంది వినియోగించారు. తిరుమల తిరుపతి దేవస్థానం హుండీల్లో కోట్లాది రూపాయిల పాత కరెన్సీ పడింది.దానిని ఏం చేయాలో పాలుపోక టీటీడీ వారు తలపట్టుకున్నారు.ఇలాంటిదే రాజస్థాన్‌లో మరో సంఘటన జరిగింది.అక్కడ ప్రసిద్ధ ఆలయంలో మన తిరుపతి లో మాదిరిగానే వేలాది మంది భక్తులువస్తుంటారు.వారు వస్తురూపంలో సమర్పించే కానుకలు కాకుండా కరెన్సీ రూపంలోనూ కానుకలిచ్చి మొక్కు తీర్చుకుంటారు. అక్కడకూడా చెల్లని కరెన్సీనీ, నాణాలను హుండీల్లో వేసి భక్తులు తమ మొక్కుచెల్లించుకున్నారు. జనం వద్ద చెల్లని కరెన్సీ, నాణాలు ఉంటే పట్టుకుంటారు కానీ, దేవుళ్ళ వద్ద ఉంటే పట్టుకోరన్న ధీమా తోనే ఇలా చేస్తున్నారు.అంటే ఎంత తెలివిమీరి పోయారో అర్థం అవుతోంది. ఇష్టం లేకపోయినా,ఎవరికైనా ఏదైనా ఇవ్వాల్సి వస్తే మధ్యలో టేపుతో అంటించిన కరెన్సీ కాగితాలు ఇచ్చేవారిని బట్టే మొక్కుబడి అనే పదానికి అలాంటి అర్థంవచ్చింది. నిజానికి మొక్కుబడి అనేది చాలా మంచి పదం. అతితెలివి ప్రదర్శించేవారి వల్ల దానికి వేరే అర్థం స్థిరపడిపోయింది. కాఫీ బాగా లేకపోతే మొక్కిబడిగా ఇస్తావేమిటని అర్థాంగి మీద కసురుకోవడం మనందరికీ అలవాటేగా!


నాటి కథని నేటి కళ్లతో...

అనగనగా... అని అమ్మ కథని ప్రారంభించగానే ముందుకి జరిగి కళ్లు పెద్దవి చేసుకుని, అమ్మ పెట్టే అన్నం ముద్దలకంటే అమ్మ మాటల్ని వినాలనే కుతూహలంతో అమ్మ ముఖాన్నే చూస్తుండే సంప్రదాయం మనది. అమ్మ పెద్దగా ఏమీ చదువుకోలేదు. అయితే తాను చెప్తున్నది మాత్రం వాళ్ల అమ్మ తనకి చెప్పిన కథని. ఆ అమ్మమ్మ అయితే అసలు - ఆడవాళ్లు చదువుకుంటారా? అనుకుని ఆశ్చర్యపడే కాలం నాటిది. అయితే ఆమెక్కూడా తెలిసినవి కొన్ని కథలు మాత్రమే. వాటిలో ఒకటి శ్రీమద్రామాయణ కథే. మరి ఏ చదువూ రాని అమ్మమ్మ, అంతో ఇంతో చదువుకున్న అమ్మా, బాగా బాగా చదువుకుంటున్న మనం... ఒకే ఒక కథని అలా తరతరాలుగా వినేస్తూ వస్తున్నామా? ఇది పెద్ద పాత కథ కదా! వాళ్లెందుకు చెప్తున్నారు? పోనీ వాళ్లు చెప్తున్నారే అనుకుందాం! మనమెందుకని వింటున్నాం? కారణం ఒకటే. ఆ కథ(లు) జీవనదుల్లాంటివి కనుక. ఏ జీవ నదైనా పల్లెలో సన్నని నది పాయగా, పట్టణంలో అయితే కాలువలాగా, నగరంలో అయితే నదిలాగా ప్రవహిస్తూ ప్రవహిస్తూ చివరికి సముద్రంలో కలిసిపోతుంది. అలాగే ఈ కథ(లు) కూడా వ్యక్తిలో, కుటుంబంలో, ఓ సంస్థలో, ఓ ప్రాంతంలో, దేశంలో అలా జీవిస్తూనే ఉంటాయి. అంటే ఏమన్నమాట? ఎక్కడ వ్యక్తి అనే ఓ జీవి ఉంటాడో, అక్కడ తప్పక ఈ కథ(లు) ఉండి తీరుతుందన్నమాట.

అయోధ్యకి రాజు దశరథుడు. రథ గజ పదాతి అశ్వదళాలు, అనుకూల సేవకులు, మంత్రులు, భార్యలు చెప్పలేనంత సంపద. మరి ఇంకా ఇలాంటి ఎన్నో సౌకర్యాలు... అలాగే వై సుఖం- సంతానం లేదు నాకు. ఈ ఇక్ష్వాకు వంశం నాతో ఆగిపోయిన పక్షంలో ఆ అపనింద నామీద పడుతుంది! నాకు సంతానం ఎలా కలుగుతుందని బహిరంగ సభ చేసి దుఃఖించాడాయన. లోకమంతా అనుకుంటుంది - అన్ని భోగభాగ్యాలుంటే ఇంక ఆయనకి చింత ఏమిటి? అని. ప్రతి వ్యక్తికీ ఓ చింతని ఏర్పాటు చేస్తాడు దైవం. కొందరు - నేను పడే కష్టాలింకెవరికీ ఉండవని అంటుంటారు. వాళ్లకి పురాణ జ్ఞానం లేదని ప్రత్యక్షంగా చెప్పుకుంటున్నారన్నమాట. ఆ రోజుల్లో ఎవరైనా దుఃఖిస్తుంటే, ఆ ఇంటికున్న శోకకారణాన్ని ఎవరికైనా చెప్పుకుంటే నేటి కాలంలోలా - దానికి కొంత వీరి పైత్యాన్ని జోడించి - కథలు కథలుగా అందరితోనూ చెప్పుకుని ప్రచారం చేస్తూ వినోదించేవాళ్లు కాదు దాన్ని తమ సమస్యగానే ఆలోచించేవాళ్లు.అందుకే దశరథుణ్ణి అశ్వమేధయాగం చేయవలసిందన్నారు. తీరా యాగం ప్రారంభమయ్యాక పుత్రకామేష్టిని చేయాలన్నారు పురోహితులు.

ఆ మాటని విన్న దశరథుడు - ముందెందుకు చెప్పలేదు. పుత్రకామేష్టి గురించి?... అంటూ చిందులు తొక్కనూ లేదు, ఇదంతా బ్రాహ్మణులు దక్షిణకోసం ఆడుతున్న నాటకం వంచన అని అనుకోనూ లేదు. అలాగే అన్నాడాయన. విశ్వాసః సంపదాం మూలమ్మని ఓ మాట ఉంది సంస్కృతంలో. వైదిక కర్మని చేయించుకోడానికి ముందు బాగా పరిశీలించి ఒకరిని పురోహితునిగా ఎన్నుకోవాలి. ఆ మీదట వారేం చెప్తే చేసుకుంటూ వెళ్లాలి. దశరథునికి ఆ పురోహితులు చెప్పారు - ఒకప్పుడు నువ్వు చేసిన బ్రహ్మహత్య (ఋషిపుత్ర వధ) కారణంగా సంతానం కలగడం లేదు. దానికోసం అశ్వమేధం సరిపోతుందనుకు న్నాం. అయితే బ్రాహ్మహత్యాదోషం పోయినా, సంతాన ప్రాప్తి కోసం పుత్రకామేష్టిని చేయాల్సిందేన ని. ఎంత హేతుబద్ధంగా ఉన్నాయీ మాటలు! ఉదాహరణకి ఓ వైద్యుడు రోగికి శస్త్రచికిత్సని అవసరమని చేస్తున్నప్పుడు, మధ్యలో మీరు అవసరమనగానే తప్పక చేయవలసిందంటామా? కాదా? అదే మరి వైదిక కర్మ వద్ద కొచ్చేసరికి చేయించే పురోహి తుని మీద అనుమానమా? ఆలోచించుకోవాలి. దశర థుడంగీకరించాడు. యాగాలు రెండూ ముగిసాయి. సంతానా నికి అవకాశం వచ్చింది. దేవతలు కూడా తమ తమ హవి ర్భాగాలని తీసుకువెళ్లారు. వైదికుడైన బ్రాహ్మణుణ్ణి విశ్వసిస్తే కలిగే ఫలితమిది. తెలుసుకోవాలి. ఎవరిని ఆశ్రయిస్తే తోవ చూపిస్తాడో ఆ బ్రాహ్మణ నింద సరికాదు.

ఇదేమిటి? దశరథుడొక్కడే కదా అనుకుంటాం! కాదు. కైకమ్మతో వివాహం కాకముందు దశరథుడు కేవలం సంతానం కోసం పరితపిస్తూ సంతానాన్నీయగల భార్య లభిస్తే బాగుండుననుకునే భార్యాన్వేషి (పెళ్లికి ఎదుంచూసే) ఆయన. దీన్ని గమనించే కేకయ మహారాజు - తానొక రాజు అయినప్పటికీ, తన మనుమనికి (కైకా దశరథుల పుత్రుడు) రాజ్యం ఏ తీరుగానూ వచ్చే అవకాశమే లేదని ముమ్మార్తులా తెలిసినప్పటికీ తన మనుమనికే రాజ్యమిచ్చే పక్షంలో తన కూతురైన కైకమ్మని వివాహం చేసుకోడానికి అంగీకరిస్తానన్నాడు. దశరథుడు ఆనాటికి కేవలం భార్యాన్వేషి - పెళ్లికి ఎదురుచూస్తున్న వ్యక్తి. అందుకే ముందు వెనుకలాలోచించకుండానూ, ఆలోచనలోకి వచ్చినా సంతానం కలిగాక చూసుకోవచ్చులే! అనుకుంటూనూ అలాగే! అని అనేసాడు. కైకా వివాహం అయిపోయింది. సంతానం కలిగింది. ఆ సంతానానికీ వివాహాలు అయిపోయాయి. రాజ్య పట్టాభిషేక సందర్భం వచ్చింది. పెద్దసభ చేసి ఎందరో రాముణ్ణి రాజుగా నిశ్చయించారని చెప్తూ భరతుని ఊసుని ఎత్తుకో(లే)ని దశరథుడు రెండో దశరథుడు. అంటే దశరథునితో వివాహ పూర్వదశ దశరథుడూ, వివాహానంతరం దశరథుడూ అని ఇద్దరయ్యా రు. అంతే. సంకటస్థితి వచ్చింది. నేటిలోకంలో. దశరథుడన్నాడు అందరి సమక్షంలో కైకమ్మతో - త్యజామి - నిన్ను విడిచేస్తున్నానని. ఇదే జరుగుతోందా లేదా ఈ రోజుల్లో! భరతునికి రాజ్యమిచ్చే వీలు లేనే లేదంటూ దశరథుడు గద్దించి మాట్లాడబోతే కైకమ్మ అంది గదా! నువ్వు వరాలనిస్తే అడుగుతున్నానా? లేక నా అంతట నేనే నిర్బంధిస్తున్నానా? ఈ వింటున్న అందరి సాక్షిగా చెప్పు - అని. ఆ మీదట దశరథునికి మిగిలింది కళ్లనిండా కన్నీరే! చెప్పగలిగిన మాటలు - నిట్టూర్పులే! కైకమ్మని దశరథ మంత్రులైన సిద్ధార్థుడు సుమంత్రుడు మొదలైన వారం తా బహిరంగంగా తిట్టారు - మాతర మంగనాః - ఆడపిల్లలందరికీ తల్లి బుద్ధులే వస్తాయి. నీ తల్లి నీ తండ్రిని మానసికంగా చిత్రవధ చేసింది! ఆ లక్షణాలె క్కడికి పోతాయని నేటి లోకంలో కూడా ఎందరో కూతుళ్ల విడాకులకి నేపథ్యం ఆ ఆడపిల్లల తల్లులే అని అర్థమౌతోంది, వార్తాపత్రికలూ ఛానళ్లని లోకాన్నీ గమనిస్తూంటే! ఇక్కడొక ప్రశ్న - ఈ సుమంత్రునికే సిద్ధార్థునికీ కైక తల్లి ప్రవర్తన గురించి తెలుసుకదా! మరి పెళ్లికి ముందే దశరథునితో ఎందుకు చెప్పి ఉండలేదు? - అని. దశరథుడామెని ఇష్టపడ్డాక, స్వయంగా తానే కేకయ రాజుని సంప్రదించాక, ఈ మంత్రులు ఏమీ అనేముంటుంది? గోతిలో పడ్డాక పైకి తీద్దామనే ఊహకాక! మాట్లాడలేకపోయారు. దానికి కారణం జరగాల్సిన నష్టం జరిగిపోయాక పరిస్థితిని చక్కదిద్దాలనే అభిప్రాయంతో పెళ్ళి అయిన తరువాత వచ్చే ఇబ్బందుల నుండి దశరథుణ్ణి పైకి తీసుకువద్దామని అనుకున్నారు.



-డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు, 9866700425

ప్రధాని మోడీకి 'ముందస్తు' పరీక్ష?

● కర్నాటకలో బీజేపీ-కాంగ్రెస్ అమీతుమీ ● 'టాప్' అజెండాతో కాషాయ పార్టీ రెడీ
● సెంటిమెంట్‌తో రంగంలోకి రాహుల్ ● గ్రామీణ ఓటర్లే కీలకమంటున్న సర్వేలు



బెంగళూరు: కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు రెండు ప్రధాన జాతీయ పార్టీలైన కాంగ్రెస్-బీజేపీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. పాగా వేసేందుకు ఒకరు.. పట్టు నిలుపుకునేందుకు మరొకరు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. కాంగ్రెస్ విముక్త భారత్ లక్ష్యం దిశగా దూసుకెళ్తున్న భారతీయ జనతాపార్టీ ఇప్పుడు కర్నాటకపై గురిపెట్టింది. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కార్యాచరణకు సిద్ధమయ్యారు. దక్షిణాదిలో సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయాలని పట్టుదలతో ఉన్నారు. తద్వారా 2019 సార్వత్రిక ఎన్నికల్లో తిరిగి అధికారం దక్కించుకునేందుకు బాటలు వేయనున్నారు. ఈక్రమంలో శక్తివంతమైన నేతలను ప్రచారానికి సమాయత్తం చేస్తున్నారు. సామాజిక మాధ్యమాన్ని సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించుకున్నారు. దక్షిణాదిలో కాంగ్రెస్‌కు మిగిలిన ఏకైక పెద్దరాష్ట్రాన్ని తమ ఏలుబడిలోకి తెచ్చుకునే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. ఒకవైపు మోడీ చరిష్మా మసకబారుతోందన్న ప్రచారం, ఇంకొకవైపు ఎన్డీయేకి వ్యతిరేకంగా పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం దృష్ట్యా కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు బీజేపీ ప్రతిష్టకు సవాల్‌గా మారాయి.

విజయం పరంపర కొనసాగేనా?

1985 నుంచి నిరంతరం మార్పును కోరుకుంటున్న ధోరణి కన్నడిగులది. అలాంటి చోట విజయం సాధించాలంటే వ్యూహాలకు మోడీ మరింత పదును పెట్టాల్సి ఉంది. 2014 తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జైత్రయాత్ర సాగిస్తున్న బీజేపీ, కర్నాటకలో పాగావేయాలంటే శక్తికి మించి పోరాడాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే ఈ దిశగా కమలనాథులు కార్యాచరణ ప్రారంభించినట్లు ఆ పార్టీ అధికార ప్రతినిధి ప్రకాశ్ మాటలను బట్టి తెలుస్తోంది. కాంగ్రెస్ నుంచి అధికారం చేజిక్కించుకోవాలంటే, బూత్ స్థాయినుంచి ఓటర్లను తమవైపునకు తిప్పుకోగలగాలి. ఈ ప్రయత్నంలోనే ఉన్నాం. కిందటిసారి విజయాన్ని చేరుకోలేకపోయాం. కానీ అప్పటికి ఇప్పటికి పరిస్థితులు మారాయి. కచ్చితంగా మేం విజయ పరంపరను కొనసాగిస్తాం అని ప్రకాశ్ ధీమా వ్యక్తంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 56వేల పోలింగ్ కేంద్రాల పరిధిలో 7 లక్షల మంది కార్యకర్తలు క్రియాశీలక విధుల్లో చేరిపోయారు. కొత్తగా 75 లక్షల మంది పార్టీలో చేరారు. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వంటి హేమాహేమీలు ప్రచారంలో పాల్గొంటారు. వ్యవసాయానికి ప్రాధాన్యత, శాంతిభద్రతల పరిరక్షణ, మౌలిక అభివృద్ధి, అవినీతి రహిత పాలన తదితరాలు తమ మేనిఫెస్టోలో కీలక అంశాలని బీజేపీ వెల్లడించింది.

బీజేపీపై రైతాంగం ఆగ్రహం

ఐటీ హబ్ కేంద్రమైన కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి రైతుల పాత్ర కీలకం కానుంది. నిరాశనిస్పృహల్లో ఉన్న 80 లక్షల మంది రైతాంగం మద్దతు కోసం అన్ని పార్టీలు అర్రులు చాస్తున్నాయి. చిన్న పట్టణాలు, నగరాల్లో బీజేపీకి కాస్తంత అనుకూల వాతావరణమే ఉంది. అయితే, 224 మేజిక్ ఫిగర్‌ను చేరుకునే క్రమంలో గ్రామీణ ఓటర్ల నుంచి ఎదురుగాలి వీచే అవకాశం కనిపిస్తోంది. నెల రోజులకిందట ఎన్నికల ర్యాలీలో మోడీ 'టాప్' (టమాటా, ఉల్లి, ఆలు) ఎజెండాను ప్రస్తావించారు. అయినా రైతాంగం దీన్ని విశ్వసించడం లేదు. బీజేపీ కేవలం సంపన్నులకే తప్ప పేదలకు, రైతులకు మేలు చేయదన్న అభిప్రాయం బలంగా వేళ్లూనుకుంది. ఈ క్రమంలో ప్రాంతీయ పార్టీలే నయమన్న భావన కలుగుతోంది. మొత్తానికి హంగ్ ఖాయమని, మాజీ ప్రధాని దేవెగౌడ నాయకత్వంలోని జేడీ(ఎస్) కింగ్‌మేకర్ పాత్ర పోషిస్తుందని సర్వేలు చెబుతున్నాయి. ఒకవేళ హంగ్ ఏర్పడితే, జేడీ(ఎస్) మద్దతు బీజేపీకి లభించొచ్చని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ బెంగళూరు ప్రొఫెసర్ నరేందర్ పాని అభిప్రాయపడ్డారు.

కాంగ్రెస్‌కే అనుకూల పవనాలు?

రాహుల్ సారథ్యంలోని కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతోంది. ఒకవైపు అభివృద్ధిని మరొక వైపు సెంటిమెంట్‌ను, ఇంకొకవైపు మోడీ పాలనలోని ప్రజా వ్యతిరేక విధానాలు, అవినీతిని ప్రచారా స్త్రాలుగా మలచుకుని ఎన్నికల సంగ్రామంలోకి దిగింది. కాషాయ పార్టీ దూకుడును నియంత్రించడంతోపాటు, దక్షిణాదిలో పెద్దరాష్ట్రమైన కర్నాటకపై పట్టు నిలుపుకోవాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ నాయకగణం అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతోంది. ఉతరాదిలో పంజాబ్‌ను హస్తగతం చేసుకున్న కాంగ్రెస్‌కు, దక్షిణాదిలో అధికారం నిలుపుకునేందుకు మిగిలిన ఒకేఒక్క రాష్ట్రం కర్నాటక మాత్రమే. ప్రస్తుతం అధికార పార్టీకి అనుకూల వాతావరణమే ఉంది. కాకుంటే సంపూర్ణ మెజార్టీ సాధించడమే సందేహమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాగా, అభివృద్ధి కార్యక్రమాలే హస్తం పార్టీకి ఓట్లు కురిపిస్తాయని సర్వేలు చెబుతున్నాయి. ముఖ్యంగా, ఉచిత బియ్యం, పాఠశాలల్లో ఉచిత పాలు, గుడ్ల పంపిణీ, బస్‌పాస్‌లు, వర్షాభావ పంటలకు ఆర్థికసాయం, సహకార బ్యాంకుల్లో రుణమాఫీ తదితర పథకాలకు జనాదరణ లభించింది. బీజేపీ వెనుకబడిపోతున్నది. ప్రస్తుత రాజకీయ దుర్బలత్వ స్థితులు ముందస్తు ఎన్నికలకు సంకేతాలిస్తున్నాయి. 2018 ఆఖరి త్రైమాసికంలో సార్వత్రిక ఎన్నికలకు 25శాతం అవకాశం ఉంది అని నోమురా హోల్డింగ్ సంస్థ విశ్లేషించింది. కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రతిష్ట మసకబారుతుంది. అదే సమయంలో విపక్షాల వ్యూహాల్లో పురోగతి కనిపిస్తుంది. 2019 రూట్‌మ్యాప్ దిశ మార్చుకుంటోంది. మళ్లీ హిందుత్వ నినాదంతోనే మోడీ ఎన్నికలకు వెళ్లకతప్పదు అని యూరేసియా గ్రూప్ ఆసియా డైరెక్టర్ ఒకరు వెల్లడించారు.

రాజ్యాంగంపై దాడికి కుట్ర

● బీజేపీపై రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు ● వారి ప్రయత్నాలు సాగనివ్వబోమని హెచ్చరిక ● మేం అధికారంలోకి వస్తే జీఎస్టీలో ఒకే శ్లాబ్ ● నోట్ల రద్దు నిర్ణయం అతిపెద్ద తప్పిదం ● కర్నాటకలో ఎన్నికల ప్రచారంలో ఎదురుదాడి



చామరాజనగర్ (కర్నాటక): భారతీయ జనతాపార్టీ విధానాలపై కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ఘాటైన విమర్శలు చేశారు. ఏకంగా రాజ్యాంగంపైనే దాడిచేస్తున్నారంటూ ధ్వజమెత్తారు. రాజ్యాంగ స్వరూపాన్ని మార్చే కుట్ర జరుగుతోందని, ఈ ప్రయత్నాన్ని కాంగ్రెస్ పార్టీ అడ్డుకుని తీరుతుందని స్పష్టంచేశారు. శనివారం కర్నాటకలో పర్యటించిన ఆయన మైసూరు దేవత చాముండేశ్వరి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. 'పెద్దనోట్ల రద్దు.. వస్తు సేవల పన్నుల ద్వారా ప్రజల సొమ్మును దోపిడీ చేయడమే కాకుండా, రాజ్యాంగంపై దాడిచేయడం బీజేపీకి ఫ్యాషన్‌నైంది. ఇకపై ఇక్కడి నుంచి వారి కుట్రలు సాగనివ్వం. రాజ్యాంగాన్ని మార్చాలన్న బీజేపీ ప్రయత్నాన్ని అనుమతించం. వాళ్లెన్ని ప్రయత్నాలు చేసినా, అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పార్టీ రక్షించి తీరుతుంది అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. నాలుగోదశ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాండ్య, మైసూరు, చామరాజ్‌నగర్ జిల్లాల్లో జనాశీర్వాద్ పేరుతో రెండు రోజుల పర్యటనకు శ్రీకారం చుట్టారు. ఇదివరకు ఈశాన్య, కోస్టల్, మల్నాడ్ ప్రాంతాల్లో రాహుల్ ప్రచారం నిర్వహించారు. 18వ శతాబ్దం మైసూరు రాజు టిప్పుసుల్తాన్, క్రిష్ణరాజ వడయార్, ప్రముఖ ఇంజనీర్ విశ్వేశ్వరయ్య, ప్రసిద్ధ కన్నడ కవి కువెంపు సేవలను ప్రస్తావిస్తూ ప్రసంగాన్ని ప్రారంభించారు. ఉపాధి, ఉద్యోగాల కల్పనను దెబ్బతీసేలా పెద్దనోట్ల రద్దుపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మూర్ఖంగా వ్యవహరించారని రాహుల్ విమర్శించారు. 'ఈ ఉదయం యువతతో భేటీ అయ్యాను. అప్పుడు ఒక విద్యార్థిని మోడీ హామీలను ప్రస్తావించింది. మేకిన్ ఇండియా ద్వారా ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీలు ఒట్టిమాటలే అయ్యాయని చెప్పింది' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. పెద్దనోట్ల రద్దు వల్ల సామాన్యులకు మేలు జరగలేదన్నారు. ఒకే దేశం ఒకే పన్ను నినాదంతో తీసుకొచ్చిన జీఎస్టీలో ఐదు శ్లాబ్‌లు ఎందుకని ఈసందర్భంగా ఆయన ప్రశ్నించారు. ఈ నిర్ణయాల అనర్థాలేమిటో 18-20 ఏళ్ల విద్యార్థులకు అర్థమైనట్లు, మోడీకి ఎందుకు అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. పేదలకు కష్టాలు మిగిల్చిన నోట్లరద్దు అక్రమార్కుల నల్లడబ్బును తెల్లగా మార్చేందుకు దోహదం చేసిందని ఆరోపించారు.

ఒకే పన్ను శ్లాబ్..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి జీఎస్టీలో ఐదు శ్లాబుల స్థానంలో ఒకే పన్ను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా 28 శాతం పన్ను శ్లాబ్‌ను పూర్తిగా రద్దుచేస్తామన్నారు. మహారాణి కాలేజీ విద్యార్థులతో సమావేశంలో ఈ మేరకు ప్రకటన చేశారు. ఏడు శాతం పన్ను శ్లాబ్ మాత్రమే అమలు చేస్తున్న సింగపూర్‌లో ఉచిత ఆరోగ్యసేవలు అందిస్తుండగా? 28శాతం పన్ను వసూలు చేస్తున్నా మనకు వైద్యం ఎందుకు అందడం లేదని విద్యార్థులు ప్రశ్నించారు. ఇందుకు ప్రధానమంత్రి మాత్రమే సరియైన జవాబు చెప్పగలరని రాహుల్ అన్నారు. జీఎస్టీ ఆలోచన కాంగ్రెస్ పార్టీదని, తాము సింగపూర్ తరహా విధానం ప్రతిపాదిస్తే, బీజేపీ ప్రభుత్వం ఐదు రకాల శ్లాబులు తెచ్చిపెట్టిందన్నారు. ఇలాంటి జీఎస్టీ అవినీతిని ప్రోత్సహిస్తుందని చెప్పారు. విదేశాల్లోని నల్లడబ్బును వెనక్కి రప్పిస్తాన్న మోడీ ఆ విషయాన్ని విస్మరించారని ఎద్దేవా చేశారు.

న్యాయవ్యవస్థ కుప్పకూలుతోంది..

జడ్జీల కొరత వల్ల కోర్టుల్లో పెండింగ్ కేసులు పెరిగిపోతున్నాయంటూ కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్‌పై రాహుల్ నిప్పులు చెరిగారు. న్యాయశాఖ బాధ్యతల బదులు అసత్య కథనాలను ప్రచారం చేసేలా రవిశంకర్ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కేంబ్రిడ్జ్ అనాలిటికాతో కాంగ్రెస్‌కు సంబంధాలున్నాయని కేంద్ర మంత్రి ఆరోపించిన నేపథ్యంలో రాహుల్ ఎదురుదాడికి దిగారు. పెండింగ్ కేసులతో న్యాయవ్యవస్థ కుప్పకూలుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. సుప్రీంలో 55వేల పైచిలుకు, హైకోర్టుల్లో 37 లక్షల పైచిలుకు, కిందిస్థాయి కోర్టుల్లో 2.6 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అదేవిధంగా హైకోర్టులో 400, కింది కోర్టుల్లో 6వేల జడ్జీల పోస్టులు ఖాళీగా ఉన్నాయని గుర్తుచేశారు. సుప్రీం న్యాయ మూర్తుల నియామకాల్లో జాప్యానికి ప్రధానిని తప్పుబట్టారు.

షిర్డీసాయికి బంగారు

దీపపుసమ్మె విరాళం

షిర్డీ: ముంబైకి చెందిన షిర్డీ సాయినాథుని భక్తుడు ఒకరు రూ.39లక్షలు విలువచేసే 1,351గ్రాముల బంగారు దీపపు సమ్మెను దేవస్థానానికి విరాళంగా అందజేశాడు. ఈ సందర్భంగా షిరిడీ సాయిబాబా దేవస్థానం అధికారులు మాట్లాడుతూ ముంబైకి చెందిన బాబా భక్తుడు జయంత్ బాయ్ ఈ కానుకను అందజేశారని అంతకు మించి వివరాలు వెల్లడించేందుకు ఆయన అంగీకరించలేదని శ్రీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ (ఎస్ఎస్ఎస్‌టీ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రుబాయ్ అగర్వాల్ వెల్లడించారు. మూడు రోజులపాటు నిర్వహించనున్న శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు జరిగిన వేడుకల్లో ఆయన ఈ కానుక దేవస్థాన అధికారులకు అందజేశారన్నారు. ఆచార సంప్రదాయ కార్యక్రమాల సందర్భంగా బాబా సమాధి మందిర్‌లో జరిగే పూజాకార్యక్రమాల్లో ఈ బంగారు పంచహారతిని దేవస్థాన ప్రధాన పూజారులు ఉపయోగిస్తారని తెలిపారు. పండుగ ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజున దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి 175పల్లకిల్లో బాబా వారి ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తూ దేవస్థానానికి చేరుకు న్నార న్నారు. వీరంతా కాలినడకనే ఈ కార్యకమం నిర్వహించారని దేవ స్థాన సీఈవో తెలిపారు. ఉత్సవాలు సందర్భంగా వేలాదిమంది భక్తులు షిర్డీ సాయిబాబా వారిని దర్శించు కు నేందుకు వస్తారని అందుకు తగ్గట్టు గానే దేవస్థాన అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారని అగర్వాల్ తెలిపారు.

రైలులో ఆహారానికి ఇక

బిల్లు తప్పనిసరి

న్యూఢిల్లీ: రైలు ప్రయాణికులకు అందించే ఆహారంలో నాణ్యత లోపిస్తోందన్న ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఐఆర్‌సిటీసీ చర్యలు ప్రారంభించింది. బెటర్ ఇండియా నివేదిక ప్రకారం ఇక నుంచి రైళ్లలో ఆహారం తీసుకునే ప్రయాణికులకు తప్పనిసరిగా బిల్లు అందించేలా కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. మొట్టమొదట ఎస్‌బిసి-ఎన్ఎస్‌డిఎల్ -కర్నాటక ఎక్స్ ప్రెస్‌లో ఈ విధానాన్ని అమలు చేయ బోతున్నారు. అనంతరం 26 రైల్వే స్టేషన్లలో 100 పాయింట్ సేల్ మెషన్లు ఏర్పాటు చేస్తారు. ఈ మిషన్ల ద్వారా ప్రయాణికులు తమకు కావాల్సిన ఆహారాన్ని బుక్ చేసుకుని రసీదు పొందవచ్చు. ఐఆర్‌సిటీసీ అందించే ఆహారం కల్తీ అయినా.. నాణ్యత లోపించినా వెంటనే ఫిర్యాదు చేసి సంబంధిత అధి కారులపై చర్యలు తీసుకునేందుకు ఈ బిల్లు ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఐసిస్ రిక్రూట్‌మెంట్ కేసులో

మహిళకు ఏడేళ్ల జైలు

తిరువనంతపురం: అతి క్రూరమైన చర్యలకు పాల్పడుతున్న ఇస్లామిక్ స్టేట్(ఐసిస్) ఉగ్రవాద సంస్థ కోసం ఓ బీహారీ మహిళకు యువతను సమీకరించిన కేసులో ఏడేళ్ల జైలు శిక్షపడింది. ఈ విషయాన్ని ధృవీకరిస్తూ స్పెషల్ ఎన్ఐఏ కోర్టు శనివారం ఏడేళ్ల కఠిన కారాగార శిక్షవిధించింది. ఐసిస్ భావజాలాన్ని ప్రచారం చేయడంతోపాటు ఆ ఉగ్రవాద సంస్థలోకి యువతను చేర్చేందుకు నేరపూరిత కుట్ర జరిగినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కేసు నమోదు చేసింది.

బీజేపీ 69- కాంగ్రెస్ 50

రాజ్యసభలో పెరిగిన ఎన్డీయే బలం

న్యూఢిల్లీ: శుక్రవారం ముగిసిన రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ మెరుగైన ఫలితాలను సాధించింది. పోలింగ్ జరిగిన రాష్ట్రాల్లో మునుపటి కంటే అదనంగా 11 స్థానాలు దక్కించుకుంది. తద్వారా 245 మంది ఎంపీలున్న ఎగువసభలో ఆపార్టీ సంఖ్యాబలం 69కి చేరింది. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ నాలుగు స్థానాలు కోల్పోయి 50 సీట్లకు చేరింది. కొత్తగా ఎన్నికైన ఎంపీలు వచ్చేవారం ప్రమాణస్వీకారం చేస్తారు. క్రమంగా రాజ్యసభలో ఎన్డీయే సంఖ్యాబలం పెరుగుతోంది. ఇటీవలే కూటమి నుంచి టీడీపీ వైదొలగిన నేపథ్యంలో తగ్గిన సంఖ్యాబలం తాజా ఎన్నికలతో భర్తీ అయింది. టీడీపీకి ఎగువ సభలో ఆరుగురు సభ్యులు ఉన్నారు. కాగా, సమాజ్‌వాది-కాంగ్రెస్ పార్టీలు యూపీలో ఆరు స్థానాలకుగాను ఒక స్థానాన్ని మాత్రమే తిరిగి నిలబెట్టుకున్నాయి. బయట నుంచి మద్దతిస్తున్న తెరాస, అన్నాడీఎంకే, వైకాపా, బీజేడీల ఎంపీలతో సభలో ఎన్డీయేకి అనుకూల పరిస్థితి ఉంది. తరచూ బిల్లుల ఆమోదంలో మోడీ ప్రభుత్వానికి రాజ్యసభలోనే ప్రతిబంధకాలు ఎదురయ్యేవి. ఇప్పుడు అలాంటి పరిస్థితి క్రమంగా తొలగనున్నది.


ఎన్డీయేకి జీజేఎం గుడ్‌బై



న్యూఢిల్లీ: కేంద్రంలోని ఎన్డీయే కూటమికి మరో కుదుపు. మిత్రపక్షం తెలుగు దేశం పార్టీ కూటమి నుంచి వైదొలగిన కొద్దిరోజుల్లోనే గూర్ఖా జన ముక్తి మోర్చా రూపంలో షాక్ తలిగింది. తెదేపా బాటలోనే జీజేఎం కూడా కూటమినికి వీడ్కోలు చెప్పింది. గూర్ఖా ప్రజల విశ్వాసాన్ని అధికార బీజేపీ ప్రభుత్వం కోల్పోయిందని, అభివృద్ధి హామీలను నెరవేర్చడంలో మోసం చేసిందని జీజేఎం పార్టీ చీఫ్ ఎల్ఎం లామా ఆరోపించారు. అందుకే ఎన్డీయే కూటమి నుంచి బయటకు వస్తున్నట్లు ప్రకటించారు. ఇకపై బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేతో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టంచేశారు. పశ్చిమబెంగాల్‌లో ప్రాబల్యం పెంచుకునేందుకు బీజేపీకి ఉన్న ఏకైక మార్గం డార్జిలింగ్ అంశమే. వారి లక్ష్యం జీజేఎంతోనే నెరవేరుతుంది. కానీ చాలా సంవత్సరాలుగా ఇక్కడి ప్రజలు బీజేపీ మేలు చేస్తుందని ఆశించి భంగపడ్డారు. తమ సమస్యలను ప్రస్తావించి, పరిష్కరిస్తారన్న ఆశలు అడియాసలు అయ్యాయి. మళ్లీ మళ్లీ బీజేపీ మరోసారి ఇక్కడి ప్రజలను మోసం చేసింది అని లామా ఆగ్రహం వ్యక్తంచేశారు.

మానవ అక్రమ రవాణా...

అతిపెద్ద విషాదం: సీజేఐ



న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా కీలక వ్యాఖ్యలు చేశారు. మానవ అక్రమ రవాణాను.. అతిపెద్ద మానవ విషాదంగా అభివర్ణించారు. మానవ అక్రమ రవాణా అంశంపై న్యూఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ సమావేశానికి హాజరైన ఆయన.. మానవ అక్రమ రవాణా అంటే చాలామంది అదో వస్తువు అని భావిస్తారనిఅన్నారు. భారత యువత మానవ అక్రమ రవాణాను వ్యతిరేకించడంలో మార్గదర్శకులుగా మారాలని ఆకాంక్షించారు. గతంలోబానిసత్వం మానవ అక్రమ రవాణాగా ఉండేదని ప్రస్తుతం ఇప్పుడు ఆ అర్థం కూడా మరింతగా విస్తరించిందని చెప్పారు. మనుషుల అక్రమ రవాణా రోజురోజుకూ పెరుగుతూ అదృశ్య పరిశ్రమగా ఎదుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ రకాల భాగస్వామ్యాలకు మానవ అక్రమ రవాణా కూడా ఒక వేదిక అవుతుండటం ఆలోచించాల్సిన అంశమని దీపక్ మిశ్రా అన్నారు. నేపాల్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సపన ప్రధాన్ మల్ల మాట్లాడుతూ.. రోజురోజుకూ పెరిగిపోతున్నసాంకేతిక పరిజ్ఞానం మానవ అక్రమరవాణాకు మార్కెట్ ను సృష్టించడంలో తోడ్పాటును అందిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

25 స్థానాల్లో 21 మనవే

● ఈశాన్య రాష్ట్రాల్లో గెలుపు లక్ష్యంగా అమిత్‌షా పావులు
● 2019 లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలపై దృష్టి

గౌహతి: బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఈనాశ్య రాష్ట్రాలపై దృష్టిపెట్టారు. 2019 లోక్ సభ ఎన్నికల్లో ఈశాన్య రాష్ట్రాల్లోని 25 లోక్‌సభ స్థానాల్లో 21 స్థానాలను బీజేపీ కైవశం చేసుకుంటుందని షా ధీమా వ్యక్తం చేశారు. అస్సాంలోని గౌహతిలో పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ర్యాలీలో పాల్గొన్న అమిత్ షా వచ్చే ఎన్నికల్లో భారీ మెజారిటీ లక్ష్యంగా నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. 2019 ఎన్నికలే టార్గెట్. ఆ ఎన్నికల్లో ఈశాన్య రాష్ట్రాల్లోని 25 లోక్‌సభ స్థానాల్లో 21 కి పైగా స్థానాలను మనం కైవశంచేసుకోవాలి. అని చెప్పుకొచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు ఈశాన్య రాష్ట్రాల మద్దతు ఎంతో అవసరమని షా నొక్కిచెప్పారు. అస్సాంలో పేజ్ ప్రముఖుల సంఖ్యను మరింతగా పెంచి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. వచ్చేఎన్నికలకు ఇప్పటి నుంచి కసరత్తు ప్రారంభించాలని అందుకోసం ఇన్‌చార్జ్‌లను కూడా నియమించాలని అస్సాం బీజేపీ యూనిట్‌ను ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఈశాన్య రాష్ట్రాలను నిర్లక్ష్యం చేసిందని మోడీ ప్రభుత్వహయాంలో ఈశాన్య భారత అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు.దేశంలో అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో అస్సాం నాలుగో స్థానంలో ఉందని షా గుర్తు చేశారు.


అన్నా హజారే దీక్షలో ఆంధ్ర - తెలంగాణా కార్యకర్తలు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్‌కు ద్రో హం చేస్తున్నారని ఏపీ ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు విమర్శించారు. లోక్‌పాల్, లోకా యుక్త బిల్లుకు సంబంధించి రామ్ లీలా మైదానంలో అన్నా హజారే చేపట్టిన దీక్షలో పాల్గొనేందుకు ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా నుంచి పెద్ద సంఖ్యలో జనం ఢిల్లీ తరలి వచ్చారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఏపీ స్టేట్ కన్వీనర్ పోతిన వెంకట రామారావు, రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అధ్యక్షుడు మీడా శ్రీనివాస్, ఏపీ జేఏఫ్ అధ్యక్షుడు కృష్ణాంజనేయులు ఆంధ్రప్రదేశ్ భవన్ వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. అవిశ్వాస తీర్మానానికి మద్దతిస్తానన్న పవన్ కళ్యాణ్ ఏమైపోయారని వారు ప్రశ్నించారు. వచ్చే నెల 20వ తేదీన రాజమండ్రిలో ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ జరగనుందని వారు తెలిపారు. ఆంధ్ర ప్రజలను మోసం చేసిన బీజేపీకి గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ప్రత్యేక హోదా కల్పించకపోతే బీజేపీ అడ్రస్ గల్లంతవుతుందని వారు హెచ్చరించారు. అన్యాయం చేసింది చాలక అమిత్ షా ఆంధ్రపై ఎదురు దాడికి దిగుతున్నారని వారు మండిపడ్డారు. మరోవైపు తెలంగాణాలో ఆత్మహత్య చేసుకుంటున్న రైతుల సంఖ్య పెరిగిపోతోందని, కేసీఆర్ సొంత నియోజకవర్గం గజ్వేల్‌లో వంద మందికి పైగా అన్నదాతలు బలవన్మరణాలకు పాల్పడ్డారని సర్పంచుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, టీజేఏసీ స్టీరింగ్ కమిటీ మెంబర్ ఆందోల్ క్రిష్ణ విమర్శించారు. 60 ఏళ్లుపైబడిన ప్రతి రైతులు నెలకు 5 వేల పెన్షన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

నాలుగో కేసులో లాలూకు 14ఏళ్ల జైలు

● వరుసగా ఏడేడు ఏళ్ల జైలు శిక్ష అనుభవించాలన్న సీబీఐ కోర్టు ● రూ. 60లక్షల జరిమానా ● అది చెల్లించకుంటే మరో రెండేళ్ల జైలుశిక్ష



రాంచీ: దాణా కుంభకోణంలో జైలు శిక్ష అనుభవిస్తున్న బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ ను సీబీఐ న్యాయస్థానం మరోషాక్ ఇచ్చింది. నాలుగో కేసులోనూ దోషిగా తేల్చిన ధర్మాసనం లాలూకు 14 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 60 లక్షల జరిమానా కూడా విధించింది. ఈ కేసులో సీబీఐ కోర్టు న్యాయమూర్తి శివపాల్ సింగ్ భారత న్యాయ శిక్షాస్మృతిలోని అవినీతి నిరోధక చట్టం కింద లాలూకు ఏడేడు ఏళ్లు వరసగా ..మొత్తంగా 14 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తున్నట్లు ప్రకటించారు. ఏపీసీ 420 చీటింగ్ కేసులో ఏడేళ్ల జైలుశిక్ష.. ఏపీసీ 409 ప్రజాపాలకుడిగా ఉండి నేరానికి పాల్పడటం కేసు కింద మరో ఏడేళ్ల జైలు శిక్ష విధించినట్లు న్యాయవాది విష్ణు శర్మ తెలిపారు. చట్టాలను తుంగలో తొక్కి అక్రమాలకు పాల్పడినందుకు రూ. 30 లక్షల జరిమానా... అవినీతికి పాల్పడినందుకు మరో రూ. 30 లక్షల రూపాయల జరిమానా విధించారని వెల్లడించారు. ఒకవేళ జరిమానా కట్టనట్లైయితే మరో రెండేళ్లపాటు ఎక్కువ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసినట్లు వివరించారు. 1995-96 లో డుంకా కోశాగారం నుంచి అక్రమంగా రూ. 3.3 కోట్ల రూపాయలు విత్ డ్రా చేశారన్న సీబీఐ అభియోగాలపై విచారణ జరిపిన ధర్మాసనం లాలూతో పాటు మరో 18 మం దిని దోషులుగా పేర్కొంది. అయితే మరో మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్రాతో పాటు 12 మందిని మాత్రం నిర్దోషులుగా ప్రకటించడం గమనార్హం.. ఐపీసీ 120బీ (నేరపూరిత కుట్ర), 409 (అధికార దుర్వినియోగం), 420 (మోసం), 471 (తప్పుడు ధృవపత్రాల సృష్టి) తదితర కేసుల నమోదు దోష లుగా తేల్చింది.

పశుసంవర్ధక శాఖ మాజీ అధికారికీ లాలూ శిక్షే

ఈ కేసులో మరో 18 మందికి కూడా న్యాయస్థానం శిక్షను ప్రకటించింది. బీహార్ పశుసంవర్ధక శాఖ మాజీ ప్రాంతీయ డైరెక్టర్ ఓపీ దివాకర్‌కు కూడా లాలూ ప్రసాద్ కు విధించిన శిక్షే విధించింది. పశుసంవర్ధక శాఖకు చెందిన తొమ్మిది మంది ఇత ర అధికారులతో పాటు మాజీ ఐఏఎస్ అధికారి ఫూల్‌చంద్ సింగ్‌కు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తున్నట్లు సీబీఐ కోర్టు స్పష్టం చేసింది. ఇక దాణా పంపిణీ చేసిన ఏడుగురికి మూడున్నరేళ్ల జైలుశిక్ష, రూ. 15 లక్షల జరిమానా విధించింది. సీబీఐ కోర్టు తీర్పుపై హైకోర్టును ఆశ్రయిస్తామని లాలూ తరపు న్యాయవాది ప్రభాత్ కుమార్ తెలిపారు. గతేడాది డిసెంబర్ 23 వ తేదీ నుంచి లాలూ జార్ఖండ్ లోని బిర్సాముండా జైలులో శిక్ష అనుభవి స్తున్నారు. 1991-1996 మధ్య లాలూ బీహార్ ముఖ్యమం త్రిగా ఉన్న సమయంలో జరిగిన రూ. 950 కోట్ల దాణాకుంభ కోణం 1996లో వెలుగులోకి వచ్చింది. పశువుల దాణా కొనుగోళ్లలో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపణ లు రావడంతో లాలూసహా మరికొందరిపై కేసు నమోదైంది. దీంతో ముఖ్యమంత్రి పదవికి లాలూ రాజీనామా చేసి తన భార్య రబ్రీదేవిని సీఎంగా చేశారు. దాణా కుంభకోణానికి సంబంధించి మొత్తం ఐదు కేసులు నమోదు కాగా నాలుగు కేసుల్లో లాలూ దోషిగా తేలారు. మరోకేసు పెండింగ్ లో ఉంది.

Andhraprabha business 2018
బిజినెస్
BUSINESS

‘చైనాకు నో ఫ్రీడమ్’



వాషింగ్టన్: చైనాకు వ్యతిరేకంగా కఠిన వాణిజ్య చర్యలు ప్రారంభించిన తరువాత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడుతూ చైనాకు ఇక నుంచి స్వేచ్ఛ పాలన అంటూ ఉండదన్నారు. ఎన్నో సంవత్సరాలుగా చైనా వ్యాపార సరళితో అమెరికా వాణిజ్యానికి భారీస్థాయిలో లోటు ఏర్పడిందన్నారు. చైనా వాణిజ్యంపై కఠిన ఆంక్షలు విధించిన మరుసటి రోజే మరోసారి ట్రంప్ ఆ దేశంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ కఠిన చర్యలు ధాటికి చైనా దిగివచ్చి తమతో న్యాయబద్ధంగా వ్యవహరిస్తుందనే ఆశాభావాన్ని ట్రంప్ వ్యక్తం చేశారు. మేము చైనాతో చాలా స్నేహపూర్వంగా ఉన్నాం. చైనాతోమాకు మంచి సంబంధాలు ఉన్నాయి. అయితే ఇకనుంచి వారికి స్వేచ్ఛ పాలన ఉండదని ట్రంప్ వైట్ హౌస్‌లో విలేఖరుల సమావేశంలో తెలిపారు. చైనా భారీ వాణిజ్యం వల్ల అమెరికాలో రెండు మిలియన్ల మందికి ఉద్యోగ అవకాశాలు కోల్పోయారని వైట్హౌస్ ప్రతినిధులు తెలిపారు.



క్రెడిట్ కార్డులుంటే.. కష్టాలే!



- రివార్డులు కొంచెం
- వడ్డింపులు అనంతం
- తేడా వస్తే అంతే సంగతులు
- నిపుణుల హెచ్చరిక

న్యూఢిల్లీ: క్రెడిట్ కార్డులను సంక్షోభ కాలంలో, అవసరాలు వచ్చినప్పుడు ఆదుకునే మంచి నేస్తాల్లో ఒకరిగా చెప్పుకుంటారు. నిజమే, కొన్ని సందర్భాల్లో అలా నిరూపితమైంది కూడా. అయితే క్రెడిట్ కార్డును తీసుకోవడానికి ఈ ఒక్క కారణమే సరిపోతుందా అనేది వెయ్యి వరహాల ప్రశ్న. క్రెడిట్ కార్డులతో లెక్కలేనన్ని ఇతర అనుకూలతలు ఉన్నాయని వాదించేవారు లేకపోలేదు. అవి డిస్కౌంట్లు ఇప్పిస్తాయి. అడక్కుండానే క్యాష్‌బ్యాక్ రివార్డులు అందిస్తాయి. 45 నుంచి 55 రోజుల దాకా వడ్డీ కట్టాల్సిన పనిలేకుండా చూస్తాయి. అంతెం దుకు మనకంటూ ఒక క్రెడిట్ చరిత్ర సృష్టించుకోవడం లో సాయపడతాయి. బ్రహ్మాండం. అద్భుతంగా ఉంది. అయితే ఇదంతా కూడా ముందూ వెనకా ఆలోచించి క్రెడిట్ కార్డులను వినియోగించే మాత్రమే వర్తిస్తుంది. ఒంటి మీద స్పృహ లేనట్టుగా ఎడాపెడా వాడేస్తే ఇక జీవితంలో ఇంటిలోన్‌కాదు కదా పర్సనల్ లోన్ కూడా పొందలేనంతగా అవి శాశ్వ తంగా దెబ్బ తీస్తాయి. ప్రపంచంలో కోట్లాది ప్రజలు అప్పులో ఊబిలో పడి కుటుంబాలను నాశనం చేసు కుంటున్నారంటే ఆ పాపం క్రెడిట్ కార్డులదే. కొం దరైతే విధిలేని పరిస్థితు ల్లో ఆత్మహత్యలు చేసు కున్నారు. ఎందుకిలా జరుగుతుందంటే నేడు ఖర్చు పెట్టు.. రేపు తిరిగి చెల్లించు అనే సూ త్రం మీద క్రెడిట్ కార్డు పని చేస్తుంది కాబట్టి. ఈ సూత్రం వలలో అనేక మంది పడిపోతు న్నారు. ఆదాయానికి మించి ఖర్చు చేస్తున్నా రు. ఇతరులను మెప్పించడానికి కొన్నిసార్లు, సో షల్ స్టేటస్ చూపించుకోవడా నికి ఇంకొన్ని సార్లు క్రెడిట్ కార్డును బరబరా గీకేస్తున్నారు. అంతా చేజారిపోయాక చేసిన పొరపా టు తెలుసుకొని ఇబ్బందులు పడుతుం టారు. ఇప్పుడు ఖర్చు చేసి తర్వాత చె ల్లించడం లో తప్పేమిటి అనే సందేహం రావడం సర్వసాధారణం. నిజమే అలా చేయడం తప్పు కాదు. పర్సనల్ లోన్ ను నెలలు లేదా సంవ త్సరాల్లో తీర్చే యవచ్చు. అదే క్రెడిట్ కార్డు విష యానికి వచ్చేసరికి కట్టాల్సిన బాకీలో కేవలం కనీసం మొత్తం మాత్రమే చెల్లిస్తున్న పక్షంలో మొత్తం అప్పు తీర్చడానికిదశాబ్దాలు పట్టినా ఆశ్చర్యపో వాల్సిన పనిలేదు. ఒక రమారమి అంచనా ప్రకారం క్రెడిట్ కార్డు అవుట్ స్టాండింగ్ బ్యాలెన్స్ రూ.2 లక్షలు ఉం డి దానిపై 40 శాతం వడ్డీ విధించారు. అలాంట ప్పుడు ప్రతి నెలా కనీస మొత్తం మాత్రమే తీరుస్తున్న పక్షంలో మొత్తం బకాయి తీర్చడానికి దాదాపు 15 సంవత్సరాలు పడుతుంది. అదే నెలవారీ చెల్లింపుల్లో కొన్ని రోజులు ఆలస్యమైన పక్షంలో కట్టడానికి లేట్ ఛార్జీలు ఎటూ ఉంటాయి. ఆ లెక్కన చూస్తే క్రెడిట్ కార్డు అవుట్ స్టాం డింగ్ బ్యాలెన్స్ ఒక జీవిత కాలం కూడా సరిపోకపోవచ్చు!ఇంత తెలిసి కూడా ఈ వగపేలా అన్నట్టు సాధ్యమైనంత వరకు క్రెడిట్ కార్డులను వినియోగించకపోవడమే ఉత్తమోత్తమమైన పనిగా చెప్పవచ్చు. క్రెడిట్ కార్డులకు నో చెప్పడానికి సవాలక్ష కారణాలున్నప్పటి కీ వాటిలో ఆణిముత్యాల్లాంటి ఆరు కారణాలను పరిశీలిద్దాం.

భారీగా వడ్డీ రేటు బాదుడు

బైట వడ్డీ రేట్లతో పోల్చినప్పుడు క్రెడిట్ కార్డు కంపెనీలు విని యోగదారుల కొనుగోళ్ళపై విధించే వడ్డీ రేటు రెండింతలు ఉంటుం దని ఆర్థిక నిపుణుల అంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే అసలు కన్నా వడ్డీ ఎక్కువ అనే నానుడి క్రెడిట్ కార్డులకు సరిగ్గా సరిపో తుం ది. ఏదైనా కొనడానికి చేతిలో డబ్బులు లేకపోతే ఆ పనికి క్రెడిట్ కార్డులు వాడితే ఆర్థిక పరిస్థితి దారుణంగా మారిపోతుందని హెచ్చరిస్తున్నారు.



అప్పు లేని వాడు కోటీశ్వరుడు అన్న మాట తాతల కాలంనాటి ముతక మాట కావొచ్చు. అస లు అప్పు అనేది లేకపోతే చెల్లింపులో

మానసిక ఒత్తిడి గ్యారంటీ

జాప్యం, పెనాల్టీలు, ఫీజు, వడ్డీ రేటు, క్రెడిట్ స్కోర్లు లాంటి వాటి గురించి చిం తించాల్సిన పని లేదు అనేది నేటి మాట. ఆశ పడిన వస్తువు కన్నా ఇ లాంటి మానసిక ప్రశాంతత ఎంతోముఖ్యమైనది. ముక్కూ ముఖం తెలియని ఎవరో వ్యాపారం పెంచడానికి, ఏ మాత్రం అవసరం లేని ఒక వస్తువు కొనుగోలు కోసం మానసిక ప్రశాంతతను పణంగా పెట్టడం సరికాదని మానసిక శాస్త్రవేత్తలు హితవు చెబుతున్నారు.

దడ పుట్టించే షరతులు

ఒక క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తుపై సంతకం చేసేట్టప్పుడు దానిపై ఉన్న నిబంధనలు, షరతులను నిజంగా చదివినట్టయితే క్రెడిట్ కార్డు వెనుక మనకు తెలియని సంగతులు ఇన్ని ఉన్నాయా అని విస్తుపోవడం ఖాయం. చీమ తలకాయంత అక్షరాలతో అచ్చయిన షరతుల్లో క్లయింట్లకు కేవలం రెండువారాల ముందస్తు నోటీసుతో వడ్డీ రేట్లు, ఫీజు, పెనాల్టీలను కంపెనీ ఎప్పుడైనా పెంచవచ్చు అని ఉంటుంది.



అప్పుల ఊబి రెడీ

క్రెడిట్ కార్డులు వడ్డించేపైకి కనిపించని ఛార్జీలు, అడ్డూ అదుపూ లేని వడ్డీ రేట్లతో అనేక మంది అప్పుల ఊబి లో పడిపోతుం టారు. ఒకానొ క దశలో బైటకు రావడం చాలా కష్టమైపోతుంది.

క్రెడిట్ స్కోరుకు గండి

ఎవరికైనా క్రెడిట్ స్కోరు తక్కువగా ఉంటే వారు ప్రస్తుతం ఎక్కువ వడ్డీ రేటు కడుతున్నట్టు లెక్క. క్రెడిట్ కార్డు రుణం చెల్లించకపోతే క్రెడిట్ స్కోరు తగ్గిపోతుంది. అలాంటప్పుడు ఇంటి లోను లాంటి ముఖ్యమైన లోను తీసుకున్నప్పుడు ఎక్కువ మొత్తం కట్టాల్సి వస్తుంది. కొన్ని కేసుల్లో అప్పు పుట్టడం కూడా కష్టమైపోతుంది.

బడ్జెట్‌కు బీటలు

ప్రజలు నగదుకు బదులుగా క్రెడిట్ కార్డులతో బజారుకు వచ్చినప్పుడు కావాల్సిన దాని కన్నా ఎక్కువ కొనుగోలు చేస్తుంటారు. కొన్నప్పుడు ఒక రసీదుపైన సంతకం చేస్తే చాలు అనే వెసులుబాటు క్రెడిట్ కార్డు ఎటూ కల్పిస్తుంది. దాంతో గోళ్ళు ఊ డకొట్టుకునేలా కొనుగోళ్ళు జరిపేస్తుంటారు. అదే నగదు చెల్లిస్తున్నప్పుడు చేతి నుంచి ఒక రూపాయి పోతుందనే భావన కొనాలనే ఉత్సాహాన్ని కట్టడి చేస్తుంది. అంతేకాక వస్తువు ఎంతవుతుంది? ఇప్ప టికిప్పుడు దాన్ని కొనాల్సిన అవసరం ఉందా? అ సలు మన జేబులో ఇంకా ఎంత మిగిలి ఉంది అనే ఆలోచన కలిగిస్తుంది. దాంతో బడ్జెట్ గీత దాటే ప్రసక్తిఉండదు. అదే క్రెడిట్ కార్డును రంగం లోకి దించితే బడ్జెట్ బీటలు వారిపోవడం ఖాయ మని నిపుణులు అంటున్నారు.



ఒకటి నుంచి ఈ-వే బిల్లు

- జూన్ వరకు జీఎస్టీఆర్-3 రిటర్న్ దాఖలు



న్యూఢిల్లీ: వచ్చే నెల ఒకటి నుంచి ఇ-వే బిల్లు అమల్లోకి రానుంది. ఈ మేరకు ఇ-వే బిల్లు అమలు తేదీని ప్రభుత్వం నోటిఫై చేసింది. రూ.50 వేలు పైబడిన విలువ కలిగిన సరకులను రాష్ట్రాల మధ్య రవాణా చేయడానికి ఇ-వే బిల్లు తపనిసరిగా ఉండాలి.జిఎస్‌టిఆర్-3బిసమ్మరీ రిటర్న్‌ను జూన్ వరకు ఫైల్ చేయవచ్చని సెంట్రల్ ఎక్సైజ్ మరియు కస్టమ్స్ బోర్డు(సిబిఇసి) నోటిఫై చేసింది. ఒక మాసానికి జిఎస్‌టిఆర్-బిను తర్వాతి నెల 20వ తేదీనాటికి దాఖలు చేయాల్సి ఉంటుంది. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలో రాష్ట్రాల ఆర్థిక మంత్రులుగా కల జిఎస్టి మండలి ఈ నెల 10న సమావేశమైంది. ఇ-వే బిల్లు అమలు, 3బి ఫైలింగ్ సదుపాయం పొడగింపును నిర్ణయించింది. తొలిసారిగా ఫిబ్రవరి ఒకటవ తేదీన ఇ-వే బిల్లును ప్రవేశపెట్టినప్పుడు సిస్టమ్ కుప్పకూలిపోవడం లాంటి విపరిణామాలు చోటు చేసుకున్నాయి. రాష్ట్రాల మధ్య ఇ-వే బిల్లు ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి అమల్లోకి రానుంది. సరకుల ఇంట్రా- స్టేట్ రవాణా దశల వారీగా ఏప్రిల్ 15 నుంచి అమల్లోకి రానుంది. సరకుల రవాణా సమయంలో జిఎస్టీ ఇన్‌స్పెక్టర్ అడిగినప్పుడు ఇ-వే బిల్లును చూపించాల్సి ఉంటుంది. అక్రమ రవాణాకు అడ్డుకట్ట, నగదు ప్రాతిపదికగా జరుగుతున్న వాణిజ్యంపై ఉక్కు పాదం మోపి పన్ను వసూళ్ళ పెంపుదల లక్ష్యంగా ఇ-వే బిల్లు అమలు కానుంది. వచ్చే నెల ఒకటి నుంచి ఇది అమల్లోకి వస్తున్న దృష్ట్యా రూ.50 వేలు పైబడిన విలువతో కూడిన సరకులు రవాణా చేసేవారు ఇ-వే బిల్లును తప్పనిసరిగా కలిగి ఉండాలి. 3బి సమ్మరీ రిటర్న్ సరళీకృతం చేయడానికి అవసరమైన మార్గాలపై జిఎస్టీ మండలి చర్చించినప్పుడు రాష్ట్రాలు వేర్వేరు అభిప్రాయాలు వ్యక్తం చేశాయి. దాంతో ప్రస్తుత ఫైలింగ్ విధానాన్ని మరో మూడు నెలలు పొడిగించాలని మండలి నిర్ణయించింది. తదనుగుణంగా వ్యాపార వర్గాలు జిఎస్‌టి ఆర్-3బి సమ్మరీ విక్రయాల రిటర్న్‌లు, జిఎస్ టిఆర్-1 తుది విక్రయాల రిటర్న్‌లను జూన్ వరకు సమర్పిం చవచ్చు.


టీవీ విడి భాగాలపై సుంకం తగ్గింపు

న్యూఢిల్లీ: ఎల్‌సిడి, ఎల్ఇడి టెలివిజన్ ప్యానెల్స్ తయారీలో వినియోగించే ఒపెన్ సెల్‌పై కస్టమ్స్ సుంకాన్ని ప్రభుత్వం ఐదు శాతానికి తగ్గించింది. లిక్విడ్ క్రిస్టల్ డిస్‌ప్లే(ఎల్‌సిడి), లైట్ ఎమిటింగ్ డయోడ్(ఎల్ఇడి) టీవీ ప్యానెల్స్ తయారీలో వినియోగించే ఒపెన్ సెల్(15.6 అంగుళాలు, అంతకు మించి)పై కస్టమ్స్ సుంకం 5 శాతం ఉంటుందని కేంద్ర ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ బోర్డు(సిబిఇసి) ఒక నోటిఫికేషన్‌లో పేర్కొంది. ప్రభుత్వం ఇటీవలి బడ్జెట్‌లో ఒపెన్ సెల్‌పై కస్టమ్స్ సుంకాన్ని 7.5 శాతం నుంచి 15 శాతాని కి పెంచింది. అదే సుంకాన్ని 5 శాతానికి పరిమితం చేయడం భా రత్‌లో అలాంటి ప్యానెల్స్ తయారీకి ఊత మిస్తుందని డెలాయిట్ ఇండియా సీనియర్ డైరెక్టర్ ఎం.ఎస్.మణి తెలిపారు.



నీరవ్ ఇళ్లపై దాడి

- వాచీలు, అభరణాలు స్వాధీనం




ముంబయి/ఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ)లో జరిగిన రూ.13 వేల కోట్ల కుంభకోణంలో ప్రధాన నిందితుడు వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ ఇళ్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు మళ్లీ సోదాలు ప్రారంభించారు. ముంబయిలోని ఆయన సముద్ర మహల్ లగ్జరీ రెసిడెన్సియల్ ఫ్లాట్‌లో 22 నుంచి ఈడీ, సీబీఐ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తాజాగా జరిగిన సోదాలో భారీగా వజ్రాభరణాలు, ఖరీదైన వాచీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు ప్రముఖ చిత్రకారులు అమృతషేర్‌గిల్, ఎంఎఫ్ హుస్సేన్ గీసిన చిత్రాలను గుర్తించారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.26 కోట్లు ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. అవేకాకుండా రూ.15 కోట్ల విలువైన ఆభరణాలు, రూ.1.4 కోట్ల విలువైన వాచీలు ఉన్నాయి. ఒక వజ్రపుటుంగరం ధరే రూ.10 కోట్లు, రూ.7,638 కోట్ల విలువైన బంగారం, వజ్రాలు, ఖరీదైనరాళ్లు, ఈడీ, సీబీఐ అధికారులు స్వాధీనం చేసుకున్నవాటిలో ఉన్నాయి. కొన్ని ఆస్తులను అటాచ్ చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న నీరవ్ మోడీ, ఆయన వ్యాపార భాగస్వామి గీతాంజలి గ్రూప్ అధినేత మోహుల్ ఛోక్సీలపై మనీలాండరింగ్ కేసు కింద రెండు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశారు. ముంబయి ప్రత్యేకకోర్టు వారిపై నాన్‌బెయిలబుల్ అరెస్టు వారెంట్లను జారీ చేసింది. విదేశాల్లో తలదాచుకుంటున్న అతనని భారత తిరిగి రప్పించేందుకు అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. విచారణకు హాజరు కావాల్సిందిగా సీబీఐ అధికారులు పలుమార్లు ఈమెయిల్ ద్వారా సమన్లు పంపించినప్పటికీ అతడు హాజరు కావడంలేదు. పైగా తన పాస్‌పోర్టును రద్దు చేశారని, భద్రతా పరమైన కారణాలు, సీబీఐ చర్యల వల్లే తాను భారత్ రాలేకపోతున్నానని చెపుతున్నట్టు సమాచారం.అంతేకాకుండా, గత నెల సీబీఐ అధికారులు జరిపిన సోదాల్లో నీరవ్‌కు చెందిన అత్యంత ఖరీదైన 10 వేల రకాల విదేశీ చేతి గడియారాలను అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. వీటితోపాటు 21 ఆస్తులను అధికారులు జప్తు చేసినట్లు పేర్కొన్నారు.

కార్తీకి మరో ఊరట

- ఎయిర్‌సెల్ మాక్సిస్ కేసులో ముందస్తు బెయిల్

న్యూఢిల్లీ: ఎయిర్‌సెల్ మాక్సిస్ కేసులో కార్తీ చిదంబరానికి ముందస్తు బెయిలును ఢిల్లీ కోర్టు శనివారంనాడు మంజూరు చేసింది. అయితే, ఎప్పుడు సమన్లు పంపినా ఇన్వెస్టిగేటింగ్ అధికారి ముందు హాజరు కావాలని కార్తీని కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఏప్రిల్ 16కు వాయిదా వేసింది. కార్తీ పెట్టుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌పై శనివారంనాడు ఇరువర్గాల వాదనలను కోర్టు విన్నది. కార్తీకి ముందస్తు బెయిల్ ఇవ్వరాదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కోర్టు ముందు తన వాదన వినిపించింది. ఎయిర్‌సెల్ మాక్సిస్ కేసులో ఎఫ్ఐపీబీ క్లియరెన్స్ విషయంలో కార్తీ అవకతవకలకు పాల్పడ్డారన్న అభియోగాలు ఉన్నాయి. ఈ కేసులో తనను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ కోరుతూ కార్తీ కోర్టును ఆశ్రయించారు. ఈ వాదనతో ఈడీ విభేదిస్తూ, వేర్వేరు కోర్టులను వేర్వేరు దరఖాస్తులతో కార్తీ ఆశ్రయించినట్టు కోర్టు దృష్టికి తెచ్చింది. కార్తీ తరపున కపిల్ సిబాల్ తన వాదన వినిపిస్తూ, క్లియరెన్స్ ఇచ్చినది అప్పటి ఆర్థిక మంత్రి అయితే, కార్తీ ప్రమేయం ఏముంటుందని ప్రశ్నించారు. ఇరువైపు వాదనలు విన్న కోర్టు ఈ కేసులో కార్తీకి ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.





సేంద్రీయ ఉత్పత్తులకు సమగ్ర చట్టం

కోల్‌కతా: సేంద్రీయ ఆహార ఉత్పత్తుల కోసం ఒక సమగ్రమైన చట్టం తీసుకురావాలని భారతీయ ఆహార భద్రత, ప్రమాణాల అథారిటీ(ఎఫ్ఎస్ఎస్ఎఐ) విజ్ఞప్తి చేసింది. దేశంలో ఆహార భద్రత, నియంత్రణలను పరిగణనలోకి తీసుకునే ఒక స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థగా ఎఫ్ఎస్ఎస్ఎఐ వ్యవహరిస్తున్నది. సేంద్రీయ ఆహార ఉత్పత్తులకు సంబంధించి వ్యవసాయ మంత్రిత్వ శాఖ, ఎపెడా(అగ్రికల్చర్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ) వేర్వేరు మార్గదర్శకాలను కలిగి ఉన్నాయని ఎఫ్ఎస్ఎస్ఎఐ ఛైర్మన్ ఆశిష్ బహుగుణ తెలిపారు. దీనికి సంబంధించి ఏకైక చట్టం ఉండాలని తాము భావిస్తున్నట్టు చెప్పారు. సిఐఐ కార్యక్రమంలో పాల్గొనే నిమిత్తం శనివారం ఇక్కడకు వచ్చిన సందర్భంగా సేంద్రీయ ఆహార ఉత్పత్తులపై తాము ఇప్పటికే ఒక ముసాయిదా నియంత్రణ పత్రాన్ని రూపొందించినట్టు ఆశిష్ తెలిపారు.

సంబంధిత వర్గాల అభిప్రాయాలను కోరుతూ దానిని జన బాహుళ్యం ముందు ఉంచుతామని చెప్పా రు. నీటలో అర్సెనిక్ కాలుష్యం అధిక స్థాయిలో ఉన్నందున బొరొ రైస్ సాగు పట్ల బహుగుణ అప్రమత్తం చేశారు. బంగ్లాదేశ్ ఇప్పటికే బొరొ రైస్ సాగును తగ్గించిందని తెలిపారు.

నగదురహిత పంపిణీకి

టోన్ ట్యాగ్ రిటైల్ ప్యాడ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: పెద్దనోట్ల రద్దుకు ముందున్న స్థాయికి చేరుకున్నట్లుగా ఆర్‌బిఐ డేటా వెల్లడించడంతో టోన్‌ట్యాగ్ - సౌండ్ ఆధారిత సామీప్య కమ్యూనికేషన్, పేమెంట్ సర్వీసెస్ ప్రొవైడర్ తన ఉత్పత్తులతో డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తోంది. చిన్న, పెద్ద వ్యాపారులు లక్ష్యంగా 50వేల మందికిపైగా వ్యాపారులను నియమించి రిటైల్ వ్యవస్థను డిజిటల్‌గా మార్చేందుకు సహాయ పడుతోందని టోన్ ట్యాగ్ సీఈవో కుమార్ అభిషేక్ అన్నారు. రిటైల్ ఐప్యాడ్ పూర్తిగా అంతర్నిర్వహణ, సురక్షితమైన నగదురహిత విధానాన్ని అందిస్తుందన్నారు. దీనికి స్మార్ట్‌ఫోన్, యాప్, క్యూఆర్ కోడ్, ఇంటర్నెట్ అవసరం లేదని ఆయన చెప్పారు. ఎలాంటి కనెక్టివిటి అవసరం లేకుండా చెల్లింపులు ఆమోదించేందుకు వ్యాపారులకు ఒక అవకాశంగా ఉంటుందని అభిషేక్ అన్నారు. తన ఇతర ఉత్పత్తులతో కలిసి రిటైల్ ఐప్యాడ్, టోన్‌ట్యాగ్‌లు నిరంతర చెల్లింపుల వ్యవస్థను కస్టమర్లు, వ్యాపారులకు ఒకే మాదిరిగా కేటాయిస్తుందని ఆయన చెప్పారు.



హైదరాబాద్: మెర్సిడెస్-బెంజ్ మహవీర్ మోటార్స్ శనివారం నిర్వహించిన లగ్జరీ వీకెండ్ ఫెస్ట్‌లో మోడల్స్‌తో మహవీర్ మోటార్స్ డైరెక్టర్ వికాస్ జబక్

కామ్వాల్ట్ విస్తరణకు సరికొత్త ఆఫీసు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అమెరికాకు చెందిన కామ్వాల్ట్ ఐటి కంపెనీ తన కార్యకలాలను విస్తరించింది. ఎంటర్‌ప్రైజ్ బ్యాకప్, రికవరీ, ఆర్చీవ్, క్లౌడ్‌లో అంతర్జాతీయంగా పేరుగాంచిన ఈ సంస్థ విస్తరణలో భాగంగా నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. దేశంలో తమ సంస్థకు పెరుగుతున్న సేవలను సకాలంలో అందించేందుకు ఎక్కువ మంది సిబ్బందికి అనువుగా నూతన కార్యాలయాన్ని ప్రారంభించినట్లు ఈ సంస్థ ఇండియా అండ్ సాఫ్ట్ విజన్ వైస్ ప్రెసిడెంట్ రమేష్ మామ్‌గైన్ చెప్పారు. ఈ నూతన కార్యాలయం కామ్వాల్ట్ డవలప్‌మెంట్ సెంటర్‌కు ప్రధాన కేంద్రంగా ఉంటుందని, సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా సిబ్బందికి మెరుగైన సదుపాయాలు అందిస్తుందని ఆయన చెప్పారు. తమ కంపెనీ డాటా సంరక్షణ కోసం కేంద్రీకృత విధానాలను అనుసరించేందుకు ప్రయత్నిస్తున్న డాటా మేనేజ్‌మెంట్ ప్రొటెక్షన్ పరిష్కారాలకు భారీ అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు. తమ సిబ్బందికి ఈ నూతన కార్యాలయంలో నాణ్యమైన, సౌకర్యవంతమైన పని వాతావరణాన్ని అందించనుందని కామ్వాల్ట్ చీఫ్ హెచ్‌ఆర్‌డి ఆఫీసర్ జస్పర్ హెల్ట్ అన్నారు.

శ్రీయుత ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), తెలుగు గంగ ప్రాజెక్టు, నెల్లూరు వారి కార్యవర్తనములు

ప్రస్తుతం : పి.ప్రశాంతి, యం.ఏ.,

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

ఫారం నెం.VI (ఎ)

(2013వ సంవత్సరము 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1)ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఆర్పీ.డి1/102/2017 — తేది : 26.02.2018

ఈ దిగువ నుదహరించిన షెడ్యూల్ దాఖలా ఎ.49.46 సెంట్లు భూములకు నెల్లూరు జిల్లా డక్కిలి మండలము, ఆల్తూరు పాడు గ్రామం నందు ప్రజాహిత ఉపయోగార్థం అనగా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కెపాసిటీ ఆఫ్ 1.007 టిఎంసి వరకు భూమి కావలయునని శ్రీ ప్రత్యేక కలెక్టర్, తెలుగు గంగ ప్రాజెక్ట్, నెల్లూరు వారు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013 సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) నిబంధనలననుసరించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.

భూసేకరణ కొరకు సేకరింపబడిన భూములలో నిర్వాసితులు ఎవరు లేరు.

స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), తెలుగు గంగ ప్రాజెక్టు, యస్.పి.యస్.ఆర్. నెల్లూరు వారు పైన పేర్కొనిన చట్టంలో సెక్షన్/12 (3జి) క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించి ప్రత్యేక ఉపకలెక్టర్ (భూసేకరణ) తెలుగు గంగ ప్రాజెక్ట్, నెల్లూరు వారికి, వారి సిబ్బందికి మరియు పనివారలకు ఆ భూముల భూసేకరణకై పై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుండి శ్రీ ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ), తెలుగు గంగ ప్రాజెక్ట్, యస్.పి.యస్.ఆర్.నెల్లూరు / ప్రత్యేక ఉపకలెక్టర్ (భూసేకరణ), తెలుగు గంగ ప్రాజెక్ట్, నెల్లూరు వారి ముందస్తు అనుమతిలేనిదే ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏవిధమైన అమ్మకం/ కొనుగోలు (క్రయ విక్రయములు) లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/ వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురింపబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా శ్రీ ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ), తెలుగు గంగ ప్రాజెక్ట్, యస్.పి.యస్.ఆర్. నెల్లూరు, ప్రత్యేక ఉపకలెక్టర్ (భూసేకరణ), తెలుగు గంగ ప్రాజెక్ట్, నెల్లూరు వారి యెదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా : శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు — మండలం : డక్కిలి — గ్రామము : ఆల్తూరుపాడు

క్రమ సంఖ్య	సర్వే నెం.ఉ సబ్ డివిజన్ నెం.	మొత్తము విస్తీర్ణం ఎ.సెం	భూ సేకరణ క్రింద విస్తీర్ణం	తరగతి	సంబంధిత ఆసామి పేరు, చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు, కట్టడములు, పంట వివరములు
1	3-1	1.86	1.86	పట్టా మాగాణి	కటకం గంగయ్య తండ్రి వెంకటరమణయ్య	1	2	4	1	బీడు
2	3-2	0.31	0.31	పట్టా మాగాణి	ఎల్లోజి సుబ్బాచారి తండ్రి ముని ఆచారి	1	2	4	1	బీడు
	3-3	0.40	0.40							
	3-4	0.11	0.11							
	3-5	0.12	0.12							
	3-6	0.50	0.50							
	3-7	0.51	0.51							
	6-5	0.30	0.30			13	7	13 & 11	5	
			2.25							
3	3-8	0.24	0.24	పట్టా మాగాణి	వెలుగు ప్రభావతమ్మ భర్త కృష్ణయ్య	1	2	4	1	బీడు
	7-2	0.13	0.13			6 & 11	2	10	5	వరి
	6-3	0.50	0.50							వరి
	6-2	0.25	0.25			13	7	13 & 11	5	వరి, వేప-4
	12-1	0.14	0.14	పట్టా మెట్ట		18	10	18	11 & 13	వరి
	12-2	0.18	0.18							వరి
	13-1	0.18	0.18	పట్టా మాగాణి		16	11	18	6	వరి
	3-9	0.22	0.22							వరి
	3-11	0.24	0.24			1	2	4	1	బీడు
	3-12	0.22	0.22							బీడు
			2.30							
4	3-10	0.48	0.48	పట్టా మాగాణి	పంజం ఈశ్వరయ్య తండ్రి లేట్ రామయ్య	1	2	4	1	బీడు
5	4-1	0.14	0.14	పట్టా మాగాణి	చిలమనూరు సుబ్బారెడ్డి తండ్రి లేట్ వెంకటరెడ్డి	1	2	5	3	వరి బోరు-1
	4-2	0.17	0.17							
	4-3	0.47	0.47							
	4-4	0.33	0.33							
	4-5	0.25	0.25							
	4-6	0.33	0.33							
	4-7	0.11	0.11							
	4-8	0.15	0.15							
	4-13	0.33	0.33							
	4-17	0.80	0.80							
			3.08							
6	4-9	1.22	1.22	పట్టా మాగాణి	చిలమనూరు మల్లికార్జునరెడ్డి తండ్రి లేట్ వెంకటరెడ్డి	1	2	5	3	వరి
	4-10	0.13	0.13							
	4-14	0.21	0.21							
	4-15	0.21	0.21							
	4-18	0.50	0.50							
	5-1	0.75	0.75			4 & 6	2	6 & 7	4	
			3.02							
7	4-11	0.34	0.34	పట్టా మాగాణి	సంకురాతిరి మునెయ్య తండ్రి గోవిందు	1	2	5	3	వరి
	4-12	0.05	0.05							
	4-16	0.31	0.31							
	4-19	0.24	0.24							
			0.94							
8	4-16	0.31	0.31	పట్టా మాగాణి	సంకురాతిరి రమణయ్య తండ్రి మునెయ్య	1	2	5	3	వరి
	4-19	0.25	0.25							
			0.56							
9	5-1	1.07	1.07	పట్టా మాగాణి	నెలబల్లి నారాయణమ్మ భర్త పెదచెంచురెడ్డి	4 & 6	2	6 & 7	4	వరి
10	5-3	0.21	0.21	పట్టా మాగాణి	మన్నేపల్లి మునిక్రిష్ణమ్మ భర్త లేట్ రమణయ్య	4 & 6	2	6& 7	4	వరి
	7-1	0.34	0.34			6 & 11	2	10	5	
	7-8	0.08	0.08			6 & 11	2	10	5	
			0.63							
11	5-4	0.07	0.07	పట్టా మాగాణి	గోనుపల్లి నరసయ్య తండ్రి రోశయ్య	4 & 6	2	6 &7	4	వరి
	5-5	0.10	0.10							
			0.17							
12	5-6	0.05	0.05	పట్టా మాగాణి	శివరాత్రి సులోచనమ్మ భర్త లేట్ మునిక్రిష్ణయ్య	4 & 6	2	6& 7	4	వరి
	7-7	0.35	0.35			6& 11	2	10	5	
	8-7	0.25	0.25			7& 10	117	9	2	
	10-10	0.55	0.55			12	8& 9	23	7	
	117-5ఎ	0.06	0.06							
	117-5బి	0.10	0.10			8	1118	116&115	2	వరి
			1.36							
13	5-7	0.81	0.81	పట్టా మాగాణి	పింగాణి మునెమ్మ భర్త ఈశ్వర్ రెడ్డి	4& 6	2	6&7	4	వరి
14	6-1	0.36	0.36	పట్టా మాగాణి	పులి కృష్ణారెడ్డి తండ్రి వెంకటరెడ్డి	13	7	13 & 11	5	వరి
	11	1.15	1.15	ఇనాం మాగాణి		13	7	12	6	
			1.51							
15	6-1	0.2650	0.2650	పట్టా మాగాణి	పైగాల గురవయ్య తండ్రి లేట్ రమణయ్య	13	7	13 &11	5	వరి
	11	0.3750	0.3750	ఇనాం మాగాణి		13	7	12	6	
			0.64							
16	6-1	0.1150	0.1150	పట్టా మాగాణి	పైడిమంతుల మునెయ్య తండ్రి	13	7	13 & 11	5	వరి
17	6-2	0.61	0.61	పట్టా మాగాణి	గోనుపల్లి మునికుమార్ తండ్రి లేట్ నరసయ్య	13	7	13 & 11	5	వరి బోరు-1 మోటార్-1
18	7-3	0.20	0.20	పట్టా మాగాణి	గోనుపల్లి శ్రీనివాసులు తండ్రి నరసయ్య	6 & 11	2	10	5	వరి
	13-2	0.20	0.20			16	11	18	6	
	7-5	0.10	0.10			6 & 11	2	10	5	
	8-5	0.34	0.34			7 & 10	117	9	2	
			0.84							
19	7-4	0.50	0.50	పట్టా మాగాణి	కుర్రా మునెమ్మ భర్త పట్టాభిరామిరెడ్డి	6 & 11	2	10	5	వరి
	7-6	0.54	0.54							
			1.04							
20	7-7	0.17	0.17	పట్టా మాగాణి	ముద్దా వెంకటమ్మ భర్త ఈశ్వర్ రెడ్డి	6 &11	2	10	5	వరి
	8-7	0.30	0.30			7 & 10	117	9	2	
	10-10	0.32	0.32			12	8 &9	23	7	
			0.79							
21	7-7	0.17	0.17	పట్టా మాగాణి	ముద్దా శివశంకర్ రెడ్డి తండ్రి బక్కిరెడ్డి	6 & 11	2	10	5	వరి
	8-7	0.18	0.18			7 & 10	117	9	2	తాటిచెట్లు-11 వరి
	9-8	0.15	0.15			10	116	19	8	వరి
	10-10	0.28	0.28			12	8 & 9	23	7	
			0.78							
22	7-5	0.45	0.45	పట్టా మాగాణి	యాకసిరి సుకవేనమ్మ భర్త ఈశ్వర్‌రెడ్డి	6 & 11	2	10	5	వరి
	23-6ఎ	0.30	0.30			24 & 31	22	33	18	
			0.75							
	7-5	0.10	0.10			6 & 11	2	10	5	వరి
	13-7	0.53	0.53							
23	13-8	0.05	0.05	పట్టా మాగాణి	చిల్లకూరు రాఘవరెడ్డి తండ్రి లేట్ గున్నారెడ్డి	16	11	18	6	వరి బావి-1
	13-3	0.05	0.05							
	13-4	0.21	0.21							
	13-5	0.25	0.25							
	13-6	0.19	0.19							
	8-5	0.35	0.35			7 & 10	117	9	2	వరి
			1.73							
24	13-3	0.18	0.18	పట్టా మాగాణి	చిల్లకూరు గురవారెడ్డి తండ్రి లేట్ గున్నారెడ్డి	16	11	18	6	వరి
	13-7	0.27	0.27							
	13-5	0.62	0.62							వరి,బోరు-1
	13-8	0.22	0.22							వరి
			1.29							
25	8-1	0.29	0.29	పట్టా మాగాణి	కలవలపూడి సంపూర్ణమ్మ భర్త నాగరాజు	7 & 10	117	9	2	వరి జువ్వి-1 మర్రి-1 తాటిచెట్లు-5
	8-2	0.18	0.18							
			0.47							
26	7-5	0.40	0.40	పట్టా మాగాణి	కలవలపూడి సుబ్బరత్నమ్మ భర్త విశ్వనాథం	6 & 11	2	10	5	వరి
	8-2	0.32	0.32			7 & 10	117	9	2	జువ్వి-1
	8-3	0.14	0.14							మర్రి-1
	9-11ఎ	0.08	0.08			10	116	19	8	తాటిచెట్లు-5
			0.94							
27	8-4	1.33	1.33	పట్టా మాగాణి	పాదలకూరు రాజయ్య తండ్రి శేషయ్య	7 & 10	117	9	2	వరి
28	8-6	0.55	0.55	పట్టా మాగాణి	పాదులేటి జ్యోతమ్మ భర్త దశరథరామిరెడ్డి	7 & 10	117	9	2	వరి
	9-7	0.16	0.16							
	9-1	0.16	0.16			10	116	19	8	
	9-9ఎ	0.15	0.15							
	117-4	0.33	0.33			8	118	116 &115	2	
	122-3ఎ	0.04	0.04	పట్టా మెట్ట		120	137	123	119	బీడు
	122-7ఎ	0.02	0.02							
			1.41							
29	9-2	0.31	0.31	పట్టా మాగాణి	పాదులేటి దశరథరామిరెడ్డి తండ్రి వెంకటస్వామి రెడ్డి	10	116	19	8	వరి
	9-4ఎ	0.13	0.13							
	9-5	0.14	0.14							
	9-6ఎ	0.30	0.30							
	10-1	0.24	0.24	పట్టా మెట్ట		12	8&9	23	7	
			1.12							
30	6-14	0.06	0.06	పట్టా మాగాణి	రొంపిచర్ల రాజేశ్వరమ్మ భర్త సుబ్రహ్మణ్యం	13	7	13&11	5	వరి
	6-6	0.55	0.55							
	6-7	0.60	0.60							
			1.21							
31	10-5	0.46	0.23	పట్టా మెట్ట	గోన నాథముని రెడ్డి తండ్రి మునిరెడ్డి	12	8&9	23	7	వరి
			0.23		గోన బాలక్రిష్ణరెడ్డి తండ్రి మునిరెడ్డి					
			0.46							
32	10-8	0.13	0.13	పట్టా మెట్ట	జడపల్లి రమణయ్య తండ్రి గురవయ్య	12	8&9	23	7	వరి తాటిచెట్లు-6 కుంకుడు-2
	10-7	0.25	0.25							
	138-1ఎ	0.05	0.05	పట్టా మాగాణి		12	8&9	23	7	
						122	140	137	2	వరి
			0.43							
33	10-4	0.36	0.36	పట్టా మెట్ట	బత్తిన భాస్కర్ రెడ్డి తండ్రి మునిరెడ్డి	12	8&9	23	7	వరి తాడిచెట్లు-20 బావి-1
34	5-6	0.26	0.26	పట్టా మాగాణి	ముద్దా ఈశ్వర్‌రెడ్డి తండ్రి బక్కిరెడ్డి	4&6	2	6&7	4	వరి
35	24-4బి	0.49	0.49	పట్టా మాగాణి	గుంటకింద రమణమ్మ భర్త మునిక్రిష్ణరెడ్డి	25	18	31	17	వరి వేపచెట్టు-1 బోరు-1 మెటార్-1 బావి-1
36	10-9	0.42	0.42	పట్టా మాగాణి	కలవలపూడి విశ్వనాథం తండ్రి గున్నయ్య	12	8&9	23	7	వరి
	11	0.3050	0.3050			13	7	12	6	
	6-1	0.26	0.26			13	7	13&11	5	
	117-2	0.11	0.11			8	118	116& 115	2	
	117-3	0.17	0.17							
			1.2650							
37	10-2	0.14	0.07	పట్టా మెట్ట	సంక్రాంతి మునెయ్య తండ్రి గోవిందు	12	8&9	23	7	వరి
			0.07		సంక్రాంతి రమణయ్య తండ్రి పోలయ్య					
			0.14							
38	10-3	0.15	0.15	పట్టా మెట్ట	సంక్రాంతి జయచంద్ర తండ్రి గోవిందు	12	8&9	23	7	వరి తాటిచెట్లు-2
39	16-4బి	0.34	0.34	పట్టా మెట్ట	చెరుకూరు పోలయ్య తండ్రి మునెయ్య	1	18	24	16	వరి తాటిచెట్లు-11, వేపచెట్లు-2
40	15-5బి	0.62	0.62	పట్టా మాగాణి	పసుపులేటి మునిప్రసాద్ తండ్రి లేట్ మునిక్రిష్ణయ్య	1	14&18	17	15	వరి బోర్లు-3, వేప-1
41	23-1	0.57	0.57	పట్టా మెట్ట	పులి సుభాషిని భర్త చిన చెంచురెడ్డి	24&31	22	33	18	వరి, వేప-1
42	23-3ఎ	0.05	0.05	పట్టా మాగాణి	యాకసిరి అమరావతి భర్త రాజారెడ్డి	24&31	22	33	18	వరి
43	23-5ఎ	0.26	0.26	పట్టా మాగాణి	కనుపర్తి యానాది రెడ్డి తండ్రి మునిరెడ్డి	24&31	22	33	18	వరి
	23-7ఎ	0.24	0.24							
	23-8ఎ	019	0.19							
	23-9ఎ	0.11	0.11							
			0.80							
44	117-1	1.48	1.48	పట్టా మాగాణి	పాదలకూరు రాజయ్య తండ్రి శేషయ్య	8	118	116& 115	2	వరి
45	117-8ఎ	0.05	0.05	పట్టా మాగాణి	వెలుగోటి నీరజ భర్త వెంకటరమణయ్య	8	118	116& 115	2	వరి
46	118-1	0.08	0.08	పట్టా మాగాణి	కాసుల హేమలత భర్త వెంకటేశ్వర్లు	117	114	115& 114	2	వరి బోరు-1
	118-2ఎ	0.28	0.28	పట్టా మెట్ట						
	118-3ఎ	0.23	0.23							
	118-4ఎ	0.02	0.02							
	10-6	0.13	0.13			12	8&9	23	7	బోరు-1 వేప-4 మునగ-1
			0.74							
47	122-2ఎ	0.05	0.05	పట్టా మెట్ట	చెలికం రాజమ్మ భర్త పొట్టిరెడ్డి	120	137	123	119	వరి
48	138-1ఎ	0.32	0.27	పట్టా మాగాణి	తిరగబత్తిన రమణయ్య తండ్రి సిద్దయ్య	122	140	137	2	వరి
	138-2ఎ	0.01	0.01							
			0.28							
49	138-6ఎ	0.05	0.05	పట్టా మాగాణి	బత్తిన భాస్కర్‌రెడ్డి తండ్రి పెద్దమునిరెడ్డి	122	140	137	2	వరి
	139-1ఎ	0.21	0.21			138	174& 175	140& 141	2	
	139-2	0.19	0.19							
	140-1ఎ	0.10	0.10							
	140-2ఎ	0.02	0.02			138	141	143	139	
	139-3	0.17	0.17			138	174& 175	140& 141	2	బోరు-1 బావి-1
			0.74							
50	139-4ఎ	0.63	0.63	పట్టా మాగాణి	మన్నేపల్లి పెంచల నరసయ్య తండ్రి పెంచలయ్య	138	174& 175	140& 141	2	వరి
	16-3బి	1.95	0.47			1	14&18	17	15	
	139-5	0.29	0.29			138	174& 175	140& 141	2	వరి,బోరు-1
	139-6ఎ	0.20	0.20							వరి
			1.59							
51	139-7ఎ	0.16	0.16	పట్టా మాగాణి	మన్నేపల్లి మల్లేశ్వరి భర్త పెంచల నరసయ్య	138	174& 175	140& 141	2	వరి
52	174-1	0.06	0.06	ఇనాం మాగాణి	కలవకొల్లు చిన్నబ్బయ్య తండ్రి సుబ్బానాయుడు	139	172	173	175	వరి
53	175-1	1.32	0.66	పట్టా మాగాణి	కలవకొల్లు వీరరాఘవులు తండ్రి శేషమ నాయుడు	139	178	172	2	వరి
			0.66		కలవకొల్లు రమేష్ బాబు తండ్రి శేషమ నాయుడు					
			1.32							
54	175-2ఎ	1.46	0.37	పట్టా మాగాణి	వేముల వెంకటరామయ్య తండ్రి పాపయ్య	139	178	172	2	బీడు
			0.37		వేముల శ్రీనివాసులు తండ్రి పాపయ్య@ గండయ్య					
			0.72		ఏలేశ్వరం సరోజనమ్మ తండ్రి వేముల నారయ్య					
			1.46							
55	7-9	0.03	0.03	పట్టా మాగాణి	యాకసిరి రమణయ్య తండ్రి	6&11	2	10	5	వరి
56	7-10	0.03	0.03	పట్టా	కలవకొల్లు ధనుంజయ	6&11	2	10	5	వరి

(మిగతా 8 పేజీలో)

ఏపీఎస్ ఆర్టీసీని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

● ఎమ్మెల్సీలు వై.శ్రీనివాసరెడ్డి, కత్తి నరసింహారెడ్డి

అమరావతి, ఆంధ్రప్రభ : నష్టాల్లో ఉన్న ఆర్టీసీని ప్రభుత్వం స్వా ధీనం చేసుకోవాలని ఎమ్మెల్సీలు వై.శ్రీనివాసరెడ్డి, కత్తి నరసింహరెడ్డిలు డిమాండ్ చేశారు. శనివారం శాసన మండలి ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడుతూ ఇప్పటికే రూ.8,700 కోట్ల అప్పుల ఊబిలో ఆర్టీసీ ఉందని దీని నుంచి బయటపడేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ గతంలో రూ.8,700 కోట్ల అప్పుల్లో ఆర్టీసీ ఉన్న మాట వాస్తవ మేనని అయితే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తీసుకున్న చర్యలతో ప్రస్తు తం రూ.3 వేల కోట్ల నష్టాల్లో ఉందని తెలిపారు. ఆర్టీసీని ఆదుకునేందుకు గత ఏడా ది బడ్జెట్‌లో రూ.490 కోట్లు కేటాయించామని అదే విధంగా ఈ ఏడాది రూ.500 కోట్లు ఇచ్చినట్లు మంత్రి వివరించారు. అంతే కాకుండా పల్లె వెలుగు బస్సు కొను గోలు నిమిత్తం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించామని తెలిపారు. అయితే ఆర్టీసీ ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రతిపాదనలు ఏమి లేవని చెప్పారు.

అంతర్‌రాష్ట్ర బస్సు సర్వీసుల నిర్వహణకు త్వరలో ఎంవోయు ..

అంతర్‌రాష్ట్ర బస్సు సర్వీసులు నడిపేందుకు త్వరలో కర్ణాటక, తెలంగాణ ఆర్టీసీతో ఎంవోయులు చేసుకోనున్నట్లు రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మండలిలో సభ్యులు తిప్పే స్వామి తదితరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ ప్రస్తుతం ఎలాంటి ఒప్పందం లేకుండా సర్వీసులు నడుస్తున్నాయని, వీటిని క్రమబద్ధీకరించేందుకు ఆయా రాష్ట్రాలకు చెందిన ఆర్టీసీతో ఎంవోయులు చేసుకుంటామన్నారు. తెలంగాణ ఆర్టీసీతో కొన్ని సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించుకునేందుకు అధికార యంత్రాంగం చర్చలు జరుపుతుందని సభకు వివరించారు.

త్వరలో వీయంసీలో 51 గ్రామ పంచాయతీలో విలీనం ..

త్వరలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో 51 గ్రామ పంచాయితీలను చేయనున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. మండలిలో సభ్యుడు వైవిబి.రాజేంద్రప్రసాద్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ ప్రస్తుతం ఈ డ్రాఫ్ట్ రూపంలోనే ఉందని ఆగస్టు నాటికి విలీనం చేసే అవకాశాలున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ విలీనం చేస్తున్న పంచాయితీలకు సంబంధించి పన్నులు భారం ప్రజలపై అధికంగా పడే అవకాశం ఉందని పదేళ్ల పాటు గ్రామపంచాయితీలో ఏ విధంగా పన్ను ఉంటుందో అదే విధంగా వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పురపాలక శాఖ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పీఎఫ్ అంశంపై సభ్యులు కత్తి నరసింహారెడ్డి, విటపు బాలసుబ్రహ్మణ్యం తదితరులు మాట్లాడుతూ అనంతపురంలో రూ.36 లక్షల ఉపాధ్యాయుల పీఎఫ్ డబ్బులు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి ఉందని తక్షణమే వారు దాచుకున్న డబ్బును తిరిగి ఇప్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. పీఎఫ్ మొత్తాన్ని ట్రెజరీల నియంత్రణకు తీసుకురావాలని ప్రభుత్వానికి సూచించారు. దీనికి మంత్రి నారాయణ బదులిస్తూ ప్రకాశం జిల్లా చీరాలకు సంబంధించి రూ.30 లక్షలు పీఎఫ్ డబ్బును జమ చేశామని అనంతపురం అంశాన్ని కూడా పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి పీఎఫ్ మొత్తాన్ని ట్రెజరీల ద్వారా చెల్లించుకునే అవకాశాన్ని కల్పిస్తామని సభ్యులకు హామీ ఇచ్చారు.

ఈ ఏడాది చివరి నాటికి వెలిగొండ ప్రాజెక్టు ద్వారా నీటి విడుదల :

మంత్రి ఉమా మహేశ్వరరావు



ఈ ఏడాది చివరి నాటికి వెలిగొండ ప్రాజెక్టు మొదటి టన్నెల్ నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు ప్రకాశం జిల్లా ప్రజలకు నీటిని విడుదల చేసేందుకు అన్ని చర్యలను చేపట్టినట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు తెలిపారు. సభ్యులు కరణం బలరాం అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిస్తూ పోలవరం, హంద్రీనీవా ప్రాజెక్టులకు ఎలాంటి ప్రాధాన్యత ప్రభుత్వం ఇస్తుందో అదే విధంగా వెలిగొండ ప్రాజెక్టుకు ఇస్తున్నామని చెప్పారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ ప్రాజెక్టు పనులను స్వయంగా పరిశీలించనున్నారని సభకు వివరించారు. ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టుకు 4,583.5 కోట్లు వెచ్చించామని ఇంకా 2,401.3కోట్లు అవసరమౌతుందని తెలిపారు. నిర్మాణ పనుల్లో ఎక్కడా జాప్యం జరగడం లేదని చెప్పారు. భూసేకరణ కూడా దాదాపు పూర్తయ్యిందని మిగిలి ఉన్న దానిని త్వరలోనే పూర్తి చేసి నిర్వాసితులకు పరిహారం అందించే విధంగా చర్యలు చేపడతామన్నారు.

టీటీడీ ద్వారా 73 దేవాలయాల నవనీకరణ ..

గత ఏడాది జూలై నుంచి ఇప్పటి వరకు టిటిడి ద్వారా 73 ఆలయాలను నవనీకరణ చేశామని ఇంకా మరో 13 ఆలయాల పనులు పురోగతిలో ఉన్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. సభ్యుడు పప్పల చలపతిరావు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ వైష్ణవ ఆలయాల నిర్మాణానికి టిటిడి ఆర్థిక సాయం అందిస్తుందని చెప్పారు. ఉత్తరాంధ్ర, రాయలసీమలో 10 శాతం మిగిలిన జిల్లాల్లో 20 శాతం వ్యయాన్ని భరిస్తే టిటిడి మిగిలిన మొత్తాన్ని ఆర్థిక సాయంగా అందించేందుకు ముందుకు వచ్చిందని చెప్పారు. ఏడాది లోగా ఒంటిమిట్ట ఆలయాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు.

పటిష్ట తాగునీటి వ్యవస్థతో సంపూర్ణ ఆరోగ్యం

గ్రామీణ నీటి సరఫరాపై చర్చల్లో మండలి సభ్యులు

పటిష్టమైన తాగునీటి వ్యవస్థ, పారిశుధ్య నిర్వహణతోనే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తారని మండలి సభ్యులు ముక్తకంఠంతో పేర్కొన్నారు. శనివారం మండలి ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో గ్రామీణ త్రాగునీటి సరఫరాపై సుదీర్ఘ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా టీడీపీ ఎమ్మెల్సీ పి.శమంతకమణి మాట్లాడుతూ యువ మంత్రి నారా లోకేష్ తరచుగా గ్రామీణ నీటి సరఫరాపై చేపడుతున్న వీడియో కాన్ఫరెన్సులకు అధికారులతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులను పిలిచినప్పుడే సమస్యలకు తక్షణ పరిష్కారం లభిస్తుందన్నారు. టీడీపీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు మాట్లాడుతూ నాన్న రాజకీయాల్లో, మామ సినీ రంగంలో మకుటంలేని మహరాజులని, వారి వారసత్వాన్ని, కష్టించేతత్వాన్ని మంత్రి లోకేష్ కొనసాగిస్తూ పట్టణాలకు ధీటుగా గ్రామాలను తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. టీడీపీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీశ్వరరావు మాట్లాడుతూ అమెరికాలో 99 శాతం, భారత్‌లో 52 శాతం, ఏపీలో 72 శాతం స్వచ్ఛమైన త్రాగునీటిని ప్రజలకు ప్రభుత్వాలు అందించడం జరుగుతోందని, మంత్రి లోకేష్ నేతృత్వంలో పటిష్టమైన తాగునీటి వ్యవస్థకు చర్యలు చేపట్టిన తరహాలోనే పారిశుధ్య నిర్వహణకు కూడా ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ గాలి, నీరు, ఆహారంపై ప్రజారోగ్యం ఆధారపడి ఉంటుందని, ప్రభుత్వ విద్యాసంస్థలు, ఆరోగ్య కేంద్రాల్లో ఆర్‌ఓ ప్లాంట్స్‌ను ఏర్పాటు చేయడంతోపాటు ప్రకృతి వనరులను, డెల్టా ప్రాంతాన్ని సంరక్షించుకునే చర్యలు ప్రభుత్వం చేపట్టాలని సూచించారు.

ఒక్క ఫోన్ కాల్‌తో 24 గంటల్లో సమస్య పరిష్కారం..

తాత, తండ్రుల నుంచి ప్రజాసేవను, కష్టపడేతత్వాన్ని అలవరుచుకున్న యువ మంత్రి నారా లోకేష్ గ్రామాల్లో తాగునీటి సమస్యలపై ఒక్క ఫోన్‌కాల్ కొడితే 24 గంటల్లోగా పరిష్కరించేలా టెక్నాలజీని, పటిష్టమైన అధికార వ్యవస్థను ఏర్పాటు చేయడం అద్భుతమైన విషయమని టీడీపీ ఎమ్మెల్సీ వట్టికూటి వీర వెంకన్న చౌదరి ప్రశంసించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా విలేజ్ వాటర్ బడ్జెట్‌ను ఏర్పాటు చేయడంతోపాటు ఉపాధి హామీ పథకం నిధులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ 2019 నాటికి ప్రతి ఇంటికి కుళాయి సౌకర్యం కల్పించేందుకు లోకేష్ కృషి ఆదర్శనీయమన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక వర్షపాతం భారత్‌లో ఉంటుందని, కానీ అందులో 90 శాతం వృధాగా సముద్రంలో కలిసిపోతుందంటూ రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న ఆదర్శవంతమైన జలసంరక్షణ చర్యలతో పాటు సింగపూర్ తరహా ప్రతి వర్షపుబొట్టుని వడిసిపట్టుకునే పటిష్టవ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. టీడీపీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యువ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని మంత్రిత్వ శాఖలకు నిన్నటి వరకు అవార్డులు, రివార్డులు ఇచ్చిన నోర్లు నేడు ఆయనపై అవినీతి బురద జల్లే ప్రయత్నాలు చేస్తుండటం వారి అధికారకాంక్ష, రాజకీయ కుట్రలకు నిదర్శనమన్నారు.

దూకుడు పెంచుదాం

● అప్రమత్తంగా వుందాం ● జనంతో మమేకమవుదాం ● 'నా రాజకీయ జీవితంలో ఇలాంటి దుర్మార్గాన్ని చూడలేదు' ● ముఖ్యనేతల భేటీలో చంద్రబాబు



అమరావతి, ఆంధ్రప్రభ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై దూకుడు పెంచే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు కసరత్తు ప్రారంభించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా రాసిన లేఖతో మండిపడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, తాజా పరిణామాల నేపథ్యంలో శనివారం అందుబాటులో వున్న నేతలతో అసెంబ్లీలోని తన చాంబర్‌లో మంతనాలు జరిపారు. తీవ్రస్థాయిలో అమిత్‌షా తీరుపై మండిపడ్డ ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా హస్తిన వైఖరి వుందంటూ నిందించినట్టు సమాచారం. కుట్రపూరితంగా కేంద్రం వ్యవహరిస్తుందని తాము ఊహించలేదని మంత్రులు, ముఖ్య నేతలతో పేర్కొన్న ముఖ్యమంత్రి, కాంగ్రెస్‌కు పట్టిన గతే బీజేపీకి పడుతుందని వ్యాఖ్యానించినట్టు తెలిసింది. టీడీపీని బలహీనపర్చడమంటే ప్రత్యక్షంగా ఏపీ ప్రజలను కించపరచడమే అవుతుందని పేర్కొన్నారు. అమిత్‌షా రాసిన తొమ్మిది పేజీల లేఖను లోతుగా విశ్లేషించిన సీఎం ప్రజా క్షేత్రంలో కేంద్రం ఎత్తుగడలను తిప్పికొట్టాలని, మిత్రపక్ష ధర్మాన్ని విస్మరించిన బీజేపీ కుయుక్తులను ప్రజలకు వివరించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. తప్పుడు లెక్కలతో మరింతగా రాష్ట్ర ప్రజలను బీజేపీ మభ్యపెడుతుంటే ప్రతిపక్షాలు వంత పాడటం స్వార్థపర రాజకీయాలకు ప్రబల నిదర్శనమని పేర్కొన్న చంద్రబాబునాయుడు, బీజేపీ విధానాలను ఎండగట్టే విధంగా కార్యాచరణను సిద్ధం చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. తన నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో బిజెపి లాంటి ద్వంద ప్రమాణాలు కలిగిన పార్టీని చూడలేదని పేర్కొన్న ముఖ్యమంత్రి వచ్చే సాధారణ ఎన్నికలను స్పష్టమైన అజెండాతో ఎదుర్కోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన అమిత్‌షా పేర్కొన్న పలు అంశాలను నేతలతో చర్చించారు. అన్నీ అబద్దాలు, కట్టుకథలు అని అమిత్‌షా లేఖను అభివర్ణించారు. ప్రత్యేకహోదాపై మాట తప్పారని, లేఖలో ఇందుకు సంబంధించి స్పష్టత కూడా ఇవ్వలేదని పేర్కొన్న ఆయన రైల్వే జోన్ వ్యవహారం నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా ఇంకా పరిశీలన దశలో ఎలా వుంటుందని ప్రశ్నించారు. అదే విధంగా రాష్ట్ర విభజన చట్టంలోని 19 అంశాలను కూడా మరోసారి ప్రధానంగా ప్రస్తావించిన చంద్రబాబునాయుడు ఎన్డీయే నుంచి, కేంద్ర మంత్రివర్గం నుంచి తెలుగుదేశం పార్టీ బయటకు రావడం ద్వారా రాష్ట్ర ప్రజల పక్షాన నిలిచినట్టయిందని తెలిపారు. వచ్చే ఎన్నికలలో విజయానికి ఇది మంచి సంకేతమని చెప్పారు. ప్రధానమంత్రిగా వాజ్‌పేయి వున్నప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో గౌరవం ఇచ్చారని, ఫలితంగా అదే స్థాయిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కూడా లెక్కకు మిక్కిలి చేపట్టామని తెలిపారు. అయితే ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో పాటు బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాలు కష్టాలలో వున్న ఆంధ్రప్రదేశ్ కు చెందిన తెలుగు ప్రజలపై కక్ష గట్టారని ముఖ్యమంత్రి ఆరోపించారు. ఇలాంటి కుటిల రాజకీయాలు తాను చూడలేదని, తనది ఎవరికీ భయపడే నైజం కాదని తెలిపారు. ఒకవైపు ఇది తెలుగుదేశంకు పరీక్షా సమయమని అంటూనే, రాజకీయ సవాళ్ళు టీడీపీకి కొత్త కాదని, బీజేపీ లేకపోయినా పార్టీకి నష్టమంటూ ఏమీ లేదని ఆయన స్పష్టం చేశారు.

లేఖపై తర్జనభర్జన

కాగా బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా వున్న అమిత్ షా ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాసిన లేఖకు ప్రత్యుత్తరమివ్వాలా? లేదా అనే అంశమై కూడా నేతల మధ్య చర్చ జరిగింది. ముఖ్యమంత్రి మాత్రం ఈ విషయమై స్పష్టతను ఇవ్వకపోయినప్పటికీ, కుట్రపూరితంగా, రాష్ట్ర ప్రజలను అవహేళన చేసేవిధంగా రాసిన లేఖను పట్టించుకోవాల్సిన అవసరం లేదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే అసెంబ్లీలో చేసిన ప్రసంగాన్నే అమిత్‌షాకు సమాధానంగా పరిగణించాల్సి వుంటుందనే సంకేతాలను ముఖ్యమంత్రి ఇచ్చారు. బిజెపి నేతలు ఇందుకు సంబంధించి చొరవ తీసుకోవాలని, ప్రత్యేక హోదాతో పాటు రాష్ట్ర సమస్యల సాధనకు ఏ.పి నేతలు కూడా కృషిచేయాలని కోరారు. అమిత్‌షా లేఖపై అసెంబ్లీ వేదికగా ఇచ్చిన సమాధానానికి లభించే స్పందనను బట్టి తదుపరి కార్యాచరణను అమలు చేయాలనే నిర్ణయానికి చంద్రబాబుతో పాటు మంత్రులు, ముఖ్యనేతలు వచ్చినట్టు తెలిసింది.

మూడు పార్టీలు ఏకమైనా టీడీపీకే లబ్ధి

కాగా మూడు పార్టీలు ఎన్నికలలో ఏకమైనప్పటికీ తెలుగుదేశంకే విజయావకాశాలు సుస్పష్టమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభిప్రాయపడినట్టు తెలిసింది. పార్టీ నాయకులకు తాజా పరిణామాలను వివరిస్తూనే భయపడేది లేదంటూ ధైర్యం చెప్పిన ముఖ్యమంత్రి నిర్మాణాత్మకంగా, వ్యూహాత్మకంగా ముందుకు వెళ్ళాలని, కేడర్‌సైతం అప్రమత్తంగా వుండాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ఈ భేటీలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, డాక్టర్ పొంగూరు నారాయణ, నారా లోకేష్, శిద్దా రాఘవరావు, అచ్చెన్నాయుడు, చీఫ్ విప్ పల్లె రఘునాథరెడ్డి, విప్‌లు కూన రవికుమార్, మేడా మల్లిఖార్జున్ రెడ్డి, ఎమ్మెల్సీ వి.వి.వి.చౌదరి, టి.డి.జనార్దన్ రావు తదితరులు పాల్గొన్నారు.

లెక్కడిగితే డొంక తిరుగుడా?



● అడిగిన దానికి జవాబు లేదు ● బహిరంగ చర్చకు రావాలని సవాల్ ● మండిపడ్డ బీజేపీ నేత జీవీఎల్ నరసింహారావు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్నది ఆపరేషన్ 'ద్రవిడ' కాదు, 'గరుడ' అంతకంటే కాదు, కానీ జరిగేది ఆపరేషన్ 'దడ' అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు అన్నారు. దీనర్థం బీజేపీ ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడ విస్తరిస్తుందోనన్న ఆందోళన తెలుగుదేశం పార్టీలో ఉండడమేనని సూత్రీకరించారు. తెలుగుదేశం నేతలకు బీజేపీ విస్తరిస్తున్న తీరు చూసి దడ పట్టుకుందని ఎద్దేవా చేశారు. అందుకే ఈ అభూత కల్పనల ఆపరేషన్లను తెరపైకి తెచ్చారని విమర్శించారు. శనివారం ఢిల్లీలోని బీజేపీ నూతన ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా రాసిన లేఖపై స్పందించిన తీరును తప్పుబట్టారు. లేఖలో ప్రస్తావించిన అంశాలకు, ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పకుండా ఎదురుదాడికి దిగుతున్నారని ఆరోపించారు. ఇలా బురదజల్లుకుంటూ పోవడం మినహా చెప్పడానికి తెలుగుదేశం పార్టీ దగ్గర సమాధానాలు లేవని ఎద్దేవా చేశారు. తమ వైఫల్యాలను, తప్పిదాలను కప్పిపుచ్చుకోడానికే తెలుగుదేశం పార్టీ బీజేపీ మీద బురదజల్లుతోందని విరుచుకుపడ్డారు. అమిత్ షా లేఖలోని అంశాలను విశదీకరిస్తూ.. జరిగిన పనులన్నీ తమవల్లనేని, జరగని పనులకు మాత్రం కేంద్రానిదే బాధ్యత అంటూ తెలుగుదేశం పార్టీ జిత్తులు ప్రదర్శిస్తోందని విమర్శించారు. కేవలం విభజన చట్టంలో ఉన్నవే కాదు, ఆ చట్టంలో లేని ఎన్నో ప్రాజెక్టులను కూడా కేంద్రం మంజూరు చేసిందని జీవీఎల్ తెలిపారు. చట్టంలో పొందుపరిచిన మౌలిక వసతుల ప్రాజెక్టుల విషయంలో కూడా సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని మాత్రమే ఉందని గుర్తుచేశారు. సాధ్యపడని పక్షంలో ఆ ప్రాజెక్టు కుదరదు అని చెప్పే అవకాశం కేంద్ర ప్రభుత్వం దగ్గర ఉన్నప్పటికీ, తాము అలా చెప్పలేదని అన్నారు.

ప్రత్యేక హోదా గురించి మాట్లాడుతూ ఈ అంశాన్ని అన్ని పార్టీలూ రాజకీయంగా వాడుకుంటున్నాయి తప్ప ఎవరికీ దీని గురించి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. నిజానికి రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని పట్టుబట్టిందే తమ పార్టీయేని ఆయన గుర్తుచేశారు. ఆనాడు తెలుగుదేశం పార్టీకి ఉభయ సభల్లో సంఖ్యాబలం లేదని, పైగా ఆ సమయంలో టీడీపీ ఎంపీలు సభలోనే లేరని వ్యాఖ్యానించారు. తాము గట్టిగా పట్టుబట్టినందుకే నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ సభలో హామీ ఇచ్చారని జీవీఎల్ నరసింహారావు అన్నారు. ఆ తర్వాత 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు హోదా ఇవ్వలేకపోయినా, అందుకు సమానమైన ప్రయోజనాలను కల్పించే ప్యాకేజీ రూపొందించినట్టు ఆయన వెల్లడించారు. ఈ ప్యాకేజి నిధులు విడుదల చేసే విషయంలో జాప్యం రాష్ట్ర ప్రభుత్వానిదే తప్ప తమది కాదని ఆరోపించారు. ఈసారి ఎలాగూ అధికారంలోకి వచ్చే అవకాశం లేదని గ్రహించి తెలుగుదేశం పార్టీ తమపై అపవాదులు వేస్తోందని అన్నారు. రాజకీయ దురుద్దేశాలు, దుర్బుద్ధితోనే తెలుగుదేశం ఎన్డీయే కూటమి నుంచి వైదొలగి నిందలు వేస్తోందని ఆరోపించారు.

మరోవైపు రెవెన్యూ లోటు గురించి మాట్లాడుతూ, ఈశాన్య రాష్ట్రాలతో పాటు రెవెన్యూ లోటు పొందుతున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశేనని జీవీఎల్ నరసింహారావు వ్యాఖ్యానించారు. ఐదేళ్లకు రూ. 22 వేల కోట్లుగా లెక్కగడితే, తొలి ఏడాదికే రూ. 16వేల కోట్లు కావాలని రాష్ట్ర ప్రభుత్వం అడుగుతోందని అన్నారు. తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో పెట్టుకున్న రుణమాఫీ పథకానికి అయ్యే ఖర్చును కూడా ఇందులో కలిపేశారని జీవీఎల్ అన్నారు. తమ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనూ రుణమాఫీ అమలు చేసినా, ఎక్కడా కేంద్రం నుంచి నిధులు తీసుకోలేదని, కేవలం రాష్ట్ర ఖజానా నుంచి మాత్రమే ఆ ఖర్చు భరించామని చెప్పుకొచ్చారు.

ఇక వెనుకబడ్డ ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ఇచ్చిన నిధుల్లో 88శాతం నిధులు ఖర్చే చేయలేదని, రాజధానికి ఇచ్చిన నిధుల్లోనూ కేవలం 8శాతం మాత్రమే ఖర్చు చేశారని చెప్పారు. ఇచ్చిన నిధులకు లెక్కలడిగితే చెప్పడం లేదని, అడిగితే మేమెందుకు చెప్పాలని ఎదురు ప్రశ్నిస్తున్నారని జీవీఎల్ అన్నారు. లెక్కలు చెప్పాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సమానంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు అడిగేది ఎక్కువ, చేసేది తక్కువ అని జీవీఎల్ వ్యాఖ్యానించారు.

తెలుగుదేశం పార్టీ నిజాల నుంచి తప్పించుకుని పారిపోతోందని జీవీఎల్ నరసింహారావు విమర్శించారు. తాను చెప్పిన మాటల్లోగానీ, తమ పార్టీ అధినేత అమిత్‌షా రాసిన లేఖలోగానీ ఎక్కడైనా అవాస్తవం ఉంటే చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబువన్నీ డైలాగ్‌బాజీ రాజకీయాలని, తాము అంకెలతో మాట్లాడుతున్నామని నరసింహారావు అన్నారు. తాము చెప్పే గణాంకాలపై చర్చించేందుకు సిద్ధమని, బహిరంగ చర్చకు తెలుగుదేశం నేతలు సిద్ధమా అని సవాల్ విసిరారు.

సాగునీరు అందించడంలో కేసీఆర్‌కు ఉన్న దమ్ము చంద్రబాబుకు ఏది?

● అవినీతి రాజ్యంలో అడుగడుగునా లంచాలే ● నరసరావుపేట ప్రజాసంకల్ప యాత్రలో చంద్రబాబుపై జగన్ విమర్శ



నరసరావుపేట, ప్రభ న్యూస్: సాగునీరు అందించడంలో తెలంగాణా ముఖ్యమంత్రి కేసీఆర్‌కున్న దమ్ము ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేదని ప్రతిపక్షనేత, వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రజా సంకల్పయాత్ర 119వ రోజు నరసరావుపేటకు శనివారం చేరుకున్న సందర్భంగా సాయంత్రం పల్నాడు రోడ్డులో జరిగిన బహిరంగసభలో ఆయన కార్యకర్తలు, అభిమానులనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి దారుణంగా ఉన్నప్పటికీ ఈ ప్రభుత్వం ఏ మాత్రం ఆదుకోలేక పోతుందన్నారు. గత నాలుగేళ్ళుగా సాగునీరు అందక రైతులు పంట పండించలేకపోతున్నారని, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక, ఉత్పత్తులను కొనుగోలు చేయడంలో కూడా రాజకీయ వివక్షత ప్రదర్శించడంతో రైతులు నానా కష్టాలు అనుభవిస్తున్నారని అన్నారు. కుడికాల్వ ద్వారా నీరు అందించకపోవడంతో వ్యవసాయ రంగం దారుణంగా దెబ్బతిన్నదని, అదే సమయంలో తెలంగాణాలో ఎడమకాల్వ ద్వారా కేసీఆర్ నీరు అందించి పంటలను కాపాడారన్నారు. కేసీఆర్‌కు ఉన్న దమ్ము చంద్రబాబుకు లేదేమిటని జగన్ ప్రశ్నించారు. యార్డుల్లో పంట ఉత్పత్తులను తీసుకెళ్ళిన రైతులను ఏ పార్టీవారో అడిగి కొనుగోలు చేస్తున్నారని, అధికార పార్టీ వారి దగ్గరే కొనుగోలు చేయడం అన్యాయమన్నారు. రుణమాఫీ పేరుతో రైతులను, డ్వాక్రా మహిళలను చంద్రబాబు మోసం చేశారని జగన్ ఆరోపించారు. ప్రత్యేకప్యాకేజీ పేరుతో ప్రత్యేక హోదాను తాకట్టుపెట్టి తెలుగు వారి ఆత్మగౌరవాన్ని దెబ్బ తీశారని విమర్శించారు. ఓటుకు నోటు కేసు వల్లనే చంద్రబాబునాయుడు సాగర్ ఆయ కట్టుకు నీరు ఇవ్వడం లేదని చెప్పారు. పంటలకు గిట్టుబాటు ధర చెల్లించాలంటూ ప్రతిపక్షనేతగా తాను వచ్చి నిరాహార దీక్ష చేస్తే తప్పించి ఈ ప్రభుత్వంలో చలనం లేదన్నారు. నరసరావుపేటలో అడుగుపెడుతూనే రైతులు తనను కలసి సమస్యలపై ఏకరవు పెట్టారని, గత నాలుగేళ్ళుగా పంటలు లేవని ఆవేదన వెలిబుచ్చారని అన్నారు.

చంద్రబాబు ప్రభుత్వ అవినీతిపై పిట్టకథ

చంద్రబాబు పాలనలో అనగనగా ఒక దొంగ. ఒకసారి దొంగతనం చేస్తూ పట్టుబడ్డ దొంగ తనను అరెస్టు చేస్తే ఊరిని, ఊరి ప్రజలను అవమానపర్చినట్లేనని అన్నట్టుగానే చంద్రబాబు వ్యవహారం కూడా ఉందని చిన్న పిట్టకథ రూపంలో వివరించారు. తాను బలహీన పడితే రాష్ట్రం బలహీన పడుతుందని చంద్రబాబు చెబుతున్నారని, ఆయనను తప్పులు చేయమని ఎవరూ చెప్పలేద న్నారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టమని, అవినీతి సొమ్ముతో ఎమ్మెల్యేలను కొనమని ఏ ప్రజలు చెప్పారని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టులో కమీషన్లు తీసుకోమని, ఇసుక, మట్టి, కరెంటు, మద్యం, ఆలయ భూముల వరకు దోచుకోమని ఎవరు చెప్పారని నిలదీశారు. ఇలాంటి పాలన సాగిస్తున్న ప్రభుత్వాన్ని క్షమించరాదని, ఒకవేళ క్షమిస్తే మళ్ళీ ఎన్నికల్లో మరిన్ని అబద్ధాలు చెబుతారని హెచ్చరించారు. ప్రతి ఇంటికి కిలో బంగారం, బోనస్‌గా వెండి కారు ఇస్తామని చెబుతారని, అయితే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. చంద్రబాబు ఇంటికి డబ్బులు పంపిస్తే తీసుకోమని, ఆ డబ్బు ప్రజలవద్దనుండి దోచుకున్నదేనని అన్నారు. అయితే ఓటు మాత్రం మనస్సాక్షి ప్రకారం వేయమన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చని నాయకులు రాజీనామా చేసి వెళ్ళే బాధ్యత ప్రజలదేనన్నారు. చెడిపోయిన రాజకీయ వ్యవస్థను మార్చేందుకు అందరం కృషిచేద్దామన్నారు. నవరత్నాల పథకాల ద్వారా ప్రజలకు మేలు చేయడానికి శతథా కృషిచేస్తానని జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు.

నరసరావుపేటలో జియస్‌టితో పాటు కెయస్‌టి

దేశవ్యాప్తంగా చెల్లించే జియస్‌టితో పాటు నరసరావుపేటలో కెయస్‌టి (కోడెల సర్వీస్ టాక్స్) చెల్లించాల్సిన పరిస్థితి ఇక్కడ నెలకొన్నదన్నారు. ఈ సందర్భంగా జగన్ స్పీకర్ కోడెల కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు చేశారు. రైల్వే కాంట్రాక్టర్లనుండి రైతుల వరకు, విద్యుత్ నుండి కోటప్పకొండ కాంట్రాక్టర్లవరకు ఇలా అన్నింటిపై కెయస్‌టి విధిస్తున్నారని కోడెల కుమారునిపై ఆరోపణలు చేశారు. ఎక్కడ చూసినా రాష్ట్రంలో లంచాలతోనే పరిపాలన నడుస్తుందని, అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తూ చంద్రబాబు దొంగాట ఆడుతున్నారని అన్నారు. ఈ సభలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సత్తెనపల్లి, గురజాల, వినుకొండ, చిలకలూరిపేట నియోజకవర్గాల పార్టీ ఇన్‌ఛార్జీలు అంబటి రాంబాబు, కాసు మహేష్‌రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, మర్రి రాజశేఖర్, జంగా కృష్ణమూర్తి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

'వెలిగొండ ప్రాజెక్టులో అవినీతికి తెరలేపింది సర్కారే'

అమరావతి, ఆంధ్రప్రభ: ప్రకాశం జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్టుకు అంచనాలు పెంచి ప్రభుత్వం వందల కోట్ల రూపాయల అవినీతికి తెరలేపిందని వైసీపీ శాసనసభ్యుడు ఆదిమూలపు సురేష్ ఆరోపించారు. విజయవాడలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్టర్‌లను ఎక్కడ పనులు అక్కడ ఆపివేసి యంత్రసామాగ్రిని వదిలివేసి వెళ్లాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. వాస్తవంగా రూ.416 కోట్లకు పూర్తి చేయాల్సిన పనులను అంచనాలు పెంచి రూ. 1,012 కోట్లకు పెంచుతూ జీవో నెంబరు 21 ను ఈనెల 22న జారీ చేశారని జీవో కాపీని సైతం మీడియాకు ప్రదర్శించారు. ఇదంగా తమకు కమీషన్లు, ముడుపులు ఇచ్చే నూతన కాంట్రాక్టర్లకు ప్రాజెక్టు వర్క్సును లమ్‌సమ్‌గా కట్టబెట్టేందుకు వేసిన ఎత్తుగడగా సురేష్ అభివర్ణించారు. వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి ప్రస్తుతం టన్నెల్ - 1, 2 పనులు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో పట్టిసీమ, పోలవరం వంటి ప్రాజెక్టులలో సాగుతున్న అవినీతి లాగానే వెలిగొండ ప్రాజెక్టును కూడా దోపిడీకి మార్గంగా ఎంచుకున్నారని తెలిపారు. అంచనాల పెంపుతో నూతన కాంట్రాక్టర్లకు ప్రభుత్వం మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆ అడ్వాన్స్‌ల లోనుంచి వందల కోట్ల రూపాయలు దోచుకునేందుకు ఈ పథకానికి రూపకల్పన జరిగిందని తెలియజేశారు.

బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు భయపడేది లేదు

అమరావతి,ఆంధ్రప్రభ; బీజేపీ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు భయపడి చేతులు ముడుచుకు కూర్చునే స్థితిలో ఆంధ్రులు లేరనే విషయాన్ని గమనించాలని భారతీయ జనతా పార్టీ ఆధ్యక్షుడు అమిత్‌షాకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ బహిరంగ లేఖ రాశారు. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామిక వ్యవస్థగా పేరుగాంచిన భారతదేశంలో సాక్షాత్తూ పార్లమెంటులో చెప్పిన అంశాల అమలుకు నోచుకోకపోవడం విచారకరం అన్నారు. అది ప్రజాస్వామిక విలువలకు గొడ్డలిపెట్టుగా పేర్కొన్నారు. ఏపీకీ చెందవలసిన అన్ని హామీలను అట కెక్కించిన ఘనత బీజేపీకే దక్కిందన్నారు. ఏరు దాటాక తెప్ప తగలేసిన బిజెపి అవకాశవాద విధానాల ఫలితంగా ఎపికి తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తాజాగా బ్లాక్ మెయిల్ రాజకీయాలకు తెరలేపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాట్లు లేఖలో స్పష్టం చేశారు. ఎన్డీఏ ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి, పార్లమెంటు నిర్ణయాల పట్ల గౌరవం ఉంటే తక్షణమే ఏపీకి ప్రత్యేకహోదా ప్రకటించాలని కోరారు. విభజన బిల్లులో పొందుపరచిన అంశాల అమలుకు పూనుకోవాలని లేనిపక్షంలో బిజెపి చరిత్రలో హీనులుగా మిగిలిపోతారనేది తథ్యం అన్నారు.

అమిత్ షా ప్రకటనకు సీపీఎం ఖండన

రాష్ట్ర విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలను కేంద్రం పూర్తి స్థాయిలో నెరవేర్చిందని బిజెపి జాతీయ ఆధ్యక్షులు అమిత్ షా ప్రకటించడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర కమిటీ శనివారం ఒక ప్రకటనలో ఖండించింది. ముఖ్యమంత్రికి రాసిన తొమ్మిది పేజీల లేఖ అసత్యాలతోనే కూడుకున్నాదని సిపియం రాష్ట్ర కార్యదర్శి మధు అన్నారు. దేశవ్యాపితంగా అమలు జరిగే పథకాల్లో భాగంగా రాష్ట్రంలో జరుగుతున్న వాటికి ఇచ్చిన నిధులను కూడా ప్రత్యేక సాయం క్రింద చూపడం బిజెపి మోసకారితనానికి నిదర్శనం అన్నారు. రహదార్లకు, విమానాశ్రయాల అభివృద్ధి వంటి వాటికి ఇచ్చిన నిధులను ఇందులో పేర్కొనడమంటేనే మాటలతో రాష్ట్ర ప్రజానీకాన్ని మరోమారు వంచన చేయడమేనన్నారు. ప్రత్యేకహోదా, విభజన హామీల అమలు రాష్ట్ర ప్రజల ప్రయోజనాలతో ముడిపడి ఉన్న అంశం అన్నారు. అలాగే విభజనతో ముడిపడి ఉన్న అంశం అని బిజెపి, తెలుగుదేశం పార్టీలు తమ సొంత వ్యవహారంలా భావించి ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికైనా బిజెపి నిజస్వరూపాన్ని గ్రహించి రాష్ట్ర ప్రయోజనాలకోసం అఖిలపక్షసమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రయోజనాల సాధనకోసం అన్ని రాజకీయ పార్టీలు అమిత్ షా దుష్ప్రచారాన్ని ఖండించాలని మధు కోరారు.

అమిత్‌షాకి సీపీఐ రామకృష్ణ లేఖ

ఆంధ్రా పార్టీలతో ప్రజలకు ముప్పు

● అభివృద్ధిని మరిచి తెదేపా, వైకాపాలు పరస్పర విమర్శలు: మీడియా చిట్‌చాట్‌లో తెలంగాణ మంత్రి తలసాని

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆంధ్రా రాజకీయ పార్టీలతో ప్రజలకు ఎప్పటికైనా ముప్పేనని తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అభిప్రాయపడ్డారు. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని పాతరేసి అధికార తెలుగుదేశం, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలు పరస్పరం బురద చల్లుకుంటున్నాయని అన్నారు. రాజకీయ రాద్ధాంతం తప్ప కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మాణం ప్రవేశపెట్టడంతో ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఏ కోణంలో చూసినా దేశానికి తెలంగాణ ప్రభుత్వమే ఆదర్శమని స్పష్టం చేశారు. కేంద్రంపై తాము చేస్తున్న రిజర్వేషన్ల పోరు చాపకింద నీరు లాంటిదని, సీఎం కేసీఆర్ పట్టుదలతో ఎట్టి పరిస్థితుల్లోనూ సాధించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. శనివారం శాసనసభ ఆవరణలో మంత్రి తలసాని జరిపిన మీడియా చిట్‌చాట్‌లో అనేక రాజకీయ అంశాలను ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్‌లో అక్కడి పార్టీలు ప్రజలను మరోసారి మోసం చేస్తున్నాయని అన్నారు. దిగజారుడు రాజకీయాలతో ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు.

హోదా కోసం ఉమ్మడిగా రాజీనామలు చేద్దాం

చంద్రబాబును డిమాండ్ చేసిన వైకాపా నేత వైవీ సుబ్బారెడ్డి

హైదరాబాద్,ఆంధప్రభ: ఏపీకి ప్రత్యేక హోదా సాధించుకునేందుకు ఎంపీలంతా మూకుమ్మడిగా రాజీనామా చేద్దాం కలిసిరా బాబు అంటూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపి వై.వి.సుబ్బారెడ్డి ముఖ్యమంత్రి టీడీపి అధ్యక్షుడు చంద్రబాబు నాయుడిని డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎన్డీఏతో కలిసి ఉన్న నాలుగేళ్లలో చంద్రబాబు ఏనాడు ప్రత్యేక హోదా అడగలేదన్నారు. ఇప్పుడు పోరాటాలు చేస్తున్నట్టు డ్రామాలాడుతున్నారని అన్నారు. బయటికి మాత్రం బీజేపీ నేతలతో, కేంద్ర మంత్రులతో కలవద్దని చెబుతూనే లోలోపల సుజనాచౌదరి, ఇతర ఎంపీలు కేంద్రమంత్రులతో కలిసి లాలూచీ రాజకీయాలు చేస్తున్నారన్నారు. మంగళవారం ప్రారంభమయ్యే సభలో కూడా అవిశ్వాస తీర్మానం ఇచ్చామన్నారు. హోదా విషయంలో ఎవరు అవిశ్వాసం పెట్టినా మద్దతు ఇస్తామన్నారు. సోమవారం పార్టీ పార్లమెంటరీ సమావేశాన్ని సత్తెనపల్లివద్ద నిర్వహిస్తున్నామన్నారు. ఎంపీలమంతా జగన్‌తో సమావేశమవుతామన్నారు. నాలుగేళ్లతరువాత అయినా చంద్రబాబుకు ప్రత్యేక హోదాపై పోరాటం చేయాలని గుర్తుకు రావటం మంచిదే అన్నారు అయితే పోరాటం పేరుతో జపాన్, సింగపూర్ పేర్లు చెప్పి ఉద్యమాన్ని అణచివేసేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు.

నాలుగేళ్లలో ఎన్డీఏలో ఉండి ఏపీకి చంద్రబాబు ఏం సాధించలేదన్నారు. ప్రత్యేక హోదాకోసం జగన్ నాయకత్వంలో తమ పార్టీ చిత్తశుద్ధితో పోరాడుతూ వస్తోందన్నారు. తమపార్టీ నుంచి ఐదుగురం ఎంపీలమే ఉన్నప్పటికీ ఐదుకోట్ల ప్రజల గొంతు వినిపించే శక్తిమేరకు పోరాడుతున్నామన్నారు.

(7వ పేజీ తరువాయి)				మాగాణి	తండ్రి శివయ్య					
57	7-11	0.06	0.06	పట్టా మాగాణి	యాకసిరి పెంచలయ్య తండ్రి	6 & 11	2	10	5	వరి
		0.07	0.07		యాకసిరి ఈశ్వరయ్య తండ్రి					
			0.13							
58	118-6ఎ	0.65	0.30	పట్టా మెట్ట	సంక్రాంతి శ్రీనివాసులు తండ్రి గోవిందు	117	114	115 & 114	2	దుక్కి
మొత్తము		51.34	49.46							

సం/- పి.ప్రశాంతి యం.ఏ.,
ప్రత్యేక కలెక్టరు, తెలుగు గంగ ప్రాజెక్టు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

ఆపరేషన్ ద్రవిడపై చర్యలు తీసుకోండి

డీజీపీకి మాజీ మంత్రి మాణిక్యాలరావు వినతి



డీజీపీకి వినతి పత్రం అందజేస్తున్న మాజీమంత్రి మాణిక్యాలరావు తదితరులు

అమరావతి, ఆంధ్రప్రభ: సినీనటుడు శివాజీ పేర్కొన్న అపరేషన్ ద్రవిడ వెనుకున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీమంత్రి, బీజేపీ సీనియర్ నేత పైడికొండల మాణిక్యాలరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బీజేపీ నేతలతో కలిసి డీజీపీ డాక్టర్ ఎం.మాలకొండయ్యకు వినతి పత్రం అందజేశారు. దక్షిణ భారత దేశంలోని రాజకీయ పార్టీలను నిర్వీర్యం చేసేందుకు ఆపరేషన్ ద్రవిడ పేరిట ఒక జాతీయ పార్టీ ప్రయత్నాలు చేస్తోందని, గురు అనే సంబోధించే వ్యక్తి దీని వెనుకున్నట్లు సినీ నటుడు శివాజీ ఇటీవల ఆరోపించారు. ఇలాంటి ఆపరేషన్ రాజ్యాంగ నియమాలకు, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మంత్రి మాణిక్యాలరావు పేర్కొన్నారు. ఈ చర్యలతో ప్రజల్లో ఆందోళన చెలరేగడంతో అయోమయం నెలకొందని ఆయన తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని శివాజీ చెప్పిన వివరాల ఆధారంగా ఆపరేషన్ ద్రవిడ వెనుకున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు. డీజీపీని కలిసిన వారిలో పలువురు బీజేపీ నేతలు ఉన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో నగరాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దొచ్చు

● ఏప్రిల్ 10 నుంచి అమరావతిలో అంతర్జాతీయ హ్యాపీ సిటీస్ సదస్సు: సీఆర్డీయే స్పెషల్ కమిషనర్ రామ్మోహనరావు

అమరావతి, ఆంధ్రప్రభ ; ప్రజల భాగస్వామ్యంతో మన నగరాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకోవచ్చునని ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) ప్రత్యేక కమిషనర్ వి.రామ్మోహనరావు అన్నారు. శనివారం విజయవాడ నగరంలో జరిగిన హ్యాపీ సిటీ హ్యాక్‌థాన్ వర్క్‌షాప్‌లో రామ్మోహనరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏప్రిల్ 10 నుంచి 12 వరకు అంతర్జాతీయ హ్యాపీ సిటీస్ అమరావతి సదస్సు నిర్వహణలో భాగంగా శనివారం విజయవాడ పున్నమి ఘాట్‌లో ఈ వర్క్‌షాప్‌ను ఏపీ సీఆర్డీఏ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినూత్న ఆలోచనలను ఆవిష్కరించి పబ్లిక్ ప్లేస్‌లను సుందరంగా తీర్చిదిద్దుకనేదానిపై యువత దృష్టి సారించాలన్నారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్న యువకులు, చిన్నారుల ఆసక్తికరమైన చిరు దరహాసాలను చూస్తే ప్రతి స్పేస్‌లోను హ్యాపీనెస్ తీసుకురాగలమనిపిస్తుందన్నారు. తమ నగరాలను అభివృద్ధి చేసుకోవాలన్న ఆసక్తి, ఉత్సాహం ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్న వివిధ కళాశాలల విద్యార్థుల్లో స్పష్టంగా కనబడుతోందన్నారు. విజయవాడ నగరంలోని గోడలన్నింటినీ నగర కమిషనర్ ప్రోత్సాహంతో కళాకారులు, విద్యార్థులు ఎంతో అందంగా తీర్చిదిద్దడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఢిల్లీలో రాహ్‌గిరి పేరుతో నిర్వహించిన వినూత్న కార్యక్రమాన్ని తాను ప్రత్యక్షంగా చూశానని కనాట్ ప్లేస్‌లో రెండు కూడళ్ళలో ట్రాఫిక్ నిలిపివేసి ప్రజలు ఆనందంగా గడిపే సౌకర్యం కల్పించడం విజయవంతమైందని స్పెషల్ కమిషనర్ అన్నారు. కాగా ఈ వర్క్‌షాప్‌లో 35 మంది విద్యార్థులు పాల్గొని తమ ఆలోచనలను వివరించారు. కాలేజీ, స్కూలు విద్యార్థులకు నిర్వహించిన వినూత్న ఆలోచనలతో కూడిన డిజైన్ల పోటీలో ప్రథమ స్థానంలో నిలిచిన విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ విద్యార్థులను ఈ వర్క్‌షాప్‌లో అతిధులు అభినందించారు. ఈ రెండు ఎంట్రీలను వర్క్‌షాప్‌లో ప్రదర్శించి విజయవాడ పున్నమిఘాట్‌ను ఆహ్లాదకరంగా మార్చే విధానాన్ని వివరించారు. సీఆర్డీఏ అధికారుల సహకారంతో 35 మంది విద్యార్థులంతా విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌లో తమ ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శనకు అనువుగా రూపొందించి ఏప్రిల్ 7, 8 తేదీలలో పున్నమి ఘాట్‌లో వాటిని అమర్చి సందర్శనకు అనువుగా తీర్చిదిద్దుతారని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శన నెలరోజుల పాటు ఉంటుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాంగణాన్ని సందర్శించే అవకాశం ఉందన్నారు.

ఈ వర్క్‌షాప్‌లో సీఆర్డీఏ సీనియర్ ప్లానింగ్ ఆఫీసర్ జి.నాగేశ్వరరావు, ఇన్‌ఫ్రా అదనపు డైరెక్టర్ ఎన్‌వీఆర్‌కె.ప్రసాద్, జాయింట్ డైరెక్టర్ వి.శ్రీనివాసరావు, జోనల్ అసిస్టెంట్ డైరెక్టర్ మృణ్మయి, డాల్‌బర్గ్ ప్రతినిధి ఇషా, విజయవాడ స్పా ప్రొఫెసర్ జి.కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

అంకురార్పణతో ఒంటిమిట్ట కోదండరాముని

బ్రహ్మోత్సవాలకు శ్రీకారం



ఒంటిమిట్ట, ప్రభ న్యూస్ : భక్తుల రామనామస్మరణల ప్రతిధ్వనులు అర్చకులు, వేదపండితుల చతుర్వేద మంత్రోచ్చరణలతో మంగళవాయిద్య కారుల నాదనీరాజనం, కళాకారుల నృత్య విన్యాసాలు, కోలాటాలు ఇది ఒంటిమిట్టకోదండపాని బ్రహ్మోత్సవ సరంభం. విద్యుత్ కాంతుల దగదగలు, పచ్చని మామిడి తోరణాలు, పూలపరిమరాలు, చలువపందెళ్ళతో పుష్పనీరాజనమైన దాసరథి కోవెలలో శనివారం రాత్రి టిటిడి ఆధ్వర్యంలో ఊరేగింపుగా పుట్టమన్ను తెచ్చిన అర్చకుల అంకురార్పణ క్రతువుతో కడపజిల్లా ఒంటిమిట్ట కోదండరాముని బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు.

వైభవంగా అంకురార్పణ

ఒంటిమిట్ట కోదండరాముని కోవెలలో శనివారం రాత్రి అంకుకార్పణ కార్యక్రమంలో బాగంగా ఆలయ రంగమండపంలో సీతారామ లక్ష్మణ ఉత్సవమూర్తులకు ఆరాధన, విశ్వక్షేణ పూజ, వాసుదేవ, పుణ్యాహవచనం, రక్షాబంధనం గావించారు. అనంతరం టీటీడీ ఇన్‌చార్జి డిప్యూటీ ఈఒ సారథి, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, అర్చకులు, వేదపండితులు మంగళవాయిద్యాలతో పుట్టవద్దకువెళ్లారు. అక్కడ పుట్టబంగా రాన్ని సేకరించి, ఆలయానికి తీసుకవచ్చి యాగశాలలో ఏర్పాటుచేసిన 36 తాలికల్లో నింపి నవధాన్యాలు వేశారు. అనంతరం అంకురార్పణహోమం, అగ్నిప్రతిష్ట రుత్వికావర ణం, మంత్రపుష్పం, నిరాజనంతో వైభవంగా కలశప్రతిష్ట నిర్వహించి అఖండ దీపారాదన గావించి నివేదనతో మంగళహారతి ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు భారీసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

సీతారాముల కళ్యాణానికి...

శ్రీరామదివ్యక్షేత్రం ముస్తాబు

- రేపు శ్రీరామనవమి... ఎల్లుండి మహాపట్టాభిషేకం
- 3లక్షల లడ్డూలు... 100 క్వింటాళ్ల తలంబ్రాలు
- కొలిక్కిరాని తెలంగాణ సీఎం కేసీఆర్ పర్యటన



భద్రాచలం, ప్రభన్యూస్ : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామివారి కళ్యాణానికి భద్రాద్రి సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. సోమవారం భద్రాచలంలో అంగరంగ వైభవంగా జరిగే శ్రీసీతారాముల కళ్యాణానికి దేవస్థానం, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు కోటి రూపాయల వ్యయంతో చేపట్టిన ఏర్పాట్లు పూర్తి చేశారు. దేశ నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తారనే అంచనాతో అధికారులు ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం విస్తా కాంప్లెక్స్, గోదావరి తీరంలో భక్తులు సేద తీరేందుకు పందిళ్లను ఏర్పాటు చేశారు. భక్తులకు తాగునీటి కోసం 5లక్షల వాటర్ ప్యాకెట్లు, లక్ష మజ్జిగ ప్యాకెట్లను సిద్ధం చేశారు. కళ్యాణానికి వచ్చే భక్తులకుస్వామివారి తలంబ్రాలను అందించేందుకు 100 క్వింటాళ్లతో ముత్యాల తలంబ్రాలను సిద్ధం చేస్తున్నారు. తలంబ్రాల పంపిణీకి 10 ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పాటు చేశారు. 3లక్షల లడ్డూ ప్రసాదాన్ని తయారు చేస్తున్నారు. స్వామివారి కళ్యాణాన్ని వీక్షించేందుకు ప్రధాన కూడళ్ళలో ఎల్‌ఈడి స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. కళ్యాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ముత్యాల తలంబ్రాలతో రేపు భద్రాచలం రావాల్సి ఉంది. సీఎం పర్యటన ఇంతవరకు కొలిక్కిరాలేదు. సిఎం పర్యటనకు సంబంధించి ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఇంత వరకు ఎటువంటి సమాచారం రాలేదు. గత యేడాది జరిగిన సీతారాములు కళ్యాణానికి అనారోగ్య కారాణాలతో సీఎం కేసీఆర్ హాజరు కాలేదు. తమ మనవడిని హిమాన్స్ పంపారు. ప్రతీ ఏటా ప్రభుత్వ లాంఛనాలతో రాష్ట్ర ముఖ్యమంత్రి ముత్యాల తలంబ్రాలను తీసుకురావడం ఆనవాయితీగా వస్తుంది. నైజాం నవాబు తానీషా కాలం నుంచి ఆనవాయితీగా వస్తున్న ఆచారాన్ని పాలక ప్రభుత్వాలు కొనసాగిస్తూ వస్తున్నాయి. సీతారాముల కళ్యాణానికి రాష్ట్ర నలుమూలల నుంచి ఇప్పటికే భారీగా భక్తులు తరలి వస్తుండటంతో భద్రాద్రి భక్తులతో కిటకిటలాడుతుంది. సరికొత్త హంగులతో భద్రాద్రికి నూతన శోభ సంతరించుకుంది. ఎండలు మండుతున్నా లెక్కచేయకుండా సీతారాముల కళ్యాణాన్ని తిలకించేం దుకు భక్తకోటి ఇక్కడకు చేరుకుంటుంది. సోమవారం మధ్యాహ్నం గం.12.00లకు సాంప్రదాయం ప్రకారం అభిజిత్ లగ్నంలో వైభవంగా జరిగే కళ్యాణానికి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మిథిలా స్టేడియం సీతారాముల కళ్యాణానికి ముస్తాబు చేస్తున్నారు. రాష్ట్ర, కేంద్ర మంత్రులు, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, హాజరవుతుండటంతో జిల్లా ఎస్పి అంబర్ కిషోర్ ఝూ ఆధ్వర్యంలో 2వేల మందికి పైగా పోలీసులతోభారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు. సరిహద్దు ప్రాంతంలో ఇటీవల మావోయిస్టుల కార్యకలాపాలు ముమ్మరంగా సాగుతుండడంతో పోలీసులు పటిష్ట బందోబస్తు చేస్తున్నారు.

భద్రాద్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : శ్రీరామనవమి సందర్భంగా టీఎస్‌ఆర్టీసీ హైదరాబాద్ నుండి భద్రాచలంకు ప్రత్యేక బస్సులు నడిపిస్తుంది. ఈ నెల 25, 26 తేదీల్లో రెగ్యులర్ బస్సులతో పాటు ప్రత్యేక బస్సులను నడిపించబోతున్నామని ఆర్టీసీ వెల్లడించింది. హైదరాబాద్, ఖమ్మం, పర్ణశాల, కొత్తగూడెం, మధిర, మనుగూరు, సత్తుపల్లి, వరంగల్, ఏలూరు, రాజమండ్రి, విజయవాడల నుండి ప్రత్యేక బస్సులు నడిపించే విధంగా చర్యలు తీసుకున్నామని ఆర్టీసీ వెల్లడించింది. భద్రాచలం నుంచి వివిధ ప్రాంతాలకు తిరుగు ప్రయాణం చేసే భక్తులకు కూడా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచబోతున్నామని పేర్కొంది. దాదాపు 320 రెగ్యూలర్ బస్సులతో పాటుగా 225 ప్రత్యేక బస్సులను నడిపించడానికి ప్రణాళిక రూపొందించుకున్నా మని వివరించింది.

టెక్నాలజీని అందిపుచ్చుకుని

విద్యార్థులు అభివృద్ధి సాధించాలి

- సీఎం సతీమణి నారా భువనేశ్వరి



చల్లపల్లి(కృష్ణాజిల్లా), ప్రభ న్యూస్ : నేటి సమాజంలో టెక్నాలజీ కీలకమైందని, విద్యార్థులు దానిని అందిపుచ్చుకుని అభివృద్ధి సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. శనివారం కృష్ణా జిల్లా చల్లపల్లిలోని ఎన్టీఆర్ ట్రస్ట్ మోడల్ స్కూల్‌లో హువానే కంపెనీ విరాళంతో ఏర్పాటు చేసిన డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్‌ను భువనేశ్వరి ప్రారంభించారు. అనంతరం జరిగిన పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నేడు గ్రామాల నుంచి శాస్త్రవేత్తలు, నాయకులు పుడుతున్నారని, మహిళలు కూడా ప్రముఖ పాత్రను పోషిస్తున్నారని పేర్కొన్నారు. మారుతున్న కాలంలో బాలికలకు చాలా అవకాశాలు వస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకోవడానికి శారీరకంగా మంచి ధృడత్వం ఉండాలన్నారు. బోధన అనేది నేడు సమాజంలో పవిత్రమైన వృత్తి అని, ఆ వృత్తిలో ఉన్న ఉపాధ్యాయులను అభినందించారు. జీవితాలను మలుచుకోవడానికి ఉపయోగపడే ఆరు అంశాలను ఈ సందర్భంగా విద్యార్థులకు వివరించారు. శాసనసభ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో నిరదారణకు గురైన ఎంతో మంది పిల్లలను అక్కున చేర్చుకుని ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా విద్యాబుద్ధులు నేర్పించడం మంచి పరిణామమని చెప్పారు. ఎన్టీఆర్ పేరు చెబితేనే తెలుగువారి మనస్సులు ఉపొంగుతాయన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఎంతో మంది నిరాదరణకు గురైన విద్యార్థులను ఆదరించి విద్యాబుద్ధులు నేర్పించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, హువాన్ కంపెనీ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పచ్చల రాము, ఎన్టీఆర్ ట్రస్ట్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి టి.విష్ణువర్ధన్, డిఇవో రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ సీతాంజలి, తదితరులు పాల్గొన్నారు.

సార్.. మమ్మల్ని విడిచి వెళ్ళొద్దు



- మీరు మాకు కావాలి
- మహారాష్ట్ర అదనపు డీజీపీ లక్ష్మీనారాయణ వెళ్ళవద్దంటూ వెలిసిన ఫ్లెక్సీలు, గోడపత్రికలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సార్.. మీరు పోలీసు ఉద్యోగానికి రాజీనామా చేయొద్దు. మీరు లేకపోతే మా పరిస్థితేంటి? మీరు పోలీసు అధికారిగానే కొనసాగాలి. రాజీనామా లేఖను వెనక్కి తీసుకోవాలి! ఈ మాటలు ఎవరన్నారో తెలుసా..

అదనపు డీజీపీ హోదాలో మహారాష్ట్ర ప్రభుత్వంలో పనిచేస్తున్న తెలుగు ఐపీఎస్ అధికారి వివి లక్ష్మీనారాయణ రెండు రోజుల క్రితం స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆయన డీజీపీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి పదవీ విరమణ లేఖను అందజేశారు. శుక్రవారం మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగరరావును రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వ కంగా కలిసి తాను తీసుకున్న నిర్ణయాన్ని ఆయనకు వివరించారు. అయితే శనివారం ముంబయితో పాటు మహారాష్ట్రలోని అనేక ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, గోడపత్రికలు వెలిశాయి. మీరు మాకు కావాలి. మమలను విడిచి వెళ్ళవద్దంటూ ఫ్లెక్సీలలో రాసి వాటిని ప్రదర్శించారు. అయితే పదవీ విరమణకు దరఖాస్తు చేసుకున్న లక్ష్మీనారాయణ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించారు. ఆదివారం హైదరాబాద్ రానున్న లక్ష్మీనారా యణ అనుచరులు, సమీప బంధువులు, శ్రేయోభిలాషులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. తన మనసులో ఉన్న అంశాన్ని వారికి వివరించి అభిప్రాయాలను తీసుకోనున్నారు.

ఏప్రిల్ నుంచి

క్షయ పీడితులకు రూ.500 పెన్షన్

- సీఎం చంద్రబాబు నిర్ణయం

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రం నుంచి క్షయ వ్యాధిని తరిమి కొట్టేందుకు ప్రభుత్వం ఉద్యమ కార్యాచరణను చేపట్టింది. 2020 నాటికి ఒక క్షయ కేసు కూడా నమోదు కావడానికి వీలులేదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వైద్య ఆరోగ్య శాఖను ఆదేశించారు. అంతేకాకుండా రాష్ట్రంలో ప్రతి వ్యాధిగ్రస్తుడికి పోషకాహారం అందించాలన్న లక్ష్యంతో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) కింద ఇకపై వచ్చే నెల నుంచి ప్రతి నెల రూ. 500 ఆర్థిక సాయం అందించాలని నిర్ణయం తీసుకున్నారు. దీంతో రాష్ట్రంలో 65లక్షల వ్యాధిగ్రస్తులకు లబ్ధి చేకూరనుంది. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించే ఉద్యమ కార్యాచరణకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం శ్రీకారం చుట్టారు. వ్యాధి నిర్మూలనకు, రోగులకు అత్యుత్తమ చికిత్స కు సంబంధించిన వివిధ పథకాలను ఆయన ప్రారంభించారు. ఒక్కో రోగికి రూ.15 లక్షలు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. మొండి వ్యాధిని కూడా నయం చేసే బెడాక్విలైన్ మందును ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయనుంది. దీని కోసం రాష్ట్ర వ్యాప్తంగా 725 మంది ఫీల్డ్ సూపర్ వైజర్లకు ట్యాబ్‌లు అందించనుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ వ్యాధి నివారణకు రూ.78 కోట్లు ఖర్చు చేయనుంది.

ప్రతి గ్రామంలో ట్రీట్‌మెంట్ సపోర్ట్ సెంటర్

ఎండ్ టీబీ కార్యక్రమాన్ని విజయవంతం చేయడమే లక్ష్యంగా రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో టీబీ వ్యాధిగ్రస్తుల కోసం ట్రీట్‌మెంట్ సపోర్టు సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు వివరించారు. వ్యాధిగ్రస్తులను గుర్తించడం, వారికి తగిన చికిత్స అందించడం అందేలా చూడడం ఈ సెంటర్ల బాధ్యులను చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని మొత్తం 610 సిహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రుల్లో కఫం తనిఖీ కేంద్రాలను నెలకొల్పేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. క్షయ వ్యాధిని గుర్తించి అత్యాధు నిక సీపీ మ్యాట్ కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు సీఎంకి వివరించారు. రాష్ట్రంలో 65 వేల మంది క్షయ వ్యాధి గ్రస్తులను గుర్తించామని, వీరందరి కీ చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఇంకా ప్రైవేటు ఆసుపత్రుల్లో మరో 35 వేల మంది వరకు ఉండవచ్చ ని, అంతా కలిపి లక్ష వరకు వ్యాధిగ్రస్తుల సంఖ్య ఉంటుందని వివరించా రు. వీరందరిని నిక్షయ్ అనే సాఫ్ట్‌వేర్ ద్వారా ఆన్‌లైన్‌లో పర్యవేక్షించనున్నట్లు తెలిపారు.

ప్రైవేటు ఆసుపత్రులతో చికిత్స పొందుతున్న వారి వివరాలు తప్పనిసరి..

రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రైవేటు ఆసుపత్రులలో క్షయ వ్యాధి చికిత్స పొందుతున్న వారి వివరాలను సైతం తప్పనిసరిగా ఆయా ఆసుపత్రుల యాజమాన్యాలు ప్రభుత్వానికి తెలియజేసేలా ఆదేశాలు జారీ చేయాలని వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్యకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు ఆదేశించారు. దీంతో వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవచ్చన్న వైద్యులు సిఫార్సు లేకుండా టీబీ మందులు ఎక్కడా విక్రయించకుండా కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో ఈ ఏడాదిలో కనీసం 30 నుంచి 40 శాతం వ్యాధి గ్రస్తులకు స్వస్థత చేకూర్చే అవకాశాలున్నాయని ఈ సందర్భంగా అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం క్షయ వ్యాధి నివారణపై రూపొందించిన కరపత్రికను సీఎం చంద్ర బాబునాయుడు ఆవిష్కరించారు. ఈ కార్య క్రమంలో పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ ఎస్.అరుణ కుమారి, క్షయ వ్యాధి నివారణ అధికారి టి.రామారావు, సీఎం కార్యదర్శి గిరిజా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫైబర్‌నెట్ కనెక్షన్ల కనెక్టివిటీ

వేగం పుంజుకోవాలి

- డిసెంబర్ లోపు రాష్ట్రంలో కోటి కనెక్షన్లు లక్ష్యం
- 6 వేల పాఠశాలల్లో డిజిటల్ తరగతులకు ఏర్పాట్లు : సీఎం చంద్రబాబు



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో ఫైబర్ నెట్ కనెక్షన్ల కనెక్టివిటీ మరింత వేగం పుంజుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. శనివారం రాత్రి సచివాలయంలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో ఏపీ ఫైబర్ నెట్‌లో జరుగుతున్న ప్రగతి గురించి రియల్‌టైమ్ గవర్నెన్స్ కేంద్రంలో సమీక్ష నిర్వహించారు. డిసెంబర్ నెలాఖరులోపు రాష్ట్రంలో కోటి కనెక్షన్ల లక్ష్యానికి చేరుకోవాలని సీఎం నిర్దేశించారు. మే నెలాఖరులోపు 10 లక్షల కనెక్షన్లు ఇవ్వాలని ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యం పూర్తి కావాలంటే ప్రతిజిల్లాలో రోజుకు 3,287 కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుందని, దానికితగ్గ ఏర్పాట్లను చేయాలని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో కనెక్టివిటీ కోసం ఎక్స్ యాప్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. అలాగే ఈ ప్రాంతాల్లో ఫైబర్ నెట్ కనెక్షన్లను గిరినెట్ పేరును అధికారులు సూచించడంతో సీఎం అంగీకరించారు. రాష్ట్రంలోని వర్చువల్ తరగతులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మే నెలాఖరులోపు 6 వేల పాఠశాలలకు డిజిటల్ తరగతి సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో సర్వైలెన్స్ కెమేరాల ఏర్పాటులో వేగం పుంజుకోవాలన్నారు. వారం రోజుల్లో అందుకుతగ్గ ప్రాణాళికలు రూపొందించి తనముందు ఉంచాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఫైబర్ నెట్ మేనేజింగ్ డైరెక్టర్ అహ్మద్ బాబు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో 1,82,394 కనెక్షన్లు ఇచ్చామనీ, నిర్దేశిత లక్ష్యాల మేరకు నెట్ కనెక్షన్లు పూర్తి చేస్తామని చెప్పారు. రైల్వే క్రాసింగ్‌ల వద్ద ఎక్స్ యాప్ వినియోగం ద్వారా తక్కువ ఖర్చుతో త్వరితగతిన లైన్లు పూర్తి చేయడంతోపాటు కనెక్షన్లప్రక్రియ వేగవంతం చేస్తామన్నారు. భారత్ నెట్ రెండో దశ కింద కేంద్రప్రభుత్వం ఇప్పటికే 851.23 కోట్ల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపిందన్నారు. అలాగే 1410 కోట్లతో పంపిన మరో ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. సమీక్షా సమావేశంలో ఏపీ ఫైబర్‌నెట్ సంస్థ సీఈవో దినేష్‌కుమార్, సీఎం కార్యాలయ ముఖ్యకార్యదర్శి సాయిప్రసాద్, కార్యదర్శి గిరిజాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సభాపర్వం



ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు

పరిహారం వెంటనే అందేలా చూడాలి

అమరావతి, ఆంధ్రప్రభ: ఆత్మహత్యలకు పాల్పడిన రైతులకు సకాలంలో పరిహారం అందడం లేదని పలువురు ఎమ్మెల్యేలు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ఆత్మహత్యకు పాల్పడిన వారికి పరిహారం పెంపు బాగానే ఉన్నప్పటికీ..నెలల తరబడి పరిహారం అందించడంలో జరుగుతున్న జాప్యం వలన వారు తీవ్ర ఆవేదనకు లోనవుతున్నట్లు తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో రైతుల ఆత్మహత్యలపై ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, నారాయణస్వామి, ఎస్.రఘురామి రెడ్డి అడిగిన ప్రశ్నపై చర్చ సాగింది. అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ఎక్కువగా కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ప్రకాశం జిల్లాలో లక్షా 20వేల మంది కౌలు రైతులున్నారని చెప్పారు. ప్రకాశం జిల్లాలో 119మంది కౌలు రైతులు ఆత్మహత్యకు పాల్పడగా ప్రభుత్వ లెక్కల ప్రకారం 39మందిగా చూపించారన్నారు. వీరికి తగిన గుర్తింపు కార్డులు జారీ చేయకపోవడం వలన పరిహారం అందడం లేదన్నారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మాట్లాడుతూ పరిహారం రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచడాన్ని హర్షిస్తున్నట్టు చెపుతూ ఇవ్వడంలో జరుగుతున్న జాప్యం నిలువరించాలన్నారు. దీనిపై వ్యవసాయ శాఖామంత్రి సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి తరుపున మంత్రి పత్తిపాటి పుల్లారావు సమాధానమిస్తూ రూ.2695 కోట్లతో 9.6లక్షల మందికి ఈ ఏడాది రుణ సదుపాయం కలిపించినట్లు తెలిపారు.. ఇక ఆత్మహత్యలకు సంబంధించి ప్రభుత్వం అన్ని రకాలుగా నిలువరించేందుకు చర్యలు తీసుకుంటన్నామన్నారు.

డి.ఫార్మసీ అభ్యర్థులకు న్యాయం

రాష్ట్రంలో డీ.ఫార్మసీ చదివిన వారికి ప్రభుత్వపరంగా తగిన న్యాయం చేస్తామని మంత్రి గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో అనంతపురం ఎమ్మెల్యే వి.ప్రభాకర చౌదరి రాష్ట్రంలో ఫార్మా డి.కాలేజీలపై అడిగిన ప్రశ్నకు మంత్రి గంటా సమాధానమిచ్చారు. వీరికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి కలిపించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అంతకు ముందు ప్రభాకర చౌదరి మాట్లాడుతూ ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ద్వారా 2008లో ఫార్మా డీ కోర్సుకు గుర్తింపు వచ్చిందన్నారు. వీరికి సర్టిఫికెట్లు ఇచ్చారే తప్ప ఇతర ప్రయోజనం లేదని, బీ ఫార్మసీ ఉన్న వాళ్లకు ఉన్న అవకాశాలు సైతం వీరికి లేవన్నారు. రాజానగరం ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, రాజోలు ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావు, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తదితరులు వీరికి ఉపాధి కలిపించాల్సిన అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు.

సినిమా హాళ్లలో తినుబండారాల ధరలపై అట్టుడిగిన శాసనసభ

రాష్ట్రంలోని సినిమా థియోటర్లలో తినుబండారాల ధరలపై శాసనసభ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. టిక్కెట్ల ధరలకు తోడు పేద, మధ్యతరగతి కుటుంబాల వారికి వినోదం ఖరీదు కావడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారంటూ పలువురు ఎమ్మెల్యేలు శాసన సభలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సినిమా హాళ్లలో తినుబండారాల ధరలను నియంత్రించలేకపోవడంలోని ఆంత్యర్యమేంటని వారు పౌరసరఫరాల శాఖా మంత్రి పత్తిపాటి పుల్లారావును నిలదీశారు. స్వల్ప వ్యవధి ప్రశ్నగా సినిమా థియోటర్లతో తినుబండారాల అధిక ధరలు అనే అంశాన్ని ఎమ్మెల్యే ఎస్.వి.మోహనరెడ్డి ప్రస్తావించారు. సినిమా థియోటర్లలో టిక్కెట్ల ధరలకంటే తినుబండారాల ధరలు అధికంగా ఉన్నాయన్నారు. పాప్‌కార్న్ రూ.110 నుంచి 120 రూపాయలు, గ్లాసుల్లో శీతల పానీయాలు ఇస్తూ దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. అనేక చోట్ల దాడులు నిర్వహిస్తున్న పౌరసరఫరాల శాఖ అధికారులు సినిమా హాళ్లలో ఎందుకు దాడులు నిర్వహిం చడం లేదని ప్రశ్నించారు. మంత్రికి లేదా ఆయన బంధువులకు ఈ తరహా థియోటర్లు ఏమైనా ఉన్నాయా? అంటూ మోహన రెడ్డి ప్రశ్నించారు. భీమవరం ఎమ్మెల్యే పి.రామాంజనేయులు మాట్లా డుతూ మల్టీఫ్లెక్స్ యాజమాన్యాలు ఈ తరహా రేట్లు వసూలు చేయకుంటే గిట్టుబాటు అవ్వడం లేదంటున్నారని తెలిపారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ మొదటి రోజు అదనపు ఆటలు, అధిక ధరలకు అనుమతులు తీసుకొని భారీ దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. బీజేపీ పక్షనేత పి.విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ టిక్కెట్లపై గిట్టుబాటు అవ్వడం లేదని చెపుతూ క్యాంటీన్ల నుంచే తమకు గిట్టుబాటు అవుతుందని పలువురు థియోటర్ యజమనా లు చెపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. చర్చల్లో పాల్గొన్న సమా చార, పౌరసంబంధాల మంత్రి కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ సాధారణ ప్రేక్షకులను దృష్టిలో ఉంచుకొని సినిమా హాళ్లలో టిక్కెట్ల ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం మంత్రుల సబ్ కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. పౌరసరఫరాల శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ గతేడాది ఎమ్మార్పీ ఉల్లంఘనలపై సినిమా థియోటర్లలో 135 కేసులు నమోదు చేసి రూ.10.61లక్షలు జరిమానాగా వసూలు చేసినట్లు తెలిపారు. గత జనవరి నుంచి సినిమా థియోటర్లు, మాల్స్‌లో దాడులు నిర్వహిస్తున్నామన్నారు. లీగల్ మెట్రాలజీ అధికారులకు ప్యాకింగ్ వస్తువులపై దాడులు నిర్వహించే అధికారం ఉంది తప్ప నాన్ ప్యాకింగ్ వస్తువులపై దాడులు చేసే అధికారం లేదన్నారు.

బలహీనవర్గాల ఆశాజ్యోతి చంద్రబాబు రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు

టీడీపీ ప్రభుత్వం బలహీనవర్గాల అశాజ్యోతి అని రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖా మంత్రి కె.అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. శనివారం ఆయన శాసనసభలో బీసీ సంక్షేమం పై మాట్లాడారు. ఒక్కటీడీపీ కే బలహీనవర్గాలపై చిత్తశుద్ధి ఉంటుందన్నారు. 50 శాతం జనాభా ఉన్న బీసీల సంక్షేమానికి రూ.750 కోట్లు కేటాయించిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందన్నారు. రూ.2047 కోట్లన ఈబీసీలకు కేటాయించామన్నారు. హాస్టల్ విద్యార్థులకు డైట్ చార్జీలు కూడా పెంచబోతున్నామన్నారు. అతిత్వరలోనే విద్యార్థులకు మరో శుభవార్తను కూడా సీఎం ప్రకటించబోతున్నారని అన్నారు.

మైనారిటీల అభివృద్ధికి ప్రాధాన్యం: మంత్రి నక్కా ఆనందబాబు

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలోని మైనార్టీల అభివృద్ధికి బడ్జెట్‌లో పెద్ద ఎత్తున నిధులు కేటాయించారని సాంఘీక సంక్షేమ శాఖా మంత్రి నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. సాంఘీకసంక్షేమ శాఖ కార్యక్రమాలపై ఆయన శనివారం శాసనసభలో మాట్లాడారు. ఈ సంవత్సరం రూ. 1102 కోట్ల కేటాయింపులు చేశామని వివరించారు. లక్షా 20వేల మైనార్టీ విద్యార్థులకు రూ.812 కోట్లు ఖర్చుచేశామన్నారు. క్రైస్తవులకు రూ.21.7 కోట్ల ఆర్థిక సాయం అందించామన్నారు. చర్చిల నిర్మాణం,రిపేర్లకు రూ. 20 కోట్లు ఇచ్చామన్నారు.

అధ్యక్షా ! ..ఆ నిధులు ఎమ్మెల్యేలు ఎలా వాడుకోవాలి బీజేపీ నేత విష్ణుకుమార్‌రాజు

అధ్యక్షా! అగ్రవర్ణాల్లోని పేదలకు రూ. 200 కోట్లు కేటాయించామన్నారు.. పెళ్లికానుక నిధులిచ్చామన్నారు..వాటిని ఎమ్మెల్యేలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రిగారు అన్నారు అధ్యక్షా!..వాటిని ఎమ్మెల్యేలు ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలపాలని శాసనసభలో బీజేపీ పక్ష నేత విష్ణుకుమార్‌రాజు స్పీకర్‌ను ప్రశ్నించడంతో సభలో ఒక్కసారిగా నవ్వులు వినిపించాయి. సద్వినియోగం చేసుకోమన్నది ఎమ్మెల్యేలను కాదు ఉన్నత కులస్థుల్లోని పేదలను అని మంత్రి అచ్చెన్నాయుడు సమాధానం చెప్పారు. అగ్రవర్ణాల్లోని పేదల పిల్లలకు రూ. 200 కోట్లు కేటాయించినందుకు ధన్యవాదలని విష్ణుకుమార్‌రాజు అన్నారు. కానీ బ్యాంకులు రుణాలు ఇచ్చే విషయంలో చాలా ఇబ్బందుల పెడుతున్నాయని, మంత్రి గారు ఈ విషయమై ప్రత్యేక దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. లేకుంటే బీసీలు సైతం ఇబ్బందిపడక తప్పదన్నారు. అదే విధంగా మేనిఫెస్టోలోని అంశాలను నూటికి నూరు శాతం అమలు చేశామంటున్నారు..అందుకు కూడా ధన్యవాదాలని ఆయన అన్నారు.

కాపీ ఇవ్వమనండీ అధ్యక్షా!

వివిధ పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి యూసీలు పంపామని అంటోంది..మాకు కూడా ఒక నకలును ఇస్తే మేము కూడా పరిశీలిస్తామని విష్ణుకుమార్‌రాజుపేర్కొన్నారు. అలాగే ఇస్తామని ముఖ్యమంత్రి సమాధానం ఇచ్చారు.

సచివాలయంలో

సీఎంను ఆశీర్వదించిన ముస్లిం పెద్దలు



అమరావతి, ఆంధ్రప్రభ: బాగ్దాద్ నుంచి పెద్ద గురువు పంపిన చాదర్‌ను చంద్రబాబు నాయుడు స్వీకరించగా, అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పక్షాన చాదర్‌ను అజ్మీర్‌లో ఖాజా మొయినుద్దీన్ దర్గాకు బహూకరించారు. అజ్మీర్‌లో ఉరుసుకు వెళుతున్న ముస్లీం మత పెద్దలు ముఖ్యమంత్రిని కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని , పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఎటువంటి ఆటంకాలు లేకుండా పూర్తికావాలని ప్రార్థించారు. మత పెద్దలు యజ్‌దాని తదితరులు మాట్లాడుతూ ముస్లింల సంపూర్ణ మద్దతు టిడిపికి ఉంటుందన్నారు. కృష్ణాజిల్లా మైనారిటీల పక్షాన ముఖ్యమంత్రిని కలిసినవారిలో ఎం.హెచ్ రహమాన్, ఎస్.ఎం. ఫైజాన్, ఎండీ బేగ్, ఎండీ సల్మాన్, ఎ. మబూద్, అస్గర్ షరీఫ్, ఎస్.కె. అమానుల్లా, ఎస్.ఎం. జావేద్, కరీముల్లా, ముఫ్తి తదితరులు వున్నారు.

ఎమ్మెల్యేల క్రీడల పోటీలు వాయిదా

ఈ నెల 26వ తేదీన జరగాల్సిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాన్ని మరుసటి రోజుకు వాయిదా వేసినట్టు శాసనసభ కార్యదర్శి ఎం.విజయరాజు ప్రకటించారు. శ్రీరామనవమి ఉత్సవాన్ని 26వ తేదీన నిర్వహిస్తూ ప్రభుత్వం జి.ఓ జారీ చేయడంతో ఆ రోజు జరగాల్సిన అసెంబ్లీ సమావేశాన్ని మరుసటి రోజుకు వాయిదా వేసినట్టు పేర్కొన్నారు. అదే విధంగా శనివారం, మంగళవారం రెండు రోజులపాటు నిర్వహించాల్సిన శాసనసభ్యుల క్రీడల పోటీలు సైతం వాయిదా పడినట్టు పేర్కొన్నారు.



- 20 బంతుల్లో వృద్ధిమాన్ సాహా సెంచరీ
- జేసీ ముఖర్జీ ట్రోఫీలో అద్భుతం
- 7 ఓవర్లలో టీ 20 మ్యాచ్ గెలుపు

సాహా.. సలాం

కోల్‌కతా: ఐపీఎల్ మెరుపులు టోర్నీ ప్రారంభానికి ముందే ప్రారంభమయ్యాయి. శనివారం కోల్‌కతాలో జరిగిన టీ20 క్లబ్ గేమ్‌లో బ్యాట్స్‌మన్, వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా తన ఆటలో కొత్త కోణాన్ని చాటాడు. మోహన్ బగాన్ తరపున ఆడుతున్న సాహా బెంగాల్ నాగపూర్ రైల్వేస్(బీఎన్ఆర్)పై అద్భుతంగా బ్యాటింగ్ చేస్తూ 20 బంతుల్లో శతకం పూర్తి చేశాడు. సాహా ఇన్నింగ్స్‌లో 14 సిక్సర్లు, నాలుగు బౌండరీలు, రెండు సింగిల్స్ ఉన్నాయి. సాహా దూకుడు రానున్న ఐపీఎల్ అతని సంసిద్ధతను చాటుతోంది. సాహాను సన్ రైజర్స్ హైదరాబాద్(ఎస్ఆర్‌హెచ్) రూ.5కోట్లతో కొనుగోలు చేసింది. జెసీ ముఖర్జీ ట్రోఫీలో భాగంగా జరిగిన ఈ టీ20 మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన బీఎన్ఆర్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 151 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మోహన్ బగాన్ ఓపెనెర్లు(సాహా, శుభమయ్ దాస్) 7 ఓవర్లలో 154 పరుగులు చేసి జట్టుకు విజయం సాధించి పెట్టారు. సాహా 20 బంతులను ఎదుర్కొని 102 పరుగులు చేశాడు. ఏడవ ఓవర్‌ను వేసిన మీడియం పేసర్ అమన్ ప్రసాద్ బౌలింగ్‌ను సాహా చీల్చి చెండాడాడు. సిక్సర్ల వర్షం కురిపించాడు. చివరి సిక్సర్‌తో సాహా తన శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. ఈ ఓవర్లో మొత్తం 37 పరుగులు వచ్చాయి. బౌలర్ ఒక వైడ్ వేయడంతో ఆ పరుగు మోహన్ బగాన్ జట్టుకు వచ్చింది. మ్యాచ్ అనంతరం సాహా తనఇన్నింగ్స్‌పై మీడియాతో వ్యాఖ్యానిస్తూ..' నేను తొలి బంతినుంచే నేను కచ్చితంగా కొట్టగలను అన్న విశ్వాసం కలిగింది. బ్యాట్ మధ్యలో బంతిని తాకేలా షాట్‌ను కొట్టాలనుకున్నా.. సాధించాను' అని అన్నాడు. అయితే ఇది రికార్డుకోసం ఆడలేదు. ఐపీఎల్‌ను దృష్టిలో ఉంచుకునే విలక్షణంగా ఆడాలని ప్రయత్నించాను సఫలం అయ్యాను అని సాహా చెప్పాడు.

ప్రత్యర్థి జట్టు పటిష్టమైనదే

బీఎన్ఆర్ జట్టు డివిజన్ జట్లలో ఒక ఉత్తమమైన జట్టే. కాలిగాట్ మైదానం కూడా కోల్‌కతా స్టేడియం మైదానంతో సమానంగా ఉంటుంది అని సాహా అన్నాడు. టెస్టుల స్పెషలిస్టుగా పేరుపొందిన సాహా ఐపీల్ 2014 ఎడిషన్‌లో కింగ్స్ ఎలెవన్ పంజాబ్ తరపున ఆడుతూ బెంగళూరులో తొలి సెంచరీ చేశాడు. సాహా తన పరుగుల ఖాతాను తొలుత సింగిల్‌తో ప్రారంభించాడు. అనంతరం నాలుగు ఫోర్లు, ఒక సిక్సర్‌ను బాదాడు. తన అర్ధ శతకాన్ని కేవలం 12 బంతుల్లో సాధించాడు. ఇందులో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సలున్నాయి. సాహాతో పాటు ఓపెనెర్‌గా క్రీజులోకి వచ్చిన మోహన్ బగాన్ కెప్టెన్ శుభమయ్ దాస్ 22 బంతుల్లో 43 పరుగులు(6 బౌండరీలు, 2 సిక్సర్లు)చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇప్పటివరకు జరిగిన ఐపీఎల్ ఫైనల్ వ్యాచుల్లో సెంచరీ చేసిన ఒక ఒక్క ఆటగాడు సాహానే. 2014 ఐపీఎల్ ఫైనల్లో కింగ్స్ ఎలవన్ పంజాబ్ జట్టు తరపున ఆడుతూ కోల్‌కతా నైట్ రైడర్స్‌పై సెంచరీ చేశాడు. ఐపీఎల్ మ్యాచుల్లో సాహా చెన్నై సూపర్ కింగ్స్, కోలకతా నైట్ రైడర్స్, కింగ్స్ ఎలవన్ పంజాబ్ జట్ల తరపున ఆడాడు. ఇటీవల భారత జట్టు దక్షిణాఫ్రికాలో పర్యటించిన సమయంలో తొలి టెస్టులో వికెట్ కీపర్‌గా బరిలోకి దిగాడు. బ్యాటింగ్‌లో సాహా నిరాశ పర్చాడు. మిగతా రెండు టెస్టులకు సాహాక ు ఆడటానికి అవకాశం రాలేదు. అంతర్జాతీయ పోటీల పరంగా చూస్తే.. 33 ఏళ్ల సాహా భారత టెస్టు జట్టుకే పరిమిత మైనప్పటికి.. దేశీయంగా పొట్టి ఫార్మాట్లలో రాణిస్తూండటం విశేషం. సాహా ఇప్పటివరకు



దేశీయంగా 164 టీ20 గేమ్స్ ఆడి 2718 పరుగులు చేశాడు. స్ట్రైక్ రేట్ 130.73 ఇందులో 115 నాటౌట్, 14 అర్ధ శతకాలున్నాయి. ఐపీఎల్ వ్యాచుల్లో 104 వ్యాచులాడి 1557 పరుగులు చేశాడు. ఐపీఎల్‌లో అత్యంత వేగవంతమైన శతకం రికార్డు వెస్టిండీస్ బ్యాట్స్‌మన్ క్రిస్‌గేల్ పేర ఉంది. 2013లో ఐపీఎల్ టోర్నీలో గేల్ 30 బంతుల్లో సెంచరీని చేశాడు.

క్రీడాప్రభ



ఇంగ్లండ్‌తో భారత్ ఢీ

ముంబై: ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచుల్లో వరుస ఓటములతో సతమతమవుతున్న మహిళా క్రికెట్ జట్టు, నేటి టీ20 ట్రై సిరీస్ మ్యాచ్‌లో ఇంగ్లండ్‌తో తలపడి విజయాన్ని సాధించి పుంజుకుంటుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఇంగ్లండ్ చేతిలో ఓటమి తప్పించుకోవాలంటే భారత మహిళా జట్టు మిడిలార్డర్, లోవర్ మిడిలార్డర్ మెరుగుపడాల్సి ఉంటుంది. వేదా కృష్ణమూర్తి, హర్మన్‌ప్రీత్ కౌర్, మిథాలి రాజ్‌లు అత్యధిక అనుభవం, నైపుణ్యమున్న క్రీడాకారిణులు.. వారు తమ సత్తాను చాటాల్సి ఉంటుంది. మిథాలి, కౌర్ తొలి దశలో ఇంగ్లండ్ బౌలర్లను కకావికలం చేస్తే తర్వాత రోడ్రిగ్స్ తన జూలు విదిలించి అదే స్థాయిని కొనసాగించాల్సి ఉంటుంది. మంధాన తన తప్పిదాలను సవరించుకుని సాగితే భారత్ బ్యాటింగ్‌కు తిరుగు ఉండదు. అంజు పాటిల్ కూడా తనవంతు పాత్రను పోషించాల్సి ఉంటుంది. బౌలింగ్‌లో జులన్ గోస్వామి ఆసీస్‌తో మ్యాచ్‌లో బాగా రాణించింది. నేటి మ్యాచ్‌లో ఆమె తన

దూకుడును కొనసాగిస్తే మ్యాచ్ భారత్ చేతిలోకి వస్తుంది. అయితే. జులన్‌కు తోడుగా శిఖా పాండే, రుమేలి ధార్‌లు, స్పిన్నర్లు పూనం యాదవ్, దీప్తి శర్మలు కూడా రాణించాల్సి ఉంటుంది. టోర్నీలో ఆసీస్‌తో ఆడిన తన తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్ తేలికగా విజయం సాధించింది. ఆసీస్ స్పిన్నర్లను ఇంగ్లండ్ బ్యాట్స్‌వుమన్లు దీటుగా ఎదుర్కొని పైచేయి సాధించారు. భారత బ్యాట్స్‌వుమన్లు మాత్రం ఆసీస్‌తో ఆడిన మ్యాచ్‌లో స్పిన్నర్లను ఎదుర్కోలేకపోయారు. కౌర సేన ఈ లోపాన్ని గుర్తించింది. నేటి మ్యాచ్‌లో దాన్ని సవరించుకుని బరిలోకి దిగుతుందని అనుకోవచ్చు. కెప్టెన్ కౌర్ మీడియాతో మాట్లాడుతూ ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. భారత జట్టులో గాయపడ్డ రాజేశ్వరీ గ్వైక్వాడ్ స్థానంలో రాదా యాదవ్ జట్టులోకి వచ్చింది.

ఉదయం 10 గంటల నుంచి స్టార్‌స్పోర్ట్స్, హాట్‌స్టార్ ఛానెళ్లలో ప్రత్యక్ష ప్రసారం

ఇంగ్లండ్, కివీస్ తొలిటెస్టు

మూడోరోజు ఆట వర్షార్పణం

ఆక్‌లాండ్: న్యూజిలాండ్, ఇంగ్లండ్‌ల మధ్య జరుగుతున్న తొలి టెస్టు మూడోరోజు ఆటకు వరుణ దేవుడు మళ్లీ ఆటంక కలిగించాడు. రెండో రోజు వాన కారణంగా ఆట సమయం కుదించుకుపోయింది. మూడో రోజు శనివారం కేవలం 17 బంతులు మాత్రమే బౌలింగ్ చేయడానికి సాధ్యమయింది. వాన మళ్లీ రావడం నిరంతరంగా కొనసాగటంతో ఆట నిలిచిపోయింది. టెస్టు తొలి రోజు ఇంగ్లండ్ 58 పరుగులకే కుప్పకూలింది. న్యూజిలాండ్ పట్టు బిగించి తొలి ఇన్నింగ్స్ లీడ్‌ను సాధించింది. రెండో రోజు 23.1 ఓవర్లు మాత్రమే బౌలింగ్ సాగగా, మూడో రోజు 10 నిమిషాల ఆట మాత్రమే సాధ్యమైంది. శుక్రవారం 49 పరుగులతో ఉన్న నికోల్స్ అర్ధ శతకం పూర్తిచేసుకుని 52 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. వాట్లింగ్ 18 పరుగులతో నాటౌట్ ఉన్నాడు. ఇప్పటివరకు న్యూజిలాండ్ 175 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. మరో రెండు రోజుల ఆట మిగిలి ఉండటంతో న్యూజిలాండర్లు విజయంపై ఆశను పెట్టుకున్నారు.

ఆటతో అలసటనే మరిచాము

టీ 20 కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్



ముంబై: ఆటతో అలసట అన్న మాటనే మరిచిపోయామని భారత టీ20 కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ వ్యాఖ్యానించింది. శనివారం కౌర్ మీడియాతో ముచ్చటించింది. మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు ఆమె బదులిస్తూ.. అతిథ్య దేశంగా విదేశాలతో ఆడడం సంతోషంగా ఉందని.. అలసట అన్న ఆలోచన రావటంలేదని పేర్కొంది. ఈ ఏడాది ప్రారంభంలో దక్షిణాఫ్రికా పర్యటన, అనంతరం దేశంలో ఆస్ట్రేలియా జట్టుతో వన్డే సిరీస్, ప్రస్తుతం ఆసీస్, ఇంగ్లండ్‌లతో ముక్కోణపు టీ20 సిరీస్ భారత మహిళా జట్టు ఆడుతోంది. ' అలసట ఎంత మాత్రం లేదు. మా జట్టు అలసటను వ్యక్తం చేయటంలేదు. వరుసగా ఆడుతున్న మ్యాచులతో మేమంతా ఆనందాన్ని ఆస్వాదిస్తున్నాము' అని కౌర్ అంది. వరుసపెట్టి ఆడే ప్రక్రియ మా క్రీడాకారిణులు ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో నేర్చుకునేందుకు ఉపయోగపడుతుందని కౌర్ వ్యాఖ్యానించింది. 'ఇది మాకు ఒక శిక్షణ, అనుభవం వంటింది.

గతంలో మేము వెంటదివెంట సిరీసుల్లో పాల్గొనలేదు. రెండు సిరీస్‌ల మధ్య కనీసం ఆరు నుంచి ఎనిమిది నెలల విరామం ఉండేది. ఒక క్రీడాకారిణి ఎల్లప్పుడు ఒకే రీతికి పరిమితం కాలేదు. పరిస్థితికి తగ్గట్టు మారుతుండాలి. వెంటదివెంట మ్యాచులు ఆడుతుండటం వల్ల అంతేవేగంగా నిలదొక్కు కుంటాము. జట్టు అలసిపోయే సమ స్యే ఉత్పన్నం కాదు. ప్రతీ ఒక్కరు ఆరోగ్యంగా ఉన్నారు. ఇది ఒక అనుభవం' అని హర్మన్ చెప్పింది.

గెలుపు ఓటములు సమానమే

వైస్ కెప్టెన్ స్మృతి మంధాన మంచి ఫామ్‌లో ఉండటం మాకు ఆత్మవిశ్వాన్నిస్తోంది. 'గెలుపు లేదా ఓటమి అన్నది ఆటలో సహజం. మేము గెలిస్తే తప్పులు మరుగునపడతాయి. ఒకవేళ ఓటమి చెందితే.. మంచి ప్రయత్నాలు మరుగున పడతాయి. ఆసీస్‌తో టీ20 మ్యాచ్‌లో మేము గెలవలేదు. స్మృతి బ్యాటింగ్‌లో, జులన్ బౌలింగ్‌లో రాణించారు. ఆసీస్‌తో వన్డే సిరీస్‌తో పోలిస్తే ఈ టోర్నీలో ఫీల్డింగ్ మెరుగుపడింది. మేము గెలవాలనే ఆడతాము. సకారాత్మక ఆలోచిస్తున్నాము. బలాలు, బలహీనతలను గుర్తించాము. బలహీనతలను అధిగమించి కొత్త శక్తిని పెంచుకోవడానికి మేము ప్రయత్నాలు చేస్తున్నాము'.

సర్రే కౌంటీ తరపున కోహ్లీ!



న్యూఢిల్లీ: భారత జట్టు ఇంగ్లండ్‌లో పర్యటించనున్న నేపథ్యంలో అక్కడి పిచ్‌లకు వాతావరణానికి అలవాటు పడటానికి కెప్టెన్ విరాట్ కోహ్లీ కౌంటీ మ్యాచ్‌ల్లో పాల్గొననున్నాడు. ఆగస్టు-సెప్టెంబర్ మాసాల్లో ఇంగ్లండ్‌తో భారత్ టెస్టు సిరీస్ ఆడనుంది. ఏ కౌంటీ తరపున ఆడనున్నది స్పష్టం కానప్పటికి.. లండన్‌లోని సర్రే జట్టు తరపున కోహ్లీ బరిలోకి దిగుతాడని బీసీసీఐ పేర్కొంది. ఇంగ్లండ్‌తో ఆదేశంలో ఆడే ఐదు టెస్టుల సిరీస్‌కు కోహ్లీ అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాడు. ఇందుకోసం జూన్ 14 నుంచి 18 వరకు ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగే సింగిల్ టెస్ట్ మ్యాచ్‌కు కూడా దూరంగా ఉండాలని కోహ్లీ భావిస్తున్నాడు. అదే సమయంలో కోహ్లీ కౌంటీ మ్యాచుల్లో బిజీగా ఉండటమే ఇందుకు కారణం. ఇదే విషయాన్ని బీసీసీఐ పాలన కమిటీ చీఫ్ వినోద్ రాయ్ శనివారం ధ్రువీకరించారు. 'విరాట్ కోహ్లీ జూన్ నెలలో ఇంగ్లీష్ కౌంటీ సర్రే తరపున ఆడుతుంటాడు. ఇందుకు బీసీసీఐ అనుమితించింది. కోహ్లీ టెస్టు సిరీస్‌పై తన దృష్టిని సారించేందుకు ఇది ఉపయోగపడుతుంది. కోహ్లీతో పాటు చటేశ్వర్ పూజారా(యార్క్‌షైర్ తరపున), ఆర్ అశ్విన్(వార్‌విక్‌షైర్), ఇశాంత్ శర్మ(ససెక్స్) కూడా కౌంటీ మ్యాచుల్లో పాల్గొంటున్నారు. విరాట్ ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగే టెస్టును మిస్సవుతాడు' అని వినోద్ రాయ్ మీడియాతో అన్నాడు.

ఇటీవల దక్షిణాఫ్రికాతో భారత్ ఆడిన టెస్ట్ సిరీస్‌ను దృష్టిలో పెట్టుకొని బోర్డు సభ్యులు చర్చించి ఇంగ్లండ్ పర్యటనకు సన్నద్ధం కావడానికి వ్యూహాన్ని కరారు చేశారు. ఐపీఎల్‌లో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున పాల్గొంటున్న కోహ్లీ, ఇది పూర్తి కాగానే ఇంగ్లండ్‌కు బయలు దేరతాడు.

గోల్డ్ కోస్ట్ కామన్వెల్త్ గేమ్స్‌లో ఫ్లాగ్ బేరర్‌గా సింధు



న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాలోని గోల్డ్ కోస్ట్‌లో జరుగనున్న 21వ కామన్వెల్త్ క్రీడల ప్రారంభోత్సవాల్లో షట్లర్ పి వి సింధు భారత జాతీయ పతాకాన్ని చేతబూని మార్చ్ పాస్ట్‌లో పాల్గొననుంది. 2016 ఒలింపిక్ క్రీడల్లో సింధు రజత పతకం గెలుచుకున్న నేపథ్యంలో ఫ్లాగ్ బేరర్ స్థానానికి సింధు పేరును భారత ఒలింపిక్ ఆసోసియేషన్ కరారు చేసింది. కామన్వెల్త్ గేమ్స్ ప్రారంభోత్సవ సమారోహం ఏప్రిల్ 4న జరుగనుంది. ఈ టోర్నీలో సింధు బ్యాడ్మింటన్‌లో హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగనుంది. 2014 గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో సింగిల్స్ విభాగంలో సింధు కాంస్య పతకాన్ని గెలుచుకోగా, ఫ్లాగ్ బేరర్‌గా షూటర్ విజయ్ కుమార్ వ్యవహరించగా, 2010లో ఘూటింగ్‌లో ఒలింపిక్ స్వర్ణ పతక విజేత అభినవ్ బింద్రా ఫ్లాగ్ బేరర్‌గా వ్యవహరించాడు. 2006 మెల్‌బోర్న్ గేమ్స్‌లో డబుల్ ట్రాప్ షూటర్ రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ ఫ్లాగ్ బేరర్‌గా వ్యవహరించాడు.



ఆసియన్ బిలియర్డ్స్ ఛాంపియన్ పంకజ్ అద్వాని

మహిళా స్నూకర్ విజేత కామిని

యూంగోన్(మయన్మార్): ఆసియన్ బిలియర్డ్స్ ఛాంపియన్‌షిప్‌ను డిఫెండింగ్ ఛాంపియన్ పంకజ్ అద్వాని మరోసారి కైవసం చేసుకున్నాడు. శనివారం జరిగిన టైటిలో పోరులో పంకజ్ తన తోటి సహచరుడు బి బాస్కర్‌పై 6-1 తేడాతో గెలిచాడు. ఈ గెలుపుతో పంకజ్ 2017-18కిగాను ఇండియన్, ఆసియన్, ప్రపంచ చాంఫియన్ బిలియర్డ్స్ టైటిళ్లను కలిగివున్న హోదాను పొందాడు. మహిళల పోటీల్లో భారత్‌కు చెందిన అమీ కామిని తాయ్‌లాండ్‌కు చెందిన సిరిపాపొర్న్ నాంథకావ్జాన్‌పై 3-0 తేడాతో విజయం సాధించి ఆసియన్ మహిళల స్నూకర్ టైటిల్‌ను గెలుచుకుంది. ఆసియన్ స్థాయి క్యూ క్రీడల్లో అద్వానికిది 11వ స్వర్ణ పతకం.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.

Lively Interaction For Ever
ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
లైఫ్ I
ఆదివారం 25 మార్చి 2018

శ్రీరామనవమికి వేసే చలువ పందిళ్ళు.. తాగడానికిచ్చే పానకాలు.. తాగుతుండగా గొంతుకకి అడ్డుపడి ఉక్కిరిబిక్కిరిచేసే మిరియాల ఘాటు.. ఈ ఘాటును మరిపించేలా ఓ పాట.. అదే శ్రీ సీతారాముల కల్యాణము చూతము రారండి.. సముద్రాల రాఘవాచార్య రచించిన పాట సుమారు ఆరు దశాబ్దాలుగా తెలుగు నేల నలుచెరగులా వినిపిస్తూనే ఉంది. వినిపిస్తూనే ఉంటుంది. గాలిపెంచల సంగీత దర్శకత్వం వహించిన ఈ పాటలో ఓ బాలిక సీతా దేవి పాత్రను పోషించారు. అమాయకమైన మోము.. స్వచ్ఛమైన నవ్వు.. బెదురు చూపులు.. వెరసి గీతాంజలి రూపు దాల్చింది. సీత పాత్రను పూర్తి స్థాయిలో చేసిన నటి గీతాంజలి. ఆమె తరవాతే అంజలి, జయప్రద, నయనతార తదితరులు ఆ పాత్రలో నటించారు. శ్రీరామ నవమి సందర్భంగా గీతాంజలితో ఆంధ్రప్రభ ప్రత్యేక సంభాషణ...



శ్రీరామ నవమి పర్వదినం వస్తోందంటే నాకు ముందుగా గుర్తుకు వచ్చేది శ్రీ సీతారాముల కల్యాణము చూతము రారండి పాట. సీతారామ కల్యాణం చిత్రంలో నేను సీతగా నటించాను. కథానాయికగా నా మొట్టమొదటి సినిమా కూడా అదే. ఈ చిత్రం చేయడానికి ముందు నేను రెండు చిత్రాలలో డ్యాన్సులు చేశాను. బి.ఎ. సుబ్బారావు దర్శకత్వంలో వచ్చిన రాణీ రత్న ప్రభ అందులో ఒకటి. ఆ చిత్రంలో ఎన్.టి. రామారావు(మేమంతా ఆయనను పెద్దాయన అని పిలుస్తాం) కథానాయకుడు.

సీతాంజలి...

కెంపుల ప్రోవై



తెలుగులో తొలి సినీ సీత

శ్రీరామనవమి సందర్భంగా... ఆంధ్రప్రభ ప్రత్యేకం

అంజలీదేవమ్మ కథానాయిక. వెంపటి సత్యం గారు డ్యాన్స్ మాస్టారు. ఆయనే స్వయంగా నన్ను, మా అక్క స్వర్ణనూ పెద్దాయనకు పరిచయం చేశారు. సినిమా పూర్తయిన తరవాత పెద్దాయన ఓ రోజు చిత్రాన్ని చూస్తున్నారు. మా నాట్యం సన్నివేశాన్ని చూశారు. నా గురించి విచారించి, కబురు పంపారు. నేను మా అక్క, మా నాన్నగారు పెద్దాయన ఇంటికి వెళ్ళాం. ఆ సమయంలో ఆయన సీతాకల్యాణం చిత్రంలో నటించడానికి సీత పాత్రధారి కోసం వెతుకుతున్నారు. నేను నచ్చడంతో కబురు చేశానని పెద్దాయన స్వయంగా చెప్పారు. నన్ను చూస్తూనే మా నాన్నగారితో ... నీ అమ్మాయి చక్కగా లేతగా, చిన్నపిల్లలా ఉంది. అమాయకంగా కనిపిస్తోంది. సీత పాత్రకు సరిగ్గా సరిపోతుంది. మీరు అంగీకరిస్తే వేషం ఇస్తా అన్నారు. మా నాన్న గారు వెంటనే అంగీకరించారు. అప్పుడు నా పేరు మణి. చిత్రం టైటిల్స్‌లో కూడా మణి అనీ, మా అక్క పేరు స్వర్ణ అని వేశారు. అలా నేను మొదటిసారిగా సీత పాత్రతో కథానాయికనయ్యాను.

ఎన్టీఆర్ ఇంట్లో రెండేళ్ళు..

సీత పాత్ర ఓకే కాగానే నేను, మా అమ్మ, నలుగురు అక్కచెల్లెళ్ళు, తమ్ముడు అందరం పెద్దాయన ఇంటికి మారిపోయాం. తమ సంస్థ ఎన్ఎటీలో రెండేళ్ళపాటు నటించేలా మాతో అగ్రిమెంటు రాయించుకున్నారు. నాకు, అక్క నెలకు వెయ్యి రూపాయల జీతం. షూటింగ్ పూర్తయ్యేవరకూ బాహ్య ప్రపంచంలోకి రాకూడదన్నారు. సీత ఇలా ఉంటుంది.. అని ముందుగా ఎవరికీ తెలియకుండా జాగ్రత్త పడ్డారన్నమాట. షూటింగ్ ఉంటే సెట్లో లేదంటే రామారావుగారింట్లో.. ఇలా గడిచిపోయింది. అక్కడే హరికృష్ణ, రామకృష్ణ, బాలకృష్ణ.. అందరం కలిసి ఆడుకునేవారం. వాళ్ళంతా నన్ను సీతక్కా అని పిలిచేవారు. ఆ రోజులు అద్భుతంగా గడిచిపోయాయి. షూటింగ్ సమయంలోనే రామారావు నాకు డ్యాన్సులు నేర్పించారు.

భాషలలో శిక్షణ...

హిందీ, తమిళ భాషలు మాట్లాడడంలో తర్ఫీదు ఇప్పించారు రామారావుగారు. సీతారామకల్యాణం పౌరాణిక చిత్రం కాబట్టి ఉచ్చారణ దోషాలు లేకుండా.. తెలుగులో స్పష్టంగా మాట్లాడేలా నేర్చుకోమని నన్ను పుండరీకాక్షయ్య గారి దగ్గరకు పంపారు. రోజూ రెండు నుంచి మూడు గంటల పాటు శిక్షణ ఉండేది. షూటింగులో ఎక్కడా తప్పులు లేకుండా పలికాను. పొరపాటున ఏదైనా పదం సరిగ్గా పలకకపోతే మళ్ళీ నేర్పేవారు తప్ప పుండరికాక్షయ్య గారు ఎప్పుడూ చిరాకు పడేవారు కాదు. మా ఉచ్చారణ చూసి, పెద్దాయన కూడా బాగా నేర్చుకుంటున్నామని ప్రశంసించేవారు. వెంపటి చిన సత్యం గారి దగ్గర డ్యాన్సులో శిక్షణ పొందాను. వాస్తవానికి ఆ సమయంలో నాకు నటన అంటే ఏమిటో తెలీదు. కెమెరా అంటే అస్సలు తెలియదు. ఆ సమయంలో పెద్దాయనే మాకు అన్నీ. ఆయన ఏది చెబితే అది చేస్తూ, భయభక్తులతో అన్నీ నేర్చుకున్నాను. ఆయన దగ్గర అవకాశం దొరకడమే మా అదృష్టం. సాక్షాత్తు వెంకటేశ్వరుడే ఆయన రూపంలో వచ్చి, మమ్మల్ని ఆదుకున్నారనుకుంటాం.

సీతంటే ఇలాగే ఉంటుందా... అనిపించాలనేవారు

నేను ఎంతో ఊహించి తీస్తున్న సినిమా ఇదని రామారావుగారు చెప్పేవారు. మీరేం చేయద్దు. నేనెలా చెబితే అలా అనుకరించండి చాలనేవారు. నువ్వు కెమెరా ముందు నుంచుంటే చాలు. సీతంటే ఇలాగే ఉంటుందేమో అనుకోవాలి ప్రేక్షకులు అనేవారు. నన్ను, హరనాథ్‌రాజునూ రామారావుగారు సీతారాములుగానే పరిగణించారు. రామారావుగారి కష్టం ఊరికే పోలేదు. శ్రీ సీతారాముల కల్యాణము చూతము రారండి అనే పాట ఒక్కటి చాలు.. మొత్తం సినిమాను చూపించేస్తుంది. ఎప్పటికీ అందరి గుండెల్లో కొలువై ఉంటుంది. శ్రీరామనవమికి ఏ పందిట్లో చూసినా, ఏ గుడిలో విన్నా అదే పాట ప్రతిధ్వనిస్తుంటుంది. ఈ పాట షూటింగ్ నాలుగైదు రోజులు పట్టింది. సీత పాత్రలో నన్ను అలంకరించడానికే చాలా సమయం తీసుకుంది. బొట్టు పెట్టడం.. బుగ్గన చుక్క పెట్టడం, నగలు అలంకరించడం.. ఇలా దేనికి దానికి షాట్స్ తీశారు. తరవాత రాముడిపై షూట్ చేశారు. హరనాథ్ జుట్టుకు సంపెగ నూనె రాశారు. తిలకం దిద్దారు. అవన్నీ చూశాం. మాకు షూటింగ్ లేనప్పుడు ఇతర పాత్రల షూటింగ్ చూశాం. పారాణి రాయడం, బొట్టు పెట్టడం, అలంకరించడం చూస్తుంటే వైకుంఠం కళ్ళ ముందు సాక్షాత్కరించినట్లుండేది. ఇప్పుడు తలచుకుంటే ఆ వైభవం గుర్తొచ్చి ఒళ్ళు పులకరిస్తుంది. సీతారాముల కల్యాణం పాట షూటింగు ఇంకా వైభవోపేతం.

ఎంతో అందంగా అలంకరించారు..

ఇక సీతారామ కల్యాణం సినిమా విశేషాలకు వస్తే.. ఆ చిత్రంలో నన్ను ఎంత అందంగా అలంకరించారో మాటల్లో చెప్పలేను. అందులో పెద్దపెద్ద నటులంతా నటించారు. నాగయ్య, మిక్కిలినేని, శోభన్ బాబు, గుమ్మడి, కెవిఎస్‌వి శర్మ, కస్తూరి శివరాం, ఛాయాదేవి, హరనాథ్‌రాజు.. అందరూ హేమాహేమీలే. నేను చిన్న పిల్లని. చిన్న నటిని కూడా. ఆ చిత్రంలో మొత్తం నాలుగు పాత్రలు ధరించాను. మాతులింగి, వేదవతి, సీతాదేవి, లక్ష్మీదేవి. ఈ సినిమా విడుదలై సుమారుగా అరవై ఏళ్ళు అవుతున్నా నేటికీ చిరస్మరణీయంగానే ఉంది. ఇందులోని పాటలు నూతనంగానే ఉన్నాయి. చిత్రంలోని ప్రతిపాట నాకు గుర్తుకు వస్తూనే ఉంటుంది.



అదిగో సీత

సీత పాత్ర చేసే సమయంలో నా వయసు 14ఏళ్ళు. అప్పుడు ఏం చేస్తున్నానో కూడా నాకు తెలీదు. సీతారాముల కల్యాణం పాట రిహార్సల్ ఎన్ని రోజులు చేశారో కూడా గుర్తు లేదు. ఎప్పుడడిగినా ఎన్టీఆర్ రిహార్సల్‌లో ఉన్నారని చెప్పేవారు. మాకేం తెలిసేది కాదు. సినిమా చూసిన తరవాత కూడా అంతగా అనిపించలేదు. తరవాత తెలిసింది ఆ చిత్రం గొప్పదనం.. ఆ పాట తియ్యదనం. బయటకెళ్ళినప్పుడు చూసిన వారు అదిగో సీత అంటూ చుట్టుముట్టేవారు. ఆ పాట పాడి వినిపించే వారు. మీ జన్మ ధన్యమైందంటూ ప్రశంసించేవారు. ఇప్పటికీ గుళ్ళకి వెళ్ళినప్పుడు ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఆ సమయంలో ఒళ్ళు పులకరించేది. ఇలాంటి అదృష్టం ఎంతమందికొస్తుందనిపించేది. వచ్చి దణ్ణం పెట్టేవారు. సీతమ్మని ఇలా పుట్టించారనేవారు. అది నా అదృష్టం.

నువ్వు సీత పాత్రలో నటించనక్కర లేదు. అలా చూస్తే చాలని పెద్దాయన చెప్పారు. ఆయన చెప్పింది చేస్తే చాలు.. అదే నటన. నా తరవాత సీత పాత్రలో అంజలీ, జయప్రద నటించారు. సీత పాత్రలో అంజలి ఒదిగిపోయారు. సీతంటే ఈమె అనుకునే వారు. తరువాత అంతటి పేరు నాకొచ్చింది. అదంతా రామారావుగారి ప్రోత్సాహమే. ఒక వాలు చూపు చూడమనేవారు.. అంతే.. బుగ్గన వేలు పెట్టుకుని ఇలా చూడు అనేవారు. చెయ్యి ఇలా పట్టుకో అనేవారు. ఇదే నేను చేసిన నటన. అత్యంత సహజంగా వచ్చింది ఆ పాత్ర. బాపుగారి సీతా కల్యాణం సినిమాలో పూర్తి స్థాయి సీత పాత్రలో జయప్రద ఒదిగిపోయారు.

శ్రీరామనవమిలా విడుదల వేడుక

సినిమా విడుదల రోజున రామారావు గారు వాహినీ స్టూడియోలో పెద్ద విందు ఏర్పాటు చేశారు. పెద్ద పెద్ద ఆర్టిస్టులంతా వచ్చారు. పానకం, వడపప్పు తయారు చేయించారు. వీటిని పసుపు, కుంకంతో పాటు పెద్దపెద్ద గిన్నెలలో పెట్టారు. నన్ను మా అక్కనీ అక్కడ నిలబెట్టారు. రామారావుగారు కూడా మా పక్కన నిలబడ్డారు. సావిత్రి, అంజలి, వంటి నటులు, నాగిరెడ్డి, చక్రపాణి, వంటి హేమాహేమీలైన నిర్మాతలు వచ్చారు. పెద్దాయన మమ్మల్ని పరిచయం చేశారు. అందరూ మమ్మల్నిద్దర్నీ చూసి, ఆశ్చర్యపోయారు. ఎంపిక చాలా చక్కగా ఉందని ప్రశంసలు కురిపించారు. సీతమ్మంటే సీతమ్మలా ఉందని అన్నారు. చిన్నతనం, అమాయకత్వం మేళవించిన వదనం అందరికీ బాగా నచ్చింది. ఆ రోజున అందరి ఆశీర్వచనాలూ, ప్రశంసలూ అందుకున్నాం. సినిమా విడుదల వేడుకను శ్రీరామ నవమిలా నిర్వహించారు. ఆ రోజు నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. పెద్దాయన ఆ రోజున చేసిన వైభవం అలాంటింది.



తొట్రుపడ్డాను.. ఎన్టీఆర్ గద్దించారు

శేషపాన్పుపై విష్ణువుకు సేవ చేస్తున్న సన్నివేశం షూటింగ్ సమయంలో ఈ సంఘటన జరిగింది. రాత్రి 11.30 గంటలకు షూటింగ్ చేశారు. ఎత్తయిన పెద్ద మంచంపై ఈ సెట్ వేశారు. సీన్ చూడడానికి పెద్దాయన రెండు బల్లలు వేసుకుని నిలబడ్డారు. ఓ భక్తుడు లక్ష్మీ దేవిని కటాక్షించమని ప్రార్థిస్తాడు. వెళ్ళి ఆదుకోమని విష్ణువు చెప్పినా లక్ష్మి కదలదు. మిమ్మల్ని వదిలి వెళ్ళనంటుంది. ఈ సన్నివేశంలో నువ్వు కన్నీరు కార్చాలని పెద్దాయన చెప్పారు. ఆయన ఎదురుగా ఉండడంతో కొంచెం భయపడ్డాను. డైలాగు చెప్పడంలో తొట్రుపడ్డాను. రామారావుగారికి చిరాకూ, కోపమూ రెండూ వచ్చాయి. పగటి పూట ఏం చేస్తున్నావ్. పుండరీకాక్షయ్య దగ్గర నేర్చుకోమన్నాను కదా. నేర్చుకోలేదా అని కోపంగా గద్దించారు. వెంటనే ఏడ్చేశాను. కంగారు పడిన రామారావుగారు ఛీఛీ ఏడవకూడదంటూ సర్ది చెప్పారు. అప్పుడు మా నాన్నగారు వాహినీ స్టూడియో ఆవరణలో నన్ను తిప్పుతూ ధైర్యం చెప్పారు. హరనాథ్‌గారు కూడా ధైర్యం చెప్పారు. మళ్ళీ చెప్పమన్నారు. మూడు నాలుగు షాట్ల తరవాత రామారావుగారికి కోపం తగ్గింది. అది తలచుకుంటే ఇప్పటికీ ఆనందం వేస్తుంది.

అదే నేను చేసిన పెద్ద తప్పు

ఎల్వీ ప్రసాద్‌గారి ఇల్లాలు చిత్రంలో హీరోయిన్‌గా నటించాను. ఆ తరవాత డాక్టర్ చక్రవర్తి చిత్రంలో నాగేశ్వరరావుగారికి చెల్లెలు పాత్ర లభించింది. తరవాత మురళీకృష్ణలో అద్భుతమైన పాత్ర దక్కింది. ఇంత అద్భుతంగా కెరీర్ ఉన్న సమయంలో కమెడియన్ పాత్ర అంగీకరించి తప్పు చేశాను. పద్మనాభం గారి దేవతలో ఆ పాత్ర చేయడమే నేను చేసిన తప్పు. నా కెరీర్‌లో పెద్ద పొరపాటు. అక్కడి నుంచి నామీద దర్శకుల దృష్టి మారిపోయింది. కామెడీతో పాటు వ్యాంప్ పాత్రలు కూడా వేయించారు. సోలో డ్యాన్సులు వేయించారు. ఇలాంటి పాత్రలు చేయిస్తూ నన్ను హీరోయిన్ పాత్ర నుంచి తప్పించేశారు. లేకపోతే టాప్ హీరోయిన్ స్థాయికి చేరి ఉండేదాన్ని. రామారావుగారు, సావిత్రిగారు హీరోహీరోయిన్లుగా ఉన్న చిత్రంలో మీ పాత్ర కామెడీ అవ్వదులెండి అని చెప్పి పద్మనాభం గారు ఒప్పించారు. ఇది పద్మనాభం గారు చేసిన తప్పు. నేను అంగీకరించడం మరో తప్పు. దీనివల్లే నాకు హీరోయిన్ పాత్రల అవకాశాలు తగ్గిపోయాయి. క్యారెక్టర్లను జాగ్రత్తగా ఎంపిక చేసుకుని చేసుకోమని అప్పుడే రామారావుగారు నాకు సలహా ఇచ్చారు. పొట్టి ప్లీడరు, లోగుట్టు పెరుమాళ్ళకెరుక, అబ్బాయిగారు- అమ్మాయిగారు చిత్రాల్లో చేశాను. హరనాథ్, చలం, శోభన్‌బాబు, రామమోహన్ ఇలా చాలామంది హీరోలపక్కన హీరోయిన్‌గా చేశాను. హీరోయిన్‌గా 50పైగా సినిమాల్లో నటించాను.

గీతాంజలి నవ్వితే చాలన్నారు ఆదుర్తి

డాక్టర్ చక్రవర్తిలో నాగేశ్వరరావుగారి చెల్లెలు పాత్ర నాకు చిరస్మరణీయంగా నిలుస్తుంది. ఆ పాత్రకు నన్ను ఎంపిక చేసినప్పుడు ఆలోచించుకోకుండా చక్కగా నటించు. నీ అమాయకత్వం ఈ పాత్రకు అతికినట్లు సరిపోతుంది అని దుక్కిపాటి మధుసూదనరావు గారు చెప్పారు. ఆ పాత్ర గురించి ఆయనే వివరించారు. అది సినిమాకి మూలమైన పాత్రని చెప్పారు. ఆ సమయంలో ఆదుర్తి సుబ్బారావుగారు.. గీతాంజలి నటించక్కర్లేదండి.. నవ్వితే చాలు అన్నారు. మొహంలో అమాయకత్వం ఉండడం ప్రత్యేకత, అది చాలు ఈ క్యారెక్టరుకు అన్నారు. కె విశ్వనాథ్‌గారు ఈ చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్. సారథి స్టూడియోలో రోజూ నాకు డైలాగ్ డెలివరీ నేర్పించేవారు. నాకు మరపురాని పేరు తెచ్చిపెట్టిన పాత్ర అది. నాగేశ్వరరావుగారి చెల్లెలుగా నటించే అవకాశం రావడం ఒక అదృష్టమైతే.. సావిత్రి గారి పాత్రలో నాగేశ్వరరావుగారు నన్ను చూసుకోవడం మరింత మధురానుభూతిని మిగిల్చింది. ఆ సినిమాలోని పాడమని నన్నడగ వలెనా.. పరవశించి పాడనా అన్న పాట నాకెంతో పేరు తెచ్చిపెట్టింది. నా సూపర్ హిట్ సాంగ్స్‌లో అదొకటి. ఇల్లాలు చిత్రంలో.. నీ ఇల్లాలుగా నేనుంటాను అనే పాట కూడా నాకు అత్యంత మధురమైనది. నువ్వొక చోట.. నేనొక చోట..అంటూ ఆ పాట సాగుతుంది. అన్ని పాటలలో డ్యాన్సులు కూడా బాగా చేశాను. చలం గారి సినిమాలన్నింటిలోనూ నటించాను. ఒక బ్యానర్‌లో ఏడు సినిమాలుంటే అన్ని సినిమాలకూ పనిచేశాను.

(తరువాయి III లో)

సీతరాలు మారాయి

'నేనేమీ రామాయణం కాలం నాటి సీతను కాను...నువ్వు ఏమన్నా పడి ఉండటానికి' ఇలాంటి డైలాగులను మనం సినిమాలు సీరియల్స్‌లో వింటూ ఉంటాం. రాముడు ఏకపత్నీవ్రతుడైతే...సీత ఆయన మాటని జవదాటని ఇల్లాలు. దాంతో ఆమె జీవితమంతా కష్టాలనే అనుభవించింది. అందుకే సీత పేరు పెట్టుకుంటే కష్టాలే...అనే నానుడి కూడా వచ్చింది. మరి రామాయణాన్ని జీవన ప్రమాణ గ్రంథంగా స్వీకరించిన మనదేశంలో...మహిళలు నేటికీ అవే కష్టాలు పడుతున్నారా...వారి జీవితమేమన్నా మారిందా...అనే ప్రశ్న వేసుకుంటే...ముందుగా ఒక మాట చెప్పుకోవాలి. నాటి సీత కూడా సబలే...ఎందుకంటే ఆమె రావణుడు ఎత్తలేని శివధనస్సుని ఆడే పాడే వయసులోనే అలవోకగా ఎత్తింది. ఎన్నో కష్టాలను నిబ్బరంగా సహించింది. అయితే నాటి సామాజిక పరిస్థితులను బట్టి...సీత తన శక్తిని బయటకు వెల్లడించలేదు అంతే. ఆ సీత వారసులైన నేటి అమ్మాయిలూ సబలలే. నాటి సీతకు నేటి వనితలకు ఉన్న తేడా ఏమిటంటే..వీళ్లు సీతలా తమలోని శక్తిని దాచకుండా బయటకు వెల్లడిస్తున్నారు...


రామాయణంలో సీత ఉనికి ప్రత్యేకం. అయినా రామాయణం మొత్తంలో ఆమె జనకుని కుమార్తెగా, రాముని అర్థాంగిగా...లక్ష్మణుని వదినగా, రావణుడిచేత మోహించబడిన స్త్రీగా, లవకుశులనే ఇద్దరు చిన్నారుల తల్లిగా మాత్రమే ఎక్కువగా కనబడుతుంది. ప్రతి చోట సీత ఒద్దిక, ఒదిగిఉన్నతనం, పరిస్థితులను బట్టి తనను తాను మార్చుకున్న సర్దుబాటు ధోరణి, సమాజం మెచ్చేలా బతకాలనే తపన...ఇవే ఎక్కువగా మనకు కనబడతాయి. శక్తి ఉన్నా...అలా ప్రవర్తించడం వలన సీత పాత్రలో మనం పరస్పర విరుద్ధమైన లక్షణాలను చూస్తాం.

ఆ ఆలోచనల కంచెని దాటుతున్న నేటి జనకులు!

నాటి సీతలాగే నేటి అమ్మాయిలు కూడా శక్తిమంతులే. అన్నింటా మగవారితో సమానులు, ఒక్కోసారి అంతకంటే ఎక్కువ కూడా. నేటి సీతలకు కలిసొస్తున్న అంశమేమిటంటే...వారు తమ శక్తిని చాటుకునే పరిస్థితులు ఉన్నాయి. శివధనస్సు ఎత్తిన సీతకు...యుద్ధవిద్యలు అన్నీ నేర్పి రాజ్యాన్ని కట్టబెట్టకుండా జనకుడు అంతకంటే శక్తిమంతుడికి ఇచ్చి పెళ్లి చేసి పంపేయాలనుకున్నాడు. అంతేకానీ...నా కుమార్తె ఎంత బలవంతురాలో చూడండి...అంటూ సభలో ఆమెచేత ఆ శివధనస్సుని ఎత్తించలేదు. ఇది శక్తిసామర్థ్యాలు ఉన్నా..మహిళలు ప్రదర్శించకూడదు అనే నిబంధనను సూచిస్తుంది. ఇదంతా నాటి సంస్కృతి. ఇప్పటికీ ఇలాంటి ఆలోచనలు చేసేవారున్నా...చాలావరకు నేటి సీతలు...వారి జనకులు ఆ కంచెని దాటుతున్నారు. కుమార్తెని పిజి వరకు చదివిస్తే మరింత చదువుకున్నవాడిని తెచ్చి వివాహం చేయాల్సివస్తుందనే ఆలోచన నేటి జనకుల్లో కనిపించడంలేదు. ముందు కుమార్తెని బాగా చదివించి ఆమె కాళ్లమీద ఆమె నిలబడేలా చేద్దామని...అనుకుంటున్నారు. అంతేకాదు...తమ కుమార్తెకంటే తక్కువ చదువు సంపాదన ఉన్నవాడికి ఇచ్చినా...ఆమె తన సంపాదనతో, శక్తితో తననితాను పోషించుకోగలదులే...అనే భరోసాతో ఉంటున్నారు.

భార్య శక్తిని గుర్తిస్తున్న ఆధునిక రామయ్యలు

సీత శక్తి మంతురాలే అయినా తన ఉనికిని, స్వతంత్రతని చాటుకున్న సందర్భాలు రామాయణంలో తక్కువ. రాముడు అడవులకు వెళుతుంటే అతనితో పాటు వెళుతుంది...రావణుడు ఎత్తుకుపోతే...రాముడు వచ్చేవరకు అశోకవనంలో శోకిస్తుంది. అయితే నా అడుగుజాడలే నీ లోకం ...అన్నట్టుగా ఉన్న నాటి అయోధ్య రామయ్యలా నేటి ఆధునిక రామయ్యలు ఉండటం లేదు. తమ భార్యకున్న ప్రత్యేకతలను గుర్తిస్తున్నారు. భర్త ప్రోత్సాహంతో చదువుకుంటున్న, ఉద్యోగాలు చేస్తున్న మహిళలు ఎంతోమంది మన చుట్టూ కనబడుతున్నారు. అదే జరగకపోతే...ఇన్ని రంగాల్లో స్త్రీలు ఇంతగా రాణించే అవకాశం ఉండేది కాదు. నేటి సీతలు రాముడు ఎక్కడుంటే...అక్కడే ఉండాలని అనుకోవటం లేదు. 'నా ఉనికిని, శక్తిని ప్రదర్శించేచోట నేను ఉంటాను' అంటున్నారు. రాష్ట్రాలు దాటి, భర్త పిల్లలను వదిలి ఉద్యోగాలు చేస్తున్న ఐఎఎస్‌లు ఐపిఎస్‌లు మనకు తరచుగా కనబడుతుంటారు. అలాగే రాముడు వచ్చేవరకు సీత లంకలో ఉంది కానీ...నేటి సీతలు తమని తాము రక్షించుకోవడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. రక్షించుకోవడం అంటే నేటి పరిభాషలో తమ ఉనికిని నిలబెట్టుకోవటం అనుకుంటే... తాను అబలగా ఉండటమే భర్తని గౌరవించడమని నేటి సీతలు భావించడం లేదు. భర్తకంటే ఎక్కువ సంపాదిస్తున్న, ఎక్కువ పేరు తెచ్చుకుంటున్న భార్యామణులు నేడు ఎంతోమంది కనబడుతున్నారు.



అశోకవనంలో దుఃఖితలు కాదు...ఆటకట్టించే కాళికలు

రావణుడు బలవంతంగా తీసుకువెళ్లి సీతని బందీగా చేయటం అనేది నాటి సమాజంలో స్త్రీ పరిస్థితిని చెబుతుంది. నేటికీ స్త్రీ వస్తువు, సంపదలతో సమానం అనే భావాలు ఉన్నా...తమ జీవితాలను తామే నిర్దేశించుకోవాలనే తపన మహిళల్లో పెరిగింది. రాముడికోసం ఎదురుచూస్తూ... బందీగానే ఉంటూ..తనని తాను విముక్తి చేసుకోవాలన్న ఆలోచనే లేనట్టుగా ఉంటుంది నాటి సీత. కానీ నేటి సీతలు...ఎవరో వస్తారని...అన్నట్టుగా ఎదురుచూడటం లేదు. తమని అవమానించే పరిస్థితులుఎదురైనప్పుడు మహిళలు ఎదురుతిరిగి కేసులు పెట్టటం, దుండగులను కాలర్ పట్టుకుని లాక్కెళ్లి పోలీసులకు అప్పగించడం లాంటివి ఇప్పుడు తరచుగా కనబడుతున్నాయి. నేటి షీ టీములు...తనని తాను రక్షించుకునే స్త్రీలకు ప్రతిరూపాలే.

అత్తింటి వారు మారుతున్నారు...లక్ష్మణ గీతలు గీయటం లేదు

శివధనస్సు విషయంలో సీత రావణుడికంటే బలవంతురాలని తేలిపోయింది. అలాంటి సీతకు లక్ష్మణుడు గీతలు గీసి...ఇవి దాటకు అంటాడు. లక్ష్మణుని గీతలు అత్తింటివారి ఆంక్షలు అనుకుంటే...అవి కూడా నేటి సీతలకు తగ్గుతున్నాయి. ఉద్యోగం చేస్తూ, తమ ఉనికిని నిలబెట్టుకుంటున్న అమ్మాయిలకు అత్తవారింటి అండ దొరుకుతోంది. పిల్లలను తాము పెంచుతూ కోడళ్లను ఉద్యోగానికి పంపుతున్న అత్తమామలు ఇప్పుడు ఎంతోమంది కనబడుతున్నారు.

✍ వి.దుర్గాంబ

మానవునికి దగ్గరైన అవతారం

చింతన



శ్రీరామనవమి రాముని పుట్టిన రోజు. మహావిష్ణువు పురుషోత్తమునిగా ఈ భూమిపై అడుగిడిన రోజు. రాముడు కొందరికి చారిత్రక పురుషుడిగా కనిపిస్తాడు. మరికొందరికి పాపాలను హరియించే కోదండరామునిగా కనిపిస్తాడు. ఎవరికెలా అనిపించినా ఆ రాముడు మనందరికీ దేవుడు. జగమేలే జగదభిరాముడిగా పేరెన్నికగన్నాడు. అవతారపురుషుడైనా **'మానవుడను నేను, మానవత్వమే నా ధర్మము'** అని తనకు హితవు చెప్పవచ్చిన ఋషీశ్వరులతో అన్నాడు. అంతేకాదు పితృవాక్పరిపాలన ఎంతటిదో చాటాడు. జన్మభూమి కన్నా మిన్న అయినది ఏదీ లేదని అన్నాడు. అంటే అటు కన్నతల్లిని, ఉన్న ఊరును ప్రేమించిన రాముడు తాను ధర్మాచరణ చేయడమే కాదు, తన ప్రజలందరి చేత ఆచరింపజేశాడు. సుమారుగా 11 వేల ఏళ్లు రామ రాజ్యం విలసిల్లింది. త్రేతాయుగంలోని రామరాజ్యం కలియుగంలోనూ కోరుకునేంతగా పరిపాలన నడిపాడు. యుగాలు దూరమైనా రాముడు అందరికీ దగ్గరే.

మానవత్వం పోత పోస్తే అది రాముని రూపం అవుతుంది. మరో పక్క **రామో విగ్రహవాన్ ధర్మః** (రాముడు మూర్తీభవించిన ధర్మ స్వరూపం) అని రాక్షసుడైన మారీచుడే అన్నాడు. పరిపూర్ణత చెందిన మానవుడు ఎలా ఉంటాడు అంటే అందుకు శ్రీరామచంద్రుడే ప్రత్యక్ష, ఏకైక ఉదాహరణ. నేటికీ వ్యక్తిత్వం ఇలా ఉండాలని చెప్పేటప్పుడు దానికి తార్కాణంగా రాముణ్నే చెబుతాం. మనుషులు ఎలా ఉండాలి అంటే దానికి రాముడే మార్గదర్శి. రాముడు ఆచరించిన ధర్మం కాని, నిర్వహించిన పాలనా వ్యవహారాలు కాని సార్వజనీనమైనవే కాదు సార్వకాలికమైనవి కూడా. ఆయన్ను మర్యాదా పురుషోత్తముడన్నారు. ఆయన పాలన రామరాజ్యమైంది. ఆయన సమాజం ఆదర్శమైంది. సాక్షాత్తు నారాయణుని అవతారం అని దేవతలు, ఋషులు, సజ్జనులు అన్నా **'ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజం'** అని తాను మానవుణ్ణని, దశరథుని కుమారుడను అని సాధా రణ వ్యక్తిగా రాముడు తనను తాను చెప్పుకున్నాడు. అందుకే ప్రతి ఇంట్లోనూ రాముడు కొలువు తీరే ఉన్నాడు. రాముడు పండుగా ఉన్నాడు (రామాఫలం), వ్యక్తిగా ఉన్నాడు (రామారావు), స్త్రీమూర్తిగా (రామలక్ష్మి), పక్షిగా (రామ చిలుక), మృగంగా (రామ మృగాలనేవి ఇంతకు ముందు కాలంలో ఉండేవంటారు). ఇలా రాముడు ఎక్కడ లేడు, అంతటా నిండి ఉన్నాడు. కనుకనే విష్ణుమూర్తి అవతారం అన్నారు. సాధారణ మానవునిగానే దశరథ పుత్రుడు జీవించాడు. సాధారణ పౌరుడు ఎదుర్కొనే సుఖదుఃఖాలను అనుభవించాడు. వాటిని సమ ర్థంగా అధిగమించాడు. అందుకే లోకారాధ్యుడయ్యాడు. లోకకంటకుడైన రావణుని వధించి విశ్వకళ్యాణాన్ని సాధించాడు. రామాలయాలు ఎన్నో ఉన్నాయి. ఉత్తరాది నుంచి దక్షిణాది వరకూ. తెలుగు రాష్ట్రాలు రెండింటిలో ఉన్నాయి. తెలంగాణలో భద్రాద్రి, ఆంధ్ర ప్రదేశ్‌లో ఒంటిమిట్ట ప్రముఖమైన వాటిలో కొన్ని. రాముడు కొలువై ఉండి భక్తులను అనుగ్రహిస్తున్న ఈ రెండు ఆలయాలలో కొన్ని ప్రత్యేకతలున్నాయి. ఆ స్థల పురాణ చరిత్రలను క్లుప్తంగా తెలుసుకుందాం.

సాక్షాత్తు నారాయణుని అవతారం అని దేవతలు, ఋషులు, సజ్జనులు అన్నా 'ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజం' అని తాను మానవుణ్ణని, దశరథుని కుమారుడను అని సాధారణ వ్యక్తిగా రాముడు తనను తాను చెప్పుకున్నాడు. అందుకే ప్రతి ఇంట్లోనూ రాముడు కొలువు తీరే ఉన్నాడు. రాముడు పండుగా ఉన్నాడు (రామాఫలం), వ్యక్తిగా ఉన్నాడు (రామారావు), స్త్రీమూర్తిగా (రామ లక్ష్మి), పక్షిగా (రామ చిలుక), మృగంగా (రామ మృగాలనేవి ఇంతకు ముందు కాలంలో ఉండేవంటారు) ఇలా రాముడు ఎక్కడ లేడు, అంతటా నిండి ఉన్నాడు.

వెన్నెల్లో రాములోరి కల్యాణం



ఒంటిమిట్ట కడప జిల్లాలో ఉంది. దీనికి సంబంధించి స్థల పురాణం ప్రకారం ఇక్కడి ఆలయంలో భాగవతార్ల ప్రవచనాలు విన్న ఒంటెడు, మిట్టడు అనే ఇద్దరు దొంగలు పరివర్తన చెంది, కష్టించి డబ్బు సంపాదించి దానితో ఈ ఆలయాన్ని నిర్మించి సీతారామలక్ష్మణ విగ్రహాలను గుడిలో ప్రతిష్ఠించారని చెబుతారు. వారి పేరు మీదే దీనికి ఒంటి మిట్ట అనే పేరు వచ్చిందని చెబుతారు. ఇది కాక మరో కథ ప్రకారం త్రేతాయుగంలోనే సీతాపహరణకు ముందు ఒక సారి సీతారామలక్ష్మణులు ఒంటిమిట్ట ప్రదేశానికి వన విహారానికి వచ్చారు. ఆ సమయంలో అక్కడ ఉన్న భల్లూక రాజు జాంబవంతుడు రాముడు విష్ణువు అవతారమని తెలిసిన వాడవడం చేత తలవని తలంపుగా వారిని చూసి ఆనందించి, ఇలాంటి ఆనందం రాబోయే తరాల వారికి కూడా కలిగించేందుకు వారి విగ్రహాలు అక్కడ ప్రతిష్ఠిస్తానని అన్నాడని చెబుతారు. జాంబవంతుని కోరిక విని రాముడు 'నీవు మా మూర్తులను తయారుచేయి. రాబోయే కాలంలో మాకోసం ఇద్దరు భక్తులు గుడిని నిర్మిస్తారు. అప్పుడు మేము అక్కడ ఉంటాము. నీ కోరికా తీరుతుంది' అని చెప్పాడని అంటారు. ఇదంతా రామలక్ష్మణులు అరణ్యానికి వెళ్లటానికి ముందు జరిగిందని చెబుతారు. అందువల్లే అక్కడ రాముని పక్కన ఆంజనేయుని విగ్రహం లేదని అంటారు. ఆ మూర్తులే నేటి ఒంటిమిట్టలో ప్రతిష్ఠించబడి ఉన్నాయంటారు. ఈ ఆలయ ముఖద్వారం 160 అడుగుల ఎత్తున ఉంటుంది. ఈ ఆలయం మీద ఉన్న శిల్ప సంపద వెలకట్టలేనిది. అద్భుతమైన శిల్పకళా మందిరంలాగా కనబడుతుంది. మనదేశానికి వచ్చిన ఒక ఫ్రెంచి యాత్రికుడు ఈ ఆలయాన్ని దర్శించి ఇక్కడ శిల్ప కళ మహాద్భుతం అని, ఈ ఆలయ గాలిగోపురం వంటిది ఇంకోటి తాను మరెక్కడా చూడలేదని తన డైరీలో రాసుకున్నాడని చరిత్రతో సంబంధం ఉన్నవారు చెబుతారు. తర్వాతి కాలంలో ప్రఖ్యాత వాగ్గేయకారుడు అన్నమయ్యస్వామిని దర్శించి తనివితీరా ఆరాధించి అనేక వేల కీర్తనలను పాడి స్వామికి సమర్పించాడని అంటారు.

భాగవతాన్ని తెనుగులోకి అనువదించిన పోతనామాత్యుడు ఈ రాముడే తనకు ఇష్టదైవమని చెప్పి తాను రచించిన భాగవతాన్ని ఒంటిమిట్ట రామునికి అంకితం చేశాడని చెబుతారు.

అంతేకాదు ఆంధ్రా వాల్మీకిగా ప్రసిద్ధి చెందిన వావిలికొలను రామదాసు ఇక్కడే నివసించేవారు. రోజూ ఈ రాముణ్ణే కొలిచారు. అష్టదిగ్గజ కవుల్లో ఒకరైన రామభద్రకవి కొంత కాలం ఈ రామాలయ పరిసర ప్రాంతాల్లో నివసించి ఈ రాముణ్ణి సేవించాడని చెబుతారు.

ఇక్కడి మరో విశేషం ఈ ఆలయంలోని సీతారాములకు వెన్నెల వేళ కల్యాణం జరపడం. ఎందుకిలా చేస్తారంటే పూర్వం క్షీరసాగర మథనం చేసినప్పుడు మహాలక్ష్మీదేవి ఆ సాగరంలోంచి వచ్చిందని, అప్పుడు దేవతలంతా మహావిష్ణువును ఆ మహాలక్ష్మీదేవిని పెళ్లిచేసుకోమని చెప్పి వారిద్దరి వివాహాన్ని చేశారని, అది పగలు జరిగినందున రాత్రి మాత్రమే వెన్నెల ఇవ్వగల చంద్రుడు, (ఆయనా క్షీరసాగరం నుంచి పట్టినందున మహాలక్ష్మీదేవికి సోదరుడు) తన వెన్నెల వెలుగులో నీవు పెళ్లిచేసుకోవాలని అడిగాడని, దానితో ఆ మహావిష్ణువు నీ కోరిక ఒంటిమిట్ట రామాలయంలో రామునిగా ఉన్నప్పుడు తీరుస్తానని చెప్పాడని జనశృతి. అందుకే ఈ సీతారాములకు సాయంత్రం వేళ కల్యాణం జరుపుతారు.

జంగం శ్రీనివాసులు
8374894743



శంఖచక్రాలతో రాముడు

భద్రాచలం ఖమ్మం జిల్లాలో ఉంది. భద్రుడనే భక్తుని పేరు మీద ఇది భద్రాద్రి అయింది. రామభక్తులలో భద్రుడు ఒకడు. రాముని చూడాలనుకున్నాడు. తపస్సు చేశాడు. స్వామి కనిపించాడు. ఏమి కావాలన్నాడు. 'నీవు నాపై కూర్చుని ఉండు' అన్నాడు. రాముడు సరేనన్నాడు. అయినా భద్రుని కోరిక తీరలేదు. ఎన్నో అర్చనలు చేసినా రాముడు రాలేదు. మళ్లీ తపస్సు ప్రారంభించాడు. భద్రాద్రినే తపో భూమి చేసుకున్నాడు. ఆయన తపోగ్ని వైకుంఠానికి చేరింది. మహావిష్ణువు రూపంలోని రాముడు పరుగెత్తుకు వచ్చాడు. ఆ తొందరలో శంఖ చక్రాలతో వచ్చాడు. కుడి చేతిలో శంఖం, ఎడమ చేతిలో చక్రాన్ని పట్టుకుని ప్రత్యక్షమయ్యాడు. అక్కడే కొలువ య్యాడు. రాముని విడిచి ఉండలేని సీతమ్మా వచ్చిం ది. రాముని కోసం లక్ష్మణుడూ వచ్చాడు. భద్రుని శరీరమే భద్రాద్రి అయింది. వైభవంగా అన్నీ జరి గాయి. ఆ తర్వాత విదేశీ దండయాత్రల సమయంలో ఆ ఆలయానికి ఆదరణ కరువైంది. జీర్ణావస్థకు చేరుకుంది. ఆ తర్వాత శబరి వంశానికి చెందిన పోతల దమ్మక్కకు కలలో కనబడి స్వామి తాను ఎక్కడున్నదీ చెప్పి సీతాలక్ష్మణ సహితుడై కనబడ్డాడు. ఆ అర్చామూర్తులను తేవడం, ఆ తర్వాత తానీషా వద్ద పన్నులు వసూలు చేసే ఉద్యోగంలో ఉన్న కంచర్ల గోపన్న (రామదాసు) రాజుకు కట్టవలసిన డబ్బుతో ఆలయం నిర్మించడం, జైలు పాలవడం, రామ, లక్ష్మణులు వచ్చి విడిపించడం కథ తెలిసిందే.

దినఫలాలు

మేష రాశి: ఆర్థిక లావాదేవీలు అనుకూలం. దూర ప్రయాణాలు అనుకూలం. విద్యా ప్రయత్నాలు అనుకూలం. మంచికార్యాలలో పేరు, ప్రఖ్యాతులు లభిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయమార్గాలు సులభతరమవుతాయి.

వృషభ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు వంటివి ఉపకరిస్తాయి. విద్యా విషయాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ పనికిరాదు. ఆర్థిక విషయాల్లో విస్మయాలు ఉంటాయి. ఆదాయ వృద్ధిలో ఆటంకాలు కొనసాగుతాయి.

మిథున రాశి: సాహస నిర్ణయాలు ఊరట కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలలో ఉపశమనం ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలత ఉంటుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. పనులలో వేగం పెరుగుతుంది. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు కలసి వస్తాయి.

కర్కాటక రాశి: విదేశీ లావాదేవీలు కలసి వస్తాయి. శుభవార్తలు వింటారు. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. శత్రుభీతి పోతుంది. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆదాయ మార్గాలు అనుకూలం.

సింహ రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి. పెట్టుబడుల ప్రతిబంధకాలు ప్రబలమవుతాయి. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార మోసాలను గ్రహించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: ఆధ్యాత్మిక కార్యాలు, కార్యక్రమాలు లభిస్తాయి. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. వ్యాపార విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు సులభతర మవుతాయి.

తులా రాశి: విదేశీ లావాదేవీలు/సంభాషణలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. మెరుగైన పరిస్థితులు ఆరోగ్య రీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. అతి తొందర ద్వారా కార్యక్రమాల్లో పొరపాట్లు దొర్లుతాయి. ఆదాయంలో మంచి లాభాలను కూడగట్టుకొనే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.


వృశ్చిక రాశి: స్థిరాస్తి కొనుగోళ్లు అనుకూలం. ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి. అసహన పరిస్థితులు వ్యాపార పరంగా ఉంటాయి. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన స్నేహాల ద్వారా లబ్ధి చేకూరుతుంది. వ్యాపార ప్రతిబంధకాలను ఎదుర్కోగలుగుతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. గతంలోని తప్పులు సరిదిద్దుకొనే అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: విదేశీ సంభాషణలు ఉపకరిస్తాయి. కోర్టు వ్యవహారాలు ఊరట కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు తప్పని సరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. బాధ్యతలు పెరుగుతాయి. ఆదాయం గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.


కుంభ రాశి: నూతన వాహన కొనుగోళ్ళు వంటివి ఆనందాన్ని కలిగిస్తాయి. విద్యా ప్రయత్నాలు లాభిస్తాయి. శుభవార్తలు వింటారు. ఆకస్మిక వ్యయం లేకపోలేదు. ఆరోగ్య విష యంలో ప్రతికూలత ఉంటుంది. ప్రత్యర్థుల ద్వారా చిరు సమస్యలు ఉంటాయి. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

మీన రాశి: రుణ ప్రయత్నాలు లాభిస్తాయి. వాహన కొనుగోళ్ళు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో ఉపశమనం ఉంటుంది. ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఆరోగ్య రీత్యా శ్రద్ధ పాటించాలి. ముఖ్యమైన పనుల విషయంలో ఏకాగ్రత తప్పని సరి. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

దశరథుని హితబోధ



దశరథుడు రాముని వైపు సాలోచనగా చూసి, 'రామా నీవు పట్టాభిషిక్తుడవు కాబోతున్నావు. కాబట్టి నీకు హిత వాక్యాలు చెప్పవలసిన బాధ్యత నాపై ఉంది. ఇక మీదట పూర్వం కంటె వినయవంతుడవు, జితేంద్రియుడివై వ్యవహరించాలి. వ్యసనాలను పరిహరించు. చారచక్షుడవై బాహ్య, అంతశ్శత్రువులను తెలుసుకుని ఏమరు పాటు లేకుండా జాగరూకుడవై రాజ్యాన్ని పాలించు. కోశాగారం ధనరజత స్వర్ణరత్న సమూహంతో ఎప్పుడూ సమృద్ధిగా ఉండేట్టు జాగ్రత్త వహించాలి. ఆయుధాగారాలను ఎప్పుడూ పుష్కల ఆయుధ సంపత్తితో నింపాలి. సప్తాంగాలు సక్రమంగా పర్యవేక్షిస్తూ రాజ్య పాలన చేస్తే, ప్రజలు సుఖ సంతోషాలతో భోగభాగ్యాలతో తులతూగుతారు. మంత్రులు నిష్కపట హృదయంతో నిస్వార్థ పరాయణులై మంత్రాంగాన్ని నిర్వహిస్తే సామంతులు భక్తి ప్రపత్తులతో నిన్ను సేవిస్తారు' అని దశరథుడు రాజ్యపాలన నిర్వహణ విషయంలో తీసుకొనవలసిన జాగ్రత్తలను సూచనప్రాయంగా తెలిపాడు.

రాముని పట్టాభిషేక వార్త అంతఃపురంలో ఉన్న కౌసల్యకు తెలిసింది. ఆ వార్తను కొని వచ్చిన రాముని అనుచరులకు వెండి, బంగారు ఆభరణాలు కానుకగా ఇచ్చింది. రాముడు సైతం పట్టాభిషేక వార్తను తల్లికి తెలపాలని తహతహలాడిపోయాడు. రాగద్వేషాలు మనస్సులను కలుషితం చేస్తాయన్న అవకాశాన్ని కాదనలేము. ఇది అనుభవంతో చెబుతున్న నగ్న సత్యం! భార్యాభర్తలు ఇరువురూ నేడు ఉపవాస దీక్ష స్వీకరించాలి. దర్భాస్తరణాలపై శయనించాలి. సంప్రదాయాన్ని అనుసరించి నియతవ్రతుడవై వ్యవహరించాలి' అని తెలిపి దశరథుడు రాముని వీడ్కొలిపాడు.

తల్లికి తన పట్టాభిషేక వార్తను తెలిపి, ఆమెను ఆనందింపజేయాలనే కుతూహలంతో రాముడు తల్లి మందిరానికి బయలుదేరాడు. కౌసల్య తన కొడుకు పట్టాభిషేక వార్త తెలిసి మంగళకార్యాలకు శ్రీకారం చుట్టింది. పూజా మందిరంలో తన ఇష్టదైవం శ్రీమన్నారాయణుని ఏకాగ్రచిత్తంతో ధ్యానిస్తున్నది. రామునికంటె ముందు సీతా లక్ష్మణులు వచ్చి కౌసల్య ఆనందంలో పాలు పంచుకున్నారు. శ్రీరాముడు ఆనందోత్సాహాలతో తల్లి దరి చేరి, నమస్కరించి పట్టాభిషేక వార్తను తెలిపాడు.

సంక్షిప్త రామాయణం

మరో పక్క దశరథుడు కొలువు చాలించి తన మందిరం చేరుకున్నాడు. వెంటనే రాముని తీసుకుని రమ్మని సుమంత్రుని పంపాడు. మరల తండ్రి పిలుపునకు కారణం ఏమా అనే ఉత్కంఠతో రాముడు తండ్రి మందిరాన్ని చేరుకుని నమస్కరించాడు. దశరథుడు రాముని లేవనెత్తి, 'రామా! నేను ధర్మ బద్ధంగా సుఖాలు అనుభవించాను, నూర్ల కొలది యాగాలు చేశాను. చివరికి నా కలల పంటగా మీరు జన్మించారు. దేవ ఋణం, ఋషి రుణం, పితృ ఋణం వంటి అన్నింటిని తీర్చి అనృడను అయ్యాను. ఒకే ఒక కర్తవ్యం మిగిలి ఉంది. అది నిన్ను పట్టాభిషిక్తుని చేయడం. నిన్ను రాజుగా అభిషేకిస్తే అది కూడా పూర్తవుతుంది. నేను నిశ్చింతగా విశ్రాంతి తీసికొనగలను. ఈ మధ్య నాకు విపరీతపు కలలు వస్తున్నాయి. ఈ కలలన్నీ నా మరణాన్ని సూచిస్తున్నాయి. నా సంకల్పం సడలక ముందే నీవు అభిషిక్తుడవు కావాలి. ఈ కార్యక్రమమంతా భరతుడు ఇక్కడకు రాక మునుపే జరిగిపోవాలి. ఎప్పుడు ఏమి జరుగుతుందో! మనుషుల బుద్ధి చపలమైనది అని నీకు తెలుసు కదా! భరతుడు సజ్జనుడే. సందేహం లేదు. కాని పరిస్థితులు ఎప్పుడు ఎవరిని ఎలా మారుస్తాయో ఎవరికి తెలుసు?

కౌసల్య ఆనందానికి అవధులు లేవు. కనులు బాష్పాలతో నిండి రాముని స్వరూపాన్ని అస్పష్టంగా చూస్తూనే దీవించింది. తండ్రీ! ఇన్నాళ్ళకు నా నోములు ఫలించాయి. చేసిన వ్రతాలు సఫలమయ్యాయి. కన్న కొడుకు పట్టాభిషేకాన్ని కన్నులారా చూసి మురిసిపోయే భాగ్యం నాకు కలిగింది! శ్రీమన్నారాయణుడు ప్రసన్నుడయ్యాడు. అందువల్లనే కోసల రాజ్యలక్ష్మి నిన్ను వరించింది. నీకు శుభమగుగాక' అని కౌసల్య దీవించింది.

రాముడు తన బహిఃప్రాణమైన లక్ష్మణుని చూసి, 'లక్ష్మణా! ఈ రాజ్యం నాదే కాదు, నీది కూడా. నేను రాజు అవడం అంటే నీకు రాజ్యం లభించినట్లే! రాజ్య సుఖాలను నీవు యథేచ్ఛగా అనుభవించవచ్చు. ఈ రాజ్యమే కాదు, నా ప్రాణాలు కూడా నీవే సుమా!' అన్నాడు. రాముడు, కౌసల్య, సుమిత్ర మాతలకు పాదాభివందనం చేశాడు. రాముడు సీతా సమేతుడై తన మందిరం చేరాడు.

కె. ఓబులేశు
9052847742



సంస్కృతి



రామచంద్ర శబ్ద విచారణ కొస్తే, నిజానికి 'రామచంద్ర' శబ్దమే తప్పని తోచుతుంది. ఎందుకని?...రాముడు సూర్యప్రతీక. భరతుడు చంద్రప్రతీక. అనగా రాముడు భరతుని వంటి వాడని చెప్పినట్లవుతుంది. ఔచిత్య భంగం వాటిల్లుతుంది. ఇది తాతను మనవడితో పోల్చడం వంటిదే! నిజానికి తన రామాయణ మహాకావ్యంలో ఒక్కసారి కూడా 'రామచంద్ర' శబ్దాన్ని ప్రయోగించలేదు వాల్మీకి. ఈ శబ్ద సృష్టి ఇటీవలిదే.

రాముడు! రామచంద్రుడా? రామనారాయణుడా?

మన అజ్ఞానమే మన మూలధనంగా మారిన రోజులివి. మనకు రాముడంటే ఎవరో తెలీదు. రామాయణమంటే ఏమిటో తెలీదు. విష్ణువన్నా, కృష్ణుడన్నా, భారతమన్నా తెలీదు. పిట్టకథల్ని వింటే, చెబితే మురిసి పోతుంటాం మనం. వాటి అంతరార్థాన్ని పట్టించుకోం.

కృష్ణుడు తన చిటికెన వ్రేలితో, గోవర్ధన పర్వతాన్ని ఎత్తాడన్నా, హనుమ సంజీవనీ పర్వతాన్ని మోసుకొచ్చాడన్నా, రాముడు పుష్పక విమానంలో తన సైన్యంతో పాటు సతీసమేతంగా కూర్చున్నా, మరొకరికి చోటు మిగిలే ఉందన్నా 'అవును నిజమే' నంటూ గంగిరెద్దుల్లా తలలూపుతాం. మనం మన తార్కిక జ్ఞానాన్ని ఏనాడో పాతరేశాం కదా?

చివరికి రామాయణం కావ్యమో, చరిత్రో మనకు ఖచ్చితంగా తెలీదు. ఐనా, అంతా తెలిసినట్లుగా భేషజాలకి పోతాం. ఉపన్యాసాలిస్తాం. వాగ్వివాదాలకి దిగుతాం!

ఇలాంటి విషాదమే ఒకటి ఇటీవల పండితుల మధ్య చోటు చేసుకుంది. ఆ వార్త పత్రికల్లోనూ, టీవీలోనూ వచ్చింది. దానిపై కొన్ని టీవీఛానళ్ళు చర్చాగోష్టుల్ని సైతం నిర్వహించి, ఆసక్తిని చూపుతున్నాయి. సామాన్యుడు తలపట్టుక్కూచున్నాడు. రాముడు రచ్చకీడ్చబడుతున్నందుకు.

నిజానికీ విషయంపై పూర్తి అవగాహన అడిగే వానికి లేదు. చెప్పేవానికి లేదు. వినేవానికీ లేదు. ఇది ఒక మహాప్రహసనం.

ఇంతకీ ఏమిటా వార్త?

''భద్రాచలం సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం కోటిలింగాల పీఠాధిపతి శ్రీశ్రీ శివస్వామిజీ హల్‌చల్ చేశారు. ఈ ఆలయంలో స్వామి వారు రాముడా? రామనారాయణుడా? తేల్చి చెప్పాలని సుమారు 400మంది పరివారంతో బైఠాయించారు. దర్శనానికి వచ్చిన భక్తులు అసహనానికి గురైనారు. బ్రహ్మోత్సవాల తరువాత తగిన సమాధానం యిస్తామని ఆలయ వేదపండితులు తెలిపారు. ఇదీ ఆ వార్త.

నిజానికి 'రామ' శబ్దానికీ 'నారాయణ' శబ్దానికీ సరియైన అర్థాలూ, అంతరార్థాలు తెలిస్తే ఈ గొడవ ఉండదు. దీనికి ముందు అవతార రహస్యం తెలియాలి. రామాయణానికున్న నాలుగు దృక్కోణాలూ (1. అధి భౌతిక, 2. అధిదైవిక 3.ఆధ్యాత్మిక, 4. అధిమార్మిక దృక్కోణాలు)తెలియాలి. ఆపై 'సకల దేవతా స్వరూపుడు సూర్యుడన్న విషయమూ తెలియాలి. అప్పుడు 'సూర్య' (నారాయణ) రహస్యం తెలుస్తుంది.

ఇంతకీ, 'రామ' శబ్దానికి అర్థం ఏమిటి? తనలో తాను రమించేవాడూ, అందరినీ రమింపజేసేవాడనీ అర్థం. అనగా ఎవరు?...సూర్యుడు!...భూమికీ, నక్షత్రాలకూ అత్యంత దూరంగా ఉన్నా, నిరంతర తపస్సులో మునిగి, సమాధి స్థితికి చేరి, తనలో తాను రమిస్తున్నాడు ఆనంద పారవశ్యంలో మునకలిడు తున్నాడు సూర్యుడు. అంతేకాదు విశ్వజీవకోటినీ రమింపజేస్తున్నాడు.

అదెలా?..సూర్యుడు లేక ప్రకాశం లేదు. ప్రకాశం లేక విజ్ఞానం లేదు. విజ్ఞానం లేక జీవితం లేదు. ఆనందం లేదు. ఒక విధంగా విజ్ఞానమే ఆనందం. అందువల్ల సూర్యుడే రాముడని చెప్పాల్సి వస్తుంది. చివరికి 'విష్ణువు' (అంతటా వ్యాపించినవాడు) అన్నా సూర్యుడే. సూర్యుడు తన ప్రకాశం చేత విశ్వమంతటా వ్యాపిస్తాడు కదా?

ఇక 'రామచంద్ర' శబ్దవిచారణ కొస్తే, నిజానికి 'రామచంద్ర' శబ్దమే తప్పని తోచుతుంది. ఎందుకని?...రాముడు సూర్యప్రతీక. భరతుడు చంద్రప్రతీక. అనగా రాముడు భరతుని వంటి వాడని చెప్పినట్లవుతుంది. ఔచిత్య భంగం వాటిల్లుతుంది. ఇది తాతను మనవడితో పోల్చడం వంటిదే! నిజానికి తన రామాయణ మహాకావ్యంలో ఒక్కసారి కూడా 'రామచంద్ర' శబ్దాన్ని ప్రయోగించలేదు వాల్మీకి. ఈ శబ్ద సృష్టి ఇటీవలిదే.

'మాట ఔచిత్యంతో పనిలేదు. ఋషి హృదయంతో సంబంధం లేదు. మా రాముడు చంద్రునివలె చల్లనివాడు. అందుకే మేము మా రాముణ్ణి 'రామచంద్రుడని' పిలుచుకుంటున్నాం అని వాదిస్తే చేసేదేమీ ఉండదు. శివుడు గరళాన్ని భరించినట్లు మనమూ భరించక తప్పదు.

ఇక 'రామనారాయణ' శబ్ద విచారణ.

'రామ' శబ్దానికి అర్థాన్ని చూశాం. మరి 'నారాయణు'డంటే ఎవరు? నార+ఆయనుడు నారాయణుడు. 'నార'మనగా నీరము. 'ఆయన'మనగా మార్గము. అనగా నీరే మార్గంగా కలిగినవాడని అర్థం. అనగా మళ్లీ సూర్యుడే. సూర్యుడు నీళ్లలోంచి ఉదయించి, మళ్లీ నీళ్లలోకే నిర్గమిస్తున్నాడు. (రాముడు సైతం సరయూ నదిలోకి దిగి, పశ్చిమాభిముఖుడై, నీళ్లలో మునిగి, తన అవతారాన్ని చాలించాడు) రాత్రంతా నీళ్లలోనే ఉంటున్నాడు. అందుకే ఆయన్ని 'సూర్యనారాయణ' అని అంటున్నాం. ఇదే సూర్యుని 'వనవాసం', అనగా జలవాసం. అందుకే సూర్య ప్రతీకమైన రామునితో సైతం 'వనవాసాన్ని' అనగా అరణ్యవాసాన్ని చేయించాడు వాల్మీకి.

అందుకే, 'రామనారాయణ' శబ్దం 'సూర్యనారాయణ' శబ్దం వంటిదే. అందువల్ల రాముణ్ణి 'రామనారాయణు'డని అనడంలో ఏ దోషమూ లేదు. దోషమంటూ ఉంటే, అది మన అవగాహనా రాహిత్యమే. (ఆధి భౌతిక ద్రృక్కోణం)

సీతారాముల గోత్రనామాన్ని సైతం తప్పుగా చదువుతున్నారనేది మరో ఆక్షేపణ. దేవతలకు గోత్రాలేమిటని భక్తుల ఆవేదన.

రాముడి భార్య అంటే సీత గుర్తుకు రావాలి గానీ మహాలక్ష్మి కాదు కదా? అన్నది మరో వాదన.

నిజమే కానీ, రాముడు విష్ణువైనప్పుడు సీత లక్ష్మిగాక ఏమవుతుంది? అప్పుడు రామునికీ, విష్ణువునకూ, సీతకూ లక్ష్మికీ అభేదమే కదా? (ఆధిదైవిక దృక్కోణం)

గుడిలోకి శివలింగాన్ని తొలగించారని మరో ఆక్షేపణ. ఇది నిజమే అయితే ఆ శివలింగాన్ని మళ్లీ ప్రతిష్ఠించితే సరిపోతుంది కదా?

రామాయల గోపురంపై శివపరివారానికి సంబంధించిన శిల్పాలున్నాయిట. అలా భక్త రామదాసుకు లేని హరిహరుల భేదం మనకెందుకో అర్థం కాదు. ''శివాయ విష్ణురూపాయ..'' అని పలికే పండితులే భేదభావాన్ని కనబరచడమేమిటి?

అందువల్ల నాదొక వినమ్ర నివేదన. మనం అవగాహనా రాహిత్యంలో బ్రతుకుతున్నాం. మన రామాయణ, భారతాదులకు, పురాణాలకు మనకు అంతరార్థ పరిజ్ఞానం లేదు. దాన్ని పెంపొందించుకోవాలి. మన ప్రత్యక్ష దేవతలైన సూర్యచంద్రుల్ని, ధరిత్రినీ, నక్షత్రాల్ని, పంచమహాభూతాల్ని ఆరాధించాలి. నిజానికి వేదాల్లో ఉన్నదదే కాదా?

'దశరథుడు' విశ్వ ప్రతీకమనీ, రాముడు సూర్యుడనీ, సీత ధరిత్రి అనీ, సూర్యరాజమే రామరాజ్యమనీ, సూర్యాయణమే రామాయణమనీ, ధరిత్రి పవిత్రులు కల్యాణమే విశ్వకల్యాణమనీ అర్థం చేసుకోవాలి. అప్పుడే మనది సరియైన అవగాహన. సరియైన మార్గం.

శుభమస్తు
సర్వేజనాస్సుఖినోభవంతు
లోకాస్సమస్తాస్సుఖినోభవంతు

- గన్నుకృష్ణమూర్తి
(రామాయణ, భారత, భాగవతాలపై వేదాలపై పరిశోధకుడు)
9247227057

(లైఫ్ పేజీ తరువాయి)

అది సినీ రంగంలో నా ప్రత్యేకత. అన్నీ మంచి క్యారెక్టర్స్. గుర్తింపు వచ్చిన పాత్రలు. సంబరాల రాంబాబులో నా పాత్ర కామెడీ అంటారు గానీ.. అది చాలా స్పెషల్ క్యారెక్టర్. తమిళంలో ఆ పాత్రను షావుకారు జానకి గారు చేశారు. తెలుగులో నటించే ముందు మొత్తం ఆమె నటనని పరిశీలించాను. ఒక రకంగా చెప్పాలంటే కాపీ కొట్టాను. పేరు తెచ్చుకున్నాను. పొరుగింటి మీనాక్షమ్మను చూశారా.. వాళ్ళ ఆయన తీర్చే ముద్దూ ముచ్చట విన్నారా... అనే పాట ఇప్పటికీ అన్ని ఇళ్ళలో వినిపిస్తుంది. మంచి హిట్స్ తెచ్చుకున్న అదృష్టం నాది. షూటింగు

సీతాంజలి... కెంపుల ప్రోవై

సమయంలో నావల్ల ఎవరూ ఇబ్బంది పడకుండా సినిమాలు చేశాను.

నా చిన్నతనం పాత్రని శ్రీదేవి పోషించింది..

తమిళం, తెలుగు కాకుండా మలయాళంలో కూడా కథానాయిక పాత్రలు ధరించాను. మలయాళంలో మిస్టర్ మధు అనే హీరోతో మేరీల్యాండ్ పిక్చర్స్ బ్యానర్‌లో తొమ్మిది సినిమాలు చేశాను. మలయాళ సినిమాల్లో స్వప్నంగళ్ అనే చిత్రంలో నాది అంధురాలి పాత్ర. శ్రీదేవి నా చిన్ననాటి పాత్రలో నటించింది. శ్రీదేవికి అప్పుడు 9 ఏళ్ళు. నాకు 18ఏళ్ళు. చిన్న శ్రీదేవి చాలా బాగా చేసింది. దాన్ని నేను హీరోయిన్‌గా అదే టెంపోలో నటించాను. లేత మనసులులో కుట్టి పద్మిని, భక్త ప్రహ్లాదలో రోజారమణి నటించారు. వీరంతా నాకు ఎంతో దగ్గరయ్యారు. వీళ్ళందర్నీ చూస్తుంటే ఆనాటి రోజులు గుర్తొచ్చి, చాలా ఆనందంగా ఉంటుంది.

గుర్తుండే పాత్రలు చాలా ఉన్నాయి..

నా కెరీర్‌లో గుర్తుండే పాత్రలు చాలా ఉన్నాయి. ఇల్లాలు పాత్ర ఎంతో ఇష్టం. తెలుగులో నేను, తమిళంలో జయలలిత, హిందీలో సాధన నటించాం. అందులో ఒక్క కోర్టు సన్నివేశాన్నే 15రోజులు చిత్రీకరించారు.

బోనులో నిలబడినప్పుడు ఆ క్యారెక్టర్ ఎక్కడెక్కడికో వెళ్ళిపోతుంటుంది. నువ్వు నా భార్య కాదంటాడు భర్త. భార్యని భర్తే అంగీకరించని ఆ సన్నివేశంలో ఎలాంటి ఎమోషన్ ఉంటుందో ఆలోచించండి. అలాగే అపాయంలో ఉపాయం సినిమాలో డ్యాన్సు చేస్తున్నప్పుడు కాలు ఫ్రాక్చరైంది. 15రోజులు విశ్రాంతి తీసుకోవాలన్నారు. ఈ సమయంలో నాకు ఎల్వీ ప్రసాద్ గారు ఇల్లాలు నెక్స్ట్‌షెడ్యూలుకు సంబంధించిన డైలాగ్స్ ఫైల్ ఇచ్చారు. ఆ సమయంలో పట్టుదలగా నేర్చుకోవడం వల్లే ఆ పాత్రకు అంత పేరొచ్చింది. ఆంధ్ర దేశం నలుచెరగులా నా పేరు మార్మోగింది. అందులో హీరోయిన్, దొంగ క్యారెక్టర్... డ్యూయల్ రోల్ చేశాను. పి. పుల్లయ్య గారి మురళీ కృష్ణ కూడా నాకు ఎంతో ఇష్టం. ఈ సినిమాకు పుల్లయ్యగారి రెండో అమ్మాయి రాధమ్మ కథ రాసింది. ఇందులో క్యారెక్టర్ వేయడానికి గీతాంజలి తప్ప ఎవరూ సరిరారని కథ రాసినప్పుడే ఆమె చెప్పింది. నన్ను ఊహించుకుని ఒక మెంటల్ పాత్రను సృష్టించారు. ఈ పాత్ర నాగేశ్వరరావుగారితోనే ఉంటుంది. హంతకులొస్తున్నారు జాగ్రత్త, అబ్బాయిగారు..అమ్మాయిగారు చిత్రాల్లో కూడా మంచి పేరొచ్చింది. అందులో నా పాత్ర టీకొట్టు పిల్ల. అల్లరి పాత్ర. వాణిశ్రీగారు కూడా ఏంటి.. గీతాంజలి పాటల్లో డ్యాన్సులు కుమ్మేశావన్నారు.

పేరు మారిన సినిమా పారస్ మణి..

గీతాంజలి అనే పేరు ఈ చిత్రంతోటే వచ్చింది. బాబూ భాయ్ మిస్త్రీ తీసిన పారస్ మణి హిందీ సినిమాలో నా పేరును గీతాంజలిగా మార్చారు. హిందీలో కథానాయికగా చేసిన తొలి సినిమా ఇది. సెట్లోకి వెళ్ళిన తరవాత మీడియాను పిలిచి, సౌత్ నుంచి మొదటిసారి హిందీలోకి వచ్చిన అమ్మాయని ఆయన నన్ను పరిచయం చేశారు. అంతవరకూ నా పేరు మణి. సినిమా పేరు పారస్ మణి. సినిమా పేరుతో నా పేరు సింక్ అవడం లేదనీ, పేరు మారుస్తానని మిస్త్రీ చెప్పారు. అంగీకరించాను. అక్కడి నుంచే నా పేరు గీతాంజలిగా మారింది. అప్పటికి నేను 75 సినిమాలు చేశాను. లక్ష్మీకాంత్ ప్యారేలాల్‌కు కూడా సంగీత దర్శకునిగా అదే మొదటి సినిమా. పాటలు కుమ్మేశారాయన. అరుణా ఇరానీ కూడా ఈ చిత్రంలో నటించింది. ఎన్టీరామారావుగారు నేర్పించిన హిందీ ఇక్కడ పనికొచ్చింది. నా డబ్బింగ్ నేనే చెప్పుకున్నాను.

పెళ్ళయిన కొత్తలో.. నుంచి వృద్ధ పాత్రలు

నా కుమారుడికి సినిమాల్లో విలన్ కోసం చూస్తున్నాను. అలాంటి సమయంలో నన్ను పెళ్ళయిన కొత్తలో సినిమాలో వృద్ధ పాత్రలోకి లాగారు. కోట శ్రీనివాసరావుగారికి జంటగా నటించాను. అక్కడి నుంచి గోపి..గోపిక..గోదావరిలోనూ వృద్ధురాలి పాత్ర వచ్చింది. బ్లైండ్ పాత్ర. చాలా మంచి పాత్ర. ఆ తరువాత డమరుకం, గ్రీకువీరుడులో నాగార్జునకు నాయనమ్మగానూ, మొగుడు చిత్రంలోనూ కూడా నటించా.

విశ్వనాథ్‌గారి చిత్రాలన్నింటిలో నటించా..

కాలం మారింది దగ్గర్నుంచి.. కె విశ్వనాథ్ గారి చిత్రాలన్నింటిలో నేనున్నాను. శుభప్రదంలో కూడా చేశా. గీతాంజలీ నాయనమ్మవయ్యావు కదా.. నా చిత్రంలో కూడా వేసేయ్ అన్నారు విశ్వనాథ్ గారు. ఆయన చిత్రాలలోనే నేను హీరోయిన్ నుంచి నాయనమ్మ దాకా అన్ని పాత్రలూ వేశా.

చపాతీలు తిన్నాం...

ఆ రోజుల్లో మేమంతా అక్కా చెల్లెళ్ళలా మెలిగేవాళ్ళం. ఎంతో ఆప్యాయతుండేది. సావిత్రితోటి నేను బలరామ శ్రీకృష్ణులు సినిమా చేశాను. పౌరాణిక చిత్రమది. ఏడాదిన్నర పాటు ఆ సినిమాకు పనిచేశాం. బలరాముడు భార్యగా సావిత్రి, కృష్ణుడి భార్యగా నేను నటించాం. ఆ సమయంలో వాళ్ళు పెట్టింది తినేవాళ్ళం. సావిత్రిగారు లావుగా ఉన్నారని ఆమెకు ఎక్కువ పెట్టేవారు కాదు. నేను సన్నగా ఉన్నా నాకూ అదే మెనూ. ఇదంతా భరించలేక చపాతీలు తిని గడుపుకొచ్చాం. సావిత్రి చనిపోయి ఎక్కుడున్నారో కానీ, మహానుభావురాలు. నేను పెద్దపెద్ద వాళ్ళతో చేయగలగడం ఎంతో అదృష్టం.

నాది లవ్ మ్యారేజ్ కాదు...

రామకృష్ణగారితో నాది ప్రేమ వివాహమనుకుంటారు. కానీ కాదు. అప్పటికే నేను 300 సినిమాలు చేశాను. ఇద్దరం కలిసి చాలా సినిమాల్లో నటించాం. మా ఇద్దరికీ డ్యూయెట్స్ కూడా ఉన్నాయి. ఆయనకు నేనంటే ఇష్టమని చెప్పారు. గీతాంజలి మంచిది అనేది ఆయన అభిప్రాయం. మా నాన్నగారికి ఆయన ఆ విషయాన్ని చెప్పారు. అప్పుడు మా నాన్నగారు ఇంకపెళ్ళి చేసేసుకోమన్నారు. పెళ్ళయిన తరవాత రామకృష్ణసినిమాల్లో బాగా బిజీ అయ్యారు.

హైదరాబాద్ వచ్చాక బాగుంది..

నేను హైదరాబాద్ వచ్చిన తరవాత నా జీవితంలో చాలా రిలీఫ్ వచ్చింది. అంతా అభిమానిస్తున్నారు. ప్రొడ్యూసర్లు నన్ను భానుమతి గారి స్థాయిలో చూస్తారు. వద్దు బాబు ఆవిడతో నన్ను పోల్చకండంటాను. అలా చూడ్డం కాదు.. నాకు మంచి క్యారెక్టర్లివ్వండని అడుగుతాను. ప్రేక్షకులకు గీతాంజలి కావాలి. ప్రొడ్యూసర్లు ఉపయోగించుకోవడం లేదు. నేను తల్లి పాత్రలు వేస్తున్నాను. నాయనమ్మ పాత్రలూ వేస్తున్నాను. చంద్రమోహన్‌గారున్నారు.. రావి కొండలరావుగారున్నారు.. మమ్మల్ని సినిమా ఇండస్ట్రీ ఉపయోగించుకోవాలి. మెయిన్ క్యారక్టర్స్ ఇవ్వండి. క్యారెక్టర్ పండాలంటే మా లాంటి సీనియర్ నటులకి అవకాశాలివ్వాలి. మాలాంటి నటులం ఇక్కడుండగా మీరు మద్రాస్ నుంచి ఎందుకు తెచ్చుకుంటారు.

పద్మనాభం గారే నా రూట్ మార్చారు..

పద్మనాభం గారితో నాది హిట్ పెయిర్ అన్నమాట నిజం. దేవత సినిమాతో ఆయన నన్ను కమెడియన్‌గా మార్చేశారు. మర్యాద రామన్న, పొట్టి ప్లీడరు సినిమాల్లో ఆయన పక్కన హీరోయిన్‌గా వేశా. మిడతం భొట్లు, ఆజన్మ బ్రహ్మచారి కూడా ఆయన తీశారు. కథానాయిక మొల్లలో నాది ఆండాళ్ పాత్ర. నా పాత్ర చెప్పిన మేరకే మొల్ల మారుతుంది. నేను, జయలలిత కలిసి, శ్రీరామ కథ చేశాం. ఆదర్శ కుటుంబం, రైతు కుటుంబం, మంచి కుటుంబం ఇలా ఎన్నో మంచి సినిమాల్లో నటించా. అప్పట్లో హైదరాబాద్‌లో ఎక్కువుండేదాన్ని. ఇప్పటికీ నన్ను చూసి, గీతాంజలి చాలా యాక్టివ్‌గా ఉన్నారంటారు.

అబ్బాయికి అవకాశాల కోసం హైదరాబాద్ వచ్చా..


హైదరాబాద్‌కి నేను రావడం వెనుక ఉద్దేశం వేరు. మా అబ్బాయిని సినీ రంగానికి పరిచయం చేద్దామనుకున్నాను. ఇక్కడికి రాగానే నన్ను తల్లి పాత్రలు వేయమని అడిగారు. నేను వేయనన్నాను. అలా వేయడం మొదలెడితే నన్ను తల్లిగా, బామ్మగా మార్చేస్తారు నాకు ఇష్టం లేదని చెప్పేశాను. మా వారు చనిపోయిన తరవాత మా అబ్బాయికి సినిమా ఆఫర్లు వచ్చాయి. అందుకే నేను హైదరాబాద్ వచ్చాను. మా వారు లేకపోవడంతో నాకు చెన్నైలో ఉండబుద్ధి కాడా కాలేదు. మా అబ్బాయి మూడు సినిమాల్లో నటించాడు. అవి వివిధ కారణాల వల్ల ఆగిపోయాయి. రామకృష్ణ గారి కొడుకు ఎలా ఉంటాడో కూడా ప్రేక్షకులకు తెలీదు. అతడికి విలన్‌గా సినిమాల్లో అవకాశం వస్తుందేమోనని చూస్తున్నాను. దాసరి నారాయణరావు, చిరంజీవిగారు కూడా మా అబ్బాయి విలన్‌గా బాగుంటాడన్నారు. అవకాశమిస్తానన్నారు దాసరి. కానీ దురదృష్టవశాత్తు ఆయన కన్నుమూశారు.

-సుబ్రహ్మణ్యం వి.ఎస్. కూచిమంచి,
ఫొటోలు: మూర్తి మల్లాల

జానపద స్త్రీలు-అలంకరణలు

సాధారణంగా ఆంధ్ర స్త్రీల వస్త్రాలు చీర, రవిక, రాజవంశ స్త్రీలు అయితే మేలి ముసుగు వేసుకుంటారు. స్త్రీకి సింగారం చీర. పట్టు చీరలు ఉత్సవాల్లో, శుభసందర్భాల్లో ధరిస్తారు. చెంగావి చీర, తెల్లని చీర, నల్లని చీర, జారు జల్తారు చీర, పట్టుపీతాంబర చీర, కనకాంబర చీర, వాయిల్ చీర మొదలైన చీరలు జానపద స్త్రీలు కడతారని స్త్రీల గేయాల వల్ల తెలు స్తుంది. జానపద స్త్రీలు జాకెట్‌లను రైకలు అని వ్యవహరిస్తారు. కొన్ని కులాల్లో స్త్రీలు రవికలను ధరించకుండా పైటతోనే శరీరాన్ని కప్పు కుంటారు. నాగభూషణ రవిక, గంగా, జమున రవిక, పట్టు రవిక, నీలాంబర రవిక, నిమ్మపండు ఛాయ రవిక, మొగ్గల రవిక, కానుగ మొగ్గల రవిక ఇంకా రక రకాల రవికలను ధరిస్తారు.

పెళ్లి సమయంలో పట్టు చీరలు కట్టుకుంటారు. స్త్రీలు పెళ్లి కూతురిని పెళ్లి పీటల మీదికి రమ్మని పిలు స్తారు. ఆసమయంలో ఏ చీరలు కడతారో క్రింది పాటలో ప్రస్తావించ బడింది.



"పట్టంచు సీరతో పణతి రావమ్మా/ సీరంచు సీరతో సెలియ రావమ్మా/ నీలం చు చీరతో నెలత రావమ్మా/మల్లె మొగ్గల చీరతో మగువ రావమ్మా/ గోరంచు సీరతో ఉవిద రావమ్మా"

ఇలాంటి చీరలు కూడా కట్టుకుంటారనే ది మనకు ఈగేయం ద్వారా తెలుస్తున్నది.

"చెన్నపట్నం చిన్నపరెడ్డి గూగూ గుమ్మడీలో
చీర ఒక్కటీ నేయరబ్బీ గూగూ గుమ్మడీలో
ఏమి సీరా నేతు పాపా గూగూ గుమ్మడీలో
ఏమి అంచు కావాలా పాపా గూగూ గుమ్మడీలో
కట్టు సెరుగుల మీద రబ్బీ గూగూ గుమ్మడీలో
కాడ మల్లెలు మీద రబ్బీ గూగూ గుమ్మడీలో
తిత్తి చెక్కే చెరుగుల మీద రబ్బీ గూగూ గుమ్మడీలో
పైట వేసే కొంగుపైన రబ్బీ గూగూ గుమ్మడీలో
పావురమ్మలు నిలుపు రబ్బీ గూగూ గుమ్మడీలో
చీరాకు అంచులు రబ్బీ గూగూ గుమ్మడీలో
జల్తారు అంచులు నిలుపు రబ్బీ గూగూ గుమ్మడీలో

స్త్రీకి ఎలా నేస్తే చీర ఇష్టమో పై గేయంలో తెలుపబడింది.

అదేవిధంగా మరో గేయంలో తనకు నచ్చిన వాడితో ఆమె ఎదుర్కొన్న సంఘటనలను వివరించే విధం తెలియజేయడమైనది.

"ఎర్రసీర కట్టుకోని ఏలూరికి నేపోతే/ ఏలూరు చిన్నోడు మావో/ నా కొంగు పట్టిలాగాడు మావ/ నా మనసంతా నీమీద మావ/ అబ్బ నేనొస్తా నీ వెంట మావ/ సిల్కుచీర కట్టుకోని సీరాలకు నే బోతే/ సీరాల చిన్నోడు మావ/ నాసెయ్యి పట్టి లాగాడు మావ/ నా మనసంతా నీమీద మావ/ అబ్బ నేనొస్త నీ వెంట మావ"

పై గేయంలో స్త్రీలు ఎలాంటి చీరలు కట్టుకుంటారు. ఆ చీరలు కట్టుకోవడం వల్ల పరాయి మగవాడు చెయ్యి, కొంగు పట్టుకున్నాడు అంటే, ఆ చీరలు కట్టుకోవడం వల్ల, ఆమె అందం పెరిగిందనేది ఇక్కడ ముఖ్య విషయంగా చెప్పుకోవచ్చు. నెల్లూరు జిల్లాలో వెంకటగిరిలోని జరీచీరలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు స్త్రీలు.

డా॥ కస్తూరి వెంకటరమణమ్మ
7093239555

సినిమాకు కోటి



మెహరీన్

రోజువారి ఖర్చులు అదనం

టాలీవుడ్ హీరోయిన్ల పారితోషికాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సినిమా సినిమాకు రేటు పెంచేస్తున్నారు. ఒక హిట్ వచ్చినా, లేదా స్టార్ హీరో సరసన అవకాశం వచ్చినా సరే ఏకంగా కోటి రూపాయలు అడుగుతున్నారు. హీరోలు తీసుకుంటున్న పారితోషికంలో 25 శాతం తమకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. కేవలం మూడు సినిమాల్లో నటించిన పూజా హెగ్డే కోటి రూపాయల పారితోషికం తీసుకుంటోంది. బాలీవుడ్ నటి కైరా అద్వానీ తన రెండవ సినిమా ఛాన్స్ రామ్‌చరణ్ సినిమాలో దక్కించుకుంది. ఆమె కోరిన మేరకు కోటి రూపాయలు ఇవ్వడానికి అంగీకరించి, గ్రైమెంట్ కుదుర్చుకున్నారని సమాచారం.

చిన్న సినిమాలతో కెరీర్ ప్రారంభించిన నటి మెహరీన్ కూడా తానేం తక్కువ కాదని అంటోంది. వరుస హిట్స్‌తో ఫామ్‌లోకి వచ్చిన ఈ అమ్మడు తనకూ కోటి రూపాయలు ఇవ్వాలని కోరుతోంది. చిన్న సినిమాల నిర్మాతలు అడిగినంత ఇవ్వలేరని తెలిసనా సరే ఒప్పుకోవడం లేదట. ఆమె అంగీకరించిన రెండు కొత్త సినిమాల షూటింగ్స్ ఇటీవల మొదలయ్యాయి. వీటికి మాత్రం కొంత తగ్గించి 90 లక్షలు తీసుకుంటోందని వినికిడి. అలాగే తనకు రోజు వారి ఖర్చులకు అదనంగా 20 వేలు ఇవ్వాలని షరతు విధించిందట. మెహరీన్ గొంతమ్మ కోరుకలు విని నిర్మాతలు బిత్తర పోతున్నారు. ఆమె అడిగినంత ఇవ్వడమా లేక మరొకరిని చూసుకోవడమా? అని సందిగ్ధంలో పడ్డారని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. హీరోయిన్ల పారితోషికం విషయంలో అదుపు చేయాలని కొందరు నిర్మాతలు అభిప్రాయపడుతున్నారు. సినిమా బిజినెస్ మొత్తం హీరో వల్లే జరుగుతుంది. కేవలం సినిమాలో ఆకర్షణకు మాత్రమే హీరోయిన్లు. వారివల్ల అదనంగా ఒక్క టికెట్ కూడా తెగదనే విషయాన్ని వారు స్పష్టం చేస్తున్నారు.

విజయ్ నటనకి ఫిదా అవుతారు



విజయ్ దేవరకొండ నటిస్తున్న తాజా చిత్రం టాక్సీవాలా. జిఏ 2, యువి పిక్చర్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఎస్‌కెఎన్ నిర్మాత. రాహుల్ సంకృత్యాన్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సైన్స్ ఫిక్షన్‌గా తెరకెక్కుతున్న టాక్సీవాలా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు.

నిర్మాత మాట్లాడుతూ విజయ్ దేవరకొండకు ఉన్న క్రేజ్, పాపులారిటీని దృష్టిలో పెట్టుకుని దర్శకుడు కథని తయారుచేశారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే విధంగా హీరో పాత్ర ఉంటుంది. మే 18న ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం అని చెప్పారు.

దర్శకుడు మాట్లాడుతూ టైటిల్‌కు మంచి స్పందన వచ్చింది. ఇది సైన్స్ ఫిక్షన్ చిత్రమే అయినప్పటికీ ఇందులోని కామెడీ బాగా నవ్విస్తూ థ్రిల్ కలిగిస్తుంది. విజయ్ దేవరకొండను మరో కొత్తకోణంలో చూపిస్తున్నాం. విజయ్ టైమింగ్‌కి ప్రేక్షకులు ఫిదా అవుతారు. అంతలా నటనతో ఆకట్టుకుంటాడు అని చెప్పారు. విజయ్ దేవరకొండ, ప్రియాంక జవాల్కర్, మాళవికా నాయర్, కల్యాణి, మధునందన్, రవిప్రకాష్, రవివర్మ, ఉత్తేజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం జేక్సన్ బిజాయ్, ఛాయాగ్రహణం సుజిత్ సారంగ్, స్క్రీన్‌ప్లే, మాటలు సాయికుమార్ రెడ్డి.

శేష్, శివానీ జంటగా 2 స్టేట్స్ ప్రారంభం



బాలీవుడ్ హిట్ ఫిల్మ్ 2 స్టేట్స్ తెలుగులో పునర్నిర్మాణమవుతోంది. 2008లో హిందీలో విడుదలైన ఈ సినిమా మంచి విజయాన్ని సాధించింది. రెండు భిన్న సంస్కృతులు ఉన్న రాష్ట్రా లకు చెందిన యువతీ యువకుడు ప్రేమించుకుని, పెద్దలను ఒప్పించి ఎలా ఒక్కటయ్యారు అనేది 2 స్టేట్స్ కథాంశం. ఈ సినిమాను తెలుగులో రీమేక్ చేస్తున్నారు.

అడవి శేష్, శివానీ జంటగా నటిస్తున్న ఈ చిత్ర ప్రారంభోత్సవం హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోలో జరిగింది. లక్ష్య ప్రొడక్షన్స్, పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. వెంకట్ కుంచమ్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. జీవితా రాజశేఖర్ తనయ శివానీ ఈ చిత్రంతో టాలీవుడ్‌లో అడుగుపెడుతోంది. 2 స్టేట్స్ షూటింగ్ ప్రారంభోత్సవానికి దర్శకులు రాఘవేంద్రరావు, కోడి రామకృష్ణ టి. సుబ్బిరామిరెడ్డి, వినాయక్, రాజమౌళి తదితర సినీ ప్రముఖులు హాజరయ్యారు. ముహూర్తపు సన్నివేశం అనంతరం దర్శకుడు వెంకట్ కుంచం మాట్లాడుతూ...చేతన్ భగత్ నవల 2 స్టేట్స్ చదివిన తర్వాత సినిమా చేస్తే బాగుంటుంది అనుకున్నాను. కొద్దిరోజులకే అది బాలీవుడ్‌లో సినిమాగా వచ్చింది. ఈ నవలను సినిమా చేయాలంటే చాలా కష్టపడాలి. ఆ మార్పులను చేసేందుకు మంచి రచయితలతో కలిసి పనిచేశాను. అడవి శేష్ ప్రతిభావంతమైన నటుడు. అతనే కథకు బాగా సరిపోతాడని అనిపించింది. శివానీ ఈ పాత్రకు బాగుంటుందని అనుకున్నాను. అయితే ఆమె చేస్తుందా లేదా అనే సందేహం ఉండేది. కథ చెప్పగానే చాలా ఆసక్తిగా మా చిత్రంలో భాగమయ్యేందుకు ముందుకొచ్చింది. సినిమాను మూడు షెడ్యూల్స్‌లో పూర్తి చేస్తాం. హైదరాబాద్‌లో మొదటి షెడ్యూల్ ఏప్రిల్ 5 నుంచి మొదలుపెడతాం. రెండవ షెడ్యూల్ కోల్‌కతాలో ఉంటుంది. మూడో షెడ్యూల్ అమెరికాలో చేయబోతున్నాం.అన్నారు. కథానాయకుడు అడవి శేష్ మాట్లాడుతూ...2 స్టేట్స్ నాకు బాగా నచ్చిన చిత్రం. మూడు సార్లు ఐమాక్స్ లో చూశాను. దర్శకుడు వెంకట్ నాకు మంచి మిత్రుడు. 2 స్టేట్స్ కథకు కొత్త మలుపులు చేర్చి అద్భుతంగా తయారు చేశారు. థ్రిల్లర్స్ లో నటిస్తున్నావు, ప్రేమ కథల్లో నటించు అని నా స్నేహితులు అంటుంటారు. ఈ సినిమాతో లవ్ స్టోరీ చేయాలనే కోరిక తీరుతోంది. నా సినిమాలు విజయవంతం అయినా కాకున్నా....శేష్ మంచి సినిమాలు చేస్తాడు, కొత్తగా ప్రయత్నిస్తాడు అనే పేరు వచ్చింది. ఆ పేరు నిలబెట్టేలా ఈ సినిమా ఉంటుంది. అన్నారు. శివానీ మాట్లాడుతూ...నా అరంగేట్ర చిత్రానికి ఇంత మంచి దర్శకుడు, నిర్మాతలు దొరకడం అదృష్టంగా భావిస్తున్నాను. నన్నొక రాజకుమారిలా చూసుకుంటున్నారు. మంచి సినిమా అవుతుందనే నమ్మకం ఉంది. అన్నారు.

రజత్ కపూర్, భాగ్యశ్రీ, లిజీ, ఆదిత్య మీనన్, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ విద్యుల్లేఖ రామన్, హేమ తదితరులు ఇతర పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ - షానిల్ డియో, సంగీతం - అనూప్ రూబెన్స్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ - కుమార్, వివేక్ కూచిబొట్ల, ఎడిటర్ - నవీన్ నూలి, స్టంట్స్ - రవి వర్మ, సంభాషణలు - మిథున్ చైతన్య, కథనం - శ్రీనివాస్.

కాబోయే వాడికి కృతజ్ఞతలు



నయనతార

అద్భుత విజయాలతో దక్షిణాదిలో తిరుగులేని తారగా ఎదిగిన నయనతార వ్యక్తిగత జీవితంలో మాత్రం తడబడుతూనే ఉంది. గతంలో నటుడు శింబూతో ప్రేమాయణం, తర్వాత ప్రభుదేవాతో సహజీవనం చేసి పెళ్లి చేసుకుంది. తర్వాత కొన్నాళ్లకు విడిపోయారు. ఇవన్నీ మర్చిపోయి నటనపై దృష్టిపెట్టింది. కొంతకాలంగా నయనతార కొత్త భాగస్వామిని ఎంచుకుంది. అతనే దర్శకుడు విఘ్నేష్ శివన్. విఘ్నేష్ దర్శకత్వంలో ఆమె నానూన్ రౌడీ దాన్ చిత్రంలో నటించింది. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో ఒకరికొకరు దగ్గరయ్యారు. ఆ తర్వాత కొన్ని ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం అమెరికా పర్యటనకు వెళ్లారు. అక్కడ నయనతార పుట్టినరోజును జరుపుకుని ఆ ఫొటోలు సామాజిక మాధ్యమాలలో పోస్టు చేశారు. ఇక తాజాగా ఓ పురస్కార కార్యక్రమంలో నయనతార మాట్లాడుతూ...నా తల్లిదండ్రులకు, కాబోయో వాడికి కృతజ్ఞతలు అంటూ పేర్కొంది. దీంతో ఎప్పుడూ లేని కాబోయో వాడి ప్రస్తావన నయనతార తీసుకురావడంతో విఘ్నేష్ శివన్‌ను త్వరలో వివాహం చేసుకుంటుందనే ప్రచారానికి బలం చేకూరింది.


ఏప్రిల్ 6న ఇంతలో ఎన్నెన్ని వింతలో

నందు, సౌమ్య వేణుగోపాల్, పూజా రామచంద్రన్, గగన్ విహారి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ఇంతలో ఎన్నెన్ని వింతలో. హరిహర చలన చిత్ర పతాకంపై దర్శకుడు వరప్రసాద్ వరికూటి ఈ చిత్రాన్ని రూపొందించారు. ఎస్ శ్రీకాంత్ రెడ్డి, ఇప్పిలి రామమోహనరావు నిర్మాతలు. శ్రీనివాస్ ఓంకార్ సహ నిర్మాత. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఇంతలో ఎన్నెన్ని వింతలో చిత్రం ఏప్రిల్ 6న ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు వరప్రసాద్ వరికూటి మాట్లాడుతూ...



నాలుగు పాత్రల మధ్య సాగే కథ ఇది. ప్రతి పది నిమిషాలకు మలుపు ఉంటుంది. ఆద్యంత ఆసక్తికరంగా సాగేలా రూపొందించాం. లవ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. కథానాయకుడి నిశ్చితార్థంతో మొదలయ్యే కథ పెళ్లితో ముగుస్తుంది. హీరోతో పాటు మిగిలిన పాత్రలకు కథలో ప్రాధాన్యత ఉంటుంది. అన్ని వాణిజ్య అంశాలతో పాటు ఆరోగ్యకరమైన వినోదాన్ని మా చిత్రంలో చూడొచ్చు. అన్నారు. నిర్మాత ఇప్పిలి రామమోహనరావు మాట్లాడుతూ.... ఇంతలో ఎన్నెన్ని వింతలో చిత్రానికి అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్నాం. ఏప్రిల్ 6 విడుదలకు వస్తున్నాం. కొత్త తరహా కథా కథనాలతో దర్శకుడు ఈ చిత్రాన్ని రూపొందించారు. యాజమాన్య అందించిన సంగీతం ఓ హైలైట్‌గా నిలుస్తుంది. పాటలు తప్పకుండా ప్రేక్షకులను అలరింపజేస్తాయి. మంచి చిత్రం అవుతుందనే నమ్మకం ఉంది. అన్నారు. ఆర్కే, దువ్వాసి మోహన్, మీనా, నల్లవేణు, త్రిశూల్, డార్లింగ్ నరసింహా, కృష్ణతేజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా -మురళీ మోహన్ రెడ్డి, ఎడిటింగ్ - ఛోటా కె ప్రసాద్, సంగీతం - యాజ మాన్య, సాహిత్యం - సురేష్, ఫైట్స్ - మార్షల్ రమణ, ఆర్ట్ - జిల్లా మోహన్

మే 11న పూరి మెహబూబా



ఆకాష్

ఆకాష్ కథానాయకుడిగా దర్శకుడు పూరీ జగన్నాథ్ తెరకెక్కించిన తాజా చిత్రం మెహబూబా. నేహాశెట్టి నాయికగా నటించింది. లావణ్య సమర్పణలో పూరీ టూరింగ్ టాకీస్ పతాకంపై ఈ చిత్రం నిర్మితమైంది. భారత్ పాక్ యుద్ధ నేపథ్యంలో సాగే ప్రేమ కథతో పూరీ ఈ చిత్రాన్ని రూపొందించారు. ప్రేమ కథలను తెరకెక్కించడంలో ప్రత్యేకత చూపించే దర్శకుడు పూరీ కొద్ది కాలంగా ఈ తరహా చిత్రాలకు దూరంగా ఉన్నారు. మెహబూబాతో మళ్లీ ప్రేమ కథతో సినిమా తెరకెక్కించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న మెహబూబా మే 11న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత, పంపిణీదారులు దిల్ రాజు విడుదల చేస్తున్నారు. పూరీ జగన్నాథ్ గతంలో తెరకెక్కించిన ఇడియట్, పోకిరీ చిత్రాలను దిల్‌రాజు ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. అవి ఘన విజయాలు సాధించాయి. మళ్లీ మెహబూబాతో పూరీ దిల్ రాజు కలిసి పనిచేస్తున్నారు. మెహబూబా విడుదల తేదీని పూరీ కనెక్ట్ సంస్థ తరుపున నటి ఛార్మీ కౌర్ వెల్లడించారు.

మంచి కమర్షియల్ సినిమా చేశామంటున్నారు

- దర్శకుడు ఉపేంద్ర మాధవ్



ఎమ్మెల్యే మంచి లక్షణాలున్న అబ్బాయి చిత్రానికి ప్రేక్షకాదరణ బాగుందంటున్నారు దర్శకుడు ఉపేంద్ర మాధవ్. కళ్యాణ్ రామ్, కాజల్ జంటగా ఆయన దర్శకత్వం వహించిన ఎమ్మెల్యే చిత్రం ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. సినిమాలోని వాణిజ్య అంశాలు బాగున్నాయనే స్పందన విడుదలైన అన్ని కేంద్రాల నుంచి వస్తోందన్నారు. దర్శకుడు ఉపేంద్ర మాధవ్ మాట్లాడుతూ...శుక్రవారం తెరపైకి వచ్చిన మా సినిమాకు అంతటా సానుకూల స్పందన వస్తోంది. మంచి కమర్షియల్ సినిమా చేశావంటూ పరిశ్రమలోని సన్నిహితులు చెబుతున్నారు. నా తొలి చిత్రం విజయవంతం కావడం సంతోషంగా ఉంది. హీరో కళ్యాణ్ రామ్ సహకారంతో సినిమా అనుకున్నట్లు పూర్తి చేయగలిగాను. నిర్మాతలు బాగా సహకరించారు. కాజల్, కళ్యాణ్ రామ్ నటన బాగుందంటున్నారు. పాటలు, ఫైట్లను ప్రేక్షకులు ఆస్వాదిస్తున్నారు. ఇక నా గురించి చెప్పుకోవాలంటే గుంటూరు జిల్లా వాసిని. దర్శకుడిని కావాలనే కోరికతో పరిశ్రమకు వచ్చాను. శ్రీనువైట్ల దగ్గర దూకుడు, బాద్ షా తదితర చిత్రాలకు పనిచేశాను. పటాస్ సినిమా చిత్రీకరణ జరుగుతున్నప్పుడు సెట్‌కి వెళ్లాను. అప్పుడు కళ్యాణ్ రామ్ మంచి కథ ఉంటే చెప్పు సినిమా చేద్దాం అన్నారు. ఆయన బిజీ కదా సినిమా ఎప్పుడుచేస్తారు. ఊరికే అన్నారని అనుకున్నాను. కథ సిద్ధమయ్యాక రఘు కారుమంచితో కలిసి కళ్యాణ్ రామ్ దగ్గరకు వెళ్లి చెప్పాను. ఆయనకు నచ్చి సినిమా ఒప్పుకున్నారు. అలా మొదలైన ఎమ్మెల్యే మంచి లక్షణాలున్న అబ్బాయి ఇవాళ ప్రేక్షకాదరణతో విజయవంతం కావడం ఆనందంగా ఉంది. అన్నారు.

కొన్ని పాత్రలే నాకు నప్పుతాయి



సాయిపల్లవి

ఆర్టిస్టులు అన్ని రకాల పాత్రలు చేయగలరా? కొందరికి కొన్నే నవ్వుతాయి. మరికొందరు ఎలాంటి పాత్ర అయినా చేయగలరు. నటి సాయిపల్లవి తనకు కొన్ని పాత్రలే నప్పుతాయి అని స్పష్టం చేసింది. ఇతర నాయికల్లా అన్నీ క్యారెక్టర్లు చేయలేనని తెలిపింది. నటిగా నాకు ఉన్న పరిమితులు ఎలాంటివో తెలుసు, కమర్షియల్ సినిమాలు నాకు సరిపడవు అని నిజాయితీగా ఒప్పుకుంది. కొందరు హీరోయిన్లు ఇలాంటి విషయాలను ఆలోచించరు. అవకాశం వచ్చిందే చాలు అంగీకరిస్తారు. పాత్రకు న్యాయం చేయలేరు. దాంతో సినిమాకు నష్టం జరుగుతుంది. కానీ, వీరికి భిన్నంగా సాయి పల్లవి ఆలోచించడం అభినందనీయం.

ఫిదా సినిమాతో తెలుగు ప్రేక్షకుల మనసు దోచిన సాయి పల్లవి ప్రస్తుతం కణం సినిమాలో ఓ పసిపాపకు తల్లిగా నటిస్తోంది. శర్వానంద్‌తో మరో సినిమా చేస్తోంది. తమిళంలో కూడా బిజీగా ఉంది. ఇవన్నీ తను చేయగలిగే పాత్రలు అని తెలిపింది.